

ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

కరీంనగర్ 18-1-2019 శుక్రవారం సిటీ సంపుటి 45 సంచిక 158

రూ. 6-50. పేజీలు 16+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi







శాసనసభలో ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్‌ఖాన్. సభకు హాజరైన ముఖ్యమంత్రి కేసీఆర్, హోం మంత్రి మహమూద్ అలీ, ఇతర శాసనసభ్యులు

కొలువుదీరిన సభ

114 మంది ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం

- తొలుత సీఎం కేసీఆర్.. చివరలో వేముల ప్రశాంత్‌రెడ్డి
- ఎమ్మెల్యేలతో ప్రమాణం చేయించిన ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్‌ఖాన్

ఈనాడు - హైదరాబాద్

తెలంగాణ శాసనసభ కొలువుదీరింది. ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఏర్పడిన రెండో శాసనసభ తొలి సమావేశాలు గురువారం ప్రారంభమయ్యాయి. కొత్త ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారం, శాసనసభ్యుల పరస్పర పలకరింపులు, కరచాలనాలతో సభ తొలి రోజు సందడిగా సాగింది. ప్రొటెం స్పీకర్‌గా నియమితులైన మజ్లిస్ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్‌ఖాన్ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు మొత్తం 114 మంది ఎమ్మెల్యేలతో అసెంబ్లీలో ప్రమాణం చేయించారు. వివిధ పక్షాలకు చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలు ప్రమాణస్వీకారానికి హాజరుకాలేదు. ఉదయం 11.30 గంటలకు ప్రారంభమైన శాసనసభ మధ్యాహ్నం 1.40 గంటల వరకు సాగింది.

ఉదయం 11 గంటల నుంచి శాసనసభలోకి ఎమ్మెల్యేలు రావడం మొదలైంది. తెరాస, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమ పార్టీ కండువాలు వేసుకుని సభలోకి ప్రవేశించారు. గత ఎన్నికల్లో ఎంపీలుగా, ఎమ్మెల్సీలుగా ఉన్న కొందరు ఈసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. తెరాస, కాంగ్రెస్, తెదేపా, ...మిగతా 2లో



అసెంబ్లీలో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఆప్యాయంగా పలకరిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

రాష్ట్ర శాసన సభాపతిగా పోచారం

- సీఎంతో పాటు తెరాస, కాంగ్రెస్, మజ్లిస్ సభ్యుల ప్రతిపాదన
- నామినేషన్ దాఖలు చేసిన శ్రీనివాస్‌రెడ్డి
- గడువులోగా పోటీలో ఉన్నది ఒక్కరే
- ఏకగ్రీవం కానున్న ఎన్నిక

నేడు అధికారికంగా వెల్లడి

ఈనాడు - హైదరాబాద్

రాష్ట్ర శాసన సభాపతిగా బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఎన్నిక కానున్నారు. ఈ పదవికి సీఎం ఆయనను ఎంపిక చేయగా. . గురువారం మధ్యాహ్నం శాసనసభలో నామినేషన్ దాఖలు చేశారు. శాసనసభా కార్యదర్శి నర్సింహాచార్యులుకు ఆరు సెట్ల నామినేషన్‌ను అందజేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్, కాంగ్రెస్ సీనియర్ నేత మల్లు భట్టి విక్రమార్క, మజ్లిస్ సభ్యుడు అహ్మద్ బలాల, తెరాస ఎమ్మెల్యేలు రేఖా నాయక్, అబ్రహం, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లు ...మిగతా 2లో



పచ్చగా బతకండి


- మాంసం తగ్గించండి
- తిండి మార్చుకోకుంటే తిప్పలే
- లాన్సెట్ మెడికల్ జర్నల్ నివేదిక హెచ్చరిక



ఆహారపు అలవాట్లను మార్చుకోకుండా, ఆహార ఉత్పత్తిని పెంచకుండా, ఆహార వృథాను అరికట్టకుండా.. ప్రపంచ మానవాళికి ఆరోగ్యకరమైన, సమతుల ఆహారాన్ని అందించలేం

- లాన్సెట్ నివేదిక

నలభై, యాభై ఏళ్ల వెనక్కి తిరిగి చూడండి. మనపెద్దల తిండి అలవాట్లను గుర్తుచేసుకోండి. బంధువు వచ్చినప్పుడో, పండగ పబ్బానికో తప్పితే వారు మాంసాహారం జోలికి వెళ్లేవారు కాదు. గింజలు, కూరగాయల్నే ఎక్కువగా వండుకు తినేవారు. ఆహారపు అలవాట్ల కారణంగా రోగాల బారినపడిన వారు చాలా తక్కువ. కానీ ఇప్పుడు మనిషి జీవనశైలితో పాటే ఆహారపు అలవాట్లూ పూర్తిగా మారిపోయాయి. మాంసాహారాన్ని విపరీతంగా వినియోగిస్తున్నాం. శృతిమించి శుద్ధిచేసిన ఆహారం, నూనెలు, వేపుళ్లను విరివిగా వాడుతున్నాం. గింజలు, పండ్లు, కూరగాయలు, దినుసులతో కూడిన సమతుల ఆహారానికి దూరమయ్యాం. దీనివల్ల శరీరానికి అవసరమైన పోషకాల్ని అందించలేకపోతున్నాం. మాంసం అతి వినియోగం వల్ల మన శరీరంతో పాటే.. ప్రపంచ పర్యావరణానికీ చేటు తెస్తున్నాం. దీనివల్ల భూగోళానికి పెనుముప్పు తప్పదని, మనిషి ఆహారపు అలవాట్లను తక్షణం మార్చుకోవాల్సిన అవసరం ఏర్పడిందని 'లాన్సెట్ మెడికల్ జర్నల్' ప్రమాద ఘంటికలు వినిపించింది. 2050 నాటికి ప్రపంచ జనాభా వెయ్యి కోట్లకు చేరుకుంటుందని, వారందరికీ తిండి పెట్టాలన్నా, వాతావరణ మార్పుల్ని అరికట్టాలన్నా మానవాళి తక్షణం స్పందించాల్సిన అవసరం ఉందంటున్న లాన్సెట్ హెచ్చరికలపై ప్రత్యేక కథనం ...వివరాలు 6లో



ఉపాధ్యాయ విద్య సమూల ప్రక్షాళన

- నాణ్యమైన విద్యా వ్యవస్థకు ఉత్తమ ఉపాధ్యాయులు తప్పనిసరి
- మరింత కఠినంగా ఉపాధ్యాయ అర్హత పరీక్షలు
- నవీన భారత్@75కు నీతి ఆయోగ్ వ్యూహపత్రం 5 లో

సీబీఐ నుంచి రాకేశ్ అస్థానాకు ఉద్వాసన!

- ఆ వెంటనే పౌర విమానయాన భద్రతా సంస్థకు బదిలీ
- మరో ముగ్గురు సీనియర్ అధికారుల పదవీకాలానికీ కత్తెర

11లో



పంచాయతీల్లో ఏకగ్రీవాల జోరు



- రెండో విడతలో పెరిగిన సంఖ్య
- పోటీ ఉన్నచోట్ల కానుకల వెల్లువ
- చీరలు.. ముక్కుపుడకల పంపిణీ
- ఊరూవాడా ప్రచార హోరు
- మూడో విడతకు కొనసాగుతున్న నామినేషన్లు

ఈనాడు - హైదరాబాద్

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవాల పరంపర కొనసాగుతోంది. మొదటి విడతలో 769 పంచాయతీలు ఏకగ్రీవమైన విషయం తెలిసిందే. రెండో విడతకు 4,135 పంచాయతీలకు ఎన్నికల ప్రకటన వెలువడింది. సర్పంచి స్థానాలకు మొత్తం 20,575 నామినేషన్లు దాఖలయ్యాయి. గురువారం నామినేషన్ల ఉపసంహరణ, అర్హుల జాబితాల ప్రకటనను ఎన్నికల అధికారులు పూర్తిచేశారు. గుర్తులు కేటాయించారు. ఈ విడతలో కూడా పెద్దఎత్తున ఏకగ్రీవాలు కొనసాగాయి. ఏకగ్రీవమైన పంచాయతీల్లో తెలంగాణ రాష్ట్ర సమితికి చెందిన మద్దతుదారులే ఎక్కువచోట్ల ముందు వరుసలో నిలిచారు.

తారస్థాయిలో ప్రచారం

పంచాయతీ ఎన్నికల్లో తొలిదశలో ఎన్నికలు జరిగే చోట ప్రచారం తారస్థాయికి చేరుకుంది. 4,479 పంచాయతీలకు గాను 769 ఏకగ్రీవం కాగా 9 పంచాయతీల్లో నామినేషన్లు చెల్లలేదు. దీంతో 3,701 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ 12,202 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. మేజర్ పంచాయతీల్లో అభ్యర్థులు హోరాహోరీ ప్రచారం నిర్వహిస్తున్నారు. ఉమ్మడి మెదక్, ఖమ్మం, మహబూబ్‌నగర్, కరీంనగర్ జిల్లాల్లో ఓటర్లను ఆకర్షించేందుకు పలువురు తమదైన శైలిలో ప్రచారం నిర్వహిస్తున్నారు. చాలా గ్రామాల్లో చీరలు, మరికొన్నిచోట్ల ...మిగతా 2లో

రాజీకి నేతల ఒత్తిళ్లు

ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్న నాయకులు కొన్నిచోట్ల ఏకగ్రీవాలకు పట్టుబడుతున్నారు. మొదటి, రెండో విడతల్లో ఆశించినస్థాయిలో ఫలితం రాని చోట్ల ఎమ్మెల్యేలే నేరుగా రంగంలోకి దిగుతున్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గ నాయకులకు బాధ్యతలు అప్పగించి రాజీకి వచ్చేలా ప్రయత్నాలు సాగిస్తున్నారు. కరీంనగర్, మెదక్ జిల్లాల్లో ఈ తరహా ఒత్తిళ్లు చోటుచేసుకుంటున్నట్లు తెలుస్తోంది. మూడో విడతలో 4,116 పంచాయతీలకు నోటిఫికేషన్ వెలువడింది. మొదటి రోజుకు 1,729 నామినేషన్లు దాఖలయ్యాయి. రెండోవిడత ఉపసంహరణలు పూర్తికావడంతో పార్టీలకు చెందిన జిల్లా కార్యవర్గాలు మూడోవిడత ఎన్నికలు జరిగే పంచాయతీలపై దృష్టిసారించాయి.

- ఎన్నికలు జరిగే రెండో విడతలో సర్పంచి స్థానాలు: 4,135
- తిరస్కరించిన నామినేషన్ల సంఖ్య: 3
- సర్పంచి స్థానానికి దాఖలైన నామినేషన్లు: 20,855
- ప్రకటన విడుదలైన వార్డులు: 36,602
- వార్డులకు దాఖలైన నామినేషన్లు: 86,855

పోలింగ్ కేంద్రాల తగ్గింపు

- ఏకగ్రీవాల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశం

6 లో

ఇదీ సంగతి!



ఏంటి సార్ చెప్పేది, నేనూ ఇదే బడిలో నాయె చదువుకున్నది.

సీఎల్పీ నేత ఎంపిక దిల్లీలోనే

- నిర్ణయం రాహుల్‌కే అప్పగింత
- కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఏకవాక్య తీర్మానం
- ఉత్తమ్, భట్టి మధ్య పోటీ
- అవకాశమిస్తే మేమూ నిరూపించుకుంటామన్న ఇంకొందరు శాసనసభ్యులు
- సీఎల్పీ నేతను నేడు ప్రకటించే అవకాశం



ఉత్తమ్



భట్టి

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ శాసనసభాపక్ష (సీఎల్పీ) నేత ఎంపికపై సస్పెన్స్ వీడలేదు. గురువారం జరిగిన కాంగ్రెస్ శాసనసభాపక్ష భేటీలో సీఎల్పీ నేత ఎంపిక బాధ్యతను ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీకి అప్పగిస్తూ ఏకవాక్య తీర్మానం చేశారు. దీంతో సీఎల్పీ నేత ఎంపిక ఘట్టం దిల్లీకి చేరింది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, సీఎల్పీ నేత ఎన్నిక పరిశీలకుడు కె.సి.వేణుగోపాల్ బుధ, గురువారాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, పార్టీ ...మిగతా 2లో

శృంగార నగరి గజ్జె కడుతోంది

ఖజురహోలో ఏ కదలిక లేకుండా మౌనముద్రలో ఉన్న శిల్పాలు మస్తిష్కాన్ని తొలుస్తాయి.. మనసును కదిలిస్తాయి. మనిషిని ఉద్రేకపరుస్తాయి. ఆ మౌనం జీవన పాఠాలు చెబుతుంది. సృష్టి రహస్యాన్ని బోధిస్తుంది. అందుకే ఈ పర్యాటక కేంద్రం ప్రేమికులకు నందనవనం.. కొత్తజంటలకు బృందావనం.. ఇప్పుడు కళాప్రియులకు పలుకుతోంది ఆహ్వానం.. ఫిబ్రవరి 20 నుంచి 26 వరకు ఖజురహోలో అంతర్జాతీయ నృత్యోత్సవం జరగనుంది. ఈ సందర్భంగా అపురూప శిల్పనగరి స్వరూపం చూసేద్దాం.



- హంపి నగరికి ప్రపంచఖ్యాతి
- అనుభ'వించ్'రాజా..
- బీమా ఉంటేనే రండి

చదవండి నేటి విహారి లో






శాసనసభ సమావేశాలకు బయలుదేరే ముందు గురువారం గన్‌పార్కు వద్దనున్న అమరవీరుల స్తూపానికి నివాళులు అర్పిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ ★ శాసనసభ ప్రాంగణంలోని పోచమ్మ ఆలయంలో సీఎం కేసీఆర్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి పూజలు ★ శాసనసభలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేస్తున్న కేసీఆర్

జూబ్లీహాలుకు పూర్వ వైభవం

- కలెక్టర్ల సదస్సులు, ప్రభుత్వ సమావేశాల నిర్వహణ
- శాసన, మండలి సభ్యుల విందులో సీఎం వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్ ప్రాంగణంలోని జూబ్లీహాలుకు పూర్వవైభవం తెస్తామని.. కలెక్టర్ల సమావేశాలు, ఇతర ముఖ్యమైన సదస్సులు అక్కడే నిర్వహిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ తెలిపారు. జూబ్లీహాలు చరిత్ర, ఘనత అందరికీ తెలియాలని సూచించారు. దేశవిదేశాల నుంచి వచ్చే ప్రముఖులకు దీన్ని సందర్శించే అవకాశం కల్పిస్తామని చెప్పారు. గురువారం తెలంగాణ శాసనసభ తొలి సమావేశాల ప్రారంభాన్ని పురస్కరించుకొని సీఎం కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలకు విందునిచ్చారు. శాసనమండలి సభ్యులు కూడా పాల్గొన్నారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డితో సభాపతి పదవికి నామినేషన్ దాఖలు వేయించిన అనంతరం సీఎం ఆయన, కాంగ్రెస్ సభ్యుడు భట్టి విక్రమార్కతో కలిసి కారులో జూబ్లీహాలుకు వచ్చారు. వారు శాసనమండలి ఛైర్మన్ స్వామిగౌడ్‌తో భేటీ అయ్యారు. అనంతరం అక్కడే విందులో పాల్గొన్నారు. సీఎంతో పాటు మండలి ఛైర్మన్ స్వామిగౌడ్, మంత్రి మహమూద్ అలీ, తాత్కాలిక సభాపతి ముంతాజ్ అహ్మద్‌ఖాన్, పోచారం, విప్‌లు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బోడకుంటి వెంకటేశ్వర్లు, తెరాస ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ సభ్యులు భట్టి విక్రమార్క, సుధీర్‌రెడ్డి, మాజీ మంత్రి నాయిని, ఎమ్మెల్సీ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీఎం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల వద్దకు వెళ్లి వారితో మాట్లాడారు. ఆ తర్వాత ఆయన జూబ్లీహాలును సందర్శించారు. ఏడాది క్రితం తాను సందర్శించినప్పుడు చేసిన సూచనల మేరకు జూబ్లీహాలులో మార్పులు చేయడంపై శాసనసభా కార్యదర్శి నర్సింహాచార్యులును అభినందించారు.



ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులతో కలిసి జూబ్లీహాల్‌ను పరిశీలిస్తున్న సీఎం కేసీఆర్

కొలువుదీరిన సభ

(మొదటి పేజీ తరువాయి)

మజ్లిస్ ఎమ్మెల్యేల పరస్పర పలకరింపులు, కరచాలనాలతో కొత్త అసెంబ్లీ సమావేశాల తొలిరోజు సందడిగా కనిపించింది. ఉదయం 11.25 గంటలకు ముఖ్యమంత్రి కేసీఆర్ సభ్యులకు అభివాదం చేస్తూ శాసనసభలోకి వచ్చారు. వస్తూనే కాంగ్రెస్ సభ్యులున్న వైపు వెళ్లారు. తొలుత పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో, తర్వాత ఇతర కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి కరచాలనం చేశారు. 11.28 గంటలకు ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్‌ఖాన్ స్పీకర్ స్థానంలోకి వచ్చి సభ్యులకు అభివాదం చేశారు. జాతీయగీతం జనగణమనతో. . శాసనసభ ప్రారంభమైంది. అనంతరం సభ్యుల ప్రమాణస్వీకారం మొదలైంది.

అక్షర క్రమంలో ప్రమాణస్వీకారం

ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారానికి స్పీకర్ పోడియం ఎదురుగా ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. తొలుత ముఖ్యమంత్రి కేసీఆర్ దైవసాక్షిగా అంటూ ఎమ్మెల్యేగా ప్రమాణం చేశారు. ఆ తర్వాత ప్రొటెం స్పీకర్ వద్దకు వెళ్లి అభివాదం చేసి, రిజిస్టర్‌లో సంతకం పెట్టారు. సీఎం తర్వాత అక్షరక్రమంలో ఎమ్మెల్యేలతో ప్రమాణం చేయించారు. ముందు మహిళా ఎమ్మెల్యేలు అజ్మీర రేఖానాయక్, దనసరి అనసూయ (సీతక్క), గొంగిడి సునీత, బానోత్ హరిప్రియ, పద్మా దేవేందర్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి ప్రమాణం చేశారు. బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డితో ప్రమాణస్వీకార కార్యక్రమం ముగిసింది. దైవసాక్షిగా అని పలువురు ఎమ్మెల్యేలు, పవిత్ర హృదయంతో అని కొందరు సభ్యులు ప్రమాణం చేశారు. మజ్లిస్ ఎమ్మెల్యేలు అల్లా పేరుతో ప్రమాణం చేశారు.



అసెంబ్లీ ఆవరణలో కేటీఆర్‌కు అభినందనలు తెలుపుతున్న ఎమ్మెల్యేలు

ప్రమాణం చేయని ఐదుగురు ఎమ్మెల్యేలు

తెలంగాణ అసెంబ్లీకి 119 మంది ఎమ్మెల్యేలు ఎన్నికయ్యారు. ఆంగ్లో ఇండియన్ కోటా కింద ఎమ్మెల్యేగా ఎన్నికైన స్టీఫెన్‌సన్‌తో కలిపి మొత్తం సభ్యుల సంఖ్య 120 మంది. గవర్నర్ సమక్షంలో బుధవారం ప్రొటెం స్పీకర్‌గా ప్రమాణస్వీకారం చేసిన ముంతాజ్ అహ్మద్‌ఖాన్ గురువారం అసెంబ్లీలో ఎమ్మెల్యేలతో ప్రమాణస్వీకారం చేయించారు. ఐదుగురు సభ్యులు సభకు హాజరుకాలేదు. మజ్లిస్ నుంచి అక్బరుద్దీన్ ఒవైసీ, జాఫర్ హుస్సేన్, తెదేపా నుంచి సండ్ర వెంకట వీరయ్య, తెరాస నుంచి మాధవరం కృష్ణారావు, భాజపా నుంచి రాజాసింగ్ ప్రమాణస్వీకారానికి సభకు రాలేదు. మజ్లిస్ ఎమ్మెల్యే ప్రొటెం స్పీకర్‌గా ఉండగా శాసనసభకు రానని, కొత్త స్పీకర్ ఎన్నికయ్యాక ఆయన ఛాంబర్‌లో ప్రమాణం చేస్తానని రాజాసింగ్ ముందే ప్రకటించిన సంగతి తెలిసిందే. కంటోన్మెంట్ నుంచి తెరాస ఎమ్మెల్యేగా గెలిచిన సాయన్నకు కాలు విరగడంతో చక్రాల కుర్చీలో సభకు హాజరయ్యారు. అనారోగ్యంతో ఉన్న ఖైరతాబాద్ తెరాస ఎమ్మెల్యే దానం నాగేందర్ సహాయకుల సాయంతో అసెంబ్లీకి వచ్చారు. ప్రమాణస్వీకారం పూర్తయిన అనంతరం ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్‌ఖాన్ సభను శుక్రవారానికి వాయిదావేశారు.

అమరవీరులకు నివాళులు

నారాయణగూడ, న్యూస్‌టుడే: ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారానికి ముందు గురువారం ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి కేసీఆర్ తమ ఎమ్మెల్యేలతో కలిసి అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్‌పార్కులోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్దకు వెళ్లారు. స్తూపం వద్ద పుష్పగుచ్ఛాన్ని ఉంచి రెండు నిమిషాలు మౌనం పాటించి అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. సీఎం తర్వాత ఎమ్మెల్యేలు కూడా పుష్పగుచ్ఛాలుంచి నివాళులర్పించారు.

కేసీఆరే సీనియర్

- తెలంగాణ తొలి శాసనసభకు ప్రాతినిధ్యం వహించిన 76 మంది ఎమ్మెల్యేలు తిరిగి ఎన్నికయ్యారు.
- 23 మంది తొలిసారి శాసనసభలో అడుగుపెట్టారు.
- సభలో అత్యంత సీనియర్ సభ్యుడు ముఖ్యమంత్రి కేసీఆర్. ఇప్పటి వరకూ ఆయన ఉపఎన్నికతో పాటు ఎనిమిది సార్లు శాసనసభకు ఎన్నికయ్యారు. తరువాత స్థానంలో ఎర్రబెల్లి దయాకర్‌రావు, రెడ్యానాయక్, ముంతాజ్ అహ్మద్‌ఖాన్ ఉన్నారు.
- ఉప ఎన్నికతో కలిపి హరీశ్‌రావు, ఈటల రాజేందర్, కొప్పుల ఈశ్వర్, పోచారం శ్రీనివాస్‌రెడ్డిలు ఆరుసార్లు శాసనసభ్యులుగా ఎన్నికయ్యారు.
- కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు (73) ఈ సభలో ఎక్కువ వయసున్న సభ్యుడు. ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియ (33) పిన్నవయస్కురాలు.
- తెలంగాణ శాసనసభలో మొత్తం 119 స్థానాలకుగాను 88మంది తెరాస సభ్యులున్నారు. కాంగ్రెస్‌కు 19, మజ్లిస్‌కు 7, తెదేపాకు ఇద్దరు, భాజపా తరఫున ఒక సభ్యుడు ఉన్నారు. ఆల్‌ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ తరఫున ఒకరు, స్వతంత్ర అభ్యర్థిగా ఒకరు గెలిచారు.
- కొత్తగా ఎన్నికైన సభ్యుల్లో నలుగురు గతంలో వేర్వేరు చట్టసభలకు ప్రాతినిధ్యం వహించారు. మేడ్చల్ నుంచి ఎన్నికైన మల్లారెడ్డి, చెన్నూరు నుంచి గెలిచిన బాల్క సుమన్ లోక్‌సభ సభ్యులుగా పనిచేశారు. మునుగోడు నుంచి ఎన్నికైన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి గతంలో లోక్‌సభ, శాసనమండలికి ప్రాతినిధ్యం వహించారు. కొడంగల్ నుంచి గెలుపొందిన పట్నం నరేందర్‌రెడ్డి ఎమ్మెల్సీగా పని చేశారు.
- గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ప్రాతినిధ్యం వహించి, తెలంగాణ తొలి శాసనసభలో లేని 16 మంది ఈసారి మళ్లీ ఎన్నికవడం విశేషం.
- మొదటి శాసనసభకు నామినేట్ అయిన స్టీఫెన్‌సన్ మళ్లీ నామినేట్ అయ్యారు.

పంచాయతీల్లో ఏకగ్రీవాల జోరు

(మొదటి పేజీ తరువాయి)

ముక్కపుడకలు ఇంటింటికీ తిరుగుతూ పంపిణీ చేస్తున్నారు. మద్యం పంపిణీ నిరంతరాయంగా కొనసాగుతోంది. ఆటోలు, టాటా ఏస్ వాహనాలకు మైకులు కట్టి ప్రచారం హోరెత్తిస్తున్నారు.

రెండోవిడతలో ఏకగ్రీవం

జిల్లా	ఏకగ్రీవమైన పంచాయతీలు
రాజన్న సిరిసిల్ల	16
కరీంనగర్	5
జగిత్యాల	22
పెద్దపల్లి	9
ఉమ్మడి రంగారెడ్డి జిల్లా	25
మహబూబ్‌నగర్	55
వనపర్తి	20
జోగులాంబ గద్వాల	14
నాగర్‌కర్నూలు	21
కామారెడ్డి	52
నిజామాబాద్	33
యాదాద్రి భువనగిరి	17
సూర్యాపేట	28
నల్గొండ	43
మహబూబాబాద్	40
ఖమ్మం	34
కుమురంభీం ఆసిఫాబాద్	18
వికారాబాద్	18
మెదక్	39
సంగారెడ్డి	52
భద్రాద్రి కొత్తగూడెం	20
సిద్దిపేట	19



అసెంబ్లీ కమిటీ హాలులో సీఎల్పీ సమావేశం అనంతరం మీడియాపాయింట్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్. పక్కన షబ్బీర్‌అలీ, భట్టివిక్రమార్క, కుంతియా, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సలీం, ఎమ్మెల్యేలు

సీఎల్పీ నేత ఎంపిక దిల్లీలోనే

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యనేతలతో సమాలోచనలు చేసి సీఎల్పీ నేతపై అభిప్రాయాలు తీసుకున్నారు. గురువారం ఉదయం శాసనసభ కమిటీ హాల్‌లో కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశం జరిగింది. కేసీ వేణుగోపాల్, టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జి ఆర్.సి.కుంతియా, 19 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎమ్మెల్సీలు సమావేశమయ్యారు. సమావేశంలో శాసనసభ్యులంతా సీఎల్పీ నేత ఎన్నిక బాధ్యతను రాహుల్‌గాంధీకి అప్పగిస్తూ ఏకవాక్య తీర్మానం చేశారు. అంతకు ముందు శాసనసభ్యులు తమ అభిప్రాయాలను విడివిడిగా తెలియజేశారు.

సీఎల్పీ బాధ్యతపై అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉంటామని కొందరు ఎమ్మెల్యేలు చెబుతూనే. . అవకాశం ఇస్తే సమర్థంగా ఆ బాధ్యతలను నిర్వహిస్తామని వివరించారు. ఆసక్తి కనబరిచినవారిలో ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, గండ్ర వెంకటరమణారెడ్డి, జగ్గారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నట్లు తెలిసింది. బుధవారం జరిగిన కోర్‌కమిటీ సమావేశంలో వ్యక్తమైన అభిప్రాయాలు, సీఎల్పీ సమావేశంలో చేసిన ఏక వాక్య తీర్మానంతో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి దిల్లీకి వెళ్లారు.

ప్రత్యామ్నాయంగా శ్రీధర్‌బాబు: సీఎల్పీ నేత పదవి కోసం టీపీసీసీ అధ్యక్షుడు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రచార కమిటీ ఛైర్మన్ మల్లు భట్టి విక్రమార్క మధ్య ప్రధానంగా పోటీ కొనసాగుతోంది. ఎటూ తేల్చుకోలేకపోయిన అధిష్ఠానం.. సీఎల్పీ ప్రకటన బాధ్యతను తానే తీసుకుంది. వీరిద్దరూ కాకుండా మరో ఎమ్మెల్యేకు సీఎల్పీ పదవిని అప్పగించాలని భావిస్తే మాజీ మంత్రి డి.శ్రీధర్‌బాబు పేరును పరిశీలించనున్నట్లు తెలిసింది. గురువారమే సీఎల్పీ నేతను ప్రకటిస్తారని భావించినా శుక్రవారం ప్రకటించనున్నట్లు తెలిసింది. ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ దిల్లీలో లేకపోవడంతో ఒక రోజు వాయిదా పడినట్లు తెలిసింది. కొంతమంది ఎమ్మెల్యేలు తెరాసలోకి వెళ్తారనే ప్రచారం నేపథ్యంలో ఎమ్మెల్యేలతో సఖ్యతగా ఉండటమే కాకుండా పార్టీ శాసనసభ్యుల సంఖ్య తగ్గకుండా చూసే బాధ్యత కూడా సీఎల్పీ నేతకే అప్పగించనున్నట్లు సమాచారం.

రాహుల్‌దే నిర్ణయం: కేసీ వేణుగోపాల్

సీఎల్పీ నేత ఎన్నిక బాధ్యతను కాంగ్రెస్ శాసనసభ్యులు ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీకి అప్పగిస్తూ ఏక వాక్య తీర్మానం చేసినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ తెలిపారు. సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడారు.

ఎల్డీఎఫ్ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకే మోదీకి శబరిమలపై భక్తి

నారాయణ ధ్వజం

ఈనాడు, దిల్లీ: కేరళలో ఎల్డీఎఫ్ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకే ప్రధాని నరేంద్ర మోదీ శబరిమలపై భక్తి చూపుతున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ధ్వజమెత్తారు. మోదీ తీరుపై గురువారం ఆయన వీడియో ప్రకటన విడుదల చేశారు.

ఈనాడు 1869 - 2019 మహాత్ముడి 150వ జయంతి వేడుకలు

సంపూర్ణ స్వేచ్ఛ

మనందరికీ రాజకీయ స్వేచ్ఛ ఉన్నమాట వాస్తవమేగానీ.. ఇప్పటికీ అంతరాంతరాల్లో మనం ఎక్కడో పాశ్చాత్యుల ఆధిపత్యానికి బద్ధులమయ్యే ఉంటున్నామని గుర్తించటం అవసరం!

– మహాత్మా గాంధీ

కమ్మేస్తున్న మంచు దుప్పటి

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రాన్ని మంచు దుప్పటి కమ్ముకుంటోంది. ఉత్తర, ఈశాన్య దిశల నుంచి వీస్తున్న గాలుల వల్ల తేమ శాతం పెరిగిందని వాతావరణ శాఖ పేర్కొంది. ఈ కారణంగానే ఉదయ, సాయంత్ర సమయాల్లో పొగమంచు ఏర్పడుతోందని తెలిపింది. పలు జిల్లాల్లో శుక్రవారం కూడా ఇదే పరిస్థితి కొనసాగవచ్చుంది. మరోవైపు బుధవారం రాత్రి ఆదిలాబాద్ జిల్లాలో 9 డిగ్రీల సెల్సియస్ అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. పగటిపూట మాత్రం రాష్ట్రంలో కనిష్ఠంగా 29, గరిష్ఠంగా 33 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయంది. పలు అటవీ ప్రాంతాల్లో ఏకంగా మంచుమేఘాలు ఏర్పడుతున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో ఉదయంపూట పదిగంటల వరకు కూడా రహదారులు సరిగా కనిపించనంతగా మంచు కురుస్తోంది. రాత్రిపూట చల్లని గాలుల ప్రభావంతోనే ఇలాంటి పరిస్థితి ఎదురైందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు.

స్విస్ బ్యాంకుల్లో రూ.3,580 కోట్ల నేపాల్ ధనం

కాఠ్‌మాండూ: నేపాల్ దేశ ప్రముఖులు కూడా స్విస్ బ్యాంకుల్లో భారీగా తమ అక్రమ సంపాదనను జమ చేస్తున్నారు. ఇంతవరకు సుమారు రూ.3,580 కోట్లను జమ చేసి ఉంటారని సెంటర్ ఫర్ ఇన్‌వెస్టిగేటివ్ జర్నలిజం పేర్కొంది. నేపాల్ లీక్స్-2019 పేరుతో బుధవారం రాత్రి నివేదికను విడుదల చేసింది.

SI - కానిస్టేబుల్
వర్రె సుధాకర్ సార్ ఆధ్వర్యంలో
Mains Batches : 21.1.2019 @2PM
Intensive Batch : 18.1.2019 @9AM
Day by Day Exams (GS+Maths) and Paper Expanations (9AM - 9PM Study Hrs.)
యూనిక్ DILSUKHNAGAR, HYD 9492459622 9059949607


రాష్ట్ర శాసన సభాపతిగా పోచారం

(మొదటి పేజీ తరువాయి)

పోచారం అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదించారు. సాయంత్రం 5 గంటల వరకు నిర్ణీత గడువులోగా ఆయన ఒక్క నామినేషన్ మాత్రమే దాఖలైంది. సీఎం కేసీఆర్ వినతి మేరకు కాంగ్రెస్, భాజపా, ఎంఐఎంలు ఆయనకు మద్దతు తెలిపాయి. దీంతో ఎన్నిక ఏకగ్రీవం కానుంది. సభాపతిగా పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికను శుక్రవారం అధికారికంగా ప్రకటించనున్నారు. అనంతరం ఆయన బాధ్యతలు చేపడతారు.

కేసీఆర్ వెంటే..

ముఖ్యమంత్రి తర్వాత గౌరవ మర్యాదలు (ప్రొటోకాల్) గల సభాపతి పదవిని పోచారం శ్రీనివాస్‌రెడ్డికి ఇవ్వాలని నిర్ణయించుకున్న సీఎం గురువారం ఉదయమే ఆయన్ను తన ఇంటికి పిలిపించుకొని ఎంపిక విషయం తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యతలు చేపట్టాలని, అన్ని విధాలా అండగా ఉంటానని కేసీఆర్ తెలిపారు. సభాపతిగా ఉంటే శాసనసభ ఎన్నికల్లో ఓడిపోతారనే భావనను తొలగించాలని, వచ్చే ఎన్నికల్లో తప్పక ఘనవిజయం సాధిస్తారని, దానికి తాను భరోసా ఇస్తానని శ్రీనివాస్‌రెడ్డికి చెప్పారు. అనంతరం ఆయనను తీసుకొని గన్‌పార్క్‌లోని అమరవీరుల స్తూపం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. తరువాత ఇద్దరూ శాసనసభకు వచ్చారు. అక్కడ శాసనసభ్యులకు కాబోయే సభాపతిగా శ్రీనివాస్‌రెడ్డిని పరిచయం చేశారు. అనంతరం వీరు శాసనసభ ప్రాంగణంలో పోచమ్మ గుడిలో పూజలు చేశారు. తరువాత నామినేషన్ దాఖలు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయనకు సీఎంతో పాటు అన్ని పక్షాల శాసనసభ్యులు అభినందనలు తెలిపారు. తనను ఎంపిక చేసిన సీఎం కేసీఆర్‌కు పోచారం ధన్యవాదాలు తెలిపారు.



సభాపతిగా నామినేషన్ పత్రాలను శాసనసభ కార్యదర్శి నర్సింహాచార్యులుకు అందజేస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి. పక్కన సీఎం కేసీఆర్, ఇంద్రకరణ్‌రెడ్డి, బలాలా, భట్టి విక్రమార్క, రేఖానాయక్ తదితరులు

2011లో తెలంగాణ ఉద్యమంలోకి

తెలంగాణ ఉద్యమంలోకి రావాలనే కేసీఆర్ పిలుపుతో 2011లో తెదేపా శాసన సభ్యత్వానికి రాజీనామా చేసి, తెరాసలో చేరారు. 2011లో జరిగిన ఉప ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిచారు. 2011 మార్చి 24న తెరాస పొలిట్ బ్యూరో సభ్యుడిగా నియమితులయ్యారు. 2014లో తెరాస తరఫున పోటీ చేసి విజయం సాధించారు. ఆ తరువాత తెలంగాణ తొలి వ్యవసాయశాఖ మంత్రిగా పనిచేశారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఆయన 18 వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి రెండో సభాపతి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి పోచారం రెండో శాసన సభాపతి కానున్నారు. గతంలో 2004 నుంచి 2009 వరకు బాల్కొండ ఎమ్మెల్యేగా ఉన్న సురేశ్‌రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సభాపతిగా పనిచేశారు.

పోచారం శ్రీనివాస్‌రెడ్డి కుటుంబ నేపథ్యం

- పుట్టిన తేదీ: 1949 ఫిబ్రవరి 10
- తల్లిదండ్రులు: పరిగె రాజిరెడ్డి, పాపవ్వ
- విద్యార్హతలు: ఇంజినీరింగు
- స్వస్థలం: బాన్సువాడ మండలం పోచారం
- కుటుంబం: భార్య పుష్ప, ముగ్గురు కుమారులు, కుమార్తె

సుదీర్ఘ రాజకీయ అనుభవం

పోచారం శ్రీనివాస్‌రెడ్డి సుదీర్ఘ రాజకీయ అనుభవమున్న నాయకుడు. ఆయన మొత్తం ఆరుసార్లు బాన్సువాడ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇంటి పేరు పరిగె అయినా ఆయన ఊరి పేరు బాన్సువాడ మండలంలోని పోచారం పేరుతో ప్రసిద్ధి పొందారు. తాను చదువుతున్న ఇంజినీరింగ్ విద్యకు మధ్యలోనే స్వస్తి పలికి 1969లో జరిగిన తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు.

- 1976లో ఆయన రాజకీయ ప్రవేశం చేశారు.
- 1977లో దేశాయిపేట సింగిల్‌విండో ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు.
- 1983లో తెదేపాలో చేరారు.
- 1987లో డీసీసీబీ ఛైర్మన్‌గా పనిచేశారు.
- 1989లో నిజామాబాద్ లోక్‌సభ స్థానం నుంచి తెదేపా అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు.
- 1992లో తెదేపా రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు.
- 1994లో బాన్సువాడ ఎమ్మెల్యేగా తొలిసారి ఎన్నికయ్యారు.
- 1998లో గృహ నిర్మాణశాఖ, మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.
- 1999లో మళ్లీ గెలుపొంది భూగర్భ గనుల శాఖ మంత్రిగా పనిచేశారు.
- 2001- 2002లో గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్‌శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు.
- 2004 శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ చేతిలో ఓడిపోయారు.
- 2005 నుంచి 2007 వరకు తెదేపా జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతల్లో ఉన్నారు.
- 2009 శాసనసభ ఎన్నికల్లో మళ్లీ తెదేపా తరఫున బాన్సువాడ నుంచి ఎన్నికయ్యారు.



సభాపతిగా నామినేషన్ దాఖలు చేసిన అనంతరం పోచారం శ్రీనివాస్‌రెడ్డిని అభినందిస్తున్న మండలి ఛైర్మన్ స్వామిగౌడ్

గ్రహం అనుగ్రహం

18–1–2019 శుక్రవారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
హేమంత రుతువు; పుష్య మాసం; శుక్ల పక్షం
ద్వాదశి: సా. 5.21 తదుపరి త్రయోదశి
రోహిణి నక్షత్రం: ఉ. 9.41 తదుపరి మృగశిర
అమృత ఘడియలు: ఉ. 8.07 వరకు
పునరమృతం తె. 12.21 నుంచి 1.53 వరకు
వర్జ్యం: మ. 3.05 నుంచి 4.37 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8.51 నుంచి 9.35
తిరిగి మ. 12.32 నుంచి 1.16 వరకు
రాహుకాలం: ఉ. 10.30 నుంచి 12.00 వరకు
సూర్యోదయం: ఉ.6-38; సూర్యాస్తమయం: సా.5-42

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
మెదక్	9.3	34.6
ఆదిలాబాద్	9.5	29.8
రామగుండం	12.0	30.2
హన్మకొండ	14.0	29.0
హైదరాబాద్	14.1	30.8
నిజామాబాద్	14.4	20.1
కడప	15.0	33.0
శ్రీకాకుళం	16.0	25.0
తిరుపతి	16.7	31.4
నల్గొండ	17.0	31.0
కరీంనగర్	17.0	31.0
మహబూబ్‌నగర్	17.0	33.6
విశాఖపట్నం	17.2	28.0
గుంటూరు	18.9	30.2
సూర్యాపేట	20.0	23.0
విజయవాడ	20.1	29.4
ఖమ్మం	22.0	29.0

పరిశోధనల్లో ఇక కొత్తపుంతలు

- అమెరికా వర్సిటీలతో ఒప్పందాలు
- సిద్ధమైన 10 భారత వర్సిటీలు
- తెలంగాణ నుంచి ఓయూ.. ఏపీ నుంచి ఆంధ్రా, ఎస్వీ విశ్వవిద్యాలయాలు

ఈనాడు, హైదరాబాద్: మన విశ్వవిద్యాలయాల్లో పరిశోధనస్థాయిని పెంచేందుకు ప్రతిష్ఠాత్మక అమెరికా విశ్వవిద్యాలయాలు వస్తున్నాయి. రాష్ట్రస్థాయి వర్సిటీలు సైతం అంతర్జాతీయ ర్యాంకింగ్‌లో ముందుండాలంటే లోతైన పరిశోధన, నాణ్యమైన పరిశోధన పత్రాలు తప్పనిసరని భావిస్తున్న కేంద్ర ప్రభుత్వం అందుకు అమెరికా విశ్వవిద్యాలయాలను పరిశోధనల్లో భాగస్వామ్యం చేస్తోంది. దేశవ్యాప్తంగా పది రాష్ట్ర విశ్వవిద్యాలయాలు ఆ విదేశీ వర్సిటీలతో కలిసి పరిశోధనలో పనిచేయబోతున్నాయి. అందులో తెలుగు రాష్ట్రాల నుంచి ఉస్మానియా, ఆంధ్రా, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయాలు ఉండటం విశేషం. మరో నెలలో అవి పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకోనున్నాయి. రాష్ట్రాల విశ్వవిద్యాలయాల్లో మౌలిక వసతుల కల్పన, పరిశోధన, ఇతర అంశాల్లో అభివృద్ధికి కేంద్ర మానవ వనరుల శాఖ రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్ (రూసా) కింద నిధులు కేటాయిస్తోంది. రెండో విడత రూసా కింద ఎక్కువ పరిశోధన, నవ కల్పన, ఉద్యోగాల కల్పనకు నిధులు ఇస్తోంది. అందులో భాగంగా దేశంలో న్యాక్ గుర్తింపు కింద అధిక పాయింట్లు సాధించిన 10 విశ్వవిద్యాలయాలను కేంద్రం గుర్తించింది. వాటికి రూసా-2లో ఒక్కో దానికి రూ.100 కోట్లు మంజూరు చేసింది. అందులో రూ.30 కోట్లను పరికరాల కొనుగోలుకు, సివిల్ పనులకు కేటాయించాలి. మిగిలినవి పరిశోధనకు, నవకల్పనకు, నాణ్యమైన విద్యకు కేటాయిస్తారు. ఈ అంశాల్లో ఇప్పటికే ముందంజలో ఉన్న అమెరికాలోని కొన్ని విశ్వవిద్యాలయాలను కేంద్ర మానవ వనరుల శాఖ ఎంపిక చేసింది. ఆ వర్సిటీల అధికారులతోపాటు దేశంలోని 10 విశ్వవిద్యాలయాల ఉపకులపతులను ఈ నెల 15న దిల్లీ ఆహ్వానించిన కేంద్రం పరస్పర భేటీలు ఏర్పాటు చేసింది. ఉపకులపతులు ఆయా విదేశీ వర్సిటీల ప్రతినిధులతో చర్చించారు. ఏపీలోని ఆంధ్రా, ఎస్వీ వర్సిటీలు పర్డ్యు వర్సిటీతో, ఓయూ అధికారులు పెన్సిల్వేనియా, కాలిఫోర్నియా విశ్వవిద్యాలయాలతో ఎంఓయూ కుదుర్చుకోవాలన్న నిర్ణయానికి వచ్చారు. ఏడాది పాటు ఈ ఒప్పందం అమల్లో ఉంటుంది. కేంద్రం కేటాయించిన రూ.100 కోట్లను ఆయా వర్సిటీలు 2020 మార్చి నాటికి ఖర్చు చేయాలి.

ఒప్పందాలు ఏయే వర్సిటీల మధ్య?

మన విశ్వవిద్యాలయం	విదేశీ వర్సిటీ
ఓయూ(తెలంగాణ)	పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయం, కాలిఫోర్నియా వర్సిటీ- బర్కిలీ
ఆంధ్రా, ఎస్వీ (ఏపీ)	పర్డ్యు విశ్వవిద్యాలయం
అలగప్పా (తమిళనాడు)	నార్త్ వెస్ట్రన్, పెన్సిల్వేనియా వర్సిటీలు
జాదవ్‌పూర్ (కోల్‌కతా)	కాలిఫోర్నియా వర్సిటీ- బర్కిలీ
జమ్మూ విశ్వవిద్యాలయం	నార్త్ వెస్ట్రన్, కాలిఫోర్నియా, పెన్సిల్వేనియా వర్సిటీలు
కురుక్షేత్ర వర్సిటీ (హరియాణా)	కాలిఫోర్నియా-బర్కిలీ, నార్త్ వెస్ట్రన్ వర్సిటీ
సావిత్రిబాయి పూలె వర్సిటీ (పుణె)	కాలిఫోర్నియా- బర్కిలీ
ఉత్కల్ వర్సిటీ (భువనేశ్వర్)	కాలిఫోర్నియా- బర్కిలీ
గురునానక్ దేవ్ వర్సిటీ (అమృత్‌సర్)	సౌత్ ఫ్లోరిడా వర్సిటీ, కార్నెల్ విశ్వవిద్యాలయం

అంకుర కేంద్రాల్లోనూ సహకారం తీసుకుంటాం

పరిశోధనతోపాటు నవ కల్పనలో భాగంగా విద్యార్థులను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా మార్చేలా అమెరికా వర్సిటీలకు చెందిన ఆచార్యుల సహకారం తీసుకుంటాం. అక్కడ అమలు చేస్తున్న ఉత్తమ విధానాలను ఇక్కడా ప్రారంభిస్తాం. అంకుర కేంద్రాల విషయంలో ఇప్పటికే అవి ముందంజలో ఉన్నందున ఈ ఒప్పందాలు విశ్వవిద్యాలయాల్లో వాతావరణాన్ని మార్చేస్తాయి.



- ఆచార్య రామచంద్రం, ఉపకులపతి, ఓయూ

వర్సిటీ స్థాయి పెరుగుతుంది



ఒప్పందంలో భాగంగా ఇక్కడి ఆచార్యులతోపాటు పీహెచ్‌డీ విద్యార్థులు ఒప్పందం కుదుర్చుకున్న అమెరికా వర్సిటీకి వెళ్లి కొన్నాళ్లపాటు పనిచేస్తారు. అంతర్జాతీయ స్థాయి పరిశోధనపత్రాలు ప్రచురించాలంటే అంతర్జాతీయ ఒప్పందాలు తప్పనిసరి. దానివల్ల వర్సిటీ స్థాయి పెరుగుతుంది.

- ఆచార్య నాగేశ్వర్‌రావు, ఉపకులపతి, ఆంధ్రా విశ్వవిద్యాలయం

బీఎస్పీ ఉద్యమంలోకి నా మేనల్లుడు

మాయావతి

దిల్లీ: బీఎస్పీ అగ్రనేత మాయావతి వారసుడు ఆమె మేనల్లుడేనంటూ వెలువడిన మీడియా కథనాలపై మాయా స్పందించారు. తన అల్లుడు ఆకాశ్‌ఆనంద్‌ను బీఎస్పీ ఉద్యమంలో చేర్చి, నేర్చుకోవడానికి అవకాశం కల్పిస్తామని మాయావతి తెలిపారు. ఎస్పీతో జట్టు కట్టిన తర్వాత బీఎస్పీకి ప్రజాదరణ పెరిగిందని, దీంతో కొన్ని పార్టీలు, నేతల్లో అశాంతి మొదలైందన్నారు. తమతో న్యాయంగా పోరాడకుండా, కొన్ని కులతత్వ, దళిత వ్యతిరేక టీవీ ఛానళ్ల సాయంతో బంధుప్రీతి అంటూ అసంబద్ధ వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. ఆకాశ్ మాయావతి సోదరుడు ఆనంద్‌కుమార్ తనయుడు. 2017లో ఆకాశ్‌ను మాయావతి పార్టీ సీనియర్ నేతలకు పరిచయం చేశారు. ఇటీవల ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్, ఆర్జేడీ నేత తేజస్వీలతో మాయావతి జరిపిన భేటీల్లోనూ, ఆమె పుట్టినరోజు వేడుకల్లోనూ ప్రముఖంగా కనిపించారు. లోక్‌సభ ఎన్నికల్లో దళిత యువతను ఆకట్టుకునేందుకు ఆకాశ్‌కు ప్రాధాన్యం ఇస్తున్నట్లు భావిస్తున్నారు.

దేశంలో తొలిసారిగా బీటెక్‌లో 'కృత్రిమ మేధ'

- పూర్తిస్థాయి కోర్సును అందుబాటులోకి తెస్తున్న ఐఐటీ హైదరాబాద్
- జేఈఈ అడ్వాన్స్‌డ్ ద్వారా ఏటా 20 మందికి ప్రవేశాలు



ఐఐటీ హైదరాబాద్ అకడమిక్ (బ్లాక్-ఎ) భవనం

ఈనాడు, సంగారెడ్డి: కృత్రిమ మేధ రానున్న రోజుల్లో మానవ జీవితాల్లో కీలక పాత్ర పోషించనుంది. దీని ద్వారా వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయం, నిఘా, రక్షణ రంగాల్లో పెనుమార్పులు సాధ్యమవుతాయి. ఇప్పటికే చాలా సంస్థలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధ)ను అందిపుచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలో దేశంలోనే తొలిసారిగా 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ-హైదరాబాద్' బీటెక్‌లో పూర్తిస్థాయి కృత్రిమ మేధ కోర్సును అందుబాటులోకి తెస్తోంది. జేఈఈ-అడ్వాన్స్‌డ్ ద్వారా ఏటా 20 మందికి ఈ కోర్సులో ప్రవేశాలు కల్పించనున్నారు. 2019-2020 విద్యాసంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించేందుకు రంగం సిద్ధం చేశారు. ఐఐటీ, హైదరాబాద్ కేంద్రంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో పరిశోధనలకు చక్కటి వాతావరణాన్ని సృష్టించడమే ఈ కోర్సు ప్రధాన లక్ష్యమని ఐఐటీహెచ్ సంచాలకులు ఆచార్య యూబీ దేశాయ్ విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రత్యేకతను చాటనున్న ఐఐటీహెచ్

ఐఐటీ హైదరాబాద్ ఇప్పటికే ఉద్యోగాలు చేస్తున్న వారికోసం ఎంటెక్‌లో డాటా సైన్స్ కోర్సును అందుబాటులో తెచ్చింది. 2015-16 విద్యాసంవత్సరం నుంచి ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఆ కోర్సులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), మెషిన్ లెర్నింగ్ భాగంగా ఉన్నాయి. కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, లిబరల్ ఆర్ట్స్ విభాగాలు సంయుక్తంగా 'ఏఐ-హ్యుమానిటీస్' కోర్సును అందుబాటులోకి తెచ్చాయి. బీటెక్ విద్యార్థులు మైనర్ కోర్సుగా దీన్ని ఎంచుకునే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే బీటెక్‌లో పూర్తిస్థాయిలో కృత్రిమ మేధ కోర్సును తీసుకొస్తున్న ఐఐటీ హైదరాబాద్ ఈ విషయంలో దేశంలోనే తొలి ఇన్‌స్టిట్యూట్‌గా నిలవనుంది. ప్రపంచవ్యాప్తంగా పరిశీలిస్తే అమెరికాలోని కార్నెగీ మెలన్ విశ్వవిద్యాలయం, మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ)లు మాత్రమే ఇలా కోర్సును అందిస్తున్నాయి. అంతర్జాతీయంగా ఈ కోర్సును అందించనున్న మూడో ఇన్‌స్టిట్యూట్‌గా హైదరాబాద్ ఐఐటీ ప్రత్యేకత సాధించనుంది.

నిపుణులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

ఈ కోర్సులో ప్రవేశాలు పొందే విద్యార్థులను నిపుణులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించారు. కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాలు సమన్వయంతో పనిచేయనున్నాయి. అల్గారిథమ్స్, సిగ్నల్ ప్రాసెసింగ్, రోబోటిక్స్ అంశాలను వారికి నేర్పించనున్నారు. 'మానవ జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో కృత్రిమ మేధ కీలక పాత్ర పోషించనుంది. ఈ కోర్సులో భాగంగా విద్యార్థులకు కంప్యూటర్ సైన్స్, ఏఐ, మెషిన్ లెర్నింగ్ అంశాల్లోని ప్రాథమిక సూత్రాలపై శిక్షణ అందించనున్నాం. కృత్రిమ మేధను ఉపయోగించే సమయంలో ఎదురయ్యే నైతిక విలువల అంశాలపై కూడా వారికి అవగాహన కల్పిస్తాం' అని ఐఐటీ హెచ్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ సుమోహన చన్నప్పయ్య వివరించారు.

బ్యాంకాక్‌కు ఐఆర్‌సీటీసీ ప్రత్యేక ప్యాకేజీ

విజయవాడ, న్యూస్‌టుడే: బ్యాంకాక్ సందర్శనకు వెళ్లే యాత్రికుల సౌకర్యార్థం ఐఆర్‌సీటీసీ ప్రత్యేక ప్యాకేజీని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ మేరకు సంస్థ విజయవాడ మేనేజర్ మధుసూదనరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు రాత్రులు, ఐదు పగళ్లు ప్యాకేజీలోభాగంగా.. ఫిబ్రవరి 15వ తేదీన హైదరాబాద్ నుంచి విమానంలో బయలుదేరుతారు. 19న తిరుగు ప్రయాణం ఉంటుందన్నారు. విమానం టికెట్లు, వసతి, బీమా, పర్యాటక ప్రదేశాల సందర్శనతో కలిపి టికెట్టు ధర ఒక్కొక్కరికీ రూ.50,958గా నిర్ణయించారు. చిన్నారులకు (2 నుంచి 11ఏళ్ల మధ్య)రూ.43094లుగా ఉంటుందన్నారు. వివరాలకు 0866-2572280, 9701360620,నంబర్లలో సంప్రదించవచ్చని ఆయన చెప్పారు.

డోక్లాంలో పెరగనున్న చైనా బలగాల మోహరింపు!

- తుది దశకు చేరుకున్న రహదారి నిర్మాణ పనులు

దిల్లీ: భారత సరిహద్దుల్లోని డోక్లాంలో చైనా బలగాల మోహరింపు ఎక్కువయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. డోక్లాం పీఠభూమితో తమ దేశ రహదారులను అనుసంధానిస్తూ చైనా చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. మెరుగ్ లా-డోక్లాంలను కలుపుతూ 12 కిలోమీటర్లమేర నిర్మిస్తున్న రోడ్డుపై తారు పోయడం పూర్తయిందని నిఘావర్గాలు తాజాగా సమాచారం అందించాయి. చైనాలోని యాటుంగ్ సైనిక స్థావరం నుంచి బలగాలు వేగంగా డోక్లాంకు చేరుకోవడానికి ఈ మార్గం దోహదపడనుంది. యాటుంగ్ నుంచి జెలెప్ లాకు చైనా నిర్మిస్తున్న రోడ్డు పనులు కూడా తుదిదశకు చేరుకున్నట్లు తెలిసింది. 2017లో భారత్-చైనా సైన్యాల మధ్య డోక్లాంలో 73 రోజులపాటు ప్రతిష్టంభన నెలకొన్న సంగతి తెలిసిందే. అనంతరం భారత్ కూడా ఈ పీఠభూమి దిశగా రహదారుల నిర్మాణాన్ని వేగవంతం చేసింది.

ఈఎంఆర్ఎస్‌కు ప్రత్యేక సొసైటీ!

- తెలంగాణ ప్రభుత్వానికి కేంద్రం సూచన

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఈఎంఆర్ఎస్) నిర్వహణ కోసం ప్రత్యేక సొసైటీ ఏర్పాటుకావాలని కేంద్ర గిరిజన సంక్షేమశాఖ ఉన్నతాధికారులు సూచించారు. అప్పుడే ఎటువంటి ఇబ్బందులూ లేకుండా నిధులను నేరుగా వినియోగించుకునే వీలుంటుందన్నారు. కేంద్ర మంత్రి జోయల్ ఓరం ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో 22 రాష్ట్రాలకు చెందిన గిరిజన శాఖ ఉన్నతాధికారుల సమావేశం ఏర్పాటైంది. సంబంధిత రాష్ట్ర ముఖ్య కార్యదర్శి మహేష్‌దత్ ఎక్కా, కమిషనర్ క్రిస్టీనా, అదనపు సంచాలకుడు సర్వేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. వచ్చే విద్యాసంవత్సరానికి దేశవ్యాప్తంగా 150 పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, ఎంతో విస్తృతంగా చర్చించారు.

కేంద్రం ఇటీవల పేర్కొన్న నిబంధనల మేరకు మండల ప్రాంతంలో 50 శాతానికిపైగా (కనీసం 20వేలు) గిరిజన జనాభా కలిగినవి 13 ఉన్నట్లు తెలంగాణ అధికారులు తెలిపారు. భూముల లభ్యత, మౌలిక సదుపాయాల గురించి వివరించారు. గిరిజన గురుకులాల కోసం సొసైటీ ఉందని చెప్పడంతో, ప్రత్యేకించి ఏర్పాటు చేసుకోవాలని కేంద్ర ఉన్నతాధికారులు పేర్కొన్నారు. ఒక్కో విద్యార్థిపై దాదాపు రూ.1.09లక్షలు ఖర్చుచేయనున్నట్లు చెప్పారు. ఏకలవ్య గురుకులాల్లో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు మరిన్ని సదుపాయాలు కల్పించాలని వారు ఆదేశించారు.

అంతర్రాష్ట్ర బదిలీలకు మరో 6 నెలలు

దరఖాస్తు చేసుకున్నవారికే అవకాశం

ఈనాడు, హైదరాబాద్: అంతర్రాష్ట్ర బదిలీలకు దరఖాస్తుచేసుకున్న ఉద్యోగులకు ఆ గడువును జూన్ 30వ తేదీ వరకు పొడిగించినట్లు... రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ బృందానికి చెందిన ఎక్స్ అఫిషియో ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎల్.ప్రేమచంద్రారెడ్డి తెలిపారు. దరఖాస్తు చేసుకుని ఇప్పటికీ అపరిష్కృతంగా ఉన్నవాటికే ఇది వర్తిస్తుందని పేర్కొన్నారు. బదిలీలకు గడువు గత డిసెంబరు 31వ తేదీ వరకు ఉండగా, ఇక ఆరు నెలలపాటు పొడిగించినట్లయిందని ప్రకటనలో వివరించారు. లోకల్ కేడర్‌లో (జిల్లా/జోనల్/మల్టీ జోనల్) దంపతులు, పరస్పర అంగీకార బదిలీలకు సంబంధించిన ఈ అంశంలో... 2017 ఆగస్టు ఏడోతేదీన జారీచేసిన మార్గదర్శకాలు వర్తిస్తాయన్నారు.



ఫోన్ చేయగానే పోలీసు ప్రత్యక్షం

- ఆ దిశగా క్షేత్రస్థాయిలో పోలీసుశాఖ కసరత్తు
- మరింత బలోపేతం కానున్న డయల్-100
- ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో 14,500 గస్తీ వాహనాలు పంపిణీ



ఈనాడు, హైదరాబాద్: ఆపదలో ఉన్నప్పుడు పోలీసుల అండ లభిస్తే.. ఫోన్ చేయగానే గస్తీ వాహనం ప్రత్యక్షమైతే... అంతకు మించిన సాంత్వన మరేమీ ఉండదు. ప్రజలు ఫోన్ చేసిన వెంటనే నిమిషాల వ్యవధిలో వారి చెంతకు చేరేందుకు పోలీసుశాఖ కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే అమలులో ఉన్న డయల్-100ను మరింత బలోపేతం చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. హైదరాబాద్‌లో నిర్మిస్తున్న కమాండ్ కంట్రోల్ కేంద్రం త్వరలో అందుబాటులోకి రానున్న నేపథ్యంలో పోలీసుశాఖ క్షేత్రస్థాయి ఏర్పాట్లు చేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లోనూ ప్రత్యేకంగా గస్తీ వాహనాలు అందజేస్తోంది. తాజాగా కొనుగోలు చేసిన 14,500 వాహనాల పంపిణీ పూర్తి కాగా వాటికి జీపీఎస్ తదితర ఉపకరణాలు అమర్చనున్నారు.

గతేడాది డయల్-100కు మొత్తం 6,12,506 ఫోన్‌కాల్స్ వచ్చాయి. ఫోన్ వచ్చిన తర్వాత సగటున 8.5 నిమిషాలకు పోలీసు వాహనం ప్రజల వద్దకు చేరింది. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో ఇది 5 నిమిషాల లోపే ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో పోలీస్‌స్టేషన్ పరిధి ఎక్కువ కాబట్టి కాస్త ఎక్కువ సమయం పడుతుంది. ప్రస్తుతం రాజధానిలో అందుబాటులో ఉన్న తరహాలోనే ఫోన్ చేసిన వెంటనే గ్రామీణ ప్రాంతాల్లోనూ వీలైనంత తక్కువ సమయంలో పోలీసు వాహనం చేరుకునేలా చూసేందుకు ప్రయత్నిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే పోలీస్‌స్టేషన్‌కు ఒక వాహనం చొప్పున ఇచ్చారు. ఆయా స్టేషన్ల పరిధిని బట్టి వీటి సంఖ్య పెంచనున్నారు. గస్తీ కోసం ప్రత్యేకించిన వాహనాలను స్టేషన్ పరిధిలో వేర్వేరు ప్రాంతాల్లో మోహరిస్తారు. తద్వారా ఎవరైనా ఫోన్ చేసినప్పుడు జీపీఎస్ ద్వారా వారు ఉన్న ప్రాంతాన్ని బట్టి వారికి దగ్గరలో ఉన్న వాహనాన్ని అక్కడకు పంపుతారు. ప్రస్తుతం ఏ స్టేషన్‌కు ఎన్ని వాహనాలు అవసరమో అధికారులు లెక్కలు కడుతున్నారు. వీటిన్నిటికీ జీపీఎస్ సదుపాయం కల్పించి కమాండ్ కంట్రోల్ కేంద్రానికి అనుసంధానం చేయనున్నారు. అలాగే ఈ వాహనాలకు సీసీ కెమెరాలు అమర్చి సంఘటనా స్థలంలో జరుగుతున్న దృశ్యాలను కమాండ్ కంట్రోల్ కేంద్రం ద్వారా వీక్షించాలని, అవసరమైతే సంఘటనా స్థలంలోనే ఎఫ్.ఐ.ఆర్. నమోదు చేయాలనేది అధికారుల ప్రణాళిక. ఇందుకోసం ప్రతి వాహనానికీ సీసీ కెమెరా, ల్యాప్‌టాప్ దానికి ఇంటర్‌నెట్ సదుపాయం కల్పించనున్నారు. ఫిర్యాదు చేసిన వెంటనే వారి ముందు పోలీసు వాహనం ప్రత్యక్షం అయ్యేలా చూడాలనేది అధికారుల ఆలోచన. కమాండ్ కంట్రోల్ భవనం నిర్మాణం పూర్తయిన తర్వాత వీటిపై దృష్టి కేంద్రీకరించనున్నారు.

అఖిలేశ్‌పై ఈడీ కేసు

దిల్లీ: ఉత్తర్‌ప్రదేశ్‌లో ఇసుక అక్రమ తవ్వకాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కేసులు నమోదు చేసినట్టు గురువారం అధికారులు వెల్లడించారు. మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ సహా మరికొందరిపై ఇప్పటికే సీబీఐ కేసు పెట్టింది. తాజాగా అక్రమ నగదు చలామణి నిరోధక చట్టం కింద ఈడీ కేసులు నమోదు చేసింది. హమిర్‌పుర్ జిల్లాలో 2012-16 మధ్యన ఇసుక, కంకర తవ్వకాల్లో అక్రమాలు చోటుచేసుకున్నట్టు సీబీఐ కేసు పెట్టింది. గనుల శాఖ నిర్వహించిన నాటి ముఖ్యమంత్రి అఖిలేశ్ సహా 11 మందిపై కేసు పెట్టింది.



ప్రైడ్ ఇండియా సంస్థకు సీసీఎస్ తాఖీదులు

- హీరాగోల్డ్ స్థిరాస్తులను కొనుగోలు చేయవద్దని హెచ్చరిక

ఈనాడు, హైదరాబాద్: హీరాగోల్డ్ గ్రూప్ సంస్థల తాలూకు స్థిరాస్తులను కొనుగోలు చేసేందుకు జీపీఏ కుదుర్చుకున్న స్థిరాస్తి సంస్థ ప్రైడ్ ఇండియాకు హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు తాఖీదులు జారీ చేశారు. టోలీచౌకీలోని పాత ముంబయి హైవేకు సమీపంలో హీరాగోల్డ్ సంస్థకు చెందిన రూ.150కోట్ల విలువైన ఆరు ఎకరాల స్థలాన్ని ప్రైడ్ఇండియా కొనుగోలు చేసినట్టు పోలీస్ ఉన్నతాధికారులు గుర్తించారు.

'హీరాగోల్డ్‌లో పెట్టుబడులు పెట్టిన మదుపరుల న్యాయ పరిరక్షణ దృష్ట్యా తాము ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలంటూ కోర్టుకు నివేదిక ఇచ్చాం. ఆ స్థలాన్ని కొనుగోలు చేయ వద్దు' అని నోటీసుల్లో పేర్కొన్నారు. ప్రైడ్ ఇండియా ప్రతినిధిని సీసీఎస్ కార్యాలయానికి పిలిపించి భూమిని ప్లాట్లుగా విడగొట్టి విక్రయించినా, మొత్తంగా అమ్మినా చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. 'తాము స్థలాలు ఎవరికీ విక్రయించలేదని' అతను చెప్పినట్టు సమాచారం.

చదువులు చట్టుబండలు

చదివేది ఎనిమిదో తరగతి అయినా, వారిలో సగం మందికిపైగా విద్యార్థులకు భాగాహారాలు చేతకావు. మూడో తరగతికి చేరిన పిల్లల్లో సుమారు 70 శాతం, రెండో తరగతి పాఠ్య పుస్తకాన్ని సరిగ్గా చదవలేరు. గ్రామీణ భారతంలో విద్యా ప్రమాణాలపై స్వచ్ఛంద సంస్థ 'ప్రథమ్' తాజాగా వెలువరించిన వార్షిక విద్యాస్థాయి నివేదిక (అసర్ 2018) ఎలుగెత్తుతున్న దిగ్భ్రాంతికర యథార్థాలివి! దేశవ్యాప్తంగా 596 గ్రామీణ జిల్లాల్లో 3-16 ఏళ్ల వయస్సులైన దాదాపు ఐదున్నర లక్షల మంది విద్యార్థుల నుంచి క్రోడీకరించిన వివరాల ప్రకారం, పునాదులు గుల్లబారుతున్నాయి. ప్రాథమిక విద్యాస్థాయిల్లో పిల్లల ప్రవేశాల శాతం పెరిగినా ప్రమాణాల పతనం ఆందోళనకరస్థాయికి చేరుతోంది. పదేళ్లక్రితం మదింపువేసిన జాతీయ సగటు ప్రకారం, ఐదో తరగతి విద్యార్థుల్లో 53 శాతమే రెండో తరగతి పుస్తకం చదివే స్థితిలో ఉండేవారు. నేడా సంఖ్య 44.2 శాతానికి పరిమితమైంది! ప్రాథమిక దశలో ఇంతటి దుర్బల పునాదుల కారణంగా పై తరగతులకు చేరేసరికి తగినంత అభ్యసన సామర్థ్యం కొరవడటం, ఎన్నో సమస్యలకు అంటుకడుతోంది. ఛత్తీస్‌గఢ్, గుజరాత్, జమ్మూకశ్మీర్, కర్ణాటక వంటిచోట్ల 60-69 శాతం దాకా ఎనిమిదో తరగతి విద్యార్థులు లెక్కల్లో చతికిలపడుతున్నారు. తెలంగాణలో 31శాతం ఎనిమిదో తరగతి పిల్లలు కనీసం రెండో తరగతి పాఠ్యపుస్తకాన్నీ చదవలేకపోతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 77 శాతానికిపైగా మూడో తరగతి విద్యార్థులు అంతకుముందు ఏడాది నేర్చిన పాఠ్యాంశాల్ని ఉచ్చరించడంలో విఫలమవుతున్నారు. గణితం, విజ్ఞాన సాంఘిక శాస్త్రాలతోపాటు భాషల్లో తెలుగు విద్యార్థుల వెనకబాటుతనానికి బోధన సిబ్బంది కొరతే ప్రధాన కారణమని మునుపటి అధ్యయనాలు ప్రస్ఫుటీకరించాయి. తరతమ భేదాలతో తక్కినచోట్లా ప్రమాణాల పతనానికి అదే పుణ్యం కట్టుకుంటున్నట్లు 'అసర్' వెలుగులోకి తెచ్చిన అంశాలు నిర్ధారిస్తున్నాయి. ఒక్కముక్కలో- దేశంలో ప్రాథమిక చదువులు చట్టుబండలవుతున్నాయి!

ఏ దేశ భవిష్యత్తయినా తరగతి గదిలోనే రూపుదిద్దుకొంటుంది. ఆ దృష్ట్యా, జాతినిర్మాణంలో కీలక భాగస్వామ్యం వహిస్తూ ప్రతి బడీ నారుమడిగా భాసిల్లాలి. బాల్యదశలో ప్రాథమిక విద్య సక్రమంగా సమకూరితేనే ఆర్థికాభ్యున్నతి ఒనగూడుతుందని గతంలో ప్రపంచ బ్యాంకు, యునెస్కో వంటివీ ఉద్బోధించాయి. దురదృష్టవశాత్తు, దేశంలో ఏళ్లతరబడి దిగనాసి ప్రాథమిక చదువుల బాగోతం- సహజసిద్ధ ప్రతిభా కర్షకరం చిదిమేస్తూ, జాతి దీర్ఘకాలిక ప్రయోజనాలకు తూట్లు పొడుస్తోంది. రాష్ట్రాలవారీగా భారీయెత్తున ఉపాధ్యాయ కొలువుల్లో ఖాళీలు భర్తీకాకపోవడం, పరిమిత బోధన సిబ్బందిపై పనిభారం పెంచుతోంది. లక్ష వరకు ఏకోపాధ్యాయ ప్రాథమిక పాఠశాలల్లో ఐదు తరగతులకూ ఒక్కరే, మొత్తం 18 సబ్జెక్టులు బోధించాల్సిన దురవస్థ, ప్రమాణాలకు అంటుకత్తెర వేస్తోంది. విద్యాహక్కు చట్టం అమలులోకి వచ్చిన ఎనిమిదేళ్ల తరవాతా ఆరు లక్షల మందికిపైగా బోధన సిబ్బంది ప్రామాణిక అర్హతలు, శిక్షణ లేనివారేనంటే- చదువులకు ఎలా చెదలు పడుతున్నాయో సుస్పష్టం. ఉపాధ్యాయ నియామకాల్లో అలసత్వం, ఉన్న సిబ్బందికి శాస్త్రీయ శిక్షణ అందించడంలో ఉదాసీనత, మౌలిక వసతుల పరికల్పనలో నిర్లక్ష్యం- దేశంలో డొల్ల చదువుల ప్రజ్వలనానికి కలికట్టుగా పుణ్యం కట్టుకుంటున్నాయి. ఈ లోటుపాట్ల కారణంగానే సార్వత్రిక విద్యాలక్ష్యాల సాధనలో ఇండియా యాభై సంవత్సరాలు వెనకబడింది. ఇకనైనా సత్వర దిద్దుబాటు చర్యల ద్వారా విద్యారంగాన మౌలిక మార్పులు చేపట్టకపోతే 2030 నాటికి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో భారత్ భంగపాటు తప్పదు. కొత్తగా ఐదు, ఎనిమిది తరగతులకు వార్షిక పరీక్షల్ని కఠినతరం చేయడం ద్వారా ప్రమాణాలేవో బాగుపడతాయని కేంద్రం చెబుతోంది. అరకొర చొరవతో సరిపుచ్చకుండా- కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అర్థవంతమైన సమన్వయంతో బడికి సరికొత్త ఒరవడి దిద్దాలి!

తొలి చదువుల దశలోనే ప్రతిభా వికసనానికి అనుసరణీయ మార్గమేమిటో ఫిన్లాండ్, స్విట్జర్లాండ్, బెల్జియం ప్రభృత దేశాలు సోదాహరణంగా తెలియజెబుతున్నాయి. ప్రపంచంలోనే అత్యుత్తమ స్థాయి ప్రాథమిక చదువులకు నెలవుతున్న దేశాలు సృజనాత్మక మానవ వనరుల నిర్మాణంలో దీమాగా పురోగమిస్తున్నాయి. బోధనపట్ల అపార అనురక్తి, వృత్తి నిబద్ధత, చిత్తశుద్ధి కలిగిన సమర్థుల్ని గరిష్ఠ వేతనాలతో గురుపీఠాలపై ప్రతిష్ఠించి, నిరంతర శిక్షణతో వారి ప్రతిభా పాటవాలకు పదునుపెట్టడంలో చైనా, దక్షిణకొరియా, హాంకాంగ్ తదితరాల అనుభవాలూ- భారత్ వంటి దేశాలకు విలువైన గుణపాఠాలు. నాణ్యమైన విద్యాబోధనకు, సమున్నత ప్రమాణాల సాధనకు అడ్డదారులు ఉండవు. ప్రధాని మోదీ చెప్పినట్లు- వ్యక్తిని విశ్వమానవుడిగా తీర్చిదిద్దగలిగేది విద్యే. దుర్బల పునాదులపై ఎన్ని నిచ్చెనలెక్కినా అభ్యసన సామర్థ్యం, గణిత మేధ కూడా కొరవడి అసంఖ్యాకుల పట్టాలు ఉపాధి వేటలో ఎందుకూ కొరగాకుండా పోతుండటం తెలిసిందే. ఈ దుస్థితిగతుల్ని బదాబదలు చేసేలా ఖాళీల భర్తీ, సముచిత బడ్జెట్ కేటాయింపులు, పాఠ్యప్రణాళికల ప్రక్షాళనకు ప్రభుత్వాలు అగ్ర ప్రాధాన్యమివ్వాలి. ఇప్పటికీ తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల వసతి, గ్రంథాలయాలు, క్రీడా మైదానాలకు నోచని పాఠశాలలు దాదాపు ప్రతి రాష్ట్రంలోనూ వేల సంఖ్యలో పోగుపడటం- విస్తృత ప్రాతిపదికన విధాన పరివర్తన ఆవశ్యకతను ప్రస్ఫుటీకరిస్తోంది. ఉపాధ్యాయుల ఎంపికలో తగిన జాగ్రత్తలు తీసుకోనట్లయితే తరాలకు తరాలే నష్టపోతాయన్న ఐపీఎస్‌సీ (ఇండియన్ పబ్లిక్ స్కూల్ కాన్ఫరెన్స్) హెచ్చరిక- ప్రభుత్వాలు ఏ దశలోనూ విస్మరించరానిది. అట్టడుగునుంచీ విద్యాబోధన పరిపుష్టమైతే, ఉన్నత చదువుల్లోనూ మెరుగుదల సాకారమై- మానవాభివృద్ధి సూచీల్లో భారత్ పైమెట్లు ఎక్కగలుగుతుంది!

రగులుతున్న ఉగ్ర ముప్పు

అంతమైందనుకుంటున్న ఐసిస్ మూలాలు దేశంలో ఇంకా బలంగానే ఉన్నాయి. విధ్వంసానికి పాల్పడేందుకు ప్రయత్నించిన ఉగ్రవాదులపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) దాడులు చేసింది. పశ్చిమ ఉత్తర్‌ప్రదేశ్, పంజాబుల్లోని 8 ప్రాంతాల్లో దాడులు నిర్వహించి వారి కుట్రలను భగ్నం చేసింది.



చాపకింద నీరు... ఐసిస్!

ప్రపంచాన్ని గడగడలాడించిన ఐఎస్ఐఎస్ (ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ సిరియా) భూతాన్ని అణిచివేయడంలో పైచేయి సాధించామని ప్రపంచ దేశాలు భావిస్తున్నా దాని భావజాలం మాత్రం ఇంకా మలగిపోలేదు. ఇటీవల వెలుగులోకి వచ్చిన భారీ కుట్ర ఈ విషయాన్ని నిరూపించింది. దిల్లీ, ఉత్తర్‌ప్రదేశ్‌లో ఈ సంస్థకు చెందిన పది మంది సానుభూతిపరులు, విధ్వంసానికి కుట్ర పన్నగా- జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్.ఐ.ఎ.) వీరిని అరెస్టు చేసి పెద్దయెత్తున ఆయుధాలు, మందుగుండు, పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకుంది. దిల్లీలో రద్దీగా ఉండే ప్రాంతంలో పేలుళ్లకు పాల్పడటంతోపాటు భారీగా ప్రాణనష్టం కలిగించాలన్నది వీరి వ్యూహం. ఐసిస్ పని అయిపోయిందన్న వాదనను ఈ ఘటన పటాపంచలు చేసింది. సిరియా, ఇరాక్‌లలో కొంత ప్రాంతాన్ని ఆక్రమించుకొని స్థాపించిన ఖలీఫా రాజ్యం పతనం అయినంత మాత్రాన ఉగ్రవాదం మలగిపోలేదని తాజా ఉదంతం స్పష్టం చేస్తోంది. సరిహద్దులతో సంబంధం లేకుండా భావజాల సారూప్యం ఉన్న వారందర్నీ ఏకం చేసిన ఉగ్రవాద సంస్థ ఐసిస్! అమెరికా, ఆస్ట్రేలియా, ఐరోపా, ఆఫ్రికా దేశాలకు చెందిన యువకులు పెద్దసంఖ్యలో ఇందులో చేరారు. సిరియాలో పోరాటానికి, తమ దేశంలో కాఫిర్ (దేవుణ్ని నమ్మని వారి)లను హతమార్చేందుకు అవసరమైతే ప్రాణాలు అర్పించేందుకు వారు సిద్ధమయ్యారు. దాని ఫలితమే బెల్జియం, పారిస్, జర్మనీ, ఆస్ట్రేలియా, అమెరికాలలో జరిగిన దాడులు!

ఏకమైన అమెరికా, రష్యా

ప్రమాదకరంగా విస్తరిస్తున్న ఐసిస్‌కు అడ్డుకట్ట వేసేందుకు ప్రపంచ దేశాలన్నీ ఏకమయ్యాయి. సిరియా విషయంలో ఉప్పూనిప్పుగా ఉన్న అమెరికా, రష్యాలు సైతం చేతులు కలిపాయి. దాంతో ఎంత వేగంగా విస్తరించిందో అంతే వేగంగా ఐఎస్ఐఎస్ బలహీనపడింది. ఉగ్రవాదులు తాము స్థాపించుకున్న రాజ్యాన్ని వదిలిపెట్టి సొంత దేశాలకు పారిపోవాల్సి వచ్చింది. 2018లో ప్రపంచం సాధించిన గొప్ప విజయాల్లో దీన్ని ఒకటిగా చెప్పుకోవచ్చు. అయితే ఉగ్రవాద సంస్థ పతనమైనంత మాత్రాన దాని నుంచి ప్రపంచానికి పొంచి ఉన్న ముప్పు పూర్తిగా తొలగిపోయినట్లేనా అన్నది ప్రశ్నార్థకం! ఈ సంస్థ సైన్యం చెల్లాచెదురైందనడంలో అనుమానం లేదు. కాని యావత్ ప్రపంచం ఇంకా దాని తాలూకు భావజాలం రాజేసిన నిప్పుల కుంపటిపైనే ఉంది. ఐసిస్ తరఫున సిరియాలో శిక్షణ పొంది, పోరాడిన వివిధ దేశాలకు చెందిన వారు గుట్టుచప్పుడు కాకుండా మళ్లీ వారి వారి దేశాలకు చేరుతున్నారు. అక్కడ వారు ఖాళీగా ఉంటారని అనుకోలేం. అవకాశం దొరికితే అక్కడా నెత్తుటి నెగళ్ళు రగిలిస్తారనడంలో సందేహం లేదు!

ఉగ్రవాదులను మట్టుబెట్టవచ్చు కానీ వారి భావజాలాన్ని తుదముట్టించడం అంత సులభం కాదు! భారత్‌లో లష్కరే తొయిబా, జైషే మహ్మద్, హర్కతుల్ జిహాదీ అల్ ఇస్లామీ (హుజీ) వంటి ఉగ్రవాద సంస్థలు భయానక వాతావరణం సృష్టిస్తున్నాయి. ఇవి ప్రధానంగా కశ్మీర్ పైనే దృష్టి సారించాయి. వీటి తరవాత పుట్టుకొచ్చిందే ఇండియన్ ముజాహిద్దీన్ (ఐఎం). ఇది దేశవ్యాప్తంగా వరస దాడులతో హడలెత్తించింది. హైదరాబాద్‌లోనూ రెండుసార్లు పడగ విసిరింది. దేశంలో దాదాపు 600 మందిని హతమార్చింది. లష్కరే తోయిబా సౌజన్యంతో శిక్షణ పొందిన షఫీక్ ఆర్మర్ వంటి వారు ఐ.ఎం. పగ్గాలు చేపట్టారు. 2013 నాటికి దాని ప్రభావం తగ్గిపోయింది. అదే సమయంలో ఐఎస్ఐఎస్ ప్రస్థానం మొదలైంది. దాంతో షఫీక్ అర్మర్ అందులో చేరాడు. ఐఎస్ఐఎస్ తరఫున భారత్‌లో కార్యకలాపాలు నిర్వహించేందుకు 'జనూద్ అల్ ఖలీఫా ఎ హింద్' స్థాపించాడు. దాని ద్వారా యువకులను ఆకర్షించడం మొదలుపెట్టాడు. ఉగ్రవాద సానుభూతి పరులందరికీ ఐసిస్ వేదిక అయింది. ఇప్పుడది పతనం అయినంత మాత్రాన ఉగ్రవాదం అంతమైనట్లు కాదు. అది ఎక్కడో మరో పేరుతో కొనసాగుతూనే ఉండవచ్చు.

నాలుగైదేళ్ళ క్రితం సామాజిక మాధ్యమాలు ఇంతలా విస్తరించలేదు. దాంతో ఉగ్రవాద సంస్థలు తమ భావజాలాన్ని సానుభూతిపరులకు చేర్చేందుకు కష్టపడాల్సి వచ్చేది. పైగా నిఘా సంస్థల సమస్య ఉండనే ఉంది. ఈ మధ్యకాలంలో మూడో కంటికి తెలియకుండా తమ అభిప్రాయాలను మద్దతుదారులకు చేరవేయగలిగే సాంకేతిక పరిజ్ఞానం విస్తరించింది. దీన్ని ఆసరగా చేసుకొని ఐసిస్ యువకులపై వల విసిరింది. ఇందుకోసం ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేసుకుంది. 'అల్-ఫరాన్', 'అల్-తిసాం', 'అజ్‌నాద్ ఫౌండేషన్స్', 'అల్-హయత్ మీడియా సెంటర్'లతో పాటు 'అల్-బయాన్' పేరుతో రేడియో స్టేషన్, అల్-హిమ్మా పేరుతో ప్రచురణ సంస్థలు స్థాపించింది. వీటి ద్వారా యువతను రెచ్చగొట్టింది. ఐ.ఎం.తో పాటు పాత తరం ఉగ్రవాద సంస్థల్లో నిరక్షరాస్యులే ఎక్కువ. చదువు మధ్యలోనే ఆపేసిన వారు పనిచేసేవారు. ఐఎస్ఐఎస్ వచ్చిన తరవాత ఉన్నత విద్యావంతులు, సాఫ్ట్‌వేర్ సంస్థల్లో ఉద్యోగాలు చేస్తున్న వారూ దానిపట్ల ఆకర్షితులయ్యారు.

అగ్రరాజ్యమే లక్ష్యంగా...



ఉగ్రవాద సంస్థలు స్థానిక పరిస్థితులను తమకు అనుకూలంగా మలచుకొని యువతను రెచ్చగొడతాయి. ఇజ్రాయెల్‌కు మద్దతు తెలుపుతుందన్న అక్కసు, పశ్చిమాసియాలో మితిమీరి జోక్యం చేసుకుంటుందన్న ఆగ్రహంతో అఫ్గానిస్థాన్ తాలిబన్లు అమెరికాను లక్ష్యంగా చేసుకున్నారు. సెప్టెంబరు 11 దాడులతో ప్రతీకారం తీర్చుకున్నారు. ఐసిస్ ఆవిర్భావానికి ముందు వరకూ ఉగ్రవాదం ఏ దేశానికి ఆ దేశంలో ప్రత్యేకం అన్నట్లుగా ఉండేది. ఆ తరవాతే ప్రపంచ సమస్యగా మారింది. ఉగ్రవాద సంస్థలో సంబంధం లేని వారు కూడా ఎవరికి వారు, ఎక్కడికక్కడే దాడులు చేయడం మొదలుపెట్టారు. వీలైతే సిరియా వెళ్ళి పోరాడటం, లేనట్లయితే సొంత దేశంలోనే తమ ప్రతాపం చూపడం ధ్యేయంగా పనిచేశారు.

ఇందుకు కారణం వారు నిత్యం వినియోగించే సామాజిక మాధ్యమాల మాటున జరుగుతున్న ప్రచారమే. ఒక్కసారి వారిలో ఆసక్తి మొదలైందంటే దాన్ని పసిగట్టి, ఉగ్రవాదం నూరిపోసేందుకు వారితో రహస్యంగా సంభాషించే వాట్సప్, నింబూజ్, స్యూర్‌స్పాట్, ట్రిలియన్ వంటి సామాజిక మాధ్యమాలు ఎన్నో అందుబాటులోకి వచ్చాయి. నిఘా వర్గాల అంచనా ప్రకారం ఇలాంటి మాధ్యమాలు 35కి పైగా ఉన్నాయి. అనతికాలంలోనే ఐఎస్ఐఎస్ ప్రపంచాన్ని భయపెట్టే స్థాయికి చేరుకుందంటే సామాజిక మాధ్యమాలే కారణం. తమ దేశం నుంచి మూడేళ్ళ కాలంలో సిరియా వెళ్ళిన వారికి సంబంధించి కెనడాకు చెందిన 'కంట్రీస్ సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ సర్వీస్' పరిశోధన నిర్వహించింది. దాని ప్రకారం 'టాకర్స్ టు వాకర్స్' (ఉగ్రవాదం గురించి మాట్లాడటం దగ్గర నుంచి ఉగ్రవాదం వైపు పయనించడం)గా తీర్చిదిద్దడానికి సామాజిక మాధ్యమాలే కారణమయ్యాయని తేలింది. అందుకే ఉగ్రవాద భావజాలానికి ఆకర్షితులైన వారంతా ఎక్కడికక్కడ జట్టు కట్టారు. తమకు తాము సొంత సంస్థలు ఏర్పాటు చేసుకున్నారు. దిల్లీలో వెలుగు చూసిన 'హర్కత్ ఉల్ హర్బ్ ఎ ఇస్లాం', కేరళ యువకులు స్థాపించిన జండ్ అల్ అక్సా, జబాత్ అల్ నస్రాహ్, హైదరాబాద్‌లో వెలుగు చూసిన 'జుండ్ ఉల్ ఖలీఫా ఫి బిలాద్ అల్ హింద్' వంటివి ఇందుకు ఉదాహరణలు. భావసారూప్యం ఉన్నవారంతా జట్టుకట్టి సాధన సంపత్తి సమకూర్చుకొని శిక్షణ పొంది దాడులకు సమాయత్తమైన తరవాత చివరి నిమిషంలో నిఘా వర్గాలకు పట్టుబడ్డారు. దాంతో పెనుముప్పు తప్పినట్లయింది. కొన్ని నెలలపాటు వారు కార్యకలాపాలు సాగిస్తున్నప్పటికీ గుర్తించలేకపోయారు. అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానం వినియోగించడమే ఇందుకు కారణం. హైదరాబాద్‌లో పట్టుబడ్డ మహ్మద్ ఇబ్రహీం యజ్దానీ, అబ్దుల్లా బిన్ అహ్మద్ అల్ అమోదీ వంటి వారిని విచారించినప్పుడు డార్క్‌నెట్ తమ ఆయుధంగా చెప్పుకొచ్చారు. మూడో వ్యక్తి పసిగట్టలేనంత స్థాయిలో దాని ద్వారా సంప్రదింపులు జరుపుకోవచ్చు!

వెలుగులోకి వస్తున్న మూలాలు

గత ఏడాది చివరి నాటికి ప్రపంచవ్యాప్తంగా ఐఎస్ఐఎస్ ప్రభావం తగ్గింది. సిరియా, ఇరాక్, అఫ్గానిస్థాన్ వంటి దేశాల్లో తప్ప ఎక్కడా పెద్దగా దాని అలికిడి లేదు. భారత్‌లో మాత్రం దాని మూలాలు బయటపడుతూనే ఉన్నాయి. భద్రతా సంస్థలను ఆందోళనకు గురిచేస్తున్న అంశం ఇదే. ఎప్పటికప్పుడు ఇలాంటి వారిని పట్టుకోగలుగుతున్నారు. అయితే ఏ ఒక్కరు తప్పించుకున్నా పరిణామాలు అనూహ్యంగా ఉంటాయనడంలో సందేహం లేదు. దేశవ్యాప్తంగా ఇంకా అనేక మంది, వివిధ సంస్థల నేతృత్వంలో విధ్వంసానికి కుట్రపన్నుతుండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. దేశంలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితులు ఇందుకు దోహదం చేస్తున్నాయి. దాదాపు 70 లక్షల మంది భారతీయులు పశ్చిమాసియాలో పనిచేస్తున్నారు. దాంతో సిరియాలో జరుగుతున్న పరిణామాలు దగ్గరగా గమనించడానికి వారికి అవకాశం ఏర్పడింది. ప్రపంచంలో ఇండొనేసియా, పాకిస్థాన్ తరవాత అత్యధికంగా ముస్లిములు ఉన్నది మన దేశంలోనే. అందుకే ఐసిస్ అగ్రనాయకత్వం ఒక దశలో భారత్‌లో ఉగ్రవాద వ్యాప్తికి ప్రాధాన్యం ఇచ్చింది. దేశవ్యాప్తంగా అనేక మంది యువకులు ఉగ్రవాద సంస్థ రగిల్చిన భావజాలానికి ఆకర్షితులయ్యారు. విధ్వంసాలకు కుట్రపన్ని పోలీసులకు పట్టుబడుతున్నారు. అనేక మంది తమలో తామే రగిలిపోతున్నారు. ఇటువంటి వారు అదను దొరికితేనో, అవకాశం కలిసి వస్తేనో తమ ప్రతాపం చూపుతారు. వీరి సంఖ్య వందల్లోనే ఉండవచ్చని పోలీసుల అంచనా. వారిని ఎలా గుర్తించాలి, ఎలా దారికి తేవాలన్నది సమస్యగా మారింది. ఉగ్రవాద భావజాలాన్ని అంతమొందించగలిగినప్పుడే దానిపై పూర్తిగా విజయం సాధించినట్లు! ఇది సామాజిక మార్పు ద్వారానే సాధ్యమవుతుంది. ఇందుకు పూనుకోవాల్సింది ప్రభుత్వాలే. ఉగ్రవాదుల అడుగు జాడలు కనిపెట్టడంతోనే బాధ్యత తీరిపోదు. వారి ఆటకట్టించడంలో బహుముఖ వ్యూహం అవసరం. అప్పుడే ఈ ముప్పును తప్పించుకోగలం!

– వలసాల వీరభద్రం

ప్రజా చైతన్యమే పరిష్కారం



పీవీ రావు

వాయు కాలుష్యం జాతి జీవనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ప్రపంచంలోనే ప్రాణాంతక విష ధూమం విస్తరించిన 15 నగరాల్లో 14 భారత్‌లోనే ఉన్నాయన్న వాస్తవం పరిస్థితి చేయిదాటుతోందన్న విషయాన్ని చాటుతోంది. భారతీయ రహదారులపై కిలోమీటరుకు సగటు వాహన రద్దీ ఏటికేడు అనూహ్యంగా పెరుగుతుండటం కాలుష్య విస్తరణకు కీలక కారణమవుతోంది. రోడ్లపై వాహనాల వేగం గంటకు సగటున 20 కిలోమీటర్లకు మించడం లేదు. వాహనాల వేగం ఈ స్థాయిలో తగ్గితే వాటినుంచి వెలువడే కాలుష్య ధూమం నాలుగునుంచి ఎనిమిది రెట్లు పెరుగుతుంది. మితిమీరిన రద్దీతో ఉన్న దేశంలోని రోడ్లపై వాహనాలు వినియోగించే చమురు సైతం చాలా ఎక్కువగా ఉంటోంది. వాహన రద్దీతోపాటు మితిమీరిన వంట చెరకు వినియోగం, చమురు కల్తీ, పంట కోతల అనంతరం ఆ వృథాను పొలాల్లో విచ్చలవిడిగా తగలబెట్టడం వంటివన్నీ వాయు కశ్మలాన్ని ఇంతలంతలు చేస్తున్నాయి. పరిస్థితి ప్రమాదకరంగా పరిణమించిన నేపథ్యంలో అయిదేళ్ల కాలావధిలో భారతీయ నగరాల్లో గాలిలోని అతిసూక్ష్మ ధూళికణాల బెడదను 20-30శాతం మేర తగ్గించేందుకు రూ.300 కోట్ల ఖర్చుతో జాతీయ వాయు శుద్ధి కార్యక్రమం (ఎన్‌కాప్) చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల ముందుకొచ్చింది. గాలి కాలుష్యం ప్రాణాంతక సమస్యగా నేడు మనముందుంది. చైనా, అమెరికాల తరవాత అత్యధిక స్థాయిలో కాలుష్య ఉద్గారాలను వెదజల్లుతున్న దేశం భారతే! వాయు కాలుష్య నియంత్రణకు 1981లోనే చట్టం తీసుకువచ్చినప్పటికీ- దానిని అమలు చేయడంలో ఎక్కడలేని అలక్ష్యంవల్ల పరిస్థితి ప్రమాదకరంగా మారింది. 'ఎన్‌కాప్' పేరిట కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రతిపాదిస్తున్న వాయు శుద్ధి కార్యక్రమం చిత్తశుద్ధితో అమలైతే- కాలుష్య తీవ్రతకు పగ్గాలు వేయగలం.

ఆవుపేడ, ఇతర మిశ్రమాలతో తయారు చేసే పిడకలను వంటచెరకుగా ఉపయోగించడం పల్లెల్లో పరిపాటి. దేశంలోని సుమారు 10 కోట్ల గృహాల్లో వీటిని ఉపయోగిస్తున్నారని అంచనా. ఇళ్లల్లో రకరకాల అవసరాలకోసం ఏటా కట్టెలు, ఇతర రకాల జీవఇంధనాలను ఏటా 15 కోట్ల టన్నుల మేర వినియోగిస్తున్నట్లు అధ్యయనాలు చాటుతున్నాయి. అమెరికా వంటి దేశాలతో పోలిస్తే తక్కువ విస్తీర్ణం, ఎక్కువ జనాభా ఉన్న భారత్‌లో వంట చెరకుగా కట్టెలను, జీవన ఇంధనాలను విరివిగా వాడటంవల్ల కాలుష్యం అదుపుతప్పుతోంది. అత్యంత ప్రమాదకరమైన విష ధూమం విస్తరిస్తోంది. ఈ తరహా వంట చెరకుకు స్వస్తి పలికి విద్యుత్ లేదా ఇతర కాలుష్య రహిత స్టవ్‌లను పల్లె ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకువస్తే పరిస్థితి కొంతలో కొంత మెరుగుపడుతుంది. కాలుష్యరహిత ప్రత్యామ్నాయ ఇంధన వనరులను ప్రజలకు చేరువ చేసేందుకు ప్రభుత్వం మరింత క్రియాశీలంగా వ్యవహరించాలి. వాహనాల్లో ఉపయోగించే చమురును నాసిరకం హైడ్రోకార్బన్లతో కల్తీ చేయడం దక్షిణాసియాలో మరీ ముఖ్యంగా ఇండియాలో సర్వసాధారణంగా కనిపించే విషయం. ట్యాక్సీలు, ఆటోలు, ప్రైవేటు బస్సుల్లో ఉపయోగించే చమురును చాలావరకు ఈ రకంగా కల్తీ చేసి డ్రైవర్లు 20శాతంనుంచి 30శాతం మేర డబ్బు మిగిలించుకునేందుకు ప్రయత్నిస్తుంటారు. ఇందుకు మొదటి కారణం చమురు ధరలు అంతకంతకూ ఆకాశాన్ని తాకేలా పెరుగుతుండటమే అని వేరే చెప్పనవసరం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధానపరమైన నిర్ణయాలతో ముందుకొచ్చి చమురు ధరలకు కోతపెడితే తప్ప ఈ సమస్యకు పరిష్కారం లేదు. బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రాలవల్ల దేశంలో కాలుష్యం విస్తరిస్తోంది. కోపెన్‌హాగన్, పారిస్ సదస్సుల్లో కుదుర్చుకున్న ఒప్పందాల మేరకు బొగ్గు పులుసు వాయువు ఉద్గారాలను భారత్ గణనీయంగా తగ్గించాల్సి ఉంది. కానీ, సమీప భవిష్యత్తులో చైనాతో సహా భారత్‌లోనూ ఈ ఉద్గారాలు పెరగడమేగానీ- తగ్గే అవకాశాలు కనిపించకపోవడమే బాధాకరం!



వాయు కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి

దేశంలోని మెజారిటీ నగరాలు గ్యాస్ ఛాంబర్లుగా మారిపోతున్నాయి. ఫలితంగా ప్రజల్లో ఆరోగ్య సమస్యలు పెచ్చుమీరుతున్నాయి. ఆస్తమా, బ్రాంకైటిస్, కాలేయ క్యాన్సర్, గుండె జబ్బులు వంటివాటితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2017లో దేశవ్యాప్తంగా సంభవించిన ప్రతి ఎనిమిది మరణాల్లో ఒకటి వాయు కాలుష్యం కారణంగానే చోటు చేసుకొంది. గాలిలో ఆర్సెనిక్, నికెల్, సీసం శాతాలు అంతకంతకూ ఇనుమడిస్తున్నాయి. దేశంలో వాయు కాలుష్యం బారినపడి ఏటా పదిలక్షలకుపైగా పసికందులు మరణిస్తున్నట్లు అధ్యయనాలున్నాయి. దిల్లీలోని బాలబాలికల్లో సగానికిపైగా ఊపిరితిత్తుల సమస్యలు ఉన్నట్లు అంచనా. ప్రపంచంలోనే దిల్లీని అత్యంత కాలుష్యనగరంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ 2014లోనే తీర్మానించింది. దిల్లీని 2016లో వాయు కాలుష్యం దుప్పటిలా కమ్మేయడంతో అది అంతర్జాతీయ చర్చనీయాంశమైంది. ఇంత జరుగుతున్నా దేశంలో వాయు కాలుష్య పరిమాణాన్ని కొలిచే సాధనాలు కేవలం 65 నగరాలు, పట్టణాల్లోనే అందుబాటులో ఉన్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతుంది. వాయు నాణ్యత, కర్బన ఉద్గారాల పరిమాణాలను మదింపు వేసి వెలువరించే 180 దేశాల పర్యావరణ పనితీరు సూచీలో భారత్ 177వ స్థానాలో నిలుస్తోంది. దేశ ప్రజల జీవితాలను కబళిస్తున్న ఈ కాలుష్యాన్ని కట్టడి చేసే దిశగా పార్టీలు, ప్రభుత్వాలు చురుగ్గా ముందుకు కదలాలంటే ముందుగా పౌర సమాజం క్రియాశీలం కావాలి. కాలుష్య నియంత్రణపై ప్రభుత్వాలకు చురుకుపుట్టించేది ప్రజా చైతన్యమే!

(రచయిత– ఆర్థిక, సామాజిక విశ్లేషకులు)

ఈనాడు లేఖలు

ఓటింగ్ శాతం పెంపునకు చర్యలు

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రాజధాని హైదరాబాద్ నగరంలో ఓటింగ్ శాతం తగ్గిపోవడం ఆందోళనకరం. పల్లెలు, ఓ మోస్తరు పట్టణాల్లో ఓటుహక్కు వినియోగించుకునేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నా, నగరంలో మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితులు ఏర్పడటం ఆలోచించదగ్గ అంశం. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు ప్రాధాన్యం, దానిని సద్వినియోగ పరచుకోవడం వంటి అంశాలపై అవగాహన సదస్సులు నిర్వహించాలి. అదే సమయంలో జాబితాల నుంచి ఓట్లు గల్లంతు కాకుండా ఎన్నికల సంఘం పకడ్బందీ చర్యలు తీసుకోవాలి. మార్పులు, చేర్పులపై తగిన జాగ్రత్తలు చేపట్టాలి. త్వరలో కీలకమైన సార్వత్రిక ఎన్నికలు రానున్నాయి. అప్పటికైనా పరిస్థితి మెరుగుపడేందుకు ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవడం ఎన్నికల సంఘం బాధ్యత.

- ఎ.సురేష్, అంబేడ్కర్ నగర్, హైదరాబాద్

శుచీశుభ్రత లేని భోజనం

రాష్ట్రంలోని పలు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పెడుతున్న భోజనంలో శుచీశుభ్రత, నాణ్యత లోపిస్తోంది. దీనివల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వాంతులు, విరేచనాలతో అనారోగ్యం పాలవుతున్నారు. పాఠశాలలకు వెళ్లాలంటేనే భయపడిపోతున్నారు. కుళ్లిపోయిన కూరగాయలతో కూరలు చేయడం, నాసికరం గుడ్లు, నాణ్యమైన వస్తువులను వాడకపోవడం, గుత్తేదారుల అవినీతి, అధికారుల పర్యవేక్షణ లోపం ఈ పరిస్థితికి ప్రధాన కారణాలు. భోజనం అందించేందుకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదలవుతున్నా వాటిని సద్వినియోగం చేసుకోవడంలో వైఫల్యం కనపడుతోంది. తాజా కూరగాయల బదులు పాతవి వాడుతున్నారు. బియ్యం ముక్కిపోయి ఉంటున్నాయి. కలెక్టర్ వంటి ఉన్నతాధికారుల పర్యవేక్షణ పెరిగితే ఈ పరిస్థితికి కొంతవరకైనా అడ్డుకట్ట పడుతుంది.

- కామిడి సతీష్‌రెడ్డి, జెడలపేట, జయశంకర్ భూపాలపల్లి జిల్లా

మంచి మనసు

శ్రీమద్రామాయణంలోని ప్రతి పాత్రా మానవాళికి మహోపదేశాన్నిస్తుంది. కొన్ని పాత్రలు ఆదర్శవంతంగా ఎలా జీవించాలో విశదం చేస్తాయి. చెడుతలంపులు, దుర్బోధలవల్ల జీవితాలు ఎలా అస్తవ్యస్తమవుతాయో మరికొన్ని చెబుతాయి.

దుర్బోధలవల్ల కలుషితమయ్యే మనసు కఠినంగా మారుతుంది. స్వార్థ చింతన ప్రబలుతుంది. ఇందుకు కైకేయి పాత్ర నిదర్శనంగా నిలుస్తుంది.

అయోధ్యా నగరమంతా శ్రీరామ పట్టాభిషేక సంరంభంలో మునిగి ఉండగా, పుట్టింటి దాసి మంథర దుర్బోధకు లోనైంది కైకేయి. దేవాసుర సంగ్రామం నాడు దశరథుడు తనకు ఇస్తానన్న రెండు వరాలను ఈ సమయం చూసి కోరుకుంది. అవి శ్రీరాముణ్ని అడవికి పంపడం, భరతుడికి పట్టం కట్టడం. దశరథుడి అనునయ వాక్యాలు, ధర్మబోధలు, దుఃఖం- కైకేయి కఠిన చిత్తాన్ని కరిగించలేకపోయాయి.

చివరకు ఆమె కాఠిన్యం దశరథుడి ప్రాణాలనే బలితీసుకుంది. భరతుడు తల్లిని దూషిస్తాడు. శ్రీరాముడిపట్ల తన భక్తిని, సోదర ప్రేమను ప్రకటించాడు. అందరికీ దూరమైంది కైకేయి.

మనిషి మనసు నవనీతంలా ఉండాలి. కరుణ రసార్ద్ర పూరితంగా భాసించాలి. దయాదాక్షిణ్య భావాలతో తొణికిసలాడాలి.


నిండైన మంచిమనసు నిర్మల గంగాప్రవాహం వంటిదని మహనీయుల మాట. ఎదుటివారి బాధలకు, కష్టాలకు కరిగిపోని మనసు కఠిన పాషాణం లాంటిది. అది మానవ నైజం కాదు. కాకూడదు.

పరుషంగా మాట్లాడటం, కఠినంగా వ్యవహరించడం వంటివి లేకుండా, రాగద్వేషాలు సోకని నిర్మల చిత్తంతో ఎవరుంటారో, వారిని సుఖం నీడలా వెన్నంటి ఉంటుందని విదుర నీతి ప్రస్తావించింది.

మనలోని కాఠిన్య భావన ఎదుటివారి మనసును గాయపరచడమే కాదు, మనపై ఏహ్యభావాన్ని కలిగిస్తుంది.

దండకారణ్యం పంచవటి ప్రాంతంలో, పర్ణశాలలో ఉన్న సీతాసాధ్విని అపహరించాలన్న దుష్టతలంపుతో మారీచుడి సాయం కోరతాడు రావణుడు. శ్రీరామచంద్రుడితో వైరం తెచ్చుకునే దుష్టయత్నం వద్దని ఎంతగా హితవు చెప్పినా వినడు రావణుడు. పైగా 'ఇది రాజాజ్ఞ! పాటించకపోతే మరణదండన తప్పదు' అని కఠినంగా హెచ్చరిస్తాడు. ఈ మూర్ఖుడి చేతిలో మరణించేకన్నా శ్రీమన్నారాయణుడి అవతారమైన రామచంద్రుడి చేతిలో మరణించడమే మేలని భావిస్తాడు మారీచుడు.

కొన్ని సందర్భాల్లో కఠినత్వం ఎదుటివారి



అంతర్యామి

ప్రవర్తనలో మార్పుతెస్తుంది. ఆ వైఖరి అభిలషణీయం కూడా. ధర్మరక్షణకు, అరాచకాల అడ్డుకట్టకు కఠిన వైఖరి ఎంతైనా అవసరం. కొందరి మాటలు కఠినంగా ఉంటాయి. లోపల వెన్నలా కరిగే మనసుంటుంది. వారిపై కఠినాత్ములన్న నింద వేయకూడదు.

కఠిన పరీక్షలకు లోనుకానిదే శ్రీరామకృష్ణులు శిష్యులను స్వీకరించేవారు కాదు. తన శిష్యులు లోకాదర్శ పురుషులై అలరారడమే ఆయన ఆశయం. శిష్యుల ప్రవర్తనను పరీక్షించడంలో ఆయన నిపుణుడు.

మహాత్ముడు దక్షిణాఫ్రికాలో ఉన్నప్పుడు ఒక విద్యార్థిని కాస్తంత దండిస్తాడు. తరవాత ఎంతో బాధాతప్త హృదయుడవుతాడు. పశ్చాత్తాప పడతాడు. ఉపవాస దీక్షచేసి తనకుతానే శిక్ష వేసుకుంటాడు. మహాపురుషుల కఠిన ధోరణి ఎదుటివారి ప్రవర్తనలో మార్పును కోరుతుంది. వారి హృదయం ఎల్లప్పుడూ శాంతి, సౌజన్యాలకు నిలయంగా ఉంటుంది.

కోపం, ద్వేషం, అసూయ లాంటివాటితో ఓ చెత్తకుండీలా మనసు ఉండకూడదు. అదొక ఖజానా. ప్రేమ, సంతోషం, తీయని జ్ఞాపకాలతో ఉండాలంటారు స్వామివివేకానంద.

స్వచ్ఛమైన జలంలో లవణీయతా శాతం పెరిగితే అది కఠిన జలంగా తయారై తాగేందుకు పనికిరాదు. ద్వేషం, వైరం లాంటి వికృత భావాలతో కూడిన కాఠిన్యపు వ్యక్తిత్వం ఆత్మీయానురాగాలకు దూరమవుతుంది.

కరుణ, ప్రేమ, అభిమానం, ఆత్మీయత మనసులో పాదుకుంటేనే కాఠిన్యపు పొరలు తొలగుతాయి.

– దానం శివప్రసాదరావు

ఉపాధ్యాయ విద్య సమూల ప్రక్షాళన

- నాణ్యమైన విద్యావ్యవస్థకు ఉత్తమ బోధకులు తప్పనిసరి
- మరింత కఠినంగా ఉపాధ్యాయ అర్హత పరీక్షలు
- జాతీయస్థాయిలో విశిష్ట సంస్థలు అవసరం
- ప్రభుత్వ పాఠశాలల విలీనంతో సత్ఫలితాలు
- నవీన భారత్ @ 75 పేరుతో నీతి ఆయోగ్ వ్యూహపత్రం

ఈనాడు – హైదరాబాద్

నవీన భారత్ నిర్మాణానికి నాణ్యమైన విద్య అవసరమని, అందుకు ఉపాధ్యాయ విద్యను అత్యంత శ్రేష్ఠమైందిగా తీర్చిదిద్దేందుకు సమూల ప్రక్షాళన తప్పనిసరని నీతి ఆయోగ్ స్పష్టం చేసింది. ఉపాధ్యాయ విద్యలోకి ప్రవేశానికి కనీస ప్రమాణాలు ఉండాలని, దానికి కఠినంగా ఉండే ఉపాధ్యాయ అర్హత పరీక్షలు నిర్వహించాలని అభిప్రాయపడింది. భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చి 2022నాటికి 75 సంవత్సరాలు పూర్తవుతుందని, అప్పటికి నూతన భారత్ సృష్టికి పాఠశాల, కళాశాల, ఉపాధ్యాయ విద్యలో ఎలాంటి మార్పులు, చేర్పులు చేయాలో పేర్కొంటూ నవీన భారత్ 75కు అవలంబించాల్సిన వ్యూహపత్రాన్ని ఇటీవల రూపొందించింది. లక్ష్యం, ప్రస్తుత పరిస్థితి, ముందుకెళ్లేందుకు అనుసరించాల్సిన మార్గాలను అందులో పొందుపరిచింది.



ఉపాధ్యాయ విద్య....

- ప్రస్తుతం ఉన్న ఉపాధ్యాయులకు శిక్షణ విధానాన్ని మెరుగుపరచాలి. కొత్తగా ప్రవేశించే వారికి ఉపాధ్యాయ పరీక్షను కఠినం చేయాలి. అభ్యాసన సామర్థ్యాలపై ఉపాధ్యాయులను జవాబుదారులు చేయాలి. ఉపాధ్యాయ ఖాళీలు, గైర్హాజరుపై దృష్టి పెట్టాలి.
- ఉపాధ్యాయ విద్యాసంస్థల(బీఈడీ, ఎంఈడీ, డీఈడీ)కు అనుమతుల విధానం కఠినతరం చేయాలి. వాటికీ న్యాక్ తరహా అక్రిడేషన్ విధానం తీసుకురావాలి. ఏటా రెండువేల మందికి ప్రవేశాలు కల్పించే ఐదారు జాతీయస్థాయి సంస్థలను నెలకొల్పాలి.
- ఉపాధ్యాయుల వేతనాల పెంపును వారి ప్రతిభతో ముడిపెట్టాలి. అందుకోసం ఏడాదికి మూడు సార్లు ఆయా రాష్ట్రాలు పరీక్షలు నిర్వహించాలి.

పాఠశాల విద్య...

- ప్రతి ఒక్కరూ చదువుకోవాలి. పదోతరగతి వరకు ఒక్కరూ మధ్యలో మానేయరాదు. జాతీయ సాధన సర్వే(న్యాస్) ద్వారా అభ్యాసన సామర్థ్యాలు పెంచాలి. ఉద్యోగావకాశాలు పెంచేందుకు పాఠశాల స్థాయిలోనే వృత్తి విద్యను ప్రారంభించాలి.
- ప్రస్తుతం జీడీపీలో 3 శాతమే విద్యకు ఖర్చు చేస్తున్నాం. దాన్ని 2022 నాటికి 6 శాతానికి పెంచాలి.
- ఉపాధ్యాయుల గైర్హాజరు, విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను వివిధ సంస్థలతో పరిశీలించాలి.
- ప్రభుత్వ పాఠశాలలను క్రమబద్ధీకరించాలి. రాజస్థాన్‌లో బడుల విలీనం చేయడంతోపాటు పిల్లలకు రవాణా సౌకర్యం కల్పించారు. దీంతో ఉపాధ్యాయుల ఖాళీలు 60శాతం నుంచి 33శాతానికి తగ్గాయి. ఏడాదిలోనే విద్యార్థుల సంఖ్య 6 శాతం పెరిగింది.
- పాఠ్య ప్రణాళికలో వేసవి కార్యక్రమాలు, విద్యాయాత్రలతోపాటు పరిశ్రమలు, కార్యాలయాల సందర్శనను చేర్చాలి.
- విద్యార్థులపై ఒత్తిడిని తగ్గించాలి. ఇందుకోసం జీవన నైపుణ్యాలను చదువులో భాగం చేయాలి. ఆందోళనను తగ్గించే, పరాజయాలను తట్టుకునేలా మనోధైర్యం పెంచే పాఠ్యాంశాలను చేర్చాలి.

ఉన్నత విద్య...

- విభిన్న రకాల ఉన్నతవిద్య నియంత్రణ సంస్థలు ఉన్నందున వాటి మధ్య సమన్వయం పెంచేందుకు యూజీసీ, ఏఐసీటీఈ, ఎన్‌సీటీఈలాంటి వాటిని పునఃనిర్మాణంగానీ విలీనం చేయడంగానీ అవసరం.
- ఆయా విద్యాసంస్థలకు కొంత వరకైనా నిధులను వాటి పనితీరు, నాణ్యతతో ముడిపెట్టి మంజూరు చేయాలి. ఉపకులపతుల నియామకాలను పారదర్శకంగా చేపట్టాలి. ప్రతిష్ఠాత్మక విదేశీ విద్యాసంస్థలు భారత్ విద్యాసంస్థలతో ఒప్పందం చేసుకొని ఇక్కడే సంయుక్త డిగ్రీలు ఇచ్చేలా విధానాన్ని రూపొందించుకోవాలి.
- ఆయా రంగాల నిపుణులు, ఆచార్యులు, విద్యార్థుల నుంచి అభిప్రాయాలను స్వీకరించి ఎప్పటికప్పుడు పాఠ్య ప్రణాళికను మార్చుకోవాలి. డిగ్రీ స్థాయిలోనే ఇంటర్న్‌షిప్‌లను ప్రోత్సహించాలి.
- కనీసం 20 విశ్వవిద్యాలయాలను ప్రపంచస్థాయి వర్సిటీలుగా మార్చాలి. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు బయట నుంచి అదనపు నిధులు వచ్చేలా మార్గాలను వెతకాలి.
- దేశంలోని 47 కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో రెండు మాత్రమే 3.51 న్యాక్ పాయింట్లు(4 పాయింట్లకు) మించి స్కోర్ సాధించాయి. వచ్చే 10 సంవత్సరాలలో ప్రపంచ ర్యాంకింగ్‌లో 500లోపు ఉండేలా ఆ వర్సిటీలు వ్యూహాత్మక ప్రణాళిక తయారు చేసుకోవాలి.

ప్రస్తుత పరిస్థితి ఇదీ...

- 2016 అసర్ సర్వే ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లోని అయిదవ తరగతి విద్యార్థుల్లో కేవలం 47.80 శాతమే 2వ తరగతి పాఠాలు తప్పులు లేకుండా చదవగలుగుతున్నారు.
- ప్రపంచ ర్యాంకింగ్‌లో మొదటి 50లో 3, 150లో ఏడు చైనా విశ్వవిద్యాలయాలు చోటు దక్కించుకుంటున్నాయి. అదే సమయంలో భారత్ సంస్థలు మొదటి 200 స్థానాల్లో రెండుమూడు మాత్రమే నిలుస్తున్నాయి.
- దేశవ్యాప్తంగా 23,219 ఉపాధ్యాయ విద్యాసంస్థల్లో 17.58 లక్షల సీట్లు అందుబాటులో ఉన్నాయి. అయినా 20 శాతం మంది వృత్తిపరమైన శిక్షణ లేకుండానే ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. ఇంకా 9 లక్షల ఉపాధ్యాయ ఖాళీలున్నాయి.

విస్తరణ తర్వాతే సభా పదవులు

- ఉప సభాపతి, విప్‌ల నియామకంపై సీఎం కసరత్తు
- సామాజిక సమీకరణాలపై చర్చ
- యాగం తర్వాతే మంత్రివర్గ విస్తరణ?

ఈనాడు, హైదరాబాద్: శాసన సభాపతిని ఇప్పటికే ఎంపిక చేసిన సీఎం కేసీఆర్, ఉప సభాపతి, చీఫ్ విప్‌లు, విప్‌ల వంటి ఇతర పదవులను మంత్రివర్గ విస్తరణ తర్వాత భర్తీ చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఈ నెలాఖరు లేదా ఫిబ్రవరి మొదటి వారంలో మంత్రి వర్గ విస్తరణ జరిగే అవకాశాలున్నాయి.

మంత్రివర్గ విస్తరణకు ముందు సభాపతి ఎంపిక కీలకంగా మారింది. అన్ని కోణాల్లో ఆలోచించిన సీఎం చివరికి పోచారం శ్రీనివాస్‌రెడ్డివైపే మొగ్గుచూపారు. ఆయన్ని ఒప్పించారు. ఈ ప్రక్రియ శుక్రవారంతో ముగుస్తుంది. ఆ తర్వాత శాసన సభలో ఉపసభాపతి, చీఫ్ విప్‌తో పాటు ముగ్గురు విప్‌ల పదవులను భర్తీ చేయాలని సీఎం భావిస్తున్నారు. ఎంపిక ప్రక్రియపైనా ఇప్పటికే ఆయన దృష్టి సారించారు.

సామాజిక సమీకరణాలే ప్రధానం

సభాపతి స్థానాన్ని అగ్రవర్ణాలకు కేటాయించినందున, ఉప సభాపతిగా బీసీలు లేదా ఎస్సీలకు అవకాశం ఇవ్వాలని సీఎం యోచిస్తున్నట్లు తెలిసింది. బీసీల నుంచి దాస్యం వినయ్‌భాస్కర్, గంగుల కమలాకర్ తదితరుల పేర్లు, ఎస్సీల నుంచి ఆరూరి రమేశ్, బాల్క సుమన్, మరికొందరి పేర్లు పరిశీలనలో ఉన్నట్లు తెలిసింది. నిజానికి ఉప సభాపతి పదవికి మహిళా సభ్యురాళ్ల పేర్లను మొదట్లో సీఎం పరిశీలించారు. పోచారాన్ని సభాపతిగా ఎంపిక చేసిన నేపథ్యంలో ఆ సమీకరణం మారింది. మహిళా సభ్యుల్లో పద్మా దేవేందర్‌రెడ్డి, సునీతారెడ్డిలు ఓసీలు కాగా రేఖానాయక్ ఎస్టీ. ఈ ముగ్గురిలో ఒక్కరికి మంత్రి పదవి ఖాయమన్న ప్రచారం ఉంది. మంత్రి పదవి ఇస్తున్నందున ఉప సభాపతిగా మహిళేతరులకు అవకాశం ఇవ్వాలని సీఎం భావిస్తున్నట్టు సమాచారం. మిగిలిన ఇద్దరు మహిళా సభ్యుల్లో ఒకరికి పార్లమెంటరీ కార్యదర్శి, మరొకరికి శాసన సభలో విప్ పదవి దక్కే వీలున్నట్లు తెలిసింది.

మంత్రివర్గ విస్తరణపై చర్చోపచర్చలు

సభాపతి ఎంపిక ప్రక్రియ ముగుస్తుండడంతో ఇప్పుడు అందరి దృష్టి మంత్రి వర్గ విస్తరణపై కేంద్రీకృతమైంది. విస్తరణపై సీఎం ఇప్పటికే స్పష్టతతో ఉన్నారనే సంకేతాలు వెలువడ్డాయి. ఎవరెవరికి ఏయే శాఖలు అనే జాబితా కూడా సిద్ధమైనట్టు తెలిసింది. ఈ నెల 21 నుంచి 26 వరకు సీఎం కేసీఆర్ ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో యాగం నిర్వహించనున్నారు. ఆ తర్వాతే విస్తరణ జరుగుతుంది. జనవరి 30, ఫిబ్రవరి 3,5,7వ తేదీల్లో విస్తరణ జరగొచ్చనే అంచనాలున్నాయి. విస్తరణ అనంతరం మిగిలిన ఎమ్మెల్యేలను పరిగణనలోనికి తీసుకొని పార్లమెంటరీ కార్యదర్శుల తోపాటు, చీఫ్ విప్, విప్‌ల పదవులను భర్తీ చేయనున్నట్టు సమాచారం.

పెట్టుబడులకు తెలంగాణలో సానుకూలత

కేసీఆర్‌కు లేఖలో ... సింగపూర్ మంత్రి ఈశ్వరన్ ప్రశంస

ఈనాడు, హైదరాబాద్ : తెలంగాణలో కేసీఆర్ రెండోసారి అధికారంలోకి రావడం వల్ల...సింగపూర్‌తో ఆర్థిక, తదితర సంబంధాలు మరింత బలోపేతమవుతున్నాయని ఆ దేశ వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి ఎస్. ఈశ్వరన్ అన్నారు. సాధించిన విజయాలే రాష్ట్ర ముఖ్యమంత్రి పనితీరుకు నిదర్శనాలని, అందుకే ప్రజలు తిరిగి పట్టం కట్టారంటూ గురువారం అభినందన లేఖ రాశారు. "మీ నాయకత్వంలో రాష్ట్ర వార్షిక రెవెన్యూ వృద్ధి రేటు 17.17% ఉంది. తెలంగాణలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం నెలకొంది. దీన్ని సింగపూర్ సంస్థలు గుర్తించి, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నాయి. సింగపూర్ అభివృద్ధి బ్యాంకు మా దేశం బయట తొలిసారిగా... హైదరాబాద్‌లో అతి పెద్ద సాంకేతిక పరిజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటుచేసింది. వ్యాపార, వాణిజ్య రంగాల్లో మీ సర్కారుతో కలిసి పనిచేసేందుకు మా ప్రభుత్వం, సంస్థలు సిద్ధంగా ఉన్నాయి" అని ఈశ్వరన్ తెలిపారు. చెన్నైలోని సింగపూర్ కాన్సులేట్ జనరల్ రాయ్.. కేసీఆర్‌కు అభినందనలుతెలుపుతూ లేఖ రాశారు.

ఆర్థిక బలోపేతం వైపు ఆర్టీసీ చూపు

ఇంధన ప్రతినిధులతో ఈడీ చర్చ

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఆర్థికంగా బలోపేతమయ్యే దిశగా టీఎస్ ఆర్టీసీ దృష్టి సారించింది. బస్‌భవన్‌లో సంస్థ ఈడీ (రెవెన్యూ), కార్యదర్శి పురుషోత్తం, ఇతర ఉన్నతాధికారులు గురువారం హెచ్‌పీసీఎల్, ఐఓసీఎల్ ప్రతినిధులతో సుదీర్ఘంగా చర్చించారు. సంస్థకు చెందిన ఖాళీ స్థలాల్లో నెలకొల్పిన పెట్రోల్ బంకుల నిర్వహణ, వాటి ద్వారా ప్రధాన ఆదాయ మార్గాల అంశాలను పరిశీలించారు. ఆయిల్ అవుట్‌లెట్స్ ప్రదేశాల్లో మౌలిక సదుపాయాల కల్పనపైనా చర్చలు సాగించారు. సర్వీస్ ప్రొవైడర్లు, అకౌంట్స్ అధికారులు, డిపో మేనేజర్లందరితోనూ శిక్షణ కార్యక్రమం ఏర్పాటుచేస్తే బాగుంటుందని పురుషోత్తం అభిప్రాయపడ్డారు. ఇంకా ఎక్కడెక్కడ ఖాళీ స్థలాలు ఉన్నాయో, వాటిని ఏ రకంగా ఉపయోగించుకుని ఆదాయ వనరులు సమకూర్చుకోవచ్చో దృష్టి సారించామన్నారు.

డీసీసీ అధ్యక్షుల ఎంపిక ప్రక్రియ కొలిక్కి !

- జిల్లాకు ఒకరి పేరు చొప్పున తుది జాబితా సిద్ధం
- ఆమోదం కోసం నేడో రేపో ఏఐసీసీకి

హైదరాబాద్, న్యూస్‌టుడే: జిల్లా కాంగ్రెస్ నూతన అధ్యక్షుల ఎంపిక ప్రక్రియ కొలిక్కి వచ్చింది. ఏఐసీసీ ఆదేశాల మేరకు ఇప్పటికే జిల్లాల ముఖ్యనేతలకు డీసీసీ అభ్యర్థుల ఎంపికపై టీపీసీసీ నమూనా అందజేయగా ఆయా జిల్లాల ఏఐసీసీ ఇన్‌ఛార్జి కార్యదర్శులు అభిప్రాయ సేకరణ పూర్తి చేశారు. తుది జాబితాకు సంబంధించి ముఖ్యనేతలు గురువారం హైదరాబాద్‌లో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల బాధ్యుడు కుంతియా, మాజీ సీఎల్పీ నేత జానారెడ్డి, ఏఐసీసీ ఇంఛార్జి కార్యదర్శులు బోస్‌రాజు, సలీం అహ్మద్, శ్రీనివాసన్ కృష్ణన్, టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు పొన్నం ప్రభాకర్, రేవంత్‌రెడ్డి, కుసుమకుమార్ తదితరులతో పాటు ఇతర ముఖ్యనాయకులు పాల్గొన్నారు. హైదరాబాద్ మినహా ఏఐసీసీ ఇన్‌ఛార్జి కార్యదర్శులు రూపొందించిన డీసీసీ అధ్యక్షుల పొట్టి జాబితాపై కసరత్తు చేశారు. ఒకట్రెండు జిల్లాలు మినహా అన్ని జిల్లాలకు ఒక్కో జిల్లాకు ఒకరి పేరునే ప్రతిపాదిస్తూ తుది జాబితా రూపొందించినట్లు తెలిసింది. శుక్రవారం మరోసారి సమావేశమై మిగిలిన జిల్లాల ప్రక్రియ కూడా పూర్తి చేసి ఏఐసీసీకి తుది జాబితాను పంపిస్తారు. ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ విదేశీ పర్యటన ముగించుకుని వచ్చాక టీపీసీసీ పంపిన జాబితాకు ఆమోద ముద్ర వేసే అవకాశం ఉందని టీపీసీసీ ముఖ్య నాయకుడొకరు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.



ఆత్మహత్యలకు ఆయన అడ్డుగోడ!

మధ్యప్రదేశ్: రాష్ట్రంలోని బర్ఘాట్ ప్రకృతి అందాలకు పెట్టింది పేరు. నర్మదా నది ఒడ్డున గల ఈ ప్రాంత సందర్శనకు ఏటా అధిక సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. ప్రకృతి సౌందర్యాన్ని చూసి మైమరచిపోతుంటారు. అయితే, బర్ఘాట్‌కు వచ్చి నదిలో దూకి ఆత్మహత్యలకు పాల్పడేవారి సంఖ్య కూడా ఎక్కువే. అందుకే ఈ ప్రాంతానికి 'సూసైడ్ పాయింట్' అనే పేరు వచ్చింది. దీంతో పోలీసు శాఖ అక్కడ ప్రత్యేకంగా ఓ కానిస్టేబుల్‌ను నియమించింది. ఆయన పేరు హరి ఓం. పర్యాటకులపై నిరంతరం కన్నేసి ఉంచడం, ఆత్మహత్యలను అడ్డుకోవడం ఆయన పని. తన విధులను హరి ఓం అత్యంత సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. బలవన్మరణానికి పాల్పడకుండా ఇప్పటివరకు 60-70 మందిని రక్షించారు. దీంతో ప్రభుత్వం ఆయన్ను అనేక అవార్డులతో సత్కరించింది. హరి ఓం పనితీరుకు ఫిదా అయిన జబల్‌పూర్ ఎస్పీ అమిత్ సింగ్ జాతీయ అవార్డుకు ఆయన పేరును సూచిస్తూ కేంద్రప్రభుత్వానికి తాజాగా లేఖ రాశారు. హరి ఓం వంటి వ్యక్తులు పోలీసుశాఖకు గర్వకారణమని, అలాంటివారు వ్యక్తిగత జీవితం కంటే ప్రజాసేవకే అధిక సమయం కేటాయిస్తారని అమిత్ సింగ్ ప్రశంసించారు. ఇక హరి ఓం మాత్రం తాను అవార్డుల గురించి ఏమాత్రం ఆలోచించనంటున్నారు. ఆత్మహత్య చేసుకోకుండా కాపాడి పలువురికి కొత్త జీవితాన్నివ్వడమే తనకు అత్యంత సంతోషకరమైన విషయమని చెబుతున్నారు.

ఈటీవీ భారత్



సైకిల్‌పై 7 రాష్ట్రాలు చుట్టి.. ఆరోగ్యంపై అవగాహన కల్పించి..

గుజరాత్: పినాలి పార్లేఖర్.. గుజరాత్‌లో ప్రస్తుతం ఆమె పేరు మార్మోగిపోతోంది. తమ రాష్ట్రానికి వన్నె తెచ్చిన ధీర వనితగా గుజరాతీలు ఆమెను ప్రశంసిస్తున్నారు. పినాలి మెహ్సానా జిల్లా పర్సా గ్రామవాసి. ఆరోగ్య పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచాలనుకున్నారు ఆమె. అందుకోసం వినూత్నంగా ఆలోచించారు. సైకిల్ యాత్ర చేపట్టారు. 18 రోజుల్లో మొత్తం 2104 కిలోమీటర్లు ప్రయాణించారు. అసోం, మేఘాలయ, త్రిపుర, మిజోరం, మణిపూర్, నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్‌ల్లో పర్యటిస్తూ ప్రజలకు ఆరోగ్య పాఠాలు బోధించారు. దీంతో ఏడు రాష్ట్రాల్లో స్వరాష్ట్ర కీర్తిపతాకను ఎగరేసిన పినాలిపై గుజరాత్‌వాసులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ప్రపంచంలోనే అత్యున్నత శిఖరమైన ఎవరెస్టును అధిరోహించాలన్నది తన తదుపరి లక్ష్యమని చెప్తున్నారు పినాలి.

విష ప్రచారం.. విద్వేషం!

- యూట్యూబ్ నిండా ఇలాంటి వీడియోల హల్‌చల్
- నేతలు.. సినీ తారలే లక్ష్యం
- తెలంగాణ పోలీసుల దర్యాప్తులో వెల్లడి
- గూగుల్, యూట్యూబ్ ప్రతినిధులకు తాఖీదులు

రమేష్‌కి రఘు మీద కోపంగా ఉంది.. వెంటనే రఘు ఫొటోలు సేకరించి మార్ఫింగ్ చేసి, అనుచిత వ్యాఖ్యలు జోడించి యూ ట్యూబ్‌లో ఉంచాడు.

'ఫలానా తార హోటల్ గదిలో వీరంగం సృష్టించింది. అప్పుడు ఆమె మద్యం తాగి ఉందా? ఈ వీడియో చూడండి' అంటూ ఓ వీడియో వైరల్ అయింది.

'సూపర్ హిట్ సినిమా అంటూ జనం మెచ్చుకుంటున్నా కలెక్షన్లు లేవు. డిస్ట్రిబ్యూటర్ల గగ్గోలు' అంటూ మరో యూట్యూబ్ ఛానెల్‌లో ప్రచారం.

యూట్యూబ్‌లో ఇలాంటి వీడియోలు పెద్ద సంఖ్యలో దర్శనమిస్తున్నాయి. ఇక అసభ్య రాతలు, అశ్లీల వీడియోల సంగతి సరేసరి. వై.ఎస్.షర్మిల ఫిర్యాదుతో దర్యాప్తు ఆరంభించిన తెలంగాణ సైబర్ క్రైమ్ పోలీసులు యూట్యూబ్ వేదికగా విద్వేషాలు, వదంతులు, విషప్రచారం, అసభ్యం, అశ్లీలంతో కూడిన వేల సంఖ్యలో వీడియోలను గుర్తించారు. పోలీసులు పట్టుకుంటారన్న ముందస్తు ఆలోచనతో సైబర్ నేరస్థులు వారి చిరునామాలను యూట్యూబ్‌లో ఉంచలేదన్న నిర్ధారణకు వచ్చారు. దీంతో గూగుల్, యూట్యూబ్ ప్రాంతీయ కార్యాలయ ప్రతినిధులకు తాఖీదులు జారీ చేసి వ్యక్తిగతంగా హాజరుకావాలంటూ ఆదేశాలిచ్చారు.

సినీ తారలు.. నాయకులు.. కార్పొరేట్ సంస్థలే లక్ష్యం

యూట్యూబ్ వేదికగా సినీ తారలు, రాజకీయ నాయకులు, కార్పొరేటు సంస్థల ప్రతిష్ఠ దెబ్బతీసేలా వారి శత్రువులు అనుచరులతో వ్యతిరేక ప్రచారం చేస్తున్నారని పోలీసులు గుర్తించారు. ముఖ్యంగా పది మంది కథానాయకులు, ఐదుగురు కథానాయికలు, ముగ్గురు ప్రయోక్తల(టీవీ ఛానెళ్ల) వ్యక్తిగత విషయాలను దారుణంగా వక్రీకరిస్తున్నారని కొన్ని వీడియోల ద్వారా నిర్ధారణకు వచ్చారు. బాధితుల నుంచి గతంలో వచ్చిన ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకున్నారు. ఆ వీడియోల వెనుక బాధితుల/బాధిత సంస్థల వ్యతిరేకుల పాత్ర ఉండొచ్చని తొలుత భావించిన పోలీసులు ఆ జాబితాలను పరిశీలించే క్రమంలో విస్తుపోయే నిజాలు తెలుసుకున్నారు. 'శత్రువులు అనుకున్న వారికి, యూట్యూబ్‌లో వీడియోలకు సంబంధం ఉండడం లేదు. ఎవరు చేశారో తెలుసుకునేందుకు ప్రయత్నించినా ప్రాథమిక ఆధారాలు లభించడం లేదు. గూగుల్ పరిశోధన సంస్థ ద్వారా ప్రయత్నిస్తే వీడియోలు, ఆడియోలు అప్‌లోడ్ చేస్తున్న వారి చిరునామాలు అమెరికా, ఆస్ట్రేలియాలో ఉన్నట్టు తెలుస్తోంది. దీంతో దర్యాప్తు ముందుకు కదలడం లేదు. తాత్కాలికంగా యూట్యూబ్‌లో ఉన్న వ్యతిరేక ప్రచార వీడియోలను తొలగిస్తున్నాం' అని పోలీసులు తెలిపారు.

స్వేచ్ఛ దుర్వినియోగం

ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా వ్యక్తిగత, సామాజిక, ప్రేరణ, స్ఫూర్తి కలిగించే వీడియో, ఆడియోలను యూట్యూబ్ వేదికగా ఎవరైనా అప్‌లోడ్ చేసే అవకాశం ఉంది. ఎవరైనా అభ్యంతరం వ్యక్తం చేసినా, నేరపూరితంగా ఉందనే ఫిర్యాదులు వచ్చినా అందుకు బాధ్యత తమదేనంటూ అప్‌లోడ్ చేసే వ్యక్తులు, సంస్థలు యూట్యూబ్ ప్రతినిధులకు హామీపత్రం ఇవ్వాల్సి ఉంటుంది. "ఈ ప్రక్రియ అంతా పద్ధతి ప్రకారమే జరుగుతున్నా భాష, భావ వ్యక్తీకరణపై యూట్యూబ్ అభ్యంతరాలు వ్యక్తం చేయడం లేదు. ఆ సంస్థ ప్రతినిధులకు వాటిపై అవగాహన కూడా లేదు. ఈ ఆడియో లేదా వీడియో అసభ్యంగా, అశ్లీలంగా ఉన్న కారణంగా తమ వేదికలో దానికి స్థానం లేదని నియంత్రించే వ్యవస్థ ఆ సంస్థలో లేదు. దీంతో ఆయా వీడియోల ప్రసారం నిరంతరంగా కొనసాగుతోంది' అని సైబర్ క్రైమ్ అదనపు డీసీపీ కె.సి.ఎస్.రఘువీర్ తెలిపారు.

– ఈనాడు, హైదరాబాద్

బాబు రావచ్చు గానీ మేము పోవద్దా?

- తప్పకుండా ఏపీలో రాజకీయాలు చేస్తాం
- ఫెడరల్ ఫ్రంట్ ప్రతాపమేంటో

బాబుకు త్వరలోనే తెలుస్తుంది: తలసాని



హైదరాబాద్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ప్రజలకు అండగా ఉంటామని మాజీ మంత్రి, తెరాస ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. ఏపీ హక్కుల కోసం తెలంగాణ ప్రభుత్వం వంద శాతం సహకరిస్తుందని స్పష్టం చేశారు. చంద్రబాబు పాలన అవినీతిమయంగా మారిందని, ఈ బాబు మాకొద్దనే అభిప్రాయానికి ఏపీ ప్రజలు వచ్చారన్నారు. చంద్రబాబు తాటాకు చప్పుళ్లకు ఎవరూ భయపడరని, ఏపీలో వందశాతం రాజకీయాలు చేస్తామని పునరుద్ఘాటించారు. కేటీఆర్, వైఎస్ జగన్ భేటీ వెనక ప్రధాని నరేంద్రమోదీ ఉన్నారని ఏపీ మంత్రులు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తలసాని చెప్పారు. ఏపీలో అభివృద్ధిని తెరాస అడ్డుకుంటుందని ఏపీ సీఎం చంద్రబాబునాయుడు చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో శ్రీనివాస్‌యాదవ్ గురువారం అసెంబ్లీ మీడియాపాయింట్‌లో మాట్లాడారు. సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా ఏపీలో బంధువుల వద్దకు వెళ్లానని, మీడియా ప్రతినిధులు మాట్లాడమని కోరితేనే తాను మాట్లాడాను తప్ప దేవాలయాల దగ్గర రాజకీయాలు చేసే ఉద్దేశం తనకు లేదన్నారు. ఏపీలో ఒక్క యాదవ సంఘానికే కాకుండా వెనకబడిన వర్గాలకు కూడా మద్దతిస్తామని, అక్కడి అన్ని జిల్లాలో పర్యటిస్తానని ఆయన చెప్పారు. ఫెడరల్ ఫ్రంట్ లేదన్న బాబుకు దాని ప్రతాపమేంటో త్వరలోనే తెలుస్తుందన్నారు. జగన్- కేటీఆర్‌ల భేటీపై చంద్రబాబు, ఆయన మంత్రులు అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. పోలవరం ప్రాజెక్టు విషయంలో ఏపీ ప్రజలను చంద్రబాబు మభ్యపెడుతున్నారని తలసాని ఆరోపించారు.

బీసీలకు అన్యాయం చేసిన జగన్ మీకు ఆప్తుడా?

తలసానిని ప్రశ్నించిన మంత్రి అచ్చెన్నాయుడు

ఈనాడు డిజిటల్, అమరావతి – విజయవాడ, న్యూస్‌టుడే: బీసీలకు అన్యాయం చేసిన ప్రతిపక్ష నేత జగన్మోహన్‌రెడ్డి ఏ విధంగా మీకు ఆప్తుడయ్యారని తెరాస ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. గతంలో వైఎస్ ప్రభుత్వం రిజర్వేషన్ శాతం పెంచకుండా 24 కులాలను బీసీ జాబితాలో చేర్చి బడుగులకు అన్యాయం చేసిందన్నారు. ఐదేళ్ల వైఎస్ పాలనలో బీసీ సంక్షేమానికి సుమారు రూ.2,940 కోట్లు కేటాయిస్తే.. ఈ నాలుగున్నరేళ్లలో ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.40 వేల కోట్లు కేటాయించారన్నారు. తలసానిని ఉన్నతస్థాయికి తీసుకువచ్చిన తెదేపాపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని హితవు పలికారు.

తెరాసతో చర్చిస్తే తప్పేంటి: బొత్స

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదాకు మద్దతు ఇస్తున్న తెరాసతో చర్చిస్తే తప్పేంటని వైకాపా సీనియర్ నేత బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైకాపాకు ఏపీ ప్రయోజనాలే ముఖ్యమని, హోదా సాధనకు ఎంతవరకైనా పోరాడతామని చెప్పారు. రాష్ట్రాలు తమ అధికారాలను కాపాడుకునేలా కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు ఉన్న అవకాశాలపై కేటీఆర్, జగన్ చర్చించినట్లు తెలిపారు. తెలుగు రాష్ట్రాల ఎంపీలు ఉమ్మడిగా పోరాటం చేస్తే ఏపీ హక్కుల సాధన సాధ్యం అవుతుందని జగన్ చెప్పారని, ఇందులో తప్పేంటని బొత్స ప్రశ్నించారు.

కొత్త వ్యవసాయ మంత్రి ఎవరో?

సభాపతిగా పోచారం ఖరారుతో తెరపైకి కొత్త పేర్లు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో గత మంత్రివర్గంలో వ్యవసాయ మంత్రిగా బాధ్యతలు వహించిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఈసారి సభాపతిగా బాధ్యతలు చేపడుతున్నారు. దీంతో కొత్త ప్రభుత్వంలో వ్యవసాయ మంత్రి ఎవరనే చర్చ మొదలైంది. వ్యవసాయ మంత్రిగా పోచారం తనదైన గుర్తింపు పొందారు. ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవసాయానికి ప్రాధాన్యం ఇస్తూ రైతులకు నిరంతర విద్యుత్ పథకాన్ని ప్రవేశపెట్టారు. రుణమాఫీని అమలు చేశారు. రైతుబంధు, రైతు బీమా, రైతు వేదికలు, పంట కాలనీల ఏర్పాటు తదితర పథకాలను ప్రారంభించారు. రైతు సమన్వయ సమితులను ఏర్పాటు చేశారు. మంత్రి పోచారం వీటిని పర్యవేక్షించారు. పోచారాన్ని సీఎం పలుసార్లు 'లక్ష్మీపుత్రుడు' అని ప్రశంసించారు. రెండోసారి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యవసాయమంత్రిగా పోచారం పోటీలో ఉంటారనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఇప్పుడు ఆయన సభాపతి అవుతున్నందున ఇప్పుడు ఆ శాఖ ఎవరికి దక్కుతుందనే ఊహాగానాలు మొదలయ్యాయి. ఈ జాబితాలో గుత్తా సుఖేందర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తదితరుల పేర్లు వినిపిస్తున్నాయి. గుత్తా సుఖేందర్‌రెడ్డి ఇప్పటికే రైతు సమన్వయ సమితి అధ్యక్షునిగా ఉన్నారు. ఎర్రబెల్లి, సింగిరెడ్డిలకు వ్యవసాయంపై అనుభవం ఉంది. ప్రశాంత్‌రెడ్డి, పల్లా సీఎం కేసీఆర్‌కు సన్నిహితులుగా ఉన్నారు. వీరిలో ఒకరికి అవకాశం లభిస్తుందని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. నిజామాబాద్ జిల్లా నుంచి పోచారానికి సభాపతి పదవి వచ్చినందున అదే జిల్లాకు చెందిన తనకు వ్యవసాయమంత్రి పదవి దక్కుతుందని ప్రశాంత్‌రెడ్డి ఆశతో ఉన్నారు.

పార్లమెంటు ఎన్నికల్లో క్రియాశీలక పాత్ర పోషించండి

యూత్ కాంగ్రెస్ తెలంగాణ ఇన్‌ఛార్జి మాథ్యూస్ పిలుపు

హైదరాబాద్, న్యూస్‌టుడే: పార్లమెంటు ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ శ్రేణులు క్రియాశీలకంగా వ్యవహరించాలని ఇండియన్ యూత్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి, యూత్ కాంగ్రెస్ తెలంగాణ ఇన్‌ఛార్జి జె.బి.మాథ్యూస్ పిలుపునిచ్చారు. గురువారం యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అనీల్‌కుమార్ యాదవ్ అధ్యక్షతన గాంధీభవన్‌లో యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. రాష్ట్ర కార్యవర్గ సభ్యులతోపాటు జిల్లాల ప్రతినిధులు హాజరయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమికి కారణాలు, పార్టీ అభ్యర్థుల విజయానికి యువజన కాంగ్రెస్ చేసిన కృషిని ఈ సందర్భంగా సమీక్షించారు. జరగబోయే పార్లమెంటు ఎన్నికల్లో పోషించాల్సిన పాత్ర, అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. తెలంగాణ ఇన్‌ఛార్జిగా నియమితులై మొదటిసారి హైదరాబాద్‌కు వచ్చిన మాథ్యూస్‌ను రాష్ట్ర కార్యవర్గం సన్మానించింది.

తెలంగాణలోని అన్ని నగరాలు మరియు గ్రామాలలో డిస్ట్రిబ్యూటర్లు మరియు డీలర్లను నియమించాలనుకుంటున్నాము.
GARS® LUBRICANTS When Quality Matters...
ఇంజన్ ఆయిల్‌ను పంపిణీ చేస్తూ డబ్బు సంపాదించే అద్భుత అవకాశం
తక్కువ పెట్టుబడి - ఎక్కువ లాభం
కేవలం 3 లక్షల పెట్టుబడితో అధికారిక డిస్ట్రిబ్యూటర్‌షిప్‌ను పొందండి
కొద్దిమంది డీలర్లు కావలెను
+91 87589 67461
+91 87589 70353
+91 87589 64590


పచ్చగా బతకండి

- శాకాహారం పెంచండి
- మాంసం తగ్గించండి
- అనారోగ్య ఆహారపు అలవాట్లతో పర్యావరణానికి పెను ప్రమాదం
- లాన్సెట్ మెడికల్ జర్నల్ నివేదిక హెచ్చరిక

విశృంఖల లైంగిక సంబంధాలు, మద్యపానం, ధూమపానం కంటే ఎక్కువగా అనారోగ్యకర ఆహారపు అలవాట్లే మనుషుల్ని చంపుతున్నాయి

మనిషి ఆహారపు అలవాట్లను మార్చుకుని తనకు తాను హాని చేసుకుంటున్నాడు. ప్రపంచానికీ ముప్పు తెస్తున్నాడు. కొత్తతరహా ఆహారపు అలవాట్లతో మనిషి ఎలాంటి అనర్థాలను కొనితెచ్చుకుంటున్నదీ 'లాన్సెట్ మెడికల్ జర్నల్' కళ్లకు కట్టింది. ఈ అనవసర ప్రమాదాల నుంచి తప్పించుకోవాలంటే ఇప్పుడున్న ఆహార అలవాట్లను సంపూర్ణంగా మార్చుకోవాలని విస్పష్ట హెచ్చరిక చేసింది. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లకు సంబంధించి లాన్సెట్ తాజాగా ఓ నివేదికను విడుదల చేసింది. 'ఈట్-లాన్సెట్' కమిషన్ అందించిన వివరాలతో ఈ నివేదికను వెలువరించింది. 16 దేశాలకు చెందిన 37 మంది శాస్త్రసాంకేతిక నిపుణులతో మూడేళ్లపాటు పని చేసి ఆ సంస్థ ఈ నివేదిక రూపొందించింది. ప్రస్తుతం ఉన్న ఆహారపు అలవాట్లు చాలా లోపభూయిష్ఠంగా ఉన్నాయని, వాతావరణ మార్పులకు (క్లైమెట్ ఛేంజ్) అవే ప్రధాన కారణమని గుర్తుచేసింది. ఈ అలవాట్లే ప్రపంచ మానవాళిని, నాగరికతను ప్రమాదంలోకి నెడుతున్నాయని ఆందోళన వ్యక్తంచేసింది. మాంసం, పాలపదార్థాల(డెయిరీ) వినియోగాన్ని గణనీయంగా తగ్గించి, శాకాహార వినియోగాన్ని బాగా పెంచుకోవాలని నివేదిక స్పష్టంచేసింది. భూమండలంపై ఉన్న సహజ వనరుల సమతౌల్యాన్ని కాపాడుకోలేకపోతే జనాభాకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడం సాధ్యంకాదని హెచ్చరించింది.

ఏ ఆహారంతో ఎంత శక్తి?



ఆహారం	గ్రాము/రోజుకు	కేలరీలు/రోజుకు
ఎరుపు, నారింజరంగు కూరగాయలు	100	30
ముదురు ఆకుపచ్చ కూరగాయలు	100	23
ఆలు, దుంపలు	50	39
ఇతర కూరగాయలు	100	25
పండ్లు	200	126
కూరగాయలు	300	–
పాలు, పాలపదార్థాలు	250	153
ఎండిన బీన్స్, బఠానీలు	50	172
వరి, గోధుమ, మొక్కజొన్న	232	811
సోయ్ ఫుడ్స్	25	112
వేరుశనగ గింజలు	25	142
ట్రీనట్స్	25	149
పామాయిల్	6.8	60
అన్‌సాచురేటెడ్ ఆయిల్స్	40	354
డెయిరీ ఫ్యాట్స్ (పాలతో కలిసి ఉన్నవి)	5	36
తీపి వస్తువులు	31	120
పెద్ద మాంసం, గొర్రె మాంసం	7	15
చికెన్, ఇతర కోళ్ల ఉత్పత్తులు	29	62
పంది మాంసం	7	15
గుడ్లు	13	19
చేపలు	28	40

మాంసం ముంచుతోంది

ప్రపంచవ్యాప్తంగా మాంసం వినియోగం విపరీతంగా పెరిగింది. ఆసియాలో మరీ ఎక్కువగా ఉంది. 2017-2050 మధ్య ఆసియాలో మాంసం వినియోగం 78% పెరుగుతుందని సింగపూర్ కేంద్రంగా గల ఏషియా రీసెర్చ్ అండ్ ఎంగేజ్‌మెంట్ ఇటీవల హెచ్చరించింది. మాంసం వినియోగం పెరిగే కొద్దీ గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలు 290 కోట్ల టన్నుల నుంచి 540 కోట్ల టన్నులకు పెరుగుతాయి. 9.5 కోట్ల కార్లు ఏడాదికి వెలువరించే ఉద్గారాలతో ఇది సమానం. మాంసం అతి వినియోగం వల్ల వస్తున్న జబ్బుల్ని అరికట్టడానికి యాంటిబయాటిక్స్‌ను విపరీతంగా వినియోగించాల్సి వస్తుంది.

ఆహారపు అలవాట్లను మార్చుకుంటే యేటా 19 నుంచి 23% దాకా మరణాలను తప్పించొచ్చు

21వ శతాబ్దంలో ఆరోగ్యం, పర్యావరణానికి ఆహారమే అతిపెద్ద సవాల్‌గా తయారైంది

లాన్సెట్ నివేదికలోని ముఖ్యాంశాలు...



- అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్ల కారణంగా యేటా 1.1 కోట్ల మంది అకారణంగా మృత్యువు పాలవుతున్నారు.
- ప్రపంచవ్యాప్తంగా 200 కోట్ల మంది అవాంఛిత ఆహారం తీసుకుంటున్నారు.
- గత 50 ఏళ్లుగా ప్రధానంగా తీసుకుంటున్న ఆహారం వాతావరణ మార్పునకు ప్రధాన కారణమైంది.
- మనుషుల ఆరోగ్యంతోపాటు, ఈ భూమండలాన్ని రక్షించుకోవాలంటే ప్రపంచం మొత్తం సరికొత్త ఆహార అలవాట్లవైపు మొగ్గు చూపాలి.
- కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాలు, పప్పుదినుసులు, గింజలు, అన్‌సాచ్యురేటెడ్ ఆయిల్స్, పరిమితంగా సముద్ర, పౌల్ట్రీ ఉత్పత్తులు తీసుకోవాలి.
- కనీసం 35 శాతం కేలరీలు కలిగిన గింజలు, ఇతరత్రా మొక్కల సంబంధ ఆహార ఉత్పత్తుల్నే తీసుకోవాలి.
- మాంసం(రెడ్‌మీట్, ప్రాసెస్డ్‌మీట్), చక్కెరతో కూడిన పదార్థాలు, అతిగా శుద్ధిచేసిన దినుసులు, పిండిపదార్థాలతో కూడిన కూరగాయల వినియోగాన్ని వీలైతే పరిహరించాలి. లేకపోతే అతితక్కువ మోతాదులో తీసుకోవాలి.
- ఆహారపు అలవాట్లను ప్రభావితం చేస్తున్న ప్రభుత్వ విధానాలు రావాలి. లేదంటే కొత్తపన్నులు, సుంకాలు వేయాలి. ప్రజలకు హానిచేసే ఆహార పదార్థాలను విక్రయాల నుంచి ఉపసంహరించడమో, లేదంటే వాటిపై రేషన్ విధించడమో చేయాలి.
- మనుషుల ఆరోగ్యం, పర్యావరణ సుస్థిరతను పెంపొందించే ఏకైక సాధనం ఆహారం మాత్రమే.
- ప్రపంచంలో 82కోట్ల మంది తగినంత ఆహారం తీసుకోవడం లేదు. అంతకుమించిన జన సంఖ్య నాసిరకమైన ఆహారం తీసుకుంటోంది.
- అసమతుల ఆహారం వల్ల సూక్ష్మపౌష్టికాహార లోపం ఏర్పడి, ఆహార సంబంధ స్థూలకాయం, అనారోగ్య సమస్యలు వస్తున్నాయి.
- 2050 నాటికి ప్రపంచ జనాభా వెయ్యికోట్లకు చేరుకుంటుంది. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు అలవరుచుకుంటేనే అప్పటికి వ్యవస్థ సురక్షితంగా ఉంటుంది.
- రెడ్‌మీట్, పాలపదార్థాల వినియోగం ఏమాత్రం పెరిగినా ఇబ్బందులు తప్పవు. రెడ్‌మీట్, చక్కెరలాంటి అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు 50%కి మించి తగ్గాలి.
- గింజలు, పండ్లు, కూరగాయల వినియోగం 100% పైగా పెరగాలి.
- గత 50 ఏళ్లలో పంట దిగుబడులు పెరిగిన కారణంగా ఆకలి తగ్గి ఆయుర్దాయం పెరిగిన మాట నిజమే. ఇదే సమయంలో ఎక్కువ కేలరీలు, అతిగా శుద్ధిచేసిన, జంతువుల నుంచి వచ్చిన ఆహారాలను అలవాటుచేసుకోవడంవల్ల కొత్త ప్రమాదాలు ముంచుకొచ్చాయి. మనిషి ఆరోగ్యాన్ని చెడగొట్టుకోవడంతోపాటు, పర్యావరణం దెబ్బతినడానికీ కారణమయ్యాడు.
- ప్రపంచవ్యాప్తంగా ఉన్న భూమిలో వ్యవసాయ పంటలు 40% ఆక్రమించాయి. అందుకు 70% మంచినీరు ఖర్చవుతోంది. అదే సమయంలో 30% ఉద్గారాలు వెలువడుతున్నాయి.
- సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు చేరుకోవాలంటే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు ఏంటో చెప్పాలి. విధానకర్తలు, వ్యాపారులు, ఆహారరంగంతో ముడిపడిన వారందరికీ దీనిపై అవగాహన కల్పించాలి

- ఈనాడు, దిల్లీ, ప్రత్యేక విభాగం

కారెక్కనున్న వంటేరు?

- నేటి సాయంత్రం తెరాసలో చేరే అవకాశం
- అలాంటిదేమీ లేదన్న మెదక్ ఎంపీ ప్రభాకర్‌రెడ్డి


వంటేరు ప్రతాప్‌రెడ్డి

ఈనాడు, సంగారెడ్డి: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నేత వంటేరు ప్రతాప్‌రెడ్డి కారెక్కనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆయన తెరాసలో చేరనున్నారనే సమాచారం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయాన్ని తెలుసుకునేందుకు ప్రతాప్‌రెడ్డిని సంప్రదించడానికి ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేరు. ఆయన కుమారుడు విజయ్‌వర్ధన్‌రెడ్డిని సంప్రదించగా శుక్రవారం (ఈ నెల 18) సాయంత్రం 4 గంటలకు ప్రగతిభవన్‌లో తాము తెరాసలో చేరుతున్నట్లు తెలిపారు. గజ్వేల్ నియోజకవర్గం నుంచి మూడుసార్లు పోటీ చేసిన వంటేరు రెండో స్థానంతోనే సరిపెట్టుకున్నారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో కేసీఆర్‌పై కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన ఆయన తీవ్రస్థాయిలో తెరాస నేతలను విమర్శించారు. ఈ క్రమంలో ఆయన తెరాసలో చేరనున్నారనే ప్రచారం ఆసక్తికరంగా మారింది. ఈ ప్రచారంలో వాస్తవం లేదని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే ఆయన ఈ దుష్ప్రచారానికి దిగారని వివరించారు. పార్టీలోకి వస్తామన్నా ఆయన్ను చేర్చుకునే అవకాశమే లేదని ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

'వైద్య-ఆరోగ్య' సంస్థకు కొత్త పోస్టులు

ఈనాడు, హైదరాబాద్: వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీలను భర్తీచేయడానికి ఇటీవలే ప్రత్యేకంగా ఏర్పాటైన 'సేవల నియామక సంస్థ' కార్యకలాపాలు ఇక విస్తరించనున్నాయి. నిర్వహణ కోసం 26 పోస్టులను తెలంగాణ ప్రభుత్వం నూతనంగా మంజూరుచేసింది. సభ్య కార్యదర్శిగా ఒక స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ హోదా అధికారిని, సభ్యుడిగా ఓ సంయుక్త సంచాలకుడిని సర్దుబాటు (డిప్యూటేషన్) విధానంలో నియమించుకునేందుకు అనుమతించింది. ఉప సంచాలకులు, పరిపాలనాధికారి, ఆర్థిక వ్యవహారాల అధికారి, న్యాయాధికారి, కార్యాలయ బాధ్యుడు, సీనియర్- జూనియర్ అసిస్టెంట్ పోస్టులను కూడా అదే విధానంలో భర్తీచేసేందుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. కార్యాలయ సహాయకులు, డేటా ఎంట్రీ ఆపరేటర్ల వంటి పోస్టులను మాత్రం ఒప్పంద, పొరుగుసేవల విధానంలో భర్తీ చేసుకోవాలంటూ గురువారం ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి కె.రామకృష్ణారావు ఆదేశాలిచ్చారు.

వాట్సాప్‌లో విచారణ.. విడాకులు

మంజూరు చేసిన నాగ్‌పూర్ న్యాయస్థానం

ముంబయి, న్యూస్‌టుడే: వాట్సాప్ వీడియో కాల్ సాయంతో అమెరికాలో ఉన్న భార్య, భారత్‌లో ఉన్న భర్త విడాకులు పొందారు. ఈ అరుదైన సంఘటనకు మహారాష్ట్రలోని నాగ్‌పూర్ కుటుంబ న్యాయస్థానం వేదికైంది. 2013 ఆగస్టు 11న నాగ్‌పూర్‌కు చెందిన వ్యక్తి (37), హైదరాబాద్ (సికింద్రాబాద్)కు చెందిన యువతి (35) పెద్దలు కుదిర్చిన వివాహ బంధంతో ఒక్కటయ్యారు. ఇంజినీరింగ్‌లో పట్టభద్రులైన ఇద్దరూ అమెరికాకు చెందిన ఆటో మొబైల్ కంపెనీలో ఉద్యోగం చేసేవారు. వీసా గడువు ముగియడంతో కొంతకాలం ఆమె నాగ్‌పూర్‌లో నివాసం ఉంది. ఈ సమయంలో ఇరువురి మధ్య మనస్పర్థలు మొదలయ్యాయి. తర్వాత ఆమె విద్యార్థి వీసా మీద మిషిగన్ వెళ్లినా వారిమధ్య సఖ్యత కుదరకపోగా, మరింత దూరం పెరుగుతూ వచ్చింది. అమెరికా నుంచి తిరిగొచ్చిన భర్త నాగ్‌పూర్ కుటుంబ న్యాయస్థానంలో భార్య నుంచి విడాకులు కోరుతూ దరఖాస్తు చేసుకున్నాడు. నిబంధనలకు అనుగుణంగా ఈ కేసును కౌన్సిల్‌కు అప్పగించారు. కేసు విచారణకు స్వయంగా తను హాజరుకాలేనని భార్య వెల్లడించడంతో న్యాయస్థానం సామాజిక మాధ్యమం'వాట్సాప్'ను సరికొత్త విధానానికి అనుసరించింది. యువతి విజ్ఞప్తి మేరకు కౌన్సిల్ ఆమెను వాట్సాప్ వీడియో కాల్ ద్వారా ప్రశ్నించి, ఆ కాల్‌ను రికార్డు చేశారు. తర్వాత భర్తను ప్రశ్నించగా ఇద్దరూ విడాకులకు సుముఖంగా ఉన్నట్లు వెల్లడైంది. భార్య తరఫున ఆమె సోదరుడు కోర్టుకు రాగా.. భర్త మాత్రం విచారణ సమయంలో స్వయంగా హాజరయ్యాడు.

ఇరాక్‌లో చిక్కుకున్న కార్మికులకు సాయం

కాన్సుల్ జనరల్ కార్యాలయానికి సీఎస్ లేఖ

ఈనాడు, హైదరాబాద్: ఏజెంట్ల చేతుల్లో మోసపోయి ఇరాక్‌లో ఇబ్బందులు పడుతున్న 15 మంది తెలంగాణ ప్రవాస కార్మికులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆ కార్మికుల తరఫున జరిమానాలు చెల్లించడంతో పాటు వారి తిరుగుప్రయాణానికి ఏర్పాట్లు చేయాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ఇరాక్‌లోని భారత కాన్సుల్ జనరల్ కార్యాలయానికి, దిల్లీలోని భారత విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శికి గురువారం లేఖ రాశారు. నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం కొండూరుకు చెందిన కాటం మహేందర్‌తో పాటు వేల్పూరు రాజేందర్ (డిచ్‌పల్లి మండలం కొరట్‌పల్లి), దురెడ్డి రాజు, లింబాద్రి (రామడుగు), లాడె రాజేశ్వర్, మల్లె ప్రభాకర్ (కమ్మర్‌పల్లి), కంఠం లక్ష్మణ్ (కొండూరు), గుండ్ల భూమేశ్వర్ (నందిపేట), గనోజి కృష్ణాకర్ (నవీపేట), పుల్లా సాయన్న, గొల్ల గంగన్న, అలూరి గంగారెడ్డి, కుర్రా రవీందర్, బానోత్ చతుర్, వినోద్ (మాక్లూర్)లు ఉపాధి కోసం ఇరాక్ వెళ్లారు. ఏజెంట్లు వారికి ఉద్యోగాలిస్తామని నమ్మించి పర్యాటక వీసాలపై తీసుకెళ్లి అక్కడే వదిలేసి వచ్చారు. ఈ కార్మికులు ఎర్బిల్ నగరంలో చిక్కుకొన్నారు. అక్కడి ప్రభుత్వం వీరు అక్రమంగా నివసిస్తున్నారని జరిమానాలు విధించింది. వారంతా అక్కడ తిండిలేక, పనిలేక ఇబ్బందులు పడుతున్నారని వారి కుటుంబాలు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చాయి. తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఎమ్మెల్యే కేటీఆర్ వినతి మేరకు సీఎస్ స్పందించి వారిని ఆదుకునేందుకు లేఖ రాశారు. వారిని నిర్బంధం నుంచి విడిపించాలని.. జరిమానాల చెల్లింపు సొమ్మును, విమానం టికెట్లను సమకూరిస్తే ఆ డబ్బును తెలంగాణ ప్రభుత్వం తరఫున తిరిగి చెల్లిస్తామని తెలిపారు.

TSRTC
టెండరు ప్రకటన
No. 07/CCE/2018-19 Dt. 09.01.2019
బస్‌స్టేషన్ల మరియు బస్ డిపోల యందు వివిధ సివిల్ & ఎలక్ట్రికల్ పనుల కొరకు ఆన్‌లైన్ ("www.tender.telangana.gov.in") ద్వారా టెండర్లను ఆహ్వానిస్తున్నాము. పూర్తి టెండర్ ప్రకటన కొరకు http://tsrtc.telangana.gov.in దర్శించండి. ఆన్‌లైన్ లో పాల్గొనుటకు www.tender.telangana.gov.in ఇతర వివరముల కొరకు సంప్రదించండి ఫోన్.నెం. 040-27614172 & 9959224534 (ఉ. 10.30 గం||ల నుండి సా. 5.00 గం|| ల వరకు)
సం/- చీఫ్ సివిల్ ఇంజనీర్

ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
e- టెండరు ప్రకటన
దిగువ తెలిపిన ఎక్విప్‌మెంట్ సరఫరా కొరకు e-ప్రొక్యూర్‌మెంట్ క్రింద TS ట్రాన్స్‌కో ఆన్‌లైన్ బిడ్స్‌ను కోరుతున్నది: 1) స్పెసిఫికేషన్ నెం. TSPMM 42-01/2019: TS ట్రాన్స్‌కోలోని విద్యుత్ సౌధ మరియు అన్ని జోన్లలో డెస్క్‌టాప్ కంప్యూటర్స్ యొక్క సరఫరా & స్థాపన. 2) TSPMM 42-02/2019: కొత్త ఉన్నతశ్రేణి ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్ సరఫరా. 3) TSPMM 42-03/2019: ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్ యొక్క సమీకృత హై పర్ఫార్మెన్స్ లిక్విడ్ క్రోమాటోగ్రాఫ్ (HPCL). 4) TSPMM 42-04/2019: ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్ యొక్క పూర్తి ఆటోమెటిక్ పెన్స్కీ-మార్టెన్స్ క్లోజ్డ్ కప్ ఫ్లాష్ పాయింట్ టెస్టర్. 5) TSPMM 42-05/2019: ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్ బ్రేక్‌డౌన్ ఓల్టేజ్ టెస్ట్‌కిట్. 6) TSPMM 42-06/2019: ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్ టాన్ డెల్టా మరియు రెసిస్టివిటీ టెస్ట్‌కిట్. 7) TSPMM 42-07/2019: ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్ యొక్క విశ్లేషణాత్మక తూకం బరువు శ్రేణి 0-220 గ్రాములు. 8) TSPMM 42-08/2019: IEC 61850 ప్రోటోకాల్‌కు అనుగుణమైన PTRలు & డైరెక్షనల్ O/L & E/L రిలేస్ కొరకు న్యూమరికల్ డిస్టెన్స్ రిలేస్, డిఫరెన్షియల్ రిలేస్, తదుపరి వివరాలను www.tender.telangana.gov.in (తెలంగాణ రాష్ట్రం) నందు చూడవచ్చును. సంప్రదించవల్సిన నెంబర్లు: 040-23396000, ఎక్స్‌టెన్షన్ 3583, 3636, 3736, 3357, 3332, 3460, 3487. www.tstransco.in.
R.O.No.65/18 సం/- చీఫ్ ఇంజనీర్/P&MM

ఐరావతం.. కాకతీయ తోరణం

- యాదాద్రి ఆలయ రక్షణ గోడపై అమరిక
- జయపురలో తయారీ
- ఈ ఏర్పాటు తొలిసారి ఇక్కడే!

యాదగిరిగుట్ట - న్యూస్‌టుడే

యాదాద్రీశుడి ఆలయ పునర్ నిర్మాణంలో భాగంగా, దేవేంద్రుడి వాహనమైన ఏనుగుల ప్రతిమలను పొందుపరచే పనులు మొదలయ్యాయి. విశ్వవిఖ్యాతి పొందేలా యాదాద్రి క్షేత్రాన్ని రూపొందించే ప్రణాళికలో ఓ భాగమిది. ఈ ఏర్పాట్లపై యాదగిరి గుట్ట ఆలయ అభివృద్ధి ప్రాధికార సంస్థ (యాడా) ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. రాజస్థాన్‌లోని జయపుర నుంచి రప్పించిన ఆ ప్రతిమల ఏర్పాట్ల పనులను పడమటి దిశలోని రక్షణ గోడకు ఏకాదశి రోజున (గురువారం) చేపట్టారు. కాకతీయ వైభవం సంతరింపజేసేలా రాష్ట్ర కళాకృతులతో గోడకు సరికొత్త శోభ కలిగిస్తున్నారు. ఏనుగుల ప్రతిమలను కాకతీయ స్తంభాలపై ఏర్పాటుచేసేందుకు సంస్థ తరఫున నడుం బిగించారు.




యాదాద్రి క్షేత్ర పునర్‌నిర్మాణంలో భాగంగా ఆలయ రక్షణ గోడపై ఏర్పాటు చేస్తున్న కాకతీయ తోరణం, ఏనుగు ప్రతిమలు

- జయపుర కళాకారులతో... ఏనుగు ప్రతిమలు, కాకతీయ స్తంభాలు, వృక్షాలతో కూడిన మండపాలు ఏర్పాటవుతున్నాయి. సిమెంటు కాంక్రీట్ పైభాగంతో కూడిన సామగ్రితో వాటిని సంసిద్ధం చేస్తున్నారు. ఆరు నెలలపాటు డిజైన్ వేసిన బ్రహ్మశ్రీ, ఆలయ శిల్పి ఆనంద సాయి పర్యవేక్షణలో పనులన్నీ జరుగుతున్నాయి.
- ఎక్కడా లేని తీరులో యాదాద్రి క్షేత్రాన్ని సుందరంగా రూపొందించే యోచనతో సరికొత్త కళాకృతులు ఆవిష్కృతం కానున్నాయి. ఆలయ సందర్శనకు వచ్చే భక్తజనులు సేదతీరేలా పడమర, దక్షిణ దిశల్లో పచ్చదనంతో కూడిన ఆహ్లాదకర ప్రాంగణాలు కొండపై ఏర్పాటవుతాయి. రక్షణ గోడకు 20 అడుగుల వెడల్పు, 30 అడుగుల ఎత్తున ఏనుగులతో పాటు కాకతీయ కళాతోరణాలు సాక్షాత్కరిస్తాయి. ఆ దిశల్లోని రక్షణ గోడంతా వివిధ కళారూపాలతో భక్తులను ఆకట్టుకోనుంది. శుభస్వాగతం పలికేలా రాత్రివేళ ప్రత్యేక విద్యుద్దీకరణ ఏర్పాట్లు చేపడుతున్నారు. ఈ విధానంతో ఏనుగు ప్రతిమలు నృత్యం చేస్తున్నట్లు అలరిస్తాయి. తెలంగాణ సంస్కృతికి అనుగుణంగా ఎన్నో కళారూపాలు రూపొందుతున్నాయని ఆనందసాయి 'న్యూస్‌టుడే'కి చెప్పారు. శంఖు చక్ర నామాలు 25 అడుగుల ఎత్తులో భక్తులను ఆకట్టుకునేలా నిర్మితమవుతాయి. రాతి విగ్రహాలు, జయపుర ప్రతిమలు, ప్రత్యేక విద్యుద్దీకరణ, పచ్చదనాలతో యాదాద్రి ఆధ్యాత్మిక, ఆహ్లాద, పర్యాటక క్షేత్రంగా మారనుంది.
- కొండకు మూడంచెల్లో నిర్మితమైన రక్షణ గోడకు ఏనుగు రూపాలను అమరుస్తున్నారు. అవి రాత్రి సమయాల్లో మరింత కనువిందు చేసేలా విద్యుత్ నిపుణులు పథకాలు రూపొందిస్తున్నారు. పనులన్నీ 4 నెలల్లో పూర్తయ్యేలా శ్రమిస్తున్నారు.
- యాదాద్రి ఆలయ పరిసరాల్లో నిరంతరం విద్యుత్ సరఫరా జరిగేలా ప్రత్యేక సబ్‌స్టేషన్ల నిర్మాణానికి 'యాడా' ఉపక్రమించింది. ఇప్పటికే కొండపై రెండు ఉప కేంద్రాల నిర్మాణ పనులు చేపట్టారు. వీటితోపాటు ఆలయ సన్నిధిలో ఎనిమిది లిఫ్టులు ఏర్పాటు కానున్నాయి. ఈ పనులూ వేగంగా జరుగుతున్నాయి.

జీవన ప్రమాణాల్లో పురోగతి

- అసర్ సర్వేలో వెలుగుచూసిన వాస్తవాలు
- తెలుగు రాష్ట్రాల్లో కనిపించిన వృద్ధి

ఈనాడు, దిల్లీ : తెలుగు రాష్ట్రాల్లో సామాజిక, విద్యా పరిస్థితులు మెరుగుపడినట్లు చిన్నారుల విద్యా ప్రమాణాలపై నిర్వహించిన అసర్ (వార్షిక విద్యాప్రమాణాల రిపోర్టు) నివేదిక వెల్లడించింది. వివిధ జీవన ప్రమాణాల కొలమానాల్లో గత నాలుగేళ్లలో కనిపించిన పురోగతి ఇందుకు అద్దం పట్టింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ జిల్లాల్లో గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించిన సర్వేలో వెలుగు చూసిన ప్రజల జీవన స్థితిగతులకు సంబంధించిన గణాంకాలను అసర్ నివేదికలో వెల్లడించారు. పక్కా ఇళ్లు, మోటార్ సైకిళ్లు, మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు, తల్లిదండ్రుల విద్యాభ్యాసాల గురించి ఇందులో వివరించారు. గత నాలుగేళ్లలో తెలుగు రాష్ట్రాల్లో చదువులేని తల్లులు, తండ్రుల సంఖ్య తగ్గిపోయింది. పది, ఆపైన చదివిన తల్లుల సంఖ్య రెట్టింపయింది. ఈ అంశంలో తండ్రులు వెనుకబడి ఉన్నారు. పదిపైన చదివిన తండ్రుల శాతంలో పెద్దగా వృద్ధి నమోదు కాలేదు.

వివరం	ఆంధ్రప్రదేశ్ 2014	ఆంధ్రప్రదేశ్ 2018	తెలంగాణ 2014	తెలంగాణ 2018
పక్కా ఇళ్లు	65.8	73.6	48.0	58.1
మోటార్‌సైకిల్	33.6	48.0	32.4	53.7
విద్యుత్తు కనెక్షన్	97.6	98.7	96.9	98.9
సర్వేరోజు విద్యుత్తు ఉన్న ఇళ్లు	94.3	97.3	88.5	96.2
మరుగుదొడ్లు ఉన్న ఇళ్లు	55.3	83.9	50.2	80.2
టీవీలున్న ఇళ్లు	82.5	87.5	74.9	86.2
మొబైల్‌ఫోన్లు ఉన్న ఇళ్లు	77.7	92.1	84.6	93.8
పుస్తకాలు, మ్యాగజైన్లు	14.1	6.6	5.5	6.1
ఇంట్లో కనీసం ఒక్కరు ఇంటర్ పూర్తి చేసినవారు	34.2	40.4	33.2	41.4
కనీసం ఒక్కరైనా కంప్యూటర్ ఆపరేటింగ్ తెలిసిన వారున్న ఇళ్లు	21.5	26.8	19.3	22.1
చదువులేని తల్లులు	39.8	30.3	56.6	43.3
1-5 చదివిన తల్లులు	17.6	17.1	8.7	9.6
6-10 చదివిన తల్లులు	34.9	38.7	26.9	32.5
10పైన చదివిన తల్లులు	7.7	13.9	7.8	14.6
చదువులేని తండ్రులు	33.5	27.4	40.5	33.3
1-5చదివిన తండ్రులు	14.2	14.8	10.0	9.9
6-10 చదివిన తండ్రులు	37.4	38.1	33.7	36.9
10పైన చదివిన తండ్రులు	14.9	19.8	15.8	19.9

పంచాయతీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల కుదింపు

'ఏకగ్రీవాల నేపథ్యంలో ఎస్ఈసీ ఆదేశాలు

ఈనాడు, హైదరాబాద్: పంచాయతీలోని వార్డుసభ్యుల పదవులన్నీ ఏకగ్రీవమై, సర్పంచి పదవికి మాత్రమే పోలింగ్ నిర్వహించాల్సి ఉన్నప్పుడు... అక్కడి పోలింగ్ కేంద్రాల సంఖ్య తగ్గనుంది. కుదించిన కేంద్రాలు ఇప్పటికే ప్రకటించిన ప్రాంతం (లొకేషన్)లో మాత్రమే ఉంటాయి. అలా కుదించేటప్పుడు ఆ ఓటర్ల సంఖ్య 600కు మించకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటారు. రాష్ట్రంలో కొన్నిచోట్ల సర్పంచి, వార్డుసభ్యుల పదవులన్నీ ఏకగ్రీవమవుతున్నాయి. మరికొన్ని చోట్ల వార్డుసభ్యుల పదవులు ఏకగ్రీవమై, సర్పంచి పదవికే పోటీ నెలకొంటోంది. ఇంకొన్ని చోట్ల సర్పంచి ఏకగ్రీవమై, వార్డుసభ్యుల పదవులకు పోటీ ఏర్పడుతోంది. వార్డులవారీగా పోలింగ్‌కేంద్రాల ఏర్పాటుకు ఇప్పటికే సన్నాహాలు చేపట్టిన నేపథ్యంలో... తాజా పరిణామాలతో కొన్ని మార్పులు అనివార్యమయ్యాయి. దీంతో రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) పోలింగ్ కేంద్రాల కుదింపుపై ఆదేశాలు వెలువరించింది. అలా కుదించినప్పుడు, వాటిల్లో ఏ కేంద్రంలోని ఓటర్లు ఎవరన్నది వెల్లడించేందుకు... వారి వరుస సంఖ్యలను బయట ప్రదర్శిస్తారు. బూత్‌ల కుదింపుపై చాటింపు ద్వారా గ్రామాల్లో ప్రచారం చేయాలని జిల్లాల కలెక్టర్లకు ఎస్ఈసీ సూచించింది. కేంద్రాలను కుదించినప్పుడు, సిబ్బందిని అందుకు అనుగుణంగా నియమిస్తారు. కేవలం కొన్ని వార్డులు ఏకగ్రీవమై సర్పంచి, మిగతా వార్డుసభ్యుల పదవులకు పోలింగ్ నిర్వహించాల్సి ఉంటే...అక్కడ ఇంతకుముందే ప్రకటించిన పోలింగ్ కేంద్రాలను కుదించటం లేదా విలీనం చేయడం ఉండబోదు.

రయ్ రయ్

autopage@eenadu.in

బైక్ అంటే గమ్యం చేర్చే వాహనమే కాదు...
అదొక లైఫ్‌స్టైల్.. ఫ్యాషన్ ఐకాన్.. హోదాకి చిహ్నం..
ఒత్తిడి నివారిణి...
ఒక్కొక్కరికీ ఒక్కో సాధనం... అందుకే అందరూ
మెచ్చేలా అన్నిరకాల ద్విచక్రవాహనాలు
తయారు చేస్తున్నాయి తయారీ సంస్థలు...
ఇందులో రకరకాల సెగ్మెంట్లు..
లెక్కలేనన్ని విభాగాలు... అవేంటి?
వాటి ఫీచర్లేంటి?
ఎవరికి ఎలాంటివి నప్పుతాయో
తెలుసుకుందాం.



స్క్రాంబ్లర్

ఇవి చాలా తేలికైన మోటార్‌సైకిళ్లు. పవర్, టార్క్ ఎక్కువగా ఉంటుంది.

గ్రాండ్ టూరర్

పేరుకు తగ్గట్టే వాహనం గ్రాండ్‌గా ఉంటుంది. ఒక సోఫాలో కూర్చొని బైక్ నడిపినంత సౌకర్యంగా ఉంటుంది.

బండెనక బండి... మీదేదండీ!

చిరుద్యోగికి కమ్యూటర్.. జోరు కోరుకునే కుర్రాడికి క్రూయిజర్.. రేసింగ్ చేసే అబ్బాయికి స్పోర్ట్స్‌బైక్.. లాంగ్‌టూర్ ఇష్టపడే రైడర్‌కి అడ్వెంచర్ టూరర్.. ఇలా ఒక్కమాటలో చెబితే సరిపోదుగా. అందుకే కాస్త విపులంగా తెలుసుకుందాం. ఎవరికేం సూటవుతాయో.

పవరే మెచ్చేవాళ్లకి.. -స్ట్రీట్ ఫైటర్

కొంచెం స్టైల్, కొంచెం పవర్ కావాలనే వారి ఛాయిస్. ఎంట్రీ లెవల్, మిడిల్ వెయిట్, లీటర్ క్లాస్ అని మూడు రకాలున్నాయి. ఇండియాలో అత్యధికంగా అమ్ముడవుతున్న రెండో సెగ్మెంట్.

- తక్కువ ధరలో స్పోర్ట్ బైక్ ఫీల్ కావాలనేవాళ్ల ఎంపిక. డిజైన్ ఆకట్టుకునేలా స్టైల్‌గా ఉంటుంది.
- మంచి పికప్ ఉంటుంది. నగరరోడ్లకు అనుకూలం. నిర్వహణ వ్యయం తక్కువే.
- గంటకు 90 కిలోమీటర్ల వేగంతో వెళ్లినా కుదుపుల్లేకుండా ప్రయాణం సాఫీగా సాగిపోతుంది..
- 150సీసీ నుంచి 175సీసీ మధ్యలో ఉంటాయి. యాభైవరకు మైలేజీ ఇస్తుంది.

టాప్ సెల్లింగ్: బజాజ్ పల్సర్, టీవీఎస్ అపాచీ ఆర్‌టీఆర్, సుజుకీ జిక్సర్

ఎవరికి?: యంగ్ ప్రొఫెషనల్స్, కాలేజీ విద్యార్థులు

ఆపాత మధురం కావాలంటే-రెట్రో క్లాసిక్, రోడ్‌స్టర్

యూనిక్ సెగ్మెంట్. వారసత్వ సంపదను కొనసాగించాలనుకునే వాళ్ల కోసం తయారైనవి.

- రెట్రో క్లాసిక్ సాధారణ డిజైన్, వింటేజ్ లుక్‌తో ఉంటే రోడ్‌స్టర్ నేటి ఆధునిక టెక్నాలజీని జత కలుపుకుంటుంది.
- రెట్రోలో ఎలక్ట్రానిక్, టెక్నికల్ ఫీచర్లు తక్కువ. రోడ్‌స్టర్‌లో ఎత్తు హ్యాండిల్‌బార్, సౌకర్యవంతమైన సీటింగ్, అనుకూలమైన రైడర్ ఫుట్ పెగ్స్ ఉంటాయి.
- తక్కువ పెర్‌ఫార్మెన్స్, తక్కువ సౌకర్యవంతమైనా మెరుగైన పనితీరు ఉంటుంది.
- ఫీచర్లకన్నా వీటికి ఓ క్యారెక్టర్ ఉంటుంది. చాలామంది వీటిని హుందాతనానికి చిహ్నంగా వాడతారు.

అత్యధిక అమ్మకాలు: రాయల్ ఎన్‌ఫీల్డ్ క్లాసిక్ 350, జావా, రాయల్‌ఎన్‌ఫీల్డ్ ఇంటర్‌సెప్టార్ 650

ఎవరికి : వారసత్వాన్ని కాపాడుకోవాలి అనుకునేవారికి

అలసట మరిపించే-క్రూజర్

బండి నడిపేటప్పుడు ఎక్కువ సౌకర్యవంతంగా ఉండాలని కోరుకునే వాళ్ల ఓటు క్రూజర్‌కే. కిందికి దిగిన సీటింగ్, దానికి తగ్గ డిజైన్, పెర్‌ఫార్మెన్స్.. ఎంత దూరం ప్రయాణించినా అలసటే తెలియదు.

- హ్యాండిల్‌బార్ ఎత్తులో పట్టుకోవడానికి అనువుగా ఉంటుంది. కాళ్లు ముందుకు చాపుకునేలా ఫుట్ రెస్ట్ ముందుకు ఉంటుంది.
- వెనక టైరు పెద్దది. బండి కొంచెం బరువెక్కువ. దూరప్రయాణాలకు అనుకూలం. మైలేజీ తక్కువే.
- ఎంట్రీలెవెల్, మిడ్ లెవెల్, ఫ్లాగ్‌షిప్ మూడురకాలున్నాయి. 160సీసీ నుంచి 1000సీసీ రేంజ్.
- హై-ఎండ్ బైక్‌ల్లో అత్యధిక పవర్ ఉంటుంది. అందరూ నడపడం కష్టం.

అత్యధిక అమ్మకాలు: బజాజ్ అవెంజర్, సుజుకీ ఇంట్రూడర్, కవాసాకీ వల్కన్ ఎస్, హార్లీడేవిడ్‌సన్ స్ట్రీట్ 750

ఎవరికి?: భారీకాయులు, దూరప్రయాణాలు ఇష్టపడేవాళ్లకి

మైలేజీ కావాలా - కమ్యూటర్

ఇండియాలో మోటార్‌సైకిల్ యాత్ర మొదలైంది ఈ కమ్యూటర్ బైక్‌లతోనే. తక్కువ ఫీచర్లు, టెక్నాలజీని పెద్దగా వాడకపోవడం, బండిని ఎవరైనా తేలికగా నడపడానికి వీలుండటం కమ్యూటర్ లక్షణాలు. ఫిల్ ఇట్, షట్ ఇట్, ఫొర్గెట్ ఇట్ అంటారు వీటిని.

- తేలికైన డిజైన్, సాఫీగా సాగిపోయే నమ్మకమైన ఇంజిన్. ఎక్కువ మైలేజీనిస్తాయివి.
- సౌకర్యవంతమైన సీటింగ్, ఇబ్బంది కలిగించని హ్యాండిల్‌బార్, సాఫీగా సాగిపోయే సస్పెన్షన్ దీని సొంతం.
- ఇంజిన్ సామర్థ్యం 75సీసీ నుంచి 125 సీసీ మధ్యలో ఉంటుంది.
- బండి ధర అందుబాటులో ఉంటుంది. నిర్వహణ వ్యయం తక్కువ కావడంతో మంచి రీసేల్ ధర ఉంటుంది.

అత్యధిక అమ్మకాలు: హీరో స్ప్లెండర్, ప్యాషన్, హోండా షైన్, టీవీఎస్ విక్టర్

ఎవరికి?: రోజువారీ అవసరాలకు, చిరుద్యోగులకు.



డ్యుయెల్ స్పోర్ట్

అడ్వెంచర్ టూరర్ కొనసాగింపు మోడళ్లు. స్పోక్ చక్రాలు, పొడవాటి ముందుచక్రాలు వీటి ప్రత్యేకత.

స్పోర్ట్ టూరర్

ఫుల్ ఫేరింగ్స్‌తో వస్తాయి. స్పోర్ట్ బైక్‌ల్లో కాకుండా రైడింగ్ సౌకర్యవంతంగా ఉంటుంది.

పవర్ క్రూయిజర్

క్రూయిజర్‌లో ఉన్న సౌకర్యాన్ని, స్పోర్ట్‌బైక్‌లో ఉన్న పవర్‌ని మేళవిస్తే పవర్ క్రూయిజర్స్.

కెఫే రేసర్లు

అరవై, డెబ్భై దశకాల్లో ఒక రేసింగ్ కల్చర్ ఉండేది. రైడర్లు ఒక కెఫే నుంచి ఇంకో కెఫేకి పోటీ పెట్టేవారు. అలాంటి కల్చర్ మళ్లీ తీసుకురావడానికి రాయల్ ఎన్‌ఫీల్డ్ కాంటినెంటల్ జీటీ 535 అనే మోడల్‌ని తీసుకొచ్చింది.



ప్రకృతి ప్రేమికులకు ప్రేమతో- అడ్వెంచర్ టూరర్లు

మోటార్‌సైకిల్‌ని ప్రయాణ సాధనంగా కాక ఒత్తిడి నివారిణిగా, లైఫ్‌స్టైల్‌గా భావించే వాళ్లకి నచ్చే సెగ్మెంట్ బైక్ ఇది. ప్రకృతిని ఎంజాయ్ చేయాలనుకునేవారి కోసం.

- పొడవైన సస్పెన్షన్, మంచి గ్రౌండ్ క్లియరెన్స్, పెద్ద ఇంధన ట్యాంకు, సామాన్లు పెట్టుకోవడానికి స్యాడల్ బ్యాగ్ చెప్పుకోదగ్గ ఫీచర్లు.
- హైవేలు, మట్టిరోడ్లు, నగరరోడ్లు ఎక్కడైనా సాఫీగా వెళ్లిపోవచ్చు. ఎంతదూరమైనా టూర్‌కి వెళ్లిపోవచ్చు.
- అవసరమైతే నిలబడి నడపడానికి సైతం వీలుగా హ్యాండిల్‌బార్ ఎత్తుగా, ఫుట్ పెగ్స్ అనుకూలంగా ఉంటాయి.
- 120కిమీల వేగంతో వెళ్లినా కుదుపులుండవు.

టాప్ ఎంపిక: హీరో ఇంపల్స్, బీఎండబ్ల్యూ జీ310జీఎస్ సుజుకీ వీ స్ట్రామ్ 650, ట్రయంఫ్ టైగర్

ఎవరికి?: లాంగ్‌టూర్‌లు ఇష్టపడే ప్రకృతి ప్రేమికులకు.



- డీనోస్ వాల్ట్
ఆటోమొబైల్ నిపుణుడు

మేటి పికప్‌కి- పర్‌ఫార్మెన్స్ స్పోర్ట్ బైక్

యాక్సిలరేటర్ ఇలా తిప్పగానే అలా జుమ్మంటూ దూసుకెళ్లాలనుకుంటే ఈ స్పోర్ట్ బైక్‌ల్ని ఎంచుకోవచ్చు. పవర్ ఉన్నచోట మైలేజీ పడిపోవడం సహజమే కదా. అయినా కుర్రకారు కోరునేవాటిల్లో ఇవి ముందుంటున్నాయి.

- రేసింగ్ టెక్నాలజీ, రేసింగ్ పెర్‌ఫార్మెన్స్ ఫీచర్లతో తయారు చేస్తారు. కుదుపుల్లేకుండా సాఫీగా వెళ్లిపోవడానికి ఫోర్‌వాల్వ్ టెక్నాలజీ వాడతారు.
- రైడింగ్ సౌకర్యవంతంగా ఉంటుంది. పనితీరు, పవర్‌కే ప్రాధాన్యత.
- మిడిల్‌వెయిట్, లీటర్‌క్లాస్ సెగ్మెంట్లలో పారలల్ ట్విన్ సిలిండర్, ఇన్‌లైన్ ఫోర్ సిలిండర్ ఇంజిన్, ట్రాక్షన్ కంట్రోల్, ఏబీఎస్‌లాంటి ఫీచర్లుంటాయి.
- 1000సీసీ వరకు అందుబాటులో ఉన్నాయి. దీనర్థం అత్యధిక శక్తి ఉత్పత్తి చేస్తాయి.

టాప్ బైక్‌లు: టీవీఎస్ అపాచీ ఆర్‌టీఆర్ 200, బజాజ్ పల్సర్ 200 ఎన్‌ఎస్, కవాసాకీ జడ్900, ట్రయంఫ్ స్ట్రీట్ ట్రిపుల్

ఎవరికి?: టూరింగ్ చేసేవాళ్లు, సౌకర్యం కోరుకునేవారికి, పవర్ కావాలనుకునేవాళ్లకి.

రేసర్ల నేస్తం - సూపర్ స్పోర్ట్

రేసింగ్ ట్రాక్ మీద నడిపించడానికి ప్రత్యేకంగా తయారు చేసినవి. దృఢమైన సస్పెన్షన్, దృఢమైన ఛాసిస్ డిజైన్ బండిని సాలిడ్‌గా మార్చినా కుదుపులకు ఆస్కారం ఎక్కువ.



- రోజువారీ అవసరాలకు పనికిరావు. బాగా ముందుకు వంగి నడిపించాలి. మామూలు రైడర్లకు అంత సౌకర్యంగా ఉండదు.
- ముందు విండ్‌స్క్రీన్, బాడీ ఫెయిరింగ్స్ ఉంటాయి. గాలిని చీల్చుకుంటూ మరింత వేగంగా వెళ్లేలా డిజైన్ చేస్తారు.
- ట్విన్ సిలిండర్ ఇంజిన్‌తో నడుస్తాయి. పవర్ చాలా ఎక్కువ. మైలేజీ చాలా తక్కువ.
- మిడిల్‌వెయిట్, లీటర్ క్లాస్‌ల్లో 600సీసీ నుంచి 1000సీసీ వరకున్నాయి.

మేటి బైక్‌లు: కేటీఎం ఆర్‌సీ 390, యమహా ఆర్15వీ3, కవాసాకీ నింజా 300

ఎవరికి నప్పుతుంది: రేస్‌ట్రాక్ రైడర్లు

మెకానిక్‌గురూ

సొట్టలు పడ్డా బీమా

■ డియర్ సర్, 2017లో హీరో స్ప్లెండర్ మోటార్‌సైకిల్ కొన్నాను. ఈమధ్య అది ఆటో ఇగ్నిషన్‌తో స్టార్ట్ కావడం లేదు. కిక్ రాడ్‌నే ఉపయోగించాల్సి వస్తోంది. మెకానిక్‌ని అడిగితే బ్యాటరీ వీక్ అయిందనీ రీఛార్జ్ చేయడం లేదా కొత్తది మార్చాలని చెబుతున్నాడు. పరిష్కారం అంతేనా? బ్యాటరీ ఇంత త్వరగా పాడవడానికి కారణమేంటి?

- జేవీవీ ప్రసాదరావు, నెల్లూరు

మీరు చెబుతున్న వివరాల ప్రకారం నిజంగానే బ్యాటరీలో లోపం ఉన్నట్టుంది. దాన్ని మార్చడమో లేదా ఛార్జ్ చేయడమే పరిష్కారం. మోటార్‌సైకిల్ బ్యాటరీ మన్నిక కనిష్ఠంగా రెండేళ్లు, గరిష్ఠంగా పదేళ్లవరకు ఉంటుంది. వాడకం ఆధారంగా దాని మన్నిక ఉంటుంది. జీవితకాలం ఎక్కువ కాలం రావాలంటే ఇలా చేయాలి.



1) రెండు, మూడు నెలలకోసారి బ్యాటరీ నీటిమట్టం పరిశీలించాలి.
2) ఆర్నెల్లకోసారి బ్యాటరీ టెర్మినల్లను ఏదైనా బ్రష్‌తో శుభ్రం చేయాలి.
3) తుప్పు, చిలుము పట్టకుండా ఉండాలంటే తరచూ గ్రీజు పూయాలి.
4) అన్నింటికన్నా ముఖ్యమైన విషయం ఏంటంటే ప్రతి మూణ్నెళ్లు లేదా 500 కిలోమీటర్లకోసారి బ్యాటరీని, బైక్‌ని పరీక్షించాలి.

■ కారు పార్కింగ్ చేస్తున్నపుడు పొరపాటున వెనకవైపు ఢీకొట్టాను. వెనకాల చిన్న సొట్ట పడింది. నాలుగుచోట్ల గీతలు పడ్డాయి. కొన్ని చిన్నవి, కొన్ని పెద్దవి. డీలరు దగ్గరికి తీసుకెళ్తే మరమ్మతుకి రూ.20వేలు బిల్లు అవుతుందని చెప్పాడు. ఈమాత్రం దానికే అంత చెల్లించాలా? ఏదైనా మెకానిక్ షెడ్‌కి తీసుకెళ్తే ఖర్చు తగ్గే అవకాశం ఉందా? **- శ్రీనివాసరావు,** గుడివాడ

కారు బ్రాండ్, మోడల్, బండిపై పడ్డ గీతల పూర్తి చెబితే ఎంత ఖర్చవుతుందో అంచనా వేయడానికి వీలయ్యేది. అవే సరిగా తెలియకుండా ఇరవై వేలు ఎక్కువా? తక్కువా? అని తేల్చి చెప్పడం కష్టం. ఏదేమైనప్పటికీ ఇలాంటి ప్రమాదాలకు బీమా వర్తిస్తుంది. మీ ఏజెంట్‌ని సంప్రదించి క్లెయిమ్ చేసుకోండి. తర్వాత మీరు భరించాల్సింది తక్కువ మొత్తమే ఉండొచ్చు.

- సాయిభరత్ బొప్పరాజు, www.motofix.in

మొదటి సవారీ

బోయ్‌ఫ్రెండ్ తోడుగా.. లాన్సర్ సవారీ!



తీరైన అందం, ఆకట్టుకునే నటనకి చిరునామా బాలీవుడ్ నటి రాధికా ఆప్టే. తనకి బైక్‌లు, కార్లు నడపడమన్నా ఇష్టమే. ఎనిమిదేళ్ల వయసులోనే ఈ లేడీ లేడీబర్డ్ సైకిల్ ఎక్కేసి వీధులన్నీ తెగ తిరిగేసేదట. టీనేజీలో ఉండగా ఓ స్నేహితురాలి టీవీఎస్ స్కూటీ తీసుకొని రెండుసార్లు కిందపడి దెబ్బలు తగిలించుకున్నా పట్టువదలకుండా ఒక్కరోజులోనే రైడింగ్ నేర్చేసుకుందట. కారు విషయానికొస్తే మొదటి బోయ్‌ఫ్రెండ్ కారు నడపడం నేర్పించాడంటోంది. అలా తొలిసారి స్టీరింగ్ పట్టిన కారు మిత్సుబిషీ లాన్సర్. ఈ విషయం తనే స్వయంగా చెప్పింది. తర్వాత మోడల్‌గా రాణిస్తున్న సమయంలో హ్యుందాయ్ సాంట్రో సొంతంగా కొనుక్కుంది.



పరిచయం

బరిలో ఆహారియర్!

ముహూర్తం ఖరారైంది. ఆటోమొబైల్ వర్గాలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న టాటామోటార్స్ ప్రీమియం ఎస్‌యూవీ హారియర్ రాకకు అంతా సిద్ధమైంది. 2018 ఆటోఎక్స్‌పోలో హెచ్5ఎక్స్ పేరుతో తొలిసారి తళుక్కుమన్న ఈ కారు హారియర్‌గా పేరు మార్చుకొని వస్తోంది. దాని ఫీచర్లు, ప్రత్యేకతల సంగతులివి.



● **ఆకట్టుకునే రూపం:** ఐదు సీట్ల స్పోర్ట్ యుటిలిటీ విభాగంలో వస్తున్న హారియర్‌ని స్టైల్ విషయంలో ఏమాత్రం రాజీ పడలేదు. ముందుభాగంలో పొడవాటి సమాంతర హ్యుమానిటీ లైన్ గ్రిల్, వాటికి ఎల్ఈడీ డీఆర్‌ఎల్‌లు, గ్జినాన్ ప్రొజెక్టర్ హెడ్‌ల్యాంప్‌లు.. చూడ్డానికి పోష్ లుక్ ఇస్తున్నాయి. అన్ని చక్రాలకు పైన అమర్చిన అతిపెద్ద వీల్ ఆర్కులు, ఫ్లోటింగ్ రూఫ్ డిజైన్, బ్రష్డ్ ప్యానెళ్లు, పెద్ద టైర్లు, మెరుపుల అల్లాయ్ చక్రాలు అచ్చమైన ఎస్‌యూవీకి ప్రతిరూపాన్నిచ్చాయి.

● **లోపల విశాలం:** కారు క్యాబిన్ చూస్తే ఎవరైనా ఆ అందానికి నోరెళ్లబెట్టాల్సిందే. చాక్లెట్ బ్రౌన్ రంగు సీట్లు, సాఫ్ట్‌టచ్ డాష్‌బోర్డు, వుడ్ కలర్ ప్యానెల్ దాన్ని వేరు చేసే వెండిరంగు గీతలు కళ్లు తిప్పుకోనివ్వవు. అంతర్భాగంలో ఎక్కడా గరుకు అంచులు లేకుండా ప్రతి మూలనీ చక్కగా ఫినిష్ చేశారు. హెడ్‌రూం, షోల్డర్ రూం, నీ రూం అన్నీ విశాలంగా ఉన్నాయి. 8.8 అంగుళాల తాకే తెరతో ఉన్న ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్ వినోదానికి చిరునామా. సబ్‌వూఫర్ స్పీకర్ల నుంచి వెలువడే మ్యూజిక్ హోంథియేటర్‌లో ఉన్న అనుభూతి కలుగజేస్తాయి..

● **ఇంజిన్ భళా:** 140 బీహెచ్‌పీ శక్తిని ఉత్పత్తి చేసే 2.0లీటర్ల మల్టీజెట్ ఇంజిన్ కారు వాయువేగంతో దూసుకెళ్లేలా చేస్తుంది. ఇది 6స్పీడ్ మాన్యువల్ గేర్‌బాక్స్‌తో పని చేస్తుంది. ఎకో, సిటీ, స్పోర్ట్ మోడ్‌ల్లో కావాల్సినట్టు మార్చుకోవచ్చు. రేర్ పార్కింగ్ కెమెరా, క్రూయిజ్ కంట్రోల్, ఆటోహెడ్‌ల్యాంప్‌లు, గ్రాఫిక్‌లతో కూడిన వేరియస్ డ్రైవింగ్ మోడ్‌లు చెప్పుకోతగ్గ ఫీచర్లు. టాటా అనుబంధ లాండ్‌రోవర్ స్ఫూర్తితో దీని ఆకృతిని తీర్చిదిద్దారు.

● **భద్రతకి పెద్దపీట:** భద్రత విషయంలో టాటాది ఎప్పుడూ ముందువరుసే. హ్యారియర్‌లో అదే తీరు అనుసరించారు. ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, ఆఫ్‌రోడ్డు యాంటీలాక్ బ్రేకింగ్ సిస్టమ్, రేర్ పార్కింగ్ కెమెరా, హిల్‌స్టార్ట్ అసిస్ట్, హిల్ డీసెంట్ కంట్రోల్, ట్రాక్షన్ కంట్రోల్, స్టెబిలిటీ కంట్రోల్, స్పీడ్ వార్నింగ్ అలారం.. సురక్షిత ప్రయాణానికి భరోసాగా ఉన్నాయి. ఎస్‌యూవీ అయినా లీటరుకి 15 కిలోమీటర్ల మైలేజీనిస్తుంది. సన్‌రూఫ్ లేకపోవడం, క్యాబిన్ ఇంజిన్‌లో శబ్దం ఎక్కువగా ఉండటం.. మైనస్ పాయింట్లు. ధర: రూ.16లక్షలు (ఎక్స్ షోరూం)

ఈనాడు సినిమా

నమ్మిన సిద్ధాంతం అదే


సమంత

చిత్ర పరిశ్రమలో ఒకొక్కరిది ఒక్కో వ్యూహం. అంతిమంగా అందరి లక్ష్యం విజయమే. ఒక విజయం లభించిందంటే, దాన్నే స్ఫూర్తిగా తీసుకొని అదే తరహాలో అడుగులు వేసే వాళ్లు చాలా మందే కనిపిస్తుంటారు. కథానాయిక సమంత విజయం కంటే కూడా ఎదురైన పరాజయాల్ని పరిగణనలోకి తీసుకొనే ముందడుగు వేస్తుంటానని చెబుతోంది. "పరాజయాల నుంచే ఎక్కువ పాఠాలు నేర్చుకొంటామనేది నేను మొదట్నుంచీ నమ్ముతున్న సిద్ధాంతం. మనం చేసిన తప్పుల్ని తలచుకొని అడుగులేస్తే మళ్లీ ఆ తప్పులు పునరావృతం కావు. అందుకే కథలు వినేటప్పుడు ఒకసారి గతంలో నాకెదురైన పరాజయాల్ని గుర్తు చేసుకొంటా. అలాంటి తప్పు ఇందులో జరిగే ఆస్కారం ఉందా? లేదా? అని ప్రశ్నించుకొంటా. ఆ తర్వాతే నిర్ణయం తీసుకొంటా" అని చెప్పింది సమంత. ప్రస్తుతం ఆమె తన భర్త నాగ చైతన్యతో కలిసి 'మజిలీ'లో నటిస్తోంది. తదుపరి 'ఓ బేబీ.. ఎంత సక్కగున్నావే' అనే చిత్రంలో నటించబోతోంది.

ఆరోగ్యం మెరుగ్గా ఉంది


బ్రహ్మానందం

నాన్నని ఐసీయు నుంచి సాధారణ గదికి మార్చారని, ఆయన ఆరోగ్యం ప్రస్తుతం మెరుగ్గా ఉందని నటుడు బ్రహ్మానందం తనయుడు రాజా గౌతమ్ ఓ ప్రకటనలో తెలియజేశారు. ఇటీవలే అస్వస్థతకి గురైన బ్రహ్మానందంకి ముంబయిలో గుండెకి సంబంధించిన శస్త్రచికిత్స విజయవంతంగా జరిగింది. ఆ విషయాన్ని బ్రహ్మానందం తనయుడు రాజా గౌతమ్ ధ్రువీకరించారు. "కొన్ని నెలలుగా ఛాతిలో అసౌకర్యంగా అనిపించడంతో హైదరాబాద్‌లో ఒక ప్రముఖ వైద్యుడిని సంప్రదించారు నాన్న. వారి సలహా మేరకే ముంబయిలోని ఏసియన్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో ఈ నెల 14న శస్త్రచికిత్స జరిగింది. ఆ విషయం తెలిసి అభిమానులు, శ్రేయోభిలాషులు, సినీ పరిశ్రమకి చెందిన ప్రముఖులు నాన్న ఆరోగ్య పరిస్థితి గురించి వాకబు చేశార'ని పేర్కొన్నారు రాజా గౌతమ్.

బాక్సర్‌గా వరుణ్ తేజ్



ఎప్పటికప్పుడు కొత్త రకమైన కథల్ని ఎంపిక చేసుకొంటూ ప్రయాణం చేస్తున్నాడు వరుణ్‌తేజ్. తదుపరి బాక్సింగ్ నేపథ్యంలో ఓ చిత్రం చేయబోతున్నాడు. కిరణ్ కొర్రపాటి అనే కొత్త దర్శకుడు తెరకెక్కించనున్న ఆ చిత్రంలో వరుణ్‌తేజ్‌కి కోచ్‌గా సీనియర్ నటుడు అర్జున్ నటిస్తారని సమాచారం. బాక్సర్ పాత్ర కోసం వరుణ్‌తేజ్ ప్రత్యేకంగా శిక్షణ తీసుకొంటున్నారు. ఈ చిత్రానికి ఆయన సహ నిర్మాతగానూ వ్యవహరించబోతున్నట్టు తెలిసింది.


'భారతీయుడు 2'లో కమల్‌హాసన్

'ఆదిత్య 369' చేస్తున్నప్పుడు సలహాలిచ్చారు


రమేష్ ప్రసాద్, బాలకృష్ణ

- బాలకృష్ణ

"సినిమానే నమ్మారు. పట్టుదలతో ఎదిగారు. తన సంపాదనను చిత్ర పరిశ్రమకీ, సమాజానికీ ఉపయోగపడేలా చేసిన ఆదర్శ పురుషుడు ఎల్వీ ప్రసాద్" అన్నారు ప్రముఖ కథానాయకుడు నందమూరి బాలకృష్ణ. గురువారం హైదరాబాద్‌లో తొలితరం దర్శకనిర్మాత ఎల్వీ ప్రసాద్ 111వ జయంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బాలకృష్ణ పాల్గొని ప్రసంగించారు. "సినిమాపై అభిమానంతో ముంబయి వెళ్లి పడరాని కష్టాలు పడ్డారు ఎల్వీ ప్రసాద్. థియేటర్ దగ్గర గేట్ కీపర్‌గా పనిచేసిన ఆయన నటుడు, నిర్మాత, దర్శకుడు, ఛాయాగ్రాహకుడు... ఇలా అన్ని విభాగాల్లోనూ ప్రతిభ చూపి ఉన్నత స్థాయికి చేరుకున్నారు. ప్రపంచంలోనే తెలుగు సినిమాకి ఖ్యాతిని, గౌరవాన్ని తెచ్చిపెట్టారాయన. సినీ పరిశ్రమకి ఆద్యుడు, ఆరాధ్యుడు, స్ఫూర్తిప్రదాత ఆయన. చిత్రపరిశ్రమ సాంకేతికంగా అభివృద్ధి చెందాలని దేశవ్యాప్తంగా అత్యున్నత ప్రమాణాలతో కూడిన ప్రసాద్ ల్యాబొరేటరీలు, స్టుడియోలు నిర్మించారు. కొత్త సాంకేతికతనైనా ప్రవేశపెట్టడానికి ముందడుగు వేసేవారు. సినిమాలు చూసిన ప్రజల కళ్లు సవ్యంగా ఉండాలనే ఆకాంక్షతో ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌ని నెలకొల్పి ప్రశంసనీయమైన సేవల్ని అందిస్తున్నారు. మద్రాస్‌లో మా ఇంటి ఎదుటే వారి ఇల్లు ఉండేది. ఆయన దర్శకత్వం వహించిన 'మనదేశం' చిత్రంతోనే నాన్నగారు పరిచయమయ్యారు. నాకూ ఆయనతో మంచి అనుబంధం ఉండేది. 1991వ సంవత్సరంలో 'ఆదిత్య 369' చేస్తున్నప్పుడు ఎల్వీ ప్రసాద్‌గారు విలువైన సలహాలు, సూచనలూ ఇచ్చారు. ఆయనలాగే నాన్న కూడా కళను సమాజాభ్యుదయం కోసం ఉపయోగించారు. తండ్రి ఎల్వీ ప్రసాద్ అడుగజాడల్లోనే ఆయన తనయుడు రమేష్ ప్రసాద్ నడుస్తున్నార"న్నారు. ఎల్వీ ప్రసాద్ తనయుడు రమేష్‌ప్రసాద్ మాట్లాడుతూ "నాన్న ఎప్పుడూ సినిమా ఆలోచనలతోనే గడిపేవారు. నాన్నంటే తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ చిత్రరంగాల్లో అపరిమితమైన గౌరవం ఉండేది. ఆయన గౌరవాన్ని నిలబెట్టే పనులు చేయడమే బాధ్యతగా మేం నడుస్తున్నామ"న్నారు. వై.వి.ఎస్ చౌదరి మాట్లాడుతూ "ఎల్వీప్రసాద్, ఎన్టీఆర్ ఇద్దరూ ఆదర్శప్రాయులు. వారిద్దరి ఆశయాల్ని నిలిపే దిశగానే బాలకృష్ణ, రమేష్‌ప్రసాద్ నడుస్తున్నారు. ఎల్వీప్రసాద్ బయోపిక్‌ని తీస్తే చూడాలని ఆశగా ఉంద"న్నారు. గీతాంజలి మాట్లాడుతూ "'సీతారామ కళ్యాణం'తో ఎన్టీఆర్ నన్ను పరిచయం చేశారు. ఆ తర్వాత ఎల్వీప్రసాద్ 'ఇల్లాలు' సినిమాలో నటించా. రెండు చిత్రాలూ నాకు పేరు తెచ్చాయ"న్నారు. కార్యక్రమంలో రమేష్ ప్రసాద్ తనయ రాధా ప్రసాద్‌తో పాటు, ప్రసాద్స్ క్రియేటివ్ మెంటార్ సురేష్ కోవూరి పాల్గొన్నారు.

అఖిల్ వేడుకకి ఎన్టీఆర్


అఖిల్


ఎన్టీఆర్

అఖిల్ అక్కినేని కథానాయకుడిగా నటించిన 'మిస్టర్ మజ్ను' వేడుకకి ఎన్టీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. చిత్రం ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకు రానున్న సందర్భంగా ఈ నెల 19న హైదరాబాద్‌లో విడుదల ముందస్తు వేడుకని నిర్వహిస్తున్నారు. వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మిస్టర్ మజ్ను'. ఇందులో అఖిల్ సరసన నిధి అగర్వాల్ నటించారు. బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మాత. తమన్ స్వరాలు సమకూర్చారు. ఇటీవలే పాటలు విడుదలయ్యాయి. నిర్మాత మాట్లాడుతూ "చిత్రంలోని పాటలకి శ్రోతల నుంచి మంచి స్పందన లభిస్తోంది. విడుదల ముందస్తు వేడుకని ఘనంగా నిర్వహించబోతున్నాం. ఈ వేడుకకి ఎన్టీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతుండడం ఆనందంగా ఉంది. అఖిల్ 'మిస్టర్ మజ్ను'గా ప్రేక్షకుల్ని తప్పకుండా మెప్పిస్తాడు" అన్నారు. ఈ చిత్రంలో నాగబాబు, ప్రియదర్శి, జయప్రకాష్, హైపర్ ఆది తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

ఈ చదువులు మారితేనే అభివృద్ధి

భారత విద్యా వ్యవస్థలోని లోపాల నేపథ్యంగా తెరకెక్కుతోన్న చిత్రం 'వై చీట్ ఇండియా?'. మొదట ఈ చిత్రానికి 'చీట్ ఇండియా' అనే టైటిల్ పెట్టారు. సెన్సార్ అభ్యంతరం వ్యక్తం చేయడంతో 'వై చీట్ ఇండియా?'గా పేరు మార్చారు. ఇమ్రాన్ హష్మీ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. సౌమిక్ సేన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా ఇమ్రాన్ హష్మీ చెప్పిన ఆసక్తికర సంగతులు...



- "'వై చీట్ ఇండియా?' చిత్రంతో వెంటనే విద్యావ్యవస్థలో పెను మార్పు రాకపోవచ్చు. ఒక చర్చ అయితే కచ్చితంగా మొదలవుతుంది. ఈ చిత్రం టైటిల్ విషయంలో సెన్సార్ నుంచి అభ్యంతరం వ్యక్తమైంది. 'చీట్ ఇండియా' అని పెడితే 'వై చీట్ ఇండియా'గా మార్చాల్సి వచ్చింది. ఓ వ్యవస్థ దేశాన్ని ఎలా మోసం చేస్తుందో ఇందులో చూపిస్తున్నాం. కథకు సరిపోయే టైటిలే పెట్టాం. విద్యావ్యవస్థలో ఏం జరుగుతుందో అద్దంలో చూపించాం. ఇందులో కొన్ని ప్రశ్నలను సూటిగానే సంధించాం. కొన్ని సార్లు నిజంతోకూడిన ప్రశ్నలు ఇబ్బందిగానే ఉంటాయి".
- "ఏడాదిన్నర క్రితం దర్శకుడు సౌమిక్ సేన్ ఈ కథను చెప్పారు. విద్యా వ్యవస్థ ఎంత లోపభూయిష్టంగా ఉంది, ఎంత పక్కాగా మోసాలు చేస్తున్నారో ఈ కథలో చెప్పారు. అందుకే ఈ కథలో నటించడమే కాదు నిర్మించాలి అనుకున్నాను. గతంలోనూ ఈ స్థాయిలో విద్యావ్యవస్థ నేపథ్యంగా సినిమా రాలేదు. చేదు నిజాల్ని కూడా తియ్యగానే చెప్పాలి కనుక చక్కటి వినోదాన్ని జోడించి ఈ కథను తీర్చిదిద్దారు దర్శకుడు. ఇప్పటి వరకూ నాకున్న ఇమేజ్‌ను పూర్తిగా మార్చేసే చిత్రమిది. నేను ఇప్పటివరకూ పలు వైవిధ్యమైన పాత్రల్లో కనిపించాను. వాటన్నింటి కంటే భిన్నంగా ఉంటుంది".
- "విద్యావ్యవస్థలోని చీటింగ్ మాఫియా పూర్తిగా కనుమరుగు అయిపోవాలనేది నా ఆశ. మొత్తం వ్యవస్థలో సమూలమైన మార్పులు రావాలి. అన్ని రంగాల కంటే విద్యారంగం జాతి నిర్మాణంలో ఎంతో కీలకమైందనే విషయం అందరూ తెలుసుకోవాలి. గ్రేడ్‌లు, మార్కులు అంటూ పిల్లల వెంట పడే చదువులు పోవాలి. వాళ్లలోని సృజనాత్మకతకు సానపెట్టేలా చదువులు మారాలి. మన దేశంలో ఇప్పుడు జరుగుతున్నదే అభివృద్ధి అనుకుంటే నిజమైన అభివృద్ధి జరగదు. నేను కలలు కన్న విద్యను నా తనయుడు అయాన్‌కు అందివ్వగలుగుతున్నాను. పరీక్షలు, హోమ్ వర్క్ అంటూ సాగే చదువుకి మావాడిని దూరంగా ఉంచాను. బాల్యాన్ని ఆస్వాదిస్తూ చదువుకుంటున్నాడు".
- "బాక్సాఫీసు అంకెల గురించి నేను పట్టించుకోను. మనం నిజాయతీగా ఓ కథను చెప్పాలనుకుంటే ప్రేక్షకులు కచ్చితంగా ఆదరిస్తారు. నా దగ్గరకు మంచి కథలు వెతుక్కొంటూ వస్తున్నాయి. చిత్ర పరిశ్రమను నేను చూస్తున్న కోణంలోంచి పుస్తకం రాయబోతున్నాను".

అక్కడ ఎవరున్నారు?


శివ కంఠంనేని

శివ కంఠంనేని ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'అక్కడొకడుంటాడు'. రామ్‌కార్తీక్, శివ హరీష్, అలేఖ్య, రసజ్ఞదీపిక నాయకానాయికలు. అల్లరి రవిబాబు, వినోద్‌కుమార్, ఇంద్రజ కీలక పాత్రలు పోషించారు. శ్రీపాద విశ్వక్ దర్శకుడు. కె.శివశంకరరావు, రావుల వెంకటేశ్వరరావు నిర్మాతలు. హైదరాబాద్‌లో ట్రైలర్ ఆవిష్కరణ జరిగింది. కథానాయకుడు నాగశౌర్య ట్రైలర్‌ని ఆవిష్కరించగా, చిత్రంలోని 'ఆడిపాడి గడిపేద్దాం...' అంటూ సాగే గీతాన్ని ప్రముఖ నిర్మాత కె.ఎస్.రామారావు విడుదల చేశారు. ఈ నెలలోనే చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామన్నారు నిర్మాత రావుల వెంకటేశ్వరరావు. "ఆపదలో చిక్కుకున్న ఒక ప్రేమ జంటకి, స్నేహితులు సహాయం అందించే సమయంలో మరో ప్రమాదం ఎదురవుతుంది. ఆ పరిణామాలు ఎవరిపై ఎలాంటి ప్రభావం చూపాయన్నది ఆసక్తికరం. ఈ కథలో ఒక వ్యక్తి పాత్ర కీలకం. అతను ఎక్కడ ఎవరికోసం ఉన్నాడనేది తెరపైనే చూడాల"న్నారు దర్శకుడు.

ముంబయిలో సినిమా మ్యూజియం

వందేళ్లు దాటిన భారతీయ సినిమా ప్రయాణాన్ని ప్రతిబింబించేలా ముంబయిలో 'నేషనల్ మ్యూజియమ్ ఆఫ్ ఇండియన్ సినిమా' పేరుతో ప్రదర్శనశాల ఏర్పాటు కానుంది. ఈ నెల 19న ప్రధాని నరేంద్ర మోదీ దీన్ని ప్రారంభించనున్నారు. ఇందుకోసం రూ.140.61 కోట్లతో ఓ కొత్త భవనంతో పాటు 19వ శతాబ్దంనాటి గుల్షన్ మహల్‌ను తీర్చిదిద్దుతున్నారు. భారతీయ సినిమా గురించి సందర్శకులకు తెలియజేయడానికి ఇందులో ఏర్పాట్లు చేస్తున్నారు. భారతీయ సినిమా పుట్టుక, మన దేశంలోకి సినిమా ఎలా ప్రవేశించింది?, సినిమాపై రెండో ప్రపంచయుద్ధ ప్రభావం, ప్రాంతీయ సినిమా ఇలాంటి ఎన్నో విషయాలను తెలుసుకొనేలా ఈ ప్రదర్శనశాలను రూపొందిస్తున్నారు. కొత్త భవనంలో నాలుగు ప్రత్యేక హాళ్లు ఉంటాయి. ప్రముఖ దర్శకుడు శ్యామ్ బెనగల్ నేతృత్వంలో ఏర్పాటైన మ్యూజియమ్ సలహా కమిటీ సూచనలతో దీన్ని తీర్చిదిద్దుతున్నారు.

రౌడీ భాయ్ థ్రిల్


షిప్రకౌర్

మానస్, షిప్రకౌర్, స్మైల్ శ్రీను ప్రధాన పాత్రధారులుగా నటించిన చిత్రం 'రౌడీ భాయ్'. ఉదయ్.జి దర్శకుడు. తుమ్మలపల్లి రామసత్యనారాయణ నిర్మాత. మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "రామసత్యనారాయణ మంచి కథతో రూపొందించిన ఈ చిత్రం ప్రేక్షకాదరణ పొందాలని ఆకాంక్షిస్తున్నా" అన్నారు. "రౌడీభాయ్ కథేంటి? ఆయన ఎలా థ్రిల్ చేశాడనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే" అన్నారు నిర్మాత.

ముహూర్తం కుదిరింది


రామ్


పూరి జగన్నాథ్

రామ్ కథానాయకుడిగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఇస్మార్ట్ శంకర్'. ఈ ఏడాది కుదిరిన ఆసక్తికరమైన కలయిక ఇది. పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్ కలిసి నిర్మిస్తున్నారు. ఈ సినిమాని సెట్స్‌పైకి తీసుకెళ్లేందుకు రంగం సిద్ధమైంది. ఈ నెల 23న ప్రారంభించి 24 నుంచి రెగ్యులర్ చిత్రీకరణ మొదలు పెట్టనున్నట్టు నిర్మాతలు తెలిపారు. అయితే ఇందులో కథానాయిక ఎవరనేది ఇంకా ఖరారు కాలేదు. ఈ చిత్రం కోసం రామ్ కొత్త స్టైల్‌లోకి మారిపోయారు.

చెప్పాల్సిన కథ అనిపించింది


కార్తికేయ

కార్తికేయ కథానాయకుడిగా అర్జున్ జంధ్యాల దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. అనిల్ కడియాల, తిరుమల్‌రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. గురువారం నుంచి ఒంగోలులో రెగ్యులర్ చిత్రీకరణ మొదలైంది. కార్తికేయ మాట్లాడుతూ "విజయవంతమైన 'ఆర్ ఎక్స్ 100' తర్వాత చాలా కథలు విన్నాను. అర్జున్ చెప్పిన ఈ కథ చాలా బాగా నచ్చింది. ఇది కచ్చితంగా చెప్పాల్సిన కథ అనిపించింద"న్నారు. దర్శకుడు మాట్లాడుతూ "బోయపాటి శ్రీను దగ్గర దర్శకత్వ శాఖలో పనిచేశా. నేను చెప్పిన కథని నమ్మి ఈ సినిమా చేయడానికి ముందుకొచ్చారు కార్తికేయ. కథానుగుణంగానే ఒంగోలులో చిత్రీకరణ మొదలుపెట్టాం" అన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ "టెలివిజన్ రంగంలో కొనసాగుతున్న మేము ఈ చిత్రంతో సినిమా రంగంలోకి అడుగు పెడుతున్నందుకు ఆనందంగా ఉంది. ఫిబ్రవరి 8 వరకు ఒంగోలు పరిసరాల్లో తొలి షెడ్యూల్ చిత్రీకరణ జరుపుతాం. రెండు పాటలతో పాటు కొన్ని కీలక సన్నివేశాల్ని తెరకెక్కించడం పూర్తవుతుంది. త్వరలోనే సినిమా పేరును ప్రకటిస్తామ"న్నారు. ఈ చిత్రానికి సంగీతం: చైతన్యభరద్వాజ్, ఛాయాగ్రహణం: రామ్, కళ: జి.ఎమ్.శేఖర్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: శివ మల్లాల.

ఈనాడు

వసుంధర

కరీంనగర్ శుక్రవారం జనవరి 18, 2019

ఫ్యాషన్ ఫ్యాషన్

అందంగా... హుందాగా... ఆధునికంగా... ఇలా మగువల మనసు దోచే కొత్త వస్త్రశ్రేణి అందుబాటులోకి వచ్చింది. స్కాండినేవియన్ ప్రింట్ల నమూనాతో... వసంత రుతువులోని అందాల్లా ఆవిష్కరించిన రంగురంగుల టాప్‌లు, కుర్తీలే అవి. చూసేయండి మరి!

టిప్‌టాప్‌గా...!





పసుపు రంగు మిడ్‌లెంగ్త్ టాప్‌పై పూలప్రింట్లతోపాటు బెల్ చేతులు. ఇది ఏ వయసు మహిళలకైనా చక్కగా నప్పుతుందనడంలో సందేహం లేదు.

ముదురు ఊదావర్ణంలో చిన్న చిన్న పూల ప్రింట్లు, కుందేళ్ల బొమ్మలతో ఉన్న ఈ టాప్‌ను రోజువారీ వేసుకోవచ్చు. దీనికి జతగా లెగ్గింగ్, జీన్స్ అదిరిపోతుంది.

నగలు, దుస్తులు: KALANJALI
www.kalanjali.com
www.facebook.com/kalanjaliworld

ఈ దుస్తులు అన్నీ కళాంజలి షోరూంలలో లభిస్తాయి



ఫ్యాన్సీ టాప్... దానిపై కుందేళ్ల ప్రింట్లు, చేతులకు అదనంగా స్లీవ్ కఫ్స్... టాప్ అందాన్ని మరింత పెంచాయి. కాలేజీ అమ్మాయిలకు చక్కటి ఎంపిక కదూ!



చిన్న చిన్న ప్రింట్లతో ఆకట్టుకునేలా రూపొందించిన ఈ కుర్తా సొగసు వర్ణించతరమా!

పనీర్ శాండ్‌విచ్

అమ్మచేత కమ్మగా



కావల్సినవి: బ్రెడ్‌స్లైసులు - ఆరు నుంచి ఎనిమిది, నూనె - రెండు చెంచాలు, జీలకర్ర - చెంచా, ఉల్లిపాయ, టొమాటో, క్యాప్సికం - ఒకటి చొప్పున (సన్నగా తరగాలి), అల్లం తరుగు - ముప్పావు చెంచా, పసుపు- చిటికెడు, ఉప్పు -తగినంత, కారం - చెంచా, గరంమసాలా - అరచెంచా, పనీర్ ముద్ద - అరకప్పు, నిమ్మరసం - అరచెంచా, కొత్తిమీర - కట్ట.

తయారీ: పొయ్యిమీద బాణలి పెట్టి నూనె వేయాలి. అది వేడయ్యాక జీలకర్ర వేయించాలి. అందులోనే ఉల్లిపాయ, క్యాప్సికం ముక్కలు, అల్లం తరుగు వేయాలి. అవి వేగాక టొమాటో ముద్ద వేయాలి. రెండు మూడు నిమిషాలయ్యాక తగినంత ఉప్పు, కారం, గరంమసాలా, పసుపు, పనీర్ ముద్ద వేసి వేయించాలి. కాసేపటికి పనీర్ వేగుతుంది. అప్పుడు నిమ్మరసం, కొత్తిమీర తరుగు వేసి దింపేయాలి. ఒక బ్రెడ్‌స్లైసుపై ఈ మిశ్రమాన్ని పరిచి, మరో స్లైసును దానిపై ఉంచాలి. ఇలా మిగతావీ చేసుకుని గ్రిల్‌లేదా పెనంపై కాల్చుకుంటే చాలు.

సరిహద్దు గీసేయండి!


యువతకి స్నేహితులే ప్రపంచం. సామాజిక మాధ్యమాలే తోడు. అవేం తప్పు కాదు కానీ... వాటికీ ఓ సరిహద్దు ఉండాలిగా!

- స్నేహితుల మాటలు, వాళ్లతో ఆటలు... అన్నీ సరదాగానే అనిపిస్తాయి. కానీ వాటిల్లో పడి రోజువారీ జీవితాన్ని, లక్ష్యాల్ని నిర్లక్ష్యం చేసినప్పుడే సమస్య. అందుకే మీ స్నేహితులతో గడిపే సమయాన్ని ముందే నిర్దేశించుకోండి. ఫోను మాట్లాడాలన్నా కూడా పరిధిలోనే ఉండాలి.
- ఎదిగే వయసులో స్నేహితుల తోడు అవసరమే! కానీ ప్రతిదీ వారితో పంచుకుని, వాళ్లు చెప్పినట్లే చేయడం సబబు కాదు కదా.. దానివల్ల మీకంటూ ఓ వ్యక్తిత్వం ఏర్పడదు. ఇతరుల మీద ఆధారపడినవారవుతారు. అందుకే అవసరం అనుకున్నప్పుడే వారి సాయం తీసుకోండి.
- అంతర్జాలం, సామాజిక మాధ్యమాల పాత్ర టీనేజీలో కీలకమే. వీటిని అతిగా వాడటం వల్ల మీలో ఆత్మవిశ్వాసం లోపించవచ్చు. అదే ప్రపంచం కావచ్చు. అందుకే రోజులో ఎంతసేపు వాటిని వాడాలనేదీ మీకు మీరే నియమం పెట్టుకోవాలి.

బంగారం వెండి

17న ముగింపు-క్రితం

తమిళనాడు (రూ. లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	3,111	3,102
వెండి (గ్రా)	42.90	42.90



	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం		విశాఖపట్నం	
బంగారం(24క్యా)	33,600	33,500	32,550	32,500	32,850	32,750	33,520	33,470	33,410	32,980
ఆర్నమెంట్	31,260	31,260	30,250	30,200	30,390	30,280	31,110	31,020	31,080	30,680
వెండి(కిలో)	40,500	40,550	40,200	40,200	40,500	40,300	40,500	40,600	41,000	40,500

నజరానా

పూలు ఎక్కువసేపు తాజాగా ఉండాలంటే... న్యూస్‌పేపర్‌ని కాస్త తడిపి అందులో వాటిని ఉంచి చూడండి.

వసుంధర,
ఈనాడు ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలిం సిటీ, అనాజ్‌పూర్,
హయత్‌నగర్ మండలం,
రంగారెడ్డి జిల్లా - 501 512
vasundhara@eenadu.net



సమస్యలే సేవ వైపు నడిపించాయి

ఓ వైపు కూతురికి వైకల్యం... మరోవైపు కుటుంబ సమస్యలు... ఈ పరిస్థితుల్లో ఏ స్త్రీ అయినా సరే మానసికంగా కుంగిపోతుంది. కానీ ఆమె మాత్రం సమస్యల నుంచి బయటపడేందుకు సేవ దిశగా అడుగులు వేసింది. కూతురి జీవితాన్ని దిద్దుకుంది. మరికొంతమందికి ఆసరాగా నిలిచింది. ఆమే లక్కోజు సుజాత.

‘మాది పశ్చిమ గోదావరి జిల్లాలోని ఏలూరు. ప్రస్తుతం వీరంపాలెంలో ఉంటున్నాం. మాకు ముగ్గురు పిల్లలు. మొదట పాప. ఆరోగ్యంగానే పుట్టింది కానీ ఏడాదిలోపే పోలియో వచ్చింది. అది తెలిసి ఎంత ఏడ్చానో. పాప పెరిగేకొద్దీ సమస్యలూ పెరిగాయి. చుట్టుపక్కలవాళ్లు తనని చూసి అవమానించేవారు. రకరకాల మాటలు అనేవారు. ఓ వైపు తనతో నేను కష్టపడుతోంటే మరో వైపు ‘పెద్దయ్యాక ఏం చేయగలదు. కాబట్టి కష్టపడటం కన్నా వేళకు ఇంత అన్నం పెట్టండి చాలు...’ అని అన్నవారూ ఉన్నారు. దానికితోడు కుటుంబ సమస్యలు. ఆ మాటలు, సమస్యలు భరించలేకపోయేదాన్ని. కానీ అక్కడే ఆగిపోకూడదనుకున్నా. ఎన్ని కష్టాలు పడైనా సరే మా అమ్మాయిని బాగా చదివించాలనుకున్నా. కేవలం మా అమ్మాయి మాత్రమే కాదు... నా బిడ్డల్లాంటివారికి, వాళ్ల తల్లిదండ్రులకు నా వంతుగా ఏదైనా సాయం చేయాలనీ అప్పుడే అనిపించింది. అలా స్వామి వివేకానంద వికలాంగుల సేవా సంస్థను ప్రారంభించా. దాదాపు ముప్ఫైమంది కలిసి ఓ ట్రస్టులా ఏర్పడ్డాం. ఇందులో అన్నివయసులవాళ్లూ ఉన్నారు. అయితే అంతా దివ్యాంగులే. చిన్నవాళ్లయితే మా అమ్మాయితోపాటు చదువుకునేలా ప్రోత్సహించేదాన్ని. కాస్త పెద్దవాళ్లయితే అందుబాటులో ఉండే సదుపాయాల గురించి వివరించి, వాటిని ఎలా పొందాలనేది చెప్పేదాన్ని. ఉచిత బస్, ట్రైన్ పాస్‌లు, ఉపకార వేతనాలు... ఇలా అన్నీ అందేలా చూసేవాళ్లం. వీరిలో కొంతమందికి చికిత్సలు అవసరం అయితే... పెద్ద తిరుపతికి తీసుకెళ్లి బర్డ్ ఆసుపత్రిలో చికిత్స చేయించేదాన్ని. అక్కడ అన్నీ ఉచితమే అయినా... వాళ్లు కోలుకునేవరకూ వెంట ఉండేదాన్ని. అప్పట్లో ‘అక్షర దీక్ష’ అనే కార్యక్రమం ఉండేది. అందులో భాగంగా ఊళ్లలో ఉండే నిరక్షరాస్య మహిళలు, వృద్ధులకు చదువు చెప్పేవాళ్లం. ఖాళీగా ఉన్న మహిళలకు కుట్టు, ఎంబ్రాయిడరీలో శిక్షణ ఇచ్చి నాలుగు డబ్బులు సంపాదించుకునేలా ప్రోత్సహించాం. ప్రస్తుతం మా అమ్మాయి ఎంఏ, బీఈడీ చేసి ప్రభుత్వ టీచరుగా స్థిరపడింది. తనతో పెరిగిన మిగతావాళ్లు కూడా ఉన్నతంగా చదువుకుని, ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. ఆ తరువాత...

చదువు దిశగా..

ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నా వంతుగా సాయం చేయాలనే ప్రయత్నంలో ఉన్నా. మా చుట్టుపక్కల ఐదు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచిత కంటి, పంటి పరీక్షలు చేయిస్తున్నాం. మాకు దగ్గర్లోని లయన్స్ క్లబ్ వైద్యుల సహకారంతో ఈ ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. అలాగే ఒకటి నుంచి పదో తరగతి చదివే పిల్లలకు ఉచితంగా పుస్తకాలు అందిస్తాం. ఇలా ఎనిమిదేళ్లుగా ప్రతి ఏడాది పదిహేనువందలమందికి పైగా పిల్లలు చదువుకునేలా చూస్తున్నాం. మా పెద్దమ్మాయితో పని చేసే ఇతర ఉపాధ్యాయులు కూడా ఇప్పుడు సాయం చేసేందుకు ముందుకొస్తున్నారు. అయితే మా పనులేవీ అనుకున్నంత సులువుగా జరగలేదు. చాలామంది నుంచి విమర్శలు ఎదురయ్యేవి. ఓ వైపు ఇంటిపనులు చేస్తూనే, మరో అమ్మాయి, అబ్బాయి ఆలనాపాలనా గమనించుకుంటూనే ఈ పనులన్నీ చేసేదాన్ని. ఒకవిధంగా నా సమస్యల్ని మర్చిపోవడానికే సేవా మార్గాన్ని ఎంచుకున్నా. మా రెండో అమ్మాయి ఎమ్మెస్సీ బయోటెక్ చేసింది. అబ్బాయిది డిగ్రీ అయ్యింది. ఈ పనులన్నీ చేయడానికి ఎక్కువభాగం నేను వేసుకుంటా. ఇప్పుడు పిల్లలు సాయం చేస్తున్నారు. కొంత దాతల నుంచి సేకరిస్తున్నా. ఈ మధ్యే నేపాల్ ప్రభుత్వం నా సేవల్ని గుర్తించి ఇండోనేపాల్ అంతర్జాతీయ పురస్కారం అందించింది. అలాంటి గుర్తింపులకన్నా వీలైనంతమంది పిల్లలకు సాయం చేసినప్పుడే ఎక్కువగా ఆనందిస్తా.



పెదాల చికిత్స వికటించిందా?

నా పెదాలు లావుగా.. అందంగా కనిపించేలా ఈ మధ్య చికిత్స చేయించుకున్నా. ఆ తరువాత నా పెదాలకు ఇన్‌ఫెక్షన్‌లా వచ్చింది. కారం, చల్లని పదార్థాలు తినలేకపోతున్నా. పైగా పగిలి రక్తం కారుతోంది. రెండు నెలలు అయినా తగ్గట్లేదు. ఎందుకిలా అయ్యింది. చికిత్స వల్లా... లేక జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లా...! పరిష్కారం ఏంటి?

- ఓ సోదరి

ఈ మధ్య ఇలాంటి చికిత్సలు సెలబ్రిటీలే కాదు... అందరూ తీసుకుంటున్నారు. దీనివల్ల ఎలాంటి ఇబ్బందులూ ఉండవు. ఈ చికిత్సతో పెదాలు పొడిబారే సమస్య తగ్గుతుంది. పెదాలు అందంగా, మృదువుగా, సున్నితంగా మారతాయి. అయితే మీరు నిపుణుల వద్ద చికిత్స తీసుకోకపోవడం లేదంటే... ఆ సమయంలో సరైన జాగ్రత్తలు పాటించకపోవడం వల్ల ఇలాంటి ఇబ్బందులు ఎదురై ఉండొచ్చు. మీరు తరచూ పెదాలకు మాయిశ్చరైజర్, లిప్‌బామ్‌తో మర్దన చేస్తుండాలి. వైద్యుల సలహాతో టాపికల్ స్టెరాయిడ్ క్రీము రాసుకోవాలి. దీనివల్ల సమస్య చాలా త్వరగా అదుపులోకి వస్తుంది. ఆ తరువాత స్టెరాయిడ్ క్రీమ్ ఆపేసి మాయిశ్చరైజర్, లిప్‌బామ్ రాసుకుంటూ ఉండాలి. ఎప్పుడైనా సరే ఇలాంటి చికిత్సలు చేయించుకునే ముందు అవగాహన చాలా అవసరం.

సన్నగా ఉన్న పెదాలను అందంగా కాస్త మందంగా తయారు చేయడానికి లిప్ ఫిల్లర్స్ వాడతారు. అంటే పెదాల్లోకి హైల్లనాయిక్ యాసిడ్‌ని ఇంజెక్షన్ రూపంలో పంపడం వల్ల పెద్దగా అవుతాయి. అయితే చాలామందికి పెదాల్లో నింపే ఉత్పత్తులు ఏంటో తెలియదు. కనీసం అవగాహన కోసం కూడా తెలుసుకునే ప్రయత్నం చేయరు. నాణ్యమైనవి వాడకపోతే ఆ ప్రాంతంలో ఇన్‌ఫెక్షన్‌లా వచ్చి వాచిపోయి కందినట్టు అవుతుంది. అనుభవంలేనివారు అతిగా ఫిల్లర్స్ నింపేస్తే పెదాల లోపలివైపు ఉండే తడిప్రాంతం (మ్యూకోసా) బయటకు వస్తుంది. దాంతో ఆ చర్మానికి బాగా గాలి తగిలి పొడిబారుతుంది. కొన్నిసార్లు మంటగానూ అనిపించొచ్చు. చర్మం పెచ్చుల్లా ఊడిపోతుంది. అందుకే మాయిశ్చరైజర్, పెట్రోలియం జెల్లీ వంటివి రాయాలి. లేదంటే ఇరిటేషన్ ఎక్కువై ఇబ్బందిగా అనిపిస్తుంది.

- ఈ చికిత్స హెర్పిస్ అనే వైరల్ ఇన్‌ఫెక్షన్ ఉన్నవాళ్లకి చేయకూడదు. కొన్నిసార్లు లోపల ఉన్న ఫిల్లర్ బయటకు వచ్చే ప్రమాదముంటుంది. దానివల్ల కూడా ఇన్‌ఫెక్షన్ రావచ్చు. అలానే లోపల ఇతర ప్రాంతాల్లోకి కూడా వ్యాపిస్తుంది. కొన్నిసార్లు ఈ సమస్య మరీ లోతుగా ఫిల్లర్లను నింపినా రావచ్చు.



డియర్ వసుంధర
డా॥ శైలజ సూరపనేని
కాస్మెటిక్ స్కిన్‌కేర్ ఫిజీషియన్

- నిపుణులైన వైద్యుల వద్ద ఈ చికిత్స చేయించుకుంటే వాళ్లు ముందు మీ చర్మ తీరును అధ్యయనం చేస్తారు. చర్మం ఎంత మందంగా ఉంది... ఏ మేరకు ఫిల్లర్ నింపొచ్చు అనే అవగాహనతో చేస్తారు.
- తక్కువ ధరలో, నాణ్యత లేని వాటికీ, ఎఫ్‌డీఏ(ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్) ఆమోదం లేని వాటికి దూరంగా ఉండాలి. వాటివల్ల హైపర్ సెన్సిటివ్ రియాక్షన్ వచ్చి.. పెదాల చర్మం రంగు మారొచ్చు, వాచిపోవచ్చు.
- రక్తం పల్చబడే మందులు, యాస్ప్రిన్లు వేసుకునే వాళ్లు గనుక చికిత్స తీసుకోవాలంటే పదిహేనురోజులు ముందు వాటిని వాడటం ఆపేయాలి.
- ఈ ఫిల్లర్లను ఎప్పుడైనా ఒకేసారి కాకుండా నిదానంగా రెండుమూడు విడతల్లో నింపాల్సి ఉంటుంది. ఎందుకంటే ఒకేసారి నింపేస్తే ఆకృతి మరీ వికృతంగా మారొచ్చు. అందుకే ఎప్పుడైనా వీటిని కొద్దికొద్దిగా ఎక్కువ సార్లు ఇవ్వాలి. ఒకేసారి అతిగా నింపితే తగ్గించుకోవడానికి చాలా కష్టపడాల్సి వస్తుంది.
- పెదాల్లోకి కొలాజెన్ ఫిల్ చేసేవాళ్లు... రక్తనాళాలను చూసుకుని నింపాలి. లేదంటే ఇన్‌ఫెక్షన్ల ప్రమాదం ఉంటుంది. చికిత్స అయిన ఐదు నిమిషాల తరువాత ఐసుప్యాకుతో మర్దన చేసుకోవాలి.
- కొన్నిసార్లు చికిత్స అయ్యాక పెదాలపై బొబ్బల్లా వస్తాయి. వాచినట్టు అవుతుంది. అలా ఇన్‌ఫెక్షన్ వచ్చినట్టు అనిపిస్తే నలభై ఎనిమిది గంటల్లోనే వైద్యుల్ని సంప్రదించాలి. యాంటీబయోటిక్స్ ఇస్తారు. మీరు మరోసారి వైద్యుల్ని సంప్రదిస్తే... సమస్యను బట్టి చికిత్స సూచిస్తారు.

- మీ సందేహాలను, సమస్యల్ని vasubeauty@eenadu.net కు పంపించగలరు.

ఈనాడు కరీంనగర్ శుక్రవారం జనవరి 18, 2019

శృంగార నగరి.. గజ్జె కడుతోంది



అదరహో.. ఖజురహో

ఏమనాలో తెలియక మౌనం వహిస్తే అంగీకారం.. అదే మౌనం వారం వారం పాటిస్తే వ్రతం.. నెలల కొద్దీ దాన్నే ఆశ్రయిస్తే యోగం.. కానీ, ఆ మౌనమే శతాబ్దాలుగా తిష్ఠవేస్తే.. వీటన్నిటినీ మించిన అద్భుతం!! అవును ఖజురహో అలాంటి అద్భుతమే. ఏ కదలిక లేకుండా మౌనముద్రలో ఉన్న శిల్పాలు మస్తిష్కాన్ని తొలుస్తాయి.. మనసును కదిలిస్తాయి. మనిషిని ఉద్రేకపరుస్తాయి. ఆ మౌనం జీవన పాఠాలు చెబుతుంది. సృష్టి రహస్యాన్ని బోధిస్తుంది. అందుకే ఈ పర్యాటక కేంద్రం ప్రేమికులకు నందనవనం.. కొత్తజంటలకు బృందావనం.. ఇప్పుడు కళాప్రియులకు పలుకుతోంది ఆహ్వానం.. ఫిబ్రవరి 20 నుంచి 26 వరకు ఖజురహోలో అంతర్జాతీయ నృత్యోత్సవం జరగనుంది. ఈ సందర్భంగా అపురూప శిల్పనగరి స్వరూపం చూసేద్దాం..

ఖజూర్ (ఖర్జూరం) వేలడంతే ఉంటుంది.. మెలికలు తిరిగిన రేఖలతో విచిత్రంగా తోస్తుంది. ఆ పండు పేరిట వెలిసిన ఖజురహో కూడా అంతే.. మధ్యప్రదేశ్‌లో ఓ మోస్తరు పట్టణం మాత్రమే..! కానీ లోనికి వెళ్లే కొద్దీ బయటకు రానివ్వకుండా చేస్తుంది. అక్కడి ఆలయాలపై నిలిచిన ఇసుకరాతి శిల్పాలు బంగారు వర్ణంలో మెరిసిపోతూ ఉత్సుకత రేకెత్తిస్తాయి. క్రీస్తుశకం 950-1050 మధ్య చందేలా రాజుల హయాంలో రూపుదిద్దుకున్న ఈ ఆలయాలు భక్తికి, అనురక్తికి సరికొత్త అర్థం చెబుతాయి.

అంతులేని సంపద

10-11 శతాబ్దాల కాలంలో చందేలా రాజులు ఖజురహో రాజధానిగా మధ్యభారతాన్ని పరిపాలించారు. ఆ సమయంలోనే ఈ ఆలయాలన్నీ వెలిశాయి. కనీవినీ ఎరుగని శిల్పకళను సంతరించుకున్నాయి. కానీ, ఆ రాజులు పోయాక.. ఏ రాజులూ ఇక్కడి సౌందర్యాన్ని గుర్తించలేదు. దీంతో వందల ఏళ్లు ఇక్కడి ఆలయాలు, శిల్పాలు ఏ ఆదరణకూ నోచుకోలేదు. బ్రిటిష్ హయాంలో మళ్లీ ఖజురహో గొప్పదనం బయటి ప్రపంచానికి తెలిసింది. ఒకప్పుడు 80 ఆలయాలతో అలరారిన చందేలా రాజధానిలో కాలపరీక్షను తట్టుకొని నిలబడ్డవి 22 ఆలయాలే! ఆ కొన్నే.. ఎన్నో వింతలకు కొలువయ్యాయి. అంతులేని కళకు నెలవయ్యాయి. ప్రతి ప్రతిమా ఆనాటి శిల్పకారుల కల్పనాశక్తికి సాక్షిగా నిలుస్తుంది. అది హిందూ ఆలయమైనా.. జైన మందిరమైనా.. చిన్నదైనా, పెద్దదైనా.. ఏ నిర్మాణమైనా దేనికదే అద్భుతం. అందుకే ఈ ఆలయ సమూహాన్ని యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించింది. ఆలయాలను, శిల్పాలను చూసేందుకు దేశవిదేశాల నుంచి పర్యాటకులు వస్తారు. ఇసుక రాళ్లలో మూర్తీభవించిన శిల్పాలను చూసి మైమరచిపోతారు. దేవుళ్లు, అప్సరసలు, యుద్ధవీరులు, సంప్రదాయాలు ఇలా ఎన్నో విశేషాలు ఒకెత్తు.. కామశాస్త్రాన్ని కళాత్మకంగా వర్ణించే శిల్పాలు మరోఎత్తు!




ప్రతి ఆలయమూ ప్రత్యేకమే

ఖజురహోలో ఉన్న ఆలయాలను తూర్పు, పశ్చిమ, దక్షిణ విభాగాలుగా విభజించారు. వీటిలో మతంగేశ్వర ఆలయం అతి ప్రాచీనమైనదిగా చెబుతారు. శిల్పకళ తక్కువగా ఉంటుంది. దీనికి సమీపంలోని లక్ష్మణ మందిరం ప్రత్యేకమైనది. ఖజురహో సౌందర్యమంతా ఈ ఆలయ గోపురాలు, స్తంభాల్లోనే ప్రతిష్ఠితమై ఉంది. మహావిష్ణువు కొలువు దీరిన ఆలయంలో ఉన్న వందలాది శిల్పాలు వేలాది భావాలను స్ఫురింపజేస్తాయి. వరాహ మందిరం మరో అద్భుతం. భారీ వరాహమూర్తి విగ్రహం ఒక అద్భుతం అనుకుంటే.. విగ్రహంపై 674 దేవతా మూర్తులు చెక్కడం మరో విశేషం. కందారియా మహాదేవ ఆలయం శిల్పకళలో లక్ష్మణ ఆలయానికి పోటీగా కనిపిస్తుంది. ఈ గుడిలో 646 విగ్రహాలు కొలువుదీరాయి. జగదంబ, విశ్వనాథ, సూర్య మందిరాలు యాత్రికులను కళ్లు తిప్పుకోనీయకుండా కట్టడి చేస్తాయి.

కదిలే శిల్పాలు..

ఖజురహోకు ఏడాదంతా పర్యాటకులు వస్తుంటారు. ఈ చారిత్రక నగరి హనీమూన్ డెస్టినేషన్‌గా కూడా ప్రసిద్ధి చెందింది. ప్రేమికుల చిరునామాగా కూడా నిలిచింది. ఏటా ఫిబ్రవరి వచ్చిందంటే ఈ మహత్తర పర్యాటక కేంద్రం మహోన్నత సాంస్కృతిక కార్యక్రమానికి వేదికవుతుంది. ఖజురహో నృత్యోత్సవంగా అంతర్జాతీయ ఖ్యాతి గడించిన వేడుకలో లబ్ధప్రతిష్ఠులైన కళాకారులు పాలుపంచుకుంటారు. సంప్రదాయ నృత్య రీతులను 'కదిలే శిల్పాలా!' అన్నట్టుగా ఆవిష్కరిస్తారు. భరతనాట్యం, కూచిపూడి, కథక్, ఒడిస్సీ, కథాకళి ఇలా భారతీయ లాస్యాలన్నీ ఒక్కచోట చేరి మలిసంజెకు మంగళహారతులు పడతాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 20 నుంచి 26 వరకు ఖజురహో నృత్యోత్సవ్ జరగనుంది. ఈ ఘనమైన వేడుకను కళ్లారా వీక్షించాలన్నా, మనసారా ఆస్వాదించాలన్నా.. అదరహో ఖజురహో అనాల్సిందే!!

చుట్టూ మరెన్నో




ఖజురహో ఆలయాలు చూసిన తర్వాత.. మరే సౌందర్యమూ కంటికి ఆనదు. కానీ, అంతకాకున్నా ఎంతోకొంత అలరించే పర్యాటక కేంద్రాలు ఇక్కడికి సమీపంలో కొన్నున్నాయి. పెన్నా నేషనల్ పార్క్ (32 కి.మీ), శివసాగర్ సరస్సు, రాణె జలపాతం, పాండవ జలపాతాలు, అజయ్‌గఢ్ కోట (80 కి.మీ), కలింజర్ కోట (25 కి.మీ) ఇలా ఎన్నో ఆకర్షణలు ఖజురహో పర్యటనను పరిపూర్ణం చేస్తాయి.

అమ్మ చుట్టూ 64 మందిరాలు

దుర్గాదేవిని చతుఃషష్టి (64) ఉపచారాలతో పూజిస్తారు. దీనికి ప్రతీకగా చౌంసట్ (64) ఆలయం కనిపిస్తుంది. అమ్మవారికి ఉపచారాలు చేయడానికి గానూ.. దేవీ ఆలయం చుట్టూ 64 మంది యోగినులకు నిర్మించిన మందిరాలివి.

అమితాబ్ వ్యాఖ్యానం

ప్రతి రోజూ సాయంత్రం ఆలయాల ప్రాంగణంలో లైట్స్ అండ్ సౌండ్ షో నిర్వహిస్తారు. ఖజురహో గొప్పదనాన్ని తెలియజేస్తూ సాగే వ్యాఖ్యానానికి బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్ గాత్రదానం చేశారు.



చేరుకునేదిలా

ఖజురహో ఝాన్సీ నుంచి 175కి.మీ. దూరంలో ఉంది. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం నుంచి ఝాన్సీకి రైళ్లు ఉన్నాయి. అక్కడి నుంచి రైలు, రోడ్డు మార్గంలో ఖజురహో చేరుకోవచ్చు.

ప్యాకేజీతో ఈజీగా

ఖజురహో నృత్యోత్సవం సందర్భంగా మధ్యప్రదేశ్ పర్యాటక శాఖ ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించింది. ఖజురహో విహారంతో పాటు నృత్యోత్సవానికి హాజరవ్వొచ్చు. తిరుగు ప్రయాణంలో చారిత్రక నగరం ఓర్చా పర్యటన కూడా ఉంటుంది. హైదరాబాద్ నుంచి మొదలయ్యే ప్యాకేజీ ఝాన్సీ వరకు రైలులో ఉంటుంది. అక్కడి నుంచి ఏసీ కారులో సాగుతుంది. బస, భోజనం ప్యాకేజీలో భాగంగా లభిస్తాయి.

ప్యాకేజీ ధర: రూ.9,700 ఒక్కొక్కరికి (కనీసం నలుగురు ప్రయాణికులు)

మరిన్ని వివరాలకు 98660 69000 నంబర్‌ను సంప్రదించండి.

బీమా ఉంటేనే పచ్చజెండా!

సాహసయాత్రకు చిరునామా లేహ్. మంచుకురిసే వేళ వచ్చిందంటే ట్రెక్కింగ్ ప్రియులకు పండగే. హిమగిరుల్లోని ప్రమాదకర నెలవుల్లో సాహస విన్యాసాలకు సిద్ధమైపోతుంటారు. లేహ్ సమీపంలోని జంస్కార్ నదిపై కూడా ఇష్టంగా ట్రెక్కింగ్ చేస్తుంటారు. నదిపై ట్రెక్కింగ్ ఏమిటి? అంటారా. జనవరి, ఫిబ్రవరి నెలల్లో జంస్కార్ నదీ జలాల్లో సింహభాగం మంచులా మారిపోతాయి. ఆ మంచు పలకల మీదుగా సుమారు 100 కిలోమీటర్లు ట్రెక్కింగ్ చేస్తారు. ఏటా ఈ సాహసంలో పాలుపంచుకోవడానికి వందల సంఖ్యలో ఔత్సాహికులు లేహ్ చేరుకుంటారు. ఈసారి మాత్రం అలా లేహ్ చేరుకొని.. ఇలా ట్రెక్కింగ్ చేస్తానంటే కుదరదు అంటున్నారు అధికారులు. ఈ యాత్రలో ప్రమాదాలు పొంచి ఉండటం, అనారోగ్య సమస్యలు తలెత్తుండటంతో కొత్త నిబంధనలు తీసుకొచ్చారు. చాదర్ ట్రెక్కింగ్‌లో పాల్గొనాలంటే మూడు రోజుల పాటు లేహ్ పరిసరాల్లో బస చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత వైద్యపరీక్షలు చేయించుకొని, ఆరోగ్యబీమా తీసుకుంటే గానీ ట్రెక్కింగ్‌కు పచ్చజెండా ఊపరు. ఈ విధానం ఇటీవలే అమల్లోకి వచ్చింది.



రాయల రాజధానికి ప్రపంచఖ్యాతి

ఏటా సుమారు 40 లక్షల మంది పర్యాటకులు హంపీని సందర్శిస్తుంటారు.

అరుదైన ఆలయాలు.. అపురూప శిల్పాలతో.. ఆశ్చర్యపరిచే విజయనగర రాజధాని హంపి నగరికి ప్రపంచస్థాయి గుర్తింపు లభించింది. 2019లో ప్రపంచంలో తప్పనిసరిగా చూడాల్సిన 52 ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో హంపికి రెండోస్థానం దక్కింది. 'న్యూయార్క్ టైమ్స్' నిర్వహించిన సర్వేలో ఈ చారిత్రక నగరానికి పట్టం కట్టారు పర్యాటక ప్రియులు. ఈ జాబితాలో కరీబియన్ ద్వీపాలకు చెందిన ప్యూర్టోరికాకు మొదటి స్థానం దక్కింది. మరోవైపు ఏషియన్ ట్రావెల్ సంస్థ నిర్వహించిన 'టాప్ ఏషియన్ ట్రావెల్' సర్వేలోనూ హంపి ఐదోస్థానాన్ని సాధించడం విశేషం. కర్ణాటకలోని హంపీలో ప్రతీ కట్టడం రాయల వైభవాన్ని కళ్లకు కడుతుంది. అందుకే ఏటికేడు ఇక్కడికి వచ్చే పర్యాటకుల సంఖ్య పెరుగుతోంది. విదేశీ పర్యాటకులను ఆకర్షించడంలోనూ రాయల రాజధాని ముందంజలో ఉంది. పర్యాటక శాఖ అంచనాల ప్రకారం ఏటా సుమారు 40 లక్షల మంది హంపీని సందర్శిస్తుండటం విశేషం. 2018లో హంపిలోని ఏకశిల రథం బొమ్మను రూ.50 కరెన్సీపై ముద్రించడం విశేషం.

- వెంకటేశ్, హొసపేట్, కర్ణాటక



..ప్చ్ ఇదేం పారిస్!



'ఎవడో బ్రిడ్జి దాటితే బ్రహ్మాండంగా ఉంటుందన్నాడు.. నరికేయాలాణ్ని' మన్మథుడు సినిమాలో పారిస్ వచ్చిన హీరో అనే మాటలివి. తన బ్యాగు దొంగతనానికి గురవ్వడంతో ఆవేశంలో అని ఉండొచ్చు. ఏం పోగొట్టుకోకున్నా.. పారిస్ వెళ్లే పర్యాటకుల్లో కొందరు పెదవి విరుస్తారట. కిటకిటలాడే వీధులు, మురికిపట్టిన దారులు, భాష తెలియక తికమకపడటాలు వెరసి 'ప్చ్ ఇదేం పారిస్' అంటూ కొందరు అసంతృప్తిగా పర్యటన పూర్తి చేస్తుంటారట. అలాంటి వాళ్లు కొన్నాళ్ల పాటు తీవ్ర ఆవేదనకు గురవుతుంటారట కూడా. ఇదే 'పారిస్ సిండ్రోమ్'. 1986లో దీనిని గుర్తించారు. పారిస్ పర్యటించే జపనీయుల్లో ఈ వైఖరి ఎక్కువగా కనిపిస్తుందట

విహారంలో మేటీ జంట

వినూత్నం

కేరళలోని కొచ్చిలో శ్రీ బాలాజీ కాఫీ హౌస్. రోజూ తెరిచే ఉంటుంది. ఒక్కసారి మూతపడితే మళ్లీ ఎప్పుడో గానీ తెరుచుకోదు. తెరుచుకున్న తర్వాత కొట్టులోకి కొత్త ఫొటోలు వస్తాయి. రద్దీ పెరుగుతుంది. పిచ్చాపా'టీ' కబుర్లు పెరుగుతాయి. దుకాణం యజమాని విజయన్ ఏవో విశేషాలు చెబుతుంటే.. ఆయనగారి భార్య మోహన ముసిముసి నవ్వులు నవ్వుతుంది. ఇంతకీ ఇద్దరూ అన్నాళ్లూ ఎక్కడికి వెళ్తారనేగా.. యాత్రలకేగుతారు. ఏ వారణాసికో.. రామేశ్వరానికో కాదు.. ఏకంగా విదేశాలు తిరిగొస్తారు.



అలాగని వీళ్లు ధనవంతులు అనుకునేరు. అలాంటిదేం లేదు. టీ, కాఫీలు అమ్మగా వచ్చిన సొమ్ముతోనే విదేశీ విహారానికి వెళ్తున్నారు వాళ్లు. 45 ఏళ్ల వైవాహిక జీవితంలో ఏకంగా 23 దేశాలు చుట్టివచ్చారీ దంపతులు. సింగపూర్, స్విట్జర్లాండ్, అమెరికా దేశాలు తన మనసును దోచాయంటారు విజయన్. త్వరలోనే స్వీడన్, డెన్మార్క్, గ్రీన్‌ల్యాండ్, నార్వే దేశాల విహారానికి సన్నద్ధం అవుతున్నారు. కష్టపడి సంపాదించిన సొమ్ముతో పాటు బ్యాంకు రుణం తీసుకొని యాత్రలు కొనసాగిస్తున్నారు వీళ్లు. బ్యాంకు రుణం తీరిపోగానే మరో యాత్రకు ప్రణాళికలు సిద్ధం చేస్తుంటారు. కాఫీ హౌస్‌లో విదేశాల్లో వీరు దిగిన ఫొటోలు, విదేశీ కరెన్సీ, పర్యటన బిల్లులు దర్శనమిస్తాయి. పెళ్లయిన కొత్తలో దేశమంతా తిరిగిన ఈ జంట.. ఇప్పుడు ప్రపంచయాత్ర కొనసాగిస్తోంది. సోషల్ మీడియా పుణ్యమా అని ఈ దంపతుల గురించి లోకానికి తెలిసింది. వీరి జీవన ప్రయాణంపై 'ఇన్విసిబుల్ వింగ్స్' అని ఓ డాక్యుమెంటరీ కూడా రూపొందడం విశేషం.

అనుభవించ్ రాజా

లోకల్ టూర్



మన్యం అనగానే గుర్తొచ్చేది భారీ కొండలు, ఎత్తయిన చెట్లు, వాటి చుట్టూ దట్టంగా ఉన్న కాఫీ తోటలు. శీతకాలంలో మంచుబిందువులు ముద్దాడటంతో మన్యం సౌందర్యం రెట్టిస్తుంది. లంబసింగి చలి.. బొర్రా గుహల విచిత్రాలు.. అరకు అందాలు.. సందర్శకులను సాదరంగా ఆహ్వానిస్తుంటాయి. ఇంత దూరం వచ్చిన పర్యాటకులు ఇంకాస్త ముందుకు వెళ్తే ఒడిశా, ఆంధ్రప్రదేశ్ సంయుక్త నిర్వహణలోని మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రాన్ని సందర్శించవచ్చు. అక్కడికి సమీపంలోని డుడుమ జలపాతం జోరులో తడిసి ముద్దయిపోవచ్చు. ఆ ఆనందం నుంచి తేరుకోకముందే.. వించ్ ప్రయాణంతో సరికొత్త అనుభూతి పొందవచ్చు.

ఈ వించ్‌కు ఆరు దశాబ్దాల చరిత్ర ఉంది. 1948లో మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం నిర్మాణం మొదలైంది. సముద్రమట్టానికి 2750 అడుగుల ఎత్తులో వించ్ హౌస్‌ను ఏర్పాటు చేశారు. విద్యుత్ కేంద్రం నిర్మాణానికి అవసరమైన సామగ్రిని, యంత్రాలను తరలించేందుకు ఆ రోజుల్లోనే రూ.60 లక్షలు ఖర్చు చేసి దీనిని నిర్మించారు. 1955 ఆగస్టు 19న విద్యుత్‌ప్లాంట్‌ను అప్పటి రాష్ట్రపతి బాబూరాజేంద్రప్రసాద్ జాతికి అంకితమిచ్చారు. రెండుకొండల నడుమ లోయలో ఉండే జలవిద్యుత్ కేంద్రానికి వించ్ ద్వారా చేరుకోవచ్చు. లోయలోకి దిగేందుకు 18 నిమిషాలు పడుతుంది. పైకి రావడానికి 13 నిమిషాలు పడుతుంది. డుడుమ జలపాతం సందర్శనకు వచ్చే పర్యాటకులు సమీపంలోని వించ్‌హౌస్‌ను చూసేందుకు వస్తుంటారు. ప్రస్తుతం సిబ్బంది మాత్రమే వినియోగిస్తున్నారు. పర్యాటకులు ప్రయాణించాలంటే అధికారుల అనుమతి తీసుకోవాలి.

దేశంలో రెండే రెండు

మనదేశంలో రెండే చోట్ల వించ్‌వేలు ఉన్నాయి. మొదటిది మాచ్‌ఖండ్ దగ్గర ఉంటే.. రెండోది తమిళనాడులోని పళని సుబ్రహ్మణ్యస్వామి క్షేత్రంలో ఉంది. భారీ సామర్థ్యం ఉన్న మోటారు సాయంతో స్టీల్ రోప్ ద్వారా వించ్‌ని లోయలోకి దించడం, ఎక్కించడం చేస్తుంటారు. స్టీల్ రోప్‌ను ఐదేళ్లకోసారి మారుస్తుంటారు. డ్రైవర్ కంట్రోల్ రూం నుంచి వించ్‌ను నిర్వహిస్తుంటాడు. ట్రాలీగార్డు మలుపుల దగ్గర వించ్ పట్టాలు తప్పకుండా జాగ్రత్తలు తీసుకుంటాడు. రోప్‌వేలో వించ్ ఎక్కడుందో తెలుసుకునేలా జీపీఎస్ ఏర్పాటు చేయడం విశేషం. వించ్‌తో పాటు జీపీఎస్ సూచిక కదులుతూ ఉంటుంది. వించ్ ఎక్కడుందో సూచించే ముల్లు మలుపుల దగ్గరకి చేరుకోగానే కంట్రోల్‌రూమ్‌లోని డ్రైవర్ వేగాన్ని నియంత్రిస్తాడు.

- వైశ్యరాజు ఉదయ్‌కుమార్, ముంచంగిపుట్టు

ఆకాశవాణి చిన్నమ్మ ఇకలేరు



అనారోగ్యంతో మృతి

ఈనాడు, హైదరాబాద్: ఆకాశవాణిలో రోజూ ప్రసారమయ్యే పాడి, పంట కార్యక్రమంలో చిన్నమ్మగా ఆబాల గోపాలాన్నీ అలరించిన నిర్మలా వసంత్ (72) గొంతు మూగబోయింది. అనారోగ్యం కారణంగా ఆమె హైదరాబాద్‌లో కన్నుమూశారు. ఈ నెల 8న ఆకాశవాణి కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆమె ఉత్సాహంగా పాల్గొన్నారు. వ్యవసాయ కార్యక్రమం అయినా కాసింత వినోదం జోడించి అన్ని వర్గాల శ్రోతలను తన వైపునకు ఆకర్షించి ఆశ్చర్యపర్చారు. పల్లెటూరి అమాయక మహిళా రైతు మనసును ఒడిసిపట్టి రైతుల సందేహాలను తన గొంతులో వినిపిస్తూ.., పెద్దయ్య ద్వారా సమాధానాలు రాబడుతూ అందరినీ మెప్పించగలిగారు. నిర్మలా వసంత్ సేవలను గుర్తుచేసుకొని ఆకాశవాణి ప్రోగ్రాం స్టాఫ్ అసోసియేషన్ సిబ్బంది ఘనంగా నివాళులర్పించారు.

సీఐసీల నియామకంలో పారదర్శకతకు జోక్యం చేసుకోండి

రాష్ట్రపతికి మాజీ సీఐసీ మాడభూషి శ్రీధరాచార్యులు లేఖ

ఈనాడు, దిల్లీ: కేంద్ర సమాచార హక్కు కమిషనర్ల (సీఐసీ) నియామకంలో పారదర్శకతకు జోక్యం చేసుకోవాలంటూ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు మాజీ సీఐసీ మాడభూషి శ్రీధరాచార్యులు గురువారం లేఖ రాశారు. సమాచార కమిషనర్లుగా మాజీ అధికారులనే కాకుండా, చట్టంలో నిర్దేశించిన వివిధ వర్గాల వ్యక్తులను నియమించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. పారదర్శకత, సమాచార లభ్యతే ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తుందని గతంలో తమ ఉపన్యాసంలో పేర్కొన్నారనీ... అయితే ఇప్పుడు సమాచార లోపం ఎక్కువగా ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సహ కమిషనర్ల నియామకంపైనా ప్రజలకు సమాచారం ఉండడం లేదని ఆయన పేర్కొన్నారు. ప్రజాప్రయోజన వ్యాజ్యాలతో సుప్రీంకోర్టు కలుగజేసుకుంటే తప్ప... ప్రభుత్వం సీఐసీల నియామకం చేపట్టడం లేదని వివరించారు. "సీబీఐ సంచాలకుడు ఆలోక్ వర్మ తొలగింపుపై ఉన్నతస్థాయి కమిటీకి ఉన్న అధికారంపై ఎవరికీ సందేహం లేదు. కానీ, ఇందుకు సంబంధించిన నివేదికలు, సమాచారం ప్రజలకూ, కమిటీ సభ్యుడైన ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గేకు తెలియాల్సిన అవసరం లేదా! సమాచారం, పారదర్శకతతోనే ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య పరస్పర విశ్వాసం పెంపొందుతుంది" అని శ్రీధర్ తన లేఖలో పేర్కొన్నారు.

సీబీఐ నుంచి రాకేశ్ అస్థానాకు ఉద్వాసన

దిల్లీ: అంతర్గత విభేదాలతో రచ్చకెక్కిన సీబీఐ ప్రత్యేక సంచాలకుడు రాకేశ్ అస్థానాకు ప్రభుత్వం ఉద్వాసన పలికింది. ఆయనతో పాటు మరో ముగ్గురు సీనియర్ అధికారులనూ గురువారం ఉన్నఫళంగా బయటకు పంపింది. అస్థానాతో పాటు సంయుక్త సంచాలకుడు అరుణ్‌కుమార్ శర్మ, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ మనీష్‌కుమార్ సిన్హా, ఎస్పీ జయంత్ జె నాయక్‌నవరేల పదవీ కాలాన్ని ఇంతటితో ముగిస్తున్నట్లు సిబ్బంది శాఖ గురువారం ఆదేశాలు జారీ చేసింది. అస్థానాను పౌర విమానయాన భద్రతా సంస్థ 'బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ'కి బదిలీ చేస్తూ ఉత్తర్వులిచ్చింది. దేశవ్యాప్తంగా విమానాశ్రయాలు, విమానాల భద్రతను ఈ సంస్థ పర్యవేక్షిస్తుంది. అయితే, మిగతా ముగ్గురు అధికారులను ఎక్కడకు పంపుతారన్న వివరాలను వెల్లడించలేదు.

వివాదాల దుమారంతో...

అస్థానా, శర్మలు గుజరాత్ కేడర్ ఐపీఎస్ అధికారులు కాగా... సిన్హా ఆంధ్రప్రదేశ్ కేడర్ (2000 బ్యాచ్) నుంచి, జయంత్ మహారాష్ట్ర కేడర్ (2004 బ్యాచ్) నుంచి వచ్చారు. సీబీఐ డైరెక్టర్‌గా పని చేసిన ఆలోక్ వర్మ, రాకేశ్ అస్థానాలు పరస్పరం అవినీతి ఆరోపణలు చేసుకోవడంతో వారి మధ్య విభేదాలు ఒక్కసారిగా బహిర్గతమయ్యాయి. వర్మ సంచాలకుడిగా ఉన్న సమయంలో అస్థానాపై సీబీఐ అవినీతి కేసు నమోదు చేసింది. ఉన్నతాధికారుల మధ్య విభేదాలు తలనొప్పిగా మారడంతో ప్రభుత్వం కలుగజేసుకుంది. గత అక్టోబరులో వారిద్దర్నీ సెలవుపై పంపి, మధ్యే మార్గంగా ఎం.నాగేశ్వరరావును తాత్కాలిక సీబీఐ డైరెక్టరుగా నియమించింది. ఇటీవలే ప్రధాని మోదీ నేతృత్వంలోని ఉన్నతస్థాయి సంఘం ఆలోక్‌వర్మకు సీబీఐ నుంచి ఉద్వాసన పలికింది. ఆ వెంటనే అగ్నిమాపక, పౌర రక్షణ, హోంగార్డు సర్వీసులకు డైరెక్టర్ జనరల్‌గా ప్రభుత్వం నియమించింది. కానీ, ఇందుకు ఆయన అంగీకరించలేదు.

వర్మ, అస్థానాల మధ్య విభేదాల్లో భాగంగా సిన్హా పేరు పలుమార్లు తెరపైకి వచ్చింది. ఆయన తన బదిలీని వ్యతిరేకిస్తూ గతంలో సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఆలోక్‌వర్మకు సంయుక్త సంచాలకుడు అరుణ్‌కుమార్ శర్మ సన్నిహితంగా మెలిగేవారు.

మూత్రపిండాల సమస్యల్ని ప్రాథమిక దశలోనే గుర్తించే పరీక్ష

సిమ్లా: దెబ్బతిన్న మూత్రపిండాల్ని ప్రారంభ దశలోనే గుర్తించే సరికొత్త పరీక్షను హిమాచల్‌ప్రదేశ్ మండిలోని ఐఐటీ పరిశోధకులు రూపొందించారు. మూత్రం, రక్తం నమూనాల్లో ప్రొటీన్ మార్కర్లు తక్కువ స్థాయుల్లో ఉన్నా ఈ పరీక్ష ద్వారా గుర్తించే అవకాశం ఉంది. ఈ పరీక్ష మూత్రం, రక్తంలో ప్రొటీన్ ఆల్బుమిన్‌ను గుర్తించడం ద్వారా పని చేస్తుంది. మూత్రనాళ వ్యవస్థ పనిచేయక పోవడం, మధుమేహ సంబంధ వ్యాధుల్ని ప్రారంభ దశలోనే గుర్తించే సంకేతంగా పనిచేస్తుంది. తమ పరీక్ష పద్ధతి ద్వారా ఆల్బుమిన్ గాఢతను ప్రతి డెసీలీటర్‌కు 3.3 మైక్రోగ్రాముల తక్కువ స్థాయి వరకూ గుర్తించవచ్చని ఐఐటీ మండి పరిశోధకులు శుభజిత్‌రాయ్ చౌధురి తెలిపారు. 15 మంది రోగులపై నిర్వహించిన క్లినికల్ ట్రయల్స్ ఆశావహ ఫలితాలు ఇచ్చాయన్నారు.

షాలిమార్ ఎక్స్‌ప్రెస్‌లో సాంకేతిక లోపం

రెండు గంటల పాటు నిలిచిన రైలు

శివనగర్(వరంగల్), న్యూస్‌టుడే: కోల్‌కతా నుంచి వచ్చే షాలిమార్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు సాంకేతిక లోపం కారణంగా వరంగల్ రైల్వేస్టేషన్ పరిధిలోని నెక్కొండ, ఎల్గూరు స్టేషన్‌ల మధ్య సుమారు గంటన్నర పాటు నిలిచిపోయింది. అనంతరం రైలును వరంగల్ రైల్వేస్టేషన్‌లో నిలిపి మరో అరగంట పాటు మరమ్మతులు చేసి పంపించారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సికింద్రాబాద్ వెళ్లే ఈ రైలు గురువారం మధ్యాహ్నం 2.39 గంటలకు వరంగల్‌కు రావాల్సి ఉంది. మధ్యాహ్నం 2.48 గంటల సమయంలో ఎయిర్ వాక్యూమర్ పైప్‌దెబ్బతినడంతో రైలును నెక్కొండ-ఎల్గూర్ స్టేషన్ల మధ్య మధ్యాహ్నం 4.15గంటల వరకు నిలిపివేశారు. తాత్కాలిక మరమ్మతులు చేయడంతో వరంగల్‌కు 4.35 గంటలకు వచ్చింది. కాజీపేట నుంచి వచ్చిన సాంకేతిక నిపుణులు షాలిమార్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు మరమ్మతులు చేయడంతో సాయంత్రం 5.11 గంటలకు బయలుదేరి సికింద్రాబాద్ వెళ్లింది.

సాన పెడదాం.. సాధన చేయిద్దాం



- 'పది' విద్యార్థులకు పూర్తయిన పాఠ్య ప్రణాళిక
- ఇక వార్షిక పరీక్షలకు మిగిలింది రెండు నెలలే
- విద్యార్థులతో మరోసారి వల్లె వేయిస్తున్న టీచర్లు

విద్యార్థి జీవితంలో పాఠశాల విద్యలో అత్యంత కీలకమైనది పదో తరగతి. వార్షిక పరీక్షలకు మిగిలింది రెండు నెలలే. దీంతో ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పునశ్చరణపై దృష్టిపెట్టాయి. రెండు నెలల నుంచి ప్రత్యేక ప్రణాళికను అమలు చేస్తున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు డిసెంబరు నెలాఖరుతో పాఠ్య ప్రణాళికను పూర్తి చేయగా.. ప్రైవేటు పాఠశాలలు నవంబరు నాటికే సిలబస్‌ను పూర్తి చేసి మరోసారి చదివించడంపై దృష్టి సారించాయి. ఇప్పటివరకు ఒకెత్తు.. ఇక నుంచి మరో ఎత్తు అని పునశ్చరణ ప్రాధాన్యాన్ని విద్యార్థులకు వివరిస్తూ పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నాయి. సర్కారు బడుల్లోనూ పునశ్చరణ మొదలైంది. ఉత్తీర్ణత శాతం తగ్గితే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుండడంతో ప్రధానోపాధ్యాయులు దీనిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. కలెక్టర్లు సైతం తమ జిల్లా ఉత్తీర్ణతలో వెనకబడకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఫిబ్రవరి 16 నుంచి 28వ తేదీ వరకు ప్రీ ఫైనల్ పరీక్షలు జరగనున్నాయి. మార్చి 16 నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. సంక్రాంతి సెలవులను తీసేస్తే పరీక్షలకు మిగిలింది రెండు నెలలు మాత్రమే కావడంతో పునశ్చరణపై ఉపాధ్యాయులు దృష్టిపెట్టారు.

లోపాలు తెలిసేది ఇప్పుడే..

పునశ్చరణ సమయంలోనే విద్యార్థుల్లో అసలు లోపాలు బయటపడతాయని మల్కాజిగిరి ప్రధానోపాధ్యాయుడు మురళీకృష్ణ చెప్పారు. పునశ్చరణ జరిపి.. పాఠాలపై వారం వారం పరీక్షలు నిర్వహిస్తున్నామని ప్రధానోపాధ్యాయులు చెబుతున్నారు. వాటిని విశ్లేషించి విద్యార్థులు చేసిన తప్పులను తెలియజేసి సబ్జెక్టు వారికి మరింతగా అర్థమయ్యేలా చెబుతామని కరీంనగర్ జిల్లా గంగాధర్ మండలం ఒద్యారం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్‌రావు వివరించారు. విద్యార్థులను చదివిస్తూ.. సందేహాలను తీరుస్తూ స్లిప్ టెస్టులు పెడుతున్నామన్నారు. సాధారణ విద్యార్థులు ఉత్తీర్ణులు కావడానికి, మంచి గ్రేడ్ పాయింట్లు (గ్రేడ్ పాయింట్ యావరేజ్.. జీపీఏ) ఆశించే వారికి అవి పొందడానికి పునశ్చరణ తరగతులు ఉపయోగపడతాయని చెబుతున్నారు. 'డిసెంబరు వరకు అందరినీ కలిపి ఉంచుతాం. పునశ్చరణ సందర్భంగా సబ్జెక్టుల వారీగా విద్యార్థుల పరిస్థితిని గమనించి గ్రూపులుగా విభజిస్తాం.. దానివల్ల ఏ గ్రూపు విద్యార్థులకు ఎలా చెప్పాలో ఉపాధ్యాయులకు స్పష్టత ఉంటుంది' అని త్రివేణి పాఠశాలల గ్రూపు సంస్థల ఛైర్మన్ వీరేంద్ర పేర్కొన్నారు. రెండు నుంచి మూడుసార్లు రివిజన్ జరిగేలా తాము ప్రణాళిక రూపొందిస్తాయని తెలిపారు. తెలంగాణ గుర్తింపు పాఠశాలల యాజమాన్య సంఘం (ట్రస్మా) ప్రధాన కార్యదర్శి ఎస్ఎన్ రెడ్డి మాట్లాడుతూ పునశ్చరణలో ముఖ్యమైన పాఠాలు, ప్రశ్నలపై ఎక్కువ దృష్టి పెడుతున్నామన్నారు.

పదో తరగతి లెక్కలివి..

- పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు: సుమారు 5.30 లక్షలమంది
- మొత్తం పాఠశాలలు: 10,980
- అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల నుంచి హాజరయ్యే వారి సంఖ్య: సుమారు 2.70 లక్షలు
- ఏటా సగటు ఉత్తీర్ణత: 83-85 శాతం
- గత ఏడాది 100 శాతం ఉత్తీర్ణులైన పాఠశాలలు: 2,125
- గత ఏడాది ఒక్కరూ ఉత్తీర్ణులు కాని పాఠశాలలు: 21

పరీక్షలు ప్రారంభం మార్చి 16

- ఈనాడు, హైదరాబాద్

గాంధేయ మార్గంపై యువతకు మార్గనిర్దేశం

- తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో అంతర్జాతీయ యువ నాయకత్వ సదస్సు
- హైదరాబాద్‌లో 19, 20 తేదీల్లో నిర్వహణ
- జాగృతి అధ్యక్షురాలు, ఎంపీ కల్వకుంట్ల కవిత



ఈనాడు, హైదరాబాద్: బాపూ బోధనలు, కార్యాచరణ, 2030 వరకు భవిష్యత్ మానవాళి మనుగడకు ఐరాస నిర్దేశించిన 17 లక్ష్యాలపై యువతకు మార్గనిర్దేశం చేసేందుకు ఈనెల 19, 20 తేదీల్లో హైదరాబాద్‌లో అంతర్జాతీయ యువ నాయకత్వ సదస్సును నిర్వహిస్తున్నారు. ఈ మేరకు హెచ్ఐసీసీ నోవాటెల్ హోటల్‌లో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించనున్నట్లు జాగృతి అధ్యక్షురాలు, ఎంపీ కల్వకుంట్ల కవిత తెలిపారు. ఈ సదస్సుకు 135 దేశాల నుంచి 550 మంది ప్రతినిధులు, 40 మంది వివిధ రంగాల ప్రముఖులు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరవుతున్నారని చెప్పారు. గురువారం నోవాటెల్‌లో ఆమె సదస్సు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు.

"ఈ నెల 19న జరిగే సదస్సు ప్రారంభ సమావేశంలో ముఖ్యఅతిథిగా పద్మభూషణ్ అన్నాహజారే, ప్రత్యేక అతిథిగా సార్క్ మాజీ ప్రధాన కార్యదర్శి అర్జున్ బహదూర్ తాపా పాల్గొంటారు. 20న సాయంత్రం జరిగే ముగింపు సమావేశానికి గవర్నర్ నరసింహన్ ముఖ్య అతిథిగా హాజరవుతారు. మొదటి రోజు యువత అభివృద్ధిపై జర్నలిస్ట్ శేఖర్ గుప్తా చర్చాగోష్ఠిని నిర్వహిస్తారు. అసోం ఎంపీ గౌరవ్ గగోయ్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతో పాటు నేను ప్యానలిస్టులుగా పాల్గొంటాం. బ్రిటన్ ఎంపీ సీమా మల్హోత్రా, న్యూజిలాండ్ ఎంపీ కన్వల్‌జిత్ సింగ్ భక్షి, యునైటెడ్ నేషన్స్‌లో నేపాల్ శాశ్వత ప్రతినిధి మధు రామన్ ఆచార్య, శ్రీలంక పరిశ్రమలు, వాణిజ్య శాఖ ఉప మంత్రి బుదికా పథిరాణా, మాసిడోనియా రిపబ్లిక్ పెట్టుబడుల శాఖ మాజీ మంత్రి గ్లిగర్ తస్కోవిచ్, ఒకినవా, అఫ్గానిస్థాన్‌లో వరల్డ్ ట్రేడ్ సెంటర్స్ వ్యవస్థాపకుడు జాన్ డిక్సన్ చర్చల్లో పాల్గొని ప్రసంగిస్తారు. రెండో రోజు నైపుణ్య శిక్షణ, సమతులాభివృద్ధిలో యువత, మహిళల పాత్ర, కార్పొరేటు, ప్రభుత్వాల భాగస్వామ్యంపై చర్చిస్తారు. వీటిని అంతర్జాతీయంగా ఆయా రంగాల్లో నిష్ణాతులు నిర్వహిస్తారు. ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన పేదరిక నిర్మూలన ఆహార సమృద్ధి, ఆరోగ్యం, నాణ్యమైన విద్య, లింగ సమానత్వం, మంచి నీరు-పరిశుభ్రత, పర్యావరణ అనుకూల విద్యుత్, గౌరవప్రదమైన పని, ఆర్థికాభివృద్ధి, పరిశ్రమలు, మౌలిక వసతులు, నూతన ఆవిష్కరణలు తదితర అంశాలపై చర్చిస్తాం" అని కవిత వివరించారు.

పట్టాలు లేవు.. హక్కులు రావు

- ఏళ్లుగా శివాయ్‌జమేదార్ల ఎదురుచూపులు
- పథకాలు పొందలేకపోతున్నాం అంటున్న రైతులు

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ భూములను సాగుచేసుకుంటున్న అర్హులైన పేదలకు పట్టాలు ఇవ్వాలనే ప్రభుత్వ ఉద్దేశం చిన్నచిన్న అడ్డంకుల కారణంగా నెరవేరడం లేదు. భూ దస్త్రాల ప్రక్షాళనలో అలాంటి రైతులను గుర్తించినా తదుపరి ప్రక్రియలో ముందడుగు పడకపోవడంతో పేదలు ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ భూములు సాగుచేసుకుంటున్న వాళ్లు లక్ష మందికిపైగా ఉన్నట్టు అంచనా. 2017లో చేపట్టిన భూ దస్త్రాల ప్రక్షాళన సందర్భంగా వీరి ఆధీనంలో 1,62,394 ఎకరాల భూమి ఉన్నట్టు గుర్తించారు. వీరిలో ప్రభుత్వానికి శిస్తు చెల్లిస్తున్న వారూ ఉన్నారు. వీరిని రెవెన్యూ పరి భాషలో శివాయిజమేదారులుగా పిలుస్తారు. వారికి సదరు భూమిపై హక్కులు లేకపోవడంతో బ్యాంకు రుణాలు, రైతు బంధు, రైతు బీమా పథకాలు పొందలేక పోతున్నారు.

అసైన్డ్ భూముల కథ అంతేనా?

రాష్ట్ర వ్యాప్తంగా 20.01 లక్షల ఎకరాల అసైన్డ్ భూములు పేదల చేతుల్లో ఉన్నట్టు ఓ అంచనా. అందులో 2,41,127 ఎకరాలు చేతులు మారినట్లు గతేడాది ప్రభుత్వం గుర్తించింది. వాస్తవానికి అసైన్డ్ భూముల క్రయవిక్రయాలు చెల్లవు. అయినప్పటికీ కొన్నిచోట్ల పేదలు విక్రయించుకోగా, కొందరు ఆక్రమణలకు పాల్పడ్డారు. అసైన్డ్ భూములను నిరుపేదలు కొనుగోలు చేసి ఉన్న పక్షంలో, వాటిని కూడా పేదలకు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. చేతులు మారిన భూముల్లో నిరుపేదలను గుర్తించి, వారికే పట్టాలు పంపిణీ చేసే అధికారాన్ని ఏడాది క్రితం కలెక్టర్లకు అప్పగించింది. దాదాపు ఏడాది గడుస్తున్నా ఈ విషయం కొలిక్కి రాలేదు.

నోటీసులతో సరి

కొన్ని జిల్లాల్లో కలెక్టర్లు ఆ భూములకు సంబంధించి వాస్తవ పట్టాదారులకు నోటీసులు జారీచేశారు. వారి నుంచి వచ్చే సమాధానాన్ని బట్టి నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించినా ఆ ప్రక్రియలో తదుపరి చర్యలు లేవు. ఫలితంగా పేద రైతులు నష్టపోతున్నారు. పట్టాలు, హక్కులు లేని కారణంగా ఇప్పటికే రెండు దశల్లో ప్రభుత్వం పంపిణీ చేసిన రైతుబంధు పెట్టుబడి సాయం పొందలేకపోయామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ స్థాయిలో చర్యలు వేగవంతం చేస్తే తప్ప శివాయిజమేదారి, చేతులు మారిన అసైన్డ్ భూముల్లోని అర్హులకు పట్టాలిచ్చే ప్రక్రియలో ముందడుగు పడదని వాపోతున్నారు.



తిరుగు ప్రయాణంలోనూ రద్దీ

చౌటుప్పల్ గ్రామీణం, న్యూస్‌టుడే : సంక్రాంతి పండుగకు వెళ్లిన రాజధాని ప్రజలు తిరుగుబాట పట్టడంతో, గురువారం చౌటుప్పల్ పట్టణంలో బారులుదీరిన వాహనాలు ఇవి. విపరీత రద్దీని నియంత్రించేందుకు పోలీసు అధికారులు, జీఎమ్మార్ సిబ్బంది పలు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. దీంతో యాదాద్రి భువనగిరి జిల్లా పంతంగి టోల్ ప్లాజా వద్ద బండ్లు ఎక్కువసేపు నిలవకుండానే వెళ్లాయి. భువనగిరి ట్రాఫిక్ ఏసీపీ శంకర్, చౌటుప్పల్ ఇన్‌స్పెక్టర్ జోసెఫ్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు చేపట్టారు. హైదరాబాద్ వైపు వెళ్లే మార్గంలో 11 'టోల్ బూత్'లు తెరిచారు. అదనంగా చేతి యంత్రాలతో జీఎమ్మార్ సంస్థ ఉద్యోగులు టోల్ రుసుములు వసూలుచేశారు. నల్గొండ జిల్లా కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ టోల్ ప్లాజా వద్ద కూడా వాహనాల తాకిడి ఎక్కువగా కనిపించింది.



'డాగ్' వాక్

ర్యాంప్‌పై ఓ వీధి శునకం హొయలు ఒలికించింది. వయ్యారంగా నడుస్తూ ఫొటోలకు ఫోజులూ ఇచ్చింది. ఇదంతా నిజమేనండీ.. ముంబయిలో బుధవారం రాత్రి ఫ్యాషన్ షో జరిగింది. ప్రముఖ డిజైనర్ రోహిత్ బల్ సిద్ధంచేసిన వస్త్రాలతో మోడళ్లు క్యాట్‌వాక్ చేశారు. అయితే ఒక్కసారిగా ర్యాంప్‌పైకి వచ్చిన ఓ వీధి శునకం అందరినీ అవాక్కయ్యేలా చేసింది. కాసేపు అటూఇటూ తిరిగి వయ్యారి భామల పక్కన నిలబడి ఫొటోలు దిగింది. అక్కడేవున్న బాలీవుడ్ తారలు సిద్ధార్థ్ మల్హోత్రా, డయానా పెంటీలను వదిలిపెట్టి ఈ శునకాన్ని చూసేందుకు ఆహూతులు ఎగబడ్డారు. సామాజిక మాధ్యమాల్లోనూ దీని చిత్రాలు స్వైర విహారం చేస్తున్నాయి.



ఇస్రో ఈనెల 24న శ్రీహరికోట నుంచి పీఎస్ఎల్‌వీ రాకెట్ ద్వారా మైక్రోశాట్-ఆర్, కలాంశాట్ ఉపగ్రహాలను ప్రయోగించనుంది.

ఉద్యోగ అవకాశాలు

Excellencia
SCHOOL • COLLEGES
Shamirpet . Madhapur . Suchitra . ECIL

Sy.No.1008, Upperpally Village, ORR Circle.Shamirpet. www.excellencia.co.in

WANTED

Excellencia Residential Junior College Shamirpet, Hyderabad is looking for **Marketing Executives** having minimum of **2 years experience** to work from all new district head quarters and major towns. **Local residents are preferred.** Compensation includes, very good salary and Incentives

Email Your resume to: Openings@excellencia.co.in
Call/Whatsapp: 73308 88025
Note: Interviews will conducted in respective District Head Quarters

అర్చకులు కావలెను

శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో వెలసిన ఉత్తర తిరుపతి క్షేత్రంలో దిగువ దేవాలయాల యందు ఆయా దేవతలకు సంబంధించిన పూజ, హోమ విధానములు తెలిసిన సద్ బ్రాహ్మణుల నుండి దరఖాస్తులు కోరనైనది.

1. శ్రీగణపతి దేవాలయము, 2. శ్రీ చక్ర సమేత లక్ష్మీ దేవి దేవాలయము, 3. శ్రీ సదాశివ సమేత దత్తాత్రేయ స్వామి దేవాలయము, 4. శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయము, 5. శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయము, 6.నవగ్రహ దేవాలయముల.

అర్చకులకు ఆశ్రమ ఆవరణలో తగిన వసతి కల్పించి, ప్రతిరోజు సాహిత్యంతో పాటు నెలవారి తగిన వేతనము ఇవ్వబడును.

అర్హత కల్గిన అభ్యర్థులు పూర్తి వివరములతో దరఖాస్తు ఈ దిగువ పెర్కొనబడిన చిరునామాకు (Bio Data, Photo, Aadhar card) మరియు గత అనుభవాలు తెలుపుతు తేది. 21-01-2019 లోగా వ్యక్తిగతముగా లేదా పోస్టు ద్వారా పంపగలరు.

శ్రీ అనఘా దత్త జ్ఞానబోధ సభ
(శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి ఆశ్రమము)
గూపన్‌పల్లి, గంగాస్థాన్ ఫేజ్-2, రోడ్ నెం.5 నిజామాబాద్.

NCL GROUP — NAGARJUNA CEMENT

WALK-IN-INTERVIEW

NCL Industries Ltd., Hyderabad, a 35 years old listed company engaged in the manufacturing of Cement and Building Materials, is looking for young & bright candidates for the following position in **Karimnagar:**

Sales Officer (Karimnagar)

Qualification: MBA (Sales & Marketing) / Graduate in any stream with minimum of 3 years' experience in sales.

Skills: Should be quite conversant with local markets and a self driven go-getter.

Interested candidates are advised to appear for the interview with latest resume and photograph.

Date of Interview: 19.01.2019, Time: 10 am to 4 pm
Venue : Hotel V Park
2-239/3/A, Near RTC Workshop Jagityal Road, Karimnagar – 505001
Contact Number: 9121207180
Email ID: careers@nclind.com www.nclind.com

DS GROUP — Diversifying portfolio. Enhanced value.

Dharampal Satyapal Group (DS Group) is a rapidly growing multi-diversified conglomerate. The Company is looking for young and result oriented sales professionals to be based at different locations in **Telangana** for its Mouth Freshener Division.

RSM (Ref: DS/RSM/TS) Experience: 15-20 years
ASMs (Ref: DS/ASM/TS) Experience: 7-10 years
Sales Officers (Ref: DS/SO/TS) Experience: Minimum 2 years

Job Description: Responsible for sales targets, coverage expansions, handling of distributors and to lead a set of sales team in an assigned area of operation.

Profile: Min. Graduate, having FMCG experience with strong leadership, interpersonal and communication skills.

Interested candidates can **walk-in** with their resume for an interview between **10:30 AM to 05:00 PM** along with the original documents related to qualification, experience and current salary at the address mentioned below.

Location: Hyderabad **Date: 22nd & 23rd January, 2019**
Venue: Hotel Abode, 6-1-74, Beside HDFC Bank, Lakdikapul, Hyderabad - 500004
Contact Number: Mr. Pratyush Dwivedi - 9005633356

Candidates who are not able to appear for walk-in interview, can email their resume at hr@dsgroup.com or send their resume by post to **Dharampal Satyapal Ltd.,** DS Headquarters, C 6-10, Dharampal Satyapal (DS) Road, Sector - 67, Noida - 201309, U.P.

Please mention reference code in subject line, otherwise application will not be considered.

ETV భారత్

ETV Bharat is a comprehensive digital national news platform conceived to deliver seamless news and information services, using video-centric Mobile Apps and Web Portals. It is first-of-its kind offering in India with diverse content, depth, dedicated journalists network and pan india reach offering services in 13 languages i.e. Hindi, Urdu, Telugu, Tamil, Kannada, Malayalam, Gujarathi, Marathi, Bengali, Punjabi, Assamese, Odiya and English.

ETV Bharat invites applications for

MANAGEMENT TRAINEE-HR

Applicants should be Post Graduates in Human Resources Management from a reputed University/ Institute and in the age group of 22-26 years with good interpersonal and communication skills. Working knowledge in MS Office is essential.

The selection procedure would be based on the candidates performance in Written Test, Group Discussion and Personal Interview. **Selected Candidates will be imparted intensive on-the-job training in all HR functions which include Manpower Planning, Recruitment, Identification of KRA/KPI's Competencies, Performance Management System, Talent Management, Salary Administration, ensuring Statutory Compliance with labour laws and implementing other HRD Practices etc.**

The duration of training period is one year during which a monthly stipend of Rs. 16,000/- will be paid. On successful completion of training, they will be absorbed in to regular employment. Selected candidates must be prepared to work at Ramoji Film City or any of our branches located across pan India. Successful candidates should be willing to execute a bond for Three years which includes the training period of one year.

Interested candidates may email their resume to **mt-hr@etvbharat.com** or send their resume with specific details of qualifications and experience, affixing a recent passport size photograph, within 10 days to:

SENIOR MANAGER - HR
ETV BHARAT
(A Division of Ushodaya Enterprises Pvt. Ltd)
Ramoji Film City - 501 512

సెన్సెక్స్ ▲ 53 **36374** | **నిఫ్టీ** ▲ 15 **10905** | **డోజోన్స్** 24178 ▼ 29 | **నాస్‌డాక్** 7045 ▲ 10 | **రూపాయి** 71.03 ▲ 21 పైసలు (ఒక అమెరికా డాలరుకు) | **ముడి చమురు** 60.99 ▼ (బ్రెంట్ ధర డాలర్లలో)

అమెరికా కాలమానం ప్రకారం గురువారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).




ఘనం (+) నిఫ్టీ	17న	మార్పు%	గ్రహణం (-) నిఫ్టీ	17న	మార్పు%
BPCL	355.20	2.29	SUN PHARMA	426.55	-6.00
GAIL (INDIA)	332.40	2.12	YES BANK	201.50	-3.29
AXIS BANK	676.65	1.91	ZEE ENTERTAIN ENT	440.90	-2.48
HCL TECH	954.70	1.75	SBI	297.40	-1.90
BHARTI INFRATEL	280.45	1.67	EICHER MOTORS	20369.95	-1.76
HDFC	2004.55	1.50	BAJAJ FINSERV	6359.00	-1.64
HPC	244.20	1.50	INDIABULLS HSG FIN	816.75	-1.55

విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	64.80	75.14	బహ్రెయిన్ దీనార్	175.39	200.67
పౌండ్ స్టెర్లింగ్	83.39	96.70	కువైట్ దీనార్	194.39	241.99
యూరో	73.78	85.55	ఒమన్ రియాల్	171.62	196.60
జపనీస్ యెన్/100	59.43	68.93	సౌదీ రియాల్	17.23	20.42
ఆస్ట్రేలియా డాలరు	46.42	53.70	యూఏఈ దిర్హమ్	17.64	20.61
సింగపూర్ డాలరు	47.79	56.60	మలేషియా రింగిట్	15.44	18.99
థాయ్ బాత్/100	204.74	244.87	చైనీస్ యువాన్	7.44	12.07



అరబిందో చేతికి స్పెక్ట్రమ్ ఫార్మా ఏడు ఔషధాలు

విలువ 300 మిలియన్ డాలర్లు ● కేన్సర్ విభాగంలో విస్తరించే అవకాశం

ఈనాడు - హైదరాబాద్

హైదరాబాద్‌కు చెందిన అరబిందో ఫార్మా విదేశాల్లో ఔషధాలు, ఔషధ కంపెనీలు, పరిశోధన-అభివృద్ధి ప్రాజెక్టులను కొనుగోలు చేయటంలో దూకుడు ప్రదర్శిస్తోంది. ఇటీవల కాలంలో అమెరికా, కెనడా, ఐరోపా, ఆస్ట్రేలియా.. తదితర దేశాల్లో జోరుగా కొనుగోళ్లు చేసిన ఈ కంపెనీ తాజాగా యూఎస్‌లో స్పెక్ట్రమ్ ఫార్మాసూటికల్స్ నుంచి ఏడు బ్రాండెడ్ కేన్సర్ ఔషధాలను సొంతం చేసుకుంది. ఇందుకు 300 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.2,100 కోట్లు) వెచ్చిస్తుంది. ఇందులో 160 మిలియన్ డాలర్లను నగదుగా వెంటనే చెల్లిస్తుంది. మిగిలిన 140 మిలియన్ డాలర్లను విడతల వారీగా నిర్దేశిత వ్యాపార లక్ష్యాలు సాధించినప్పుడు ఇవ్వాల్సి ఉంటుంది. వచ్చే మూడు నెలల వ్యవధిలో ఈ లావాదేవీ పూర్తయ్యే అవకాశం ఉంది. అరబిందో ఫార్మా, యూఎస్‌లోని తన అనుబంధ సంస్థ అయిన



అక్రోటెక్ బయోఫార్మా ద్వారా ఈ ఔషధాలను కొనుగోలు చేయటానికి ఒప్పందం కుదుర్చుకుంది.

కనీసం 100 మిలియన్ డాలర్ల అమ్మకాలు

ఈ ఔషధాలను కొనుగోలు చేయటం వల్ల బ్రాండెడ్ కేన్సర్ ఔషధాల విభాగంలో విస్తరించినట్లు అవుతుందని అరబిందో ఫార్మా పేర్కొంది. అంతేగాక భవిష్యత్తులో మరి కొన్ని కేన్సర్ ఔషధాలను తయారు చేసేందుకు వీలుకలుగుతుందని భావిస్తోంది. స్పెక్ట్రమ్ ఫార్మాసూటికల్స్ నుంచి కొనుగోలు చేసిన ఈ ఔషధాలకు 2018లో దాదాపు 105 మిలియన్ డాలర్ల అమ్మకాలు నమోదయ్యాయి. తన చేతికి వచ్చిన తర్వాత మొదటి ఏడాదిలో ఈ ఔషధాల అమ్మకాల ద్వారా కనీసం 100 మిలియన్ డాలర్ల అమ్మకాలను సాధించవచ్చని అరబిందో ఫార్మా భావిస్తోంది. అరబిందో ఫార్మా ప్రస్తుతం యాంటీబయాటిక్స్, యాంటీ-రిట్రోవైరల్స్, గ్యాస్ట్రో-ఎంటరలాజికల్స్, యాంటీ-అలెర్జీస్, యాంటీ-డయాబెటిస్ విభాగాల్లో ఔషధాలు తయారు చేస్తోంది. ఈ కంపెనీ వార్షిక ఆదాయాల్లో 70 శాతం యూఎస్, యూరప్ మార్కెట్ల నుంచే నమోదు అవుతోంది. ఇటీవల కాలంలో యూఎస్, యూరప్‌లో కొనుగోలు చేసిన కంపెనీలు, ఔషధాలతో ఇంకా అధిక ఆదాయాలు సాధించే అవకాశం ఉన్నట్లు పరిశ్రమ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

కొనసాగుతున్న జోరు

గత ఏడాది సెప్టెంబరులో అరబిందో ఫార్మా, శాండోజ్ యూఎస్ చర్మవ్యాధుల ఔషధాల వ్యాపారాన్ని 1 బిలియన్ డాలర్లు వెచ్చించి కొనుగోలు చేసిన విషయం విదితమే. అంతకు ముందే కెనాడా సంస్థ అయిన అపోటెక్స్ ఇంటర్నేషనల్‌కు చెందిన అయిదు ఐరోపా దేశాల వ్యాపారాన్ని 86 మిలియన్ డాలర్లకు సొంతం చేసుకుంది. అదేవిధంగా ఆస్ట్రేలియాకు చెందిన అడ్వెంట్ ఫార్మాసూటికల్స్ వద్ద అభివృద్ధి దశలో ఉన్న కొన్ని ఔషధాలను 12.5 మిలియన్ డాలర్లకు గత ఏడాది నవంబరులో కొనుగోలు చేసింది. ఈ కొనుగోళ్లకు సొంత నిధులు, రుణ నిధులు వెచ్చించింది. ఇప్పుడు స్పెక్ట్రమ్ ఫార్మా నుంచి కేన్సర్ ఔషధాలు సొంతం చేసుకోవటం ద్వారా అదే జోరును కొనసాగిస్తున్నట్లు అవుతోంది. ఈ కొనుగోలు కంపెనీకి అన్ని రకాలుగా మేలు చేస్తుందని భావిస్తున్నట్లు అరబిందో ఫార్మా ఎండీ ఎన్.గోవిందరాజన్ అభిప్రాయపడ్డారు.

పెట్రో రసాయనాల వ్యాపారంలోకి అదానీ

- జర్మనీ సంస్థ బీఏఎస్‌ఎఫ్‌తో జట్టు
- గుజరాత్‌లో రూ.16000 కోట్లతో ప్లాంటు ఏర్పాటు

దిల్లీ: గౌతమ్ అదానీ నేతృత్వంలోని అదానీ గ్రూపు పెట్రో రసాయనాల విభాగంలోకి అడుగుపెడుతోంది. జర్మనీకి చెందిన రసాయనాల తయారీ దిగ్గజం బీఏఎస్‌ఎఫ్ భాగస్వామ్యంతో ప్లాంటును ఏర్పాటు చేయనుంది. ఇందుకు ఇరు సంస్థలు రూ.16,000 కోట్ల మేర పెట్టుబడి పెట్టనున్నాయి. గుజరాత్‌లోని ముంద్రా జిల్లాలో పెట్రో రసాయనాల కర్మాగారాన్ని నెలకొల్పుతున్నట్లు అదానీ గ్రూపు, బీఏఎస్‌ఎఫ్‌లు ఓ సంయుక్త ప్రకటనను విడుదల చేశాయి. ఈ కర్మాగారం విద్యుత్ అవసరాలు తీర్చేందుకు ఇదే ప్రాంతంలో సౌర, పవన విద్యుత్ ప్లాంటును కూడా ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నాయి. ప్రతిపాదిత రసాయనాల ప్లాంటులో బీఏఎస్‌ఎఫ్‌కు మెజార్టీ వాటా ఉండనుంది. ఇందుకు సంబంధించి గుజరాత్‌లో జరుగుతోన్న వైబ్రంట్ గుజరాత్ గ్లోబల్ సమిట్‌లో ఇరు సంస్థలు అవగాహన పూర్వక ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశాయి. అయితే బీఏఎస్‌ఎఫ్ ఎంత మేర పెట్టుబడి పెట్టనుందో వెల్లడికానప్పటికీ, భారత్‌లో ఆ సంస్థ పెట్టబోతున్న అత్యధిక పెట్టుబడి ఇదే కానుంది. విద్యుత్ ప్లాంట్లలో మాత్రం బీఏఎస్‌ఎఫ్ మైనార్టీ వాటాను కలిగి ఉంటుంది. ఇంతకుమించి ప్లాంటుకు సంబంధించి మిగతా వివరాలను ఇరు సంస్థలు వెల్లడించలేదు. ప్రస్తుతం దేశీయంగా పెట్రో రసాయనాల విభాగంలో ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ అగ్రగామి సంస్థగా ఉన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు గౌతమ్ అదానీ కూడా పెట్రో రసాయనాల విభాగంలో అడుగుపెట్టడంతో గుజరాత్‌కు చెందిన ఇద్దరు దిగ్గజ పారిశ్రామికవేత్తలు ప్రత్యక్షంగా పోటీ పడుతున్న మొట్టమొదటి వ్యాపార విభాగంగా ఇది నిలవనుంది.

ఐఏఏ వరల్డ్ కాంగ్రెస్‌కు ముకేశ్ అంబానీ

- కోచిలో వచ్చేనెల 20-22 తేదీల్లో సదస్సు

ఈనాడు, హైదరాబాద్: ఇంటర్నేషనల్ అడ్వర్‌టైజింగ్ అసోసియేషన్ (ఐఏఏ) వరల్డ్ కాంగ్రెస్ వచ్చే నెల 20-22 తేదీల్లో కోచిలో జరగనుంది. ఈ విషయాన్ని ఐఏఏ అధ్యక్షుడు శ్రీనివాసన్ స్వామి ఇక్కడ వెల్లడించారు. న్యూయార్క్ కేంద్రంగా ఎనిమిది దశాబ్దాలుగా ఐఏఏ కార్యకలాపాలు సాగిస్తోంది. ఐఏఏ వరల్డ్ కాంగ్రెస్ రెండేళ్లకోసారి జరుగుతుంది. దీనికి ఈసారి మనదేశం ఆతిథ్యం ఇస్తోంది. ఈ సదస్సు మనదేశంలో జరగటం ఇదే మొదటి సారి. కోచిలో జరిగే సదస్సుకు 25 దేశాల నుంచి దాదాపు రెండు వేల మందికి పైగా ప్రతినిధులు హాజరవుతారని అంచనా. ఐఏఏ వరల్డ్ కాంగ్రెస్ స్టీరింగ్ కమిటీ ఛైర్మన్ ప్రదీప్ గుహా ఈ సందర్భంగా స్పందిస్తూ అడ్వర్‌టైజింగ్‌తో పాటు మార్కెటింగ్, మీడియా, టెక్నాలజీ... తదితర అంశాలు ఈ సదస్సులో చర్చకు వస్తాయని అన్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ సీఎండీ ముకేశ్ అంబానీ, యునిలీవర్ సీఈఓ పాల్ పోల్‌మ్యాన్, క్వాల్‌కామ్ సీఈఓ స్టీవెన్ మూలెన్‌కాఫ్, సాఫ్ట్‌బ్యాంక్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్స్ సీఈఓ రాజీవ్ మిశ్రా, ఇన్ఫోసిస్ నాన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ నందన్ నీలేకని, శ్రీశ్రీ రవిశంకర్, అమితాబ్ బచ్చన్ ఈ సదస్సులో పాల్గొని మాట్లాడతారు. సోషల్ హ్యూమనాయిడ్ రోబో 'సోఫియా' ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

కీలక రేట్లను తగ్గించండి

- ద్రవ్య లభ్యతను పెంచేందుకు చర్యలు చేపట్టండి
- ఆర్‌బీఐ గవర్నరుకు పరిశ్రమ సంఘాల వినతి



దిల్లీ: వృద్ధికి ఊతమిచ్చేందుకు కీలక రేట్లను తగ్గించాల్సిందిగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)కు పరిశ్రమ సంఘాలు విన్నవించాయి. గురువారం ఆర్‌బీఐ గవర్నరు శక్తికాంత దాస్‌తో పరిశ్రమ సంఘాల ప్రతినిధులు భేటీ అయ్యారు. ద్రవ్య లభ్యత పరిస్థితిని మెరుగుపర్చేందుకు నగదు నిల్వల నిష్పత్తిని (సీఆర్ఆర్) కనీసం 50 బేసిస్ పాయింట్ల మేర తగ్గించాల్సిన అవసరం ఉందని సమావేశంలో భారత పరిశ్రమ సంఘాల సమాఖ్య (సీఐఐ) సూచించింది. ముఖ్యంగా సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు, మౌలిక రంగానికి తగినన్ని నిధులు అందుబాటులోకి వచ్చేలా చర్యలు చేపట్టాలని తెలిపింది. అలాగే తగ్గిన ద్రవ్యోల్బణ రేటుకు అనుగుణంగా రెపో రేటును కూడా 50 బేసిస్ పాయింట్లు తగ్గించాలని పేర్కొంది. నిధుల లభ్యత విషయంలో స్థిరాస్తి రంగం, ఎంఎస్ఎమ్ఈలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఆర్‌బీఐ చేపట్టిన చర్యలను సీఐఐ ప్రశంసించింది. ఫిక్కీ కూడా కీలక రేట్ల కోతకు విన్నవించింది. రెపో రేటు, సీఆర్ఆర్‌ను తగ్గించడం ద్వారా దేశంలో పెట్టుబడుల పరిస్థితి మెరుగవుతుందని, వినియోగం పెరిగి వృద్ధికి దోహదం చేస్తుందని ఫిక్కీ అధ్యక్షుడు సందీప్ సోమని తెలిపారు. ఇవే కాకుండా బలహీన ప్రభుత్వ రంగ బ్యాంకులకు అమలుచేస్తోన్న సత్వర దిద్దుబాటు చర్యల నిబంధనలను సడలించాలని కూడా సీఐఐ సిఫారసు చేసింది. అలాగే నేషనల్ హౌసింగ్ బ్యాంక్‌కు రుణాలిచ్చేందుకు ఆ బ్యాంకులకు అనుమతినివ్వాలని, తద్వారా ఈ నిధులను గృహ రుణ కంపెనీల ద్వారా స్థిరాస్తి ప్రాజెక్టులకు రుణాలిచ్చేందుకు ఉపయోగించొచ్చని తెలిపింది.

ఎగుమతులపై మిధాని దృష్టి

- అత్యాధునిక లోహ మిశ్రమాల అభివృద్ధికి స్పెయిన్ కంపెనీతో ఒప్పందం

ఈనాడు, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ మిశ్రధాతు నిగమ్ (మిధాని) అత్యాధునిక లోహ మిశ్రమాల ఎగుమతిపై దృష్టి పెట్టింది. దీనికోసం స్పెయిన్‌కు చెందిన ట్యూబేక్స్‌తో జతకట్టింది. ఈ మేరకు మిధాని సీఎండీ దినేష్ కుమార్, ట్యూబేక్స్ సీఈవో జీసస్ ఎస్మోరీస్ హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. మార్చి నాటికి చమురు రంగంలో అత్యాధునిక లోహ మిశ్రమాలను ఇరాన్‌కు ఎగుమతి చేయాలన్న లక్ష్యాన్ని ఇరు కంపెనీలు నిర్దేశించుకున్నాయి. ఈ సందర్భంగా మిధాని సీఎండీ దినేష్ కుమార్ మాట్లాడుతూ.. మిధాని, ట్యూబేక్స్ రెండూ భారత్ మార్కెట్‌లో విడివిడిగా తమ ఉత్పత్తులను మార్కెట్ చేస్తూనే భవిష్యత్తు అవసరాలకు తగ్గ అత్యాధునిక లోహమిశ్రమాల పరిశోధన, అభివృద్ధి, తయారీపై కలిసి పనిచేయనున్నట్లు చెప్పారు. దేశీయంగా ఇంధన అవసరాలు పెరుగుతున్నాయని అల్ట్రా సూపర్ క్రిటికల్ థర్మల్ ప్లాంట్ల, న్యూక్లియర్ ప్లాంట్లకు అవసరమైన లోహ మిశ్రమాలపై దృష్టిపెట్టినట్లు చెప్పారు. ట్యూబేక్స్ సీఈవో ఎస్మోరీస్ మాట్లాడుతూ అణు ఇంధనశక్తి రంగంలో భారత్ ప్రపంచంలోనే అగ్రగామి దిశగా అడుగులు వేస్తున్న సమయంలో భద్రత, నాణ్యత, అధిక శక్తి సామర్థ్యంపై ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు మిధానితో ఒప్పందం దోహదం చేస్తుందన్నారు.

'ఇండిగోలెర్న్'కు ఏంజెల్ నిధులు

ఈనాడు, హైదరాబాద్: విద్యా రంగంలో సేవలు అందిస్తున్న టెక్-స్టార్టప్ సంస్థ అయిన ఇండిగోలెర్న్ 'ఏంజెల్ ఇన్వెస్టర్ల' నుంచి 2.65 లక్షల డాలర్ల నిధులు (దాదాపు రూ.1.90 కోట్లు) సమీకరించింది. ఇందులో మన దేశంతో పాటు, యూఎస్‌కు చెందిన ఏంజెల్ ఇన్వెస్టర్లు ఇటీవల సమకూర్చిన నిధులు కూడా ఉన్నాయి. సీఏ, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్ విభాగాల్లో కోర్సులు చేస్తున్న విద్యార్థులకు ఆన్‌లైన్లో శిక్షణ సేవలను ఈ సంస్థ అందిస్తోంది. ప్రస్తుతం ప్రధానంగా సీఏ ఫౌండేషన్, సీఏ ఇంటర్ శిక్షణ అందిస్తున్నట్లు, వచ్చే ఏడాదిలో సీఏ ఫైనల్, 10 ప్లస్ టూ విద్యార్థులను అనువైన శిక్షణ కార్యక్రమాలను ఆవిష్కరించనున్నట్లు ఇండిగోలెర్న్ వివరించింది.

మార్కెట్ కబుర్లు

- రూల్‌ట్రానిక్స్‌ను దాదాపు రూ.53 కోట్లతో కొనుగోలు చేసినట్లు **ఎల్‌అండ్‌టీ ఇన్ఫోటెక్** వెల్లడించింది.
- ప్రమోటర్ వాటా పరిమితిని తగ్గించుకోవడంపై ఆర్‌బీఐ జారీ చేసిన ఆదేశాలను సవాలు చేస్తే **కోటక్ మహీంద్రా బ్యాంక్** దాఖలు చేసిన పిటిషన్‌ను మార్చి 12 వరకు బొంబే హైకోర్టు వాయిదా వేసింది.
- విదేశీ విపణుల్లో బాండ్ల జారీ ద్వారా 125 కోట్ల డాలర్లను (దాదాపు రూ.8,800 కోట్లు) సమీకరించినట్లు **ఎస్‌బీఐ** వెల్లడించింది. ఈ నిధులను వ్యాపార విస్తరణకు ఉపయోగించనుంది.
- దిల్లీ నుంచి చండీగఢ్ వరకు 250 కి.మీ రహదారి మార్గంలో విద్యుత్ వాహనాల కోసం అక్కడక్కడ సౌర విద్యుత్ ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నట్లు **భెల్** వెల్లడించింది.
- గ్లకోమా చికిత్సలో ఉపయోగించే ఎసిటాజోలమైడ్ మందుబిళ్లల విక్రయానికి అమెరికా ఆహార ఔషధ నియంత్రణ సంస్థ నుంచి **జైడస్ కేడిలా**కు తుది అనుమతులు లభించాయి.
- ప్రైవేట్ ప్లేస్‌మెంట్ పద్ధతిలో షేర్ల విక్రయం ద్వారా రూ.1000 కోట్ల సమీకరణ నిమిత్తం **యూకో బ్యాంక్**కు డైరెక్టర్ల బోర్డు అనుమతినిచ్చింది.

ఒడుదొడుకుల నడుమ..

- 53 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్
- 10,900 ఎగువన ముగిసిన నిఫ్టీ

సూచీలు వరుసగా మూడో రోజూ స్వల్ప లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు వస్తున్నప్పటికీ స్టాక్ ఆధారిత కొనుగోళ్లతో సెన్సెక్స్ 53 పాయింట్లు, నిఫ్టీ 15 పాయింట్ల మేర పెరిగాయి. వచ్చే నెల 1న ప్రవేశపెట్టబోయే తాత్కాలిక బడ్జెట్, కార్పొరేట్ ఫలితాలు, అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితులు మార్కెట్లను ప్రభావితం చేస్తున్నాయి. అంతర్జాతీయ సూచీలకొస్తే ఆసియా మార్కెట్లు ప్రతికూలంగా ముగియగా, ఐరోపా మార్కెట్లు కూడా అదే ధోరణిలో ట్రేడయ్యాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 21 పైసలు నష్టంతో 71.03 వద్ద స్థిరపడింది.

సెన్సెక్స్ ఉదయం 36,413.60 పాయింట్ల వద్ద సానుకూలంగా ప్రారంభమైంది. తర్వాత వచ్చిన కొనుగోళ్ల మద్దతుతో 36,468.42 పాయింట్ల గరిష్ఠాన్ని తాకింది. అయితే మధ్యాహ్నం తర్వాత మదుపర్లు విక్రయాలకు దిగడంతో ఒక దశలో 36,170.80 పాయింట్ల కనిష్ఠ స్థాయిని నమోదు చేసింది. చివరకు 52.79 పాయింట్ల లాభంతో 36,374.08 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సైతం 14.90 పాయింట్ల లాభంతో 10,905.20 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ



10,930.65-10,844.65 పాయింట్ల మధ్య కదలాడింది.

సెన్సెక్స్ 30 షేర్లలో యాక్సిస్ బ్యాంక్ అత్యధికంగా 1.91 శాతం లాభపడింది. హెచ్‌సీఎల్ టెక్ 1.77%, హెచ్‌డీఎఫ్‌సీ 1.51%, టీసీఎస్ 1.34%, కోటక్ బ్యాంక్ 1.24%, ఎంఅండ్ఎం 1.19%, పవర్‌గ్రిడ్ 1.09%, హీరో మోటోకార్ప్ 0.92% మేర లాభపడ్డాయి. సన్‌ఫార్మా అత్యధికంగా 5.78 శాతం నష్టపోయింది. యెస్ బ్యాంక్ 3.31%, ఎస్‌బీఐ 1.78%, బజాజ్ ఫైనాన్స్ 1.45%, హెచ్‌యూఎల్ 1.12% మేర నష్టపోయాయి. రంగాలవారీ సూచీలకొస్తే ఇంధన, ఫైనాన్స్, ఐటీ, చమురు-గ్యాస్, స్థిరాస్తి లాభపడ్డాయి. ఆరోగ్య సంరక్షణ, ఎంఎఫ్‌సీజీ, లోహ రంగాలు డీలా పడ్డాయి.

ఆన్‌లైన్లో దేశీయ వస్తువులు

ఈనాడు, హైదరాబాద్: ఆన్‌లైన్లో జాతీయ, అంతర్జాతీయ సంస్థలు తయారు చేసే ఎన్నో వస్తువులు లభ్యం అవుతాయి. కానీ మనదగ్గర ఎంతో ప్రాచుర్యాన్ని పొందిన పోచంపల్లి చీరలు, కొండపల్లి, పెందుర్తి ఫెలిగ్రీ వస్తువులు పెద్దగా దొరకవు. దీన్ని గమనించి కేవలం స్థానికంగా లభించే ముఖ్యమైన వస్తువులను ఆన్‌లైన్లో వినియోగదార్లకు అందించేందుకు ముందుకు వచ్చింది టెక్-స్టార్టప్ అయిన పిక్ ఎన్ హుక్. ప్రస్తుతం హైదరాబాద్‌లో తాము కార్యకలాపాలు ప్రారభించినట్లు, భవిష్యత్తులో దిల్లీతో పాటు ఇతర మెట్రో నగరాలకు విస్తరిస్తామని పిక్ ఎన్ హుక్ సీఈఓ మోనీష్ పత్తిపాటి వివరించారు. కశ్మీర్ నుంచి కంచి వరకూ లభించే పూర్తి దేశీ ఉత్పత్తులను విక్రయించటం ద్వారా అటు తయారీదార్లు, ఇటు వినియోగదార్లకు అనువైన వేదికగా నిలవాలని అనుకుంటున్నట్లు పేర్కొన్నారు.

నకిలీ వెబ్‌సైట్లను అడ్డుకోండి

గూగుల్‌కు అమూల్ నోటీసు

దిల్లీ: తమ వెబ్‌సైట్‌ను పోలిన నకిలీ వెబ్‌సైట్ల ప్రకటనలను అడ్డుకోవాలని అమూల్ సెర్చ్ ఇంజిన్ గూగుల్ ఇండియాకు నోటీసునిచ్చింది. తమ ట్రేడ్‌మార్క్‌ను అనధికారికంగా ఉపయోగిస్తున్న వెబ్‌సైట్ల ప్రకటనల ద్వారా గూగుల్ ఇండియా ఆదాయాన్ని ఆర్జించిందని ఆరోపించింది. ఆయా వెబ్‌సైట్లను వెంటనే నిలిపివేసేలా చర్యలు చేపట్టాలని పేర్కొంది. 'మార్చి 2018 నుంచి అమూల్‌ను పోలిన అనేక నకిలీ వెబ్‌సైట్ల ప్రకటనలు కనిపిస్తున్నాయని మా దృష్టికి వచ్చింది. అవి ఉద్యోగాలు ఇస్తామని, ఫ్రాంఛైజీల ఏర్పాటుకు అనుమతి ఇస్తామని చెబుతున్నాయి. బ్యాంకు ఖాతా వివరాలను పేర్కొంటూ, అందులో డబ్బు జమ చేయాలని కోరుతున్నాయి' అని అమూల్ లీగల్ నోటీసులో పేర్కొంది. గూగుల్ ప్రకటనల వేదిక ఎలాంటి తనిఖీలు లేకుండానే వీటిని అనుమతిస్తోందనీ, దీనిద్వారా అది ఆదాయాన్ని ఆర్జిస్తోందని పేర్కొంది. దీనికి గూగుల్ ఇండియా అధికారి స్పందిస్తూ.. గుర్తు తెలియని వ్యక్తులు ఈ నకిలీ వెబ్‌సైట్లు, ఈ మెయిల్స్‌ను సృష్టించారని, ఈ విషయంపై విచారిస్తామని పేర్కొన్నారు.



17న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

కోడిగుడ్లు			
హైదరాబాద్	418	వరంగల్	420
చిల్లరగా (ఒక గుడ్డు)	4.80	విశాఖపట్నం	435
బెంగళూరు	445	చెన్నై	450
18వ తేదీకి...		చిత్తూరు	443
విజయవాడ/గోదావరి	435	నమక్కల్	435

ఎన్‌ఎస్‌ఈ

గురువారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 394.50 (389.30) 4156932
ASIAN PAINTS 1389.60 (1389.75) 853829
AXIS BANK LT 676.65 (664.00) 10448209
BAJAJ AUTO L 2729.65 (2717.45) 230784
BAJAJ FINANC 2535.90 (2569.85) 994183
BAJAJ FINSER 6359.00 (6464.85) 139043
BHARTI AIRTE 332.05 (333.95) 4118364
BHARTI INFRA 280.45 (275.85) 3729858
BPCL 355.20 (347.25) 3949498
CIPLA 509.60 (511.50) 1598184
COAL INDIA L 232.05 (232.05) 3220136
DR. REDDYS 2619.15 (2616.95) 649802
EICHER MOTOR 20369.95 (20735.70) 103777
GAIL 332.40 (325.50) 4290595
GRASIM IND 828.10 (826.30) 997585
HCL TECH 954.70 (938.25) 1845117
HDFC 2004.55 (1975.00) 2773741
HDFC BANK 2132.30 (2120.20) 2060057
HERO MOTOCOR 2903.60 (2879.85) 515341
HINDALCO IND 206.00 (208.40) 6537377
HINDUSTAN UN 1751.50 (1772.55) 1941204
HPCL 244.20 (240.60) 4239731
ICICI BANK 374.60 (375.30) 13171721
INDIABULLS H 816.75 (829.60) 6405691
INDIAN OIL 137.65 (135.80) 11644105
INDUSINDBANK 1523.00 (1526.70) 1467807
INFOSYS LTD 733.35 (736.80) 6903771
ITC 293.95 (294.05) 10601100
JSW STEEL LT 289.00 (286.45) 4817690
KOTAK MAHIND 1219.95 (1202.75) 3934500
LARSEN & TOU 1346.05 (1342.15) 1610419
M&M 734.65 (726.25) 3318440
MARUTI SUZIK 7336.25 (7310.25) 462725
NTPC LTD 144.90 (146.35) 6274305
ONGC 145.00 (146.35) 5142302
POWER GRID C 193.90 (192.00) 2995612
RELIANCE IND 1134.45 (1135.90) 7487963
SBI 297.40 (303.15) 15974634
SUN PHARMA 426.55 (453.80) 8343750
TATA CONSULT 1894.30 (1870.15) 2625816
TATA MOTORS 184.90 (185.45) 9365756
TATA STEEL L 473.15 (474.55) 4281935
TECH MAHINDR 705.55 (699.90) 1434040
TITAN IND 961.55 (961.20) 1303576
ULTRATECH 3846.45 (3887.00) 235993
UPL LIMITED 769.05 (766.10) 1442884
VEDANTA LIMI 197.45 (196.30) 6591718
WIPRO 335.40 (336.55) 5289184
YES BANK LTD 201.50 (208.35) 60534702
ZEE ENTERTAI 440.90 (452.10) 8620833

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1286.70 (1287.45) 44053
ACC 1455.15 (1473.95) 467164
ADITYA BIRLA 95.45 (96.35) 1878179
AMBUJA CEMEN 215.25 (216.85) 934332
ASHOK LEYLAN 93.25 (93.95) 8949001
AUROBIND PHA 775.00 (788.30) 1308601
AVENUE SUPER 1368.00 (1393.25) 657383
BANDHAN BANK 449.75 (448.65) 679418
BANK OFBAROD 119.20 (121.00) 9553120
BEL 87.20 (88.90) 7937656
BHEL 70.15 (68.35) 9573414
BIOCON LTD 657.65 (650.70) 1100775
BOSCH LTD 19150.55 (19089.40) 7450
BRITANNIA 3207.10 (3175.75) 154540
CADILA HEALT 355.85 (352.55) 1053793
COLGATE PALM 1326.60 (1330.75) 246007
CONTAINER 694.40 (696.90) 751713
DABUR INDIA 420.30 (423.85) 2118185
DLF LIMITED 184.20 (182.95) 4558933
GENERAL INS 258.00 (258.25) 37116
GODREJ CONSU 793.30 (774.95) 875985
HAVELLS INDI 676.15 (683.45) 969498
HDFC STAND L 390.85 (387.50) 962821
HINDUSTAN ZI 271.75 (272.60) 571873
ICICI LOMBAR 875.90 (860.30) 239981
ICICI PRU LI 349.75 (347.25) 1149959
IDEA CELLULR 36.95 (36.40) 14915441
INTERGLOBE A 1112.90 (1136.55) 1059208
L&TFIN.HOLD 141.30 (141.85) 7492429
LIC HOUS.FIN 490.70 (481.85) 2038083
LUPIN 868.75 (863.20) 1995674
MARICO LIMIT 380.20 (380.40) 986391
MCDOWELL 594.95 (595.20) 666895
MOTHERSON 159.60 (162.30) 3141731
MRF 65802.80 (65991.20) 3530
NHPC LTD 25.55 (25.85) 1356978
NMDC LTD 91.85 (93.30) 6755057
OIL INDIA 172.75 (173.55) 862255
ORACLE FIN S 3694.40 (3682.75) 23553
P&G HYG&HEAL 9996.95 (9896.85) 1549
PETRONET LNG 221.95 (220.50) 3428274
PIDILITE IND 1151.55 (1154.00) 323531
PIRAMAL ENTE 2387.90 (2372.15) 367656
SAIL 49.90 (50.40) 13023795
SBI LIFE INS 623.35 (621.40) 377003
SHREE CEMENT 15914.70 (15822.95) 16720
SHRIRAM TRAN 1149.50 (1188.20) 2060773
SIEMENS 1064.80 (1060.55) 499832
SUN TV LTD 564.95 (573.45) 1087914
THE NEW INDI 182.50 (183.55) 11749

బీఎస్‌ఈలో రాష్ట్ర కంపెనీలు

ADITYA SPIN 6.01 (6.32) 320
AISHWARYA TE 3.15 (3.15) 30006
ALPHAGEO 476.95 (478.45) 7620
AMAR RAJA BA 781.10 (765.15) 91097
ANDHRA BANK 28.80 (29.10) 28111
ANDHRA CEMEN 5.73 (5.80) 1361
ANDHRA PAPER 449.40 (450.40) 2663
ANDHRA PETRO 68 (67.15) 51521
ANDHRA SUGAR 327.15 (330.45) 1194
ASTRA MICROW 83.55 (83.35) 7575
AUROBINDO PH 774.30 (787.05) 88331
AVANTEL SOFT 228.30 (230.70) 1484
AVANTI FEEDS 378.65 (383.15) 17703
AVON ORG 6.39 (6.14) 115
BALAJI AMIN 482.25 (483.45) 6462
BARTRONICS 7.17 (7.21) 9550
BHAGIRA CHEM 432.70 (442.40) 3126
BHAGYA NAG 36.50 (36.90) 510
BN RATHI SEC 25.80 (26) 6808
BRILLIANT SE 1.12 (1.07) 116642
CAMBRIDGE TE 46.40 (44.10) 96
CIL SECURI 15.80 (15.75) 266
CONT COFFEE 266.95 (264.25) 93421
COROMAN FERT 454.35 (453.85) 1419
CUBEX TUB 14.55 (14.78) 690
CYBERMATE 2.09 (2.16) 23895
CYIENT LIMIT 627.55 (623.15) 17151
DECCAN CEMEN 400.45 (395) 183
DIVI'S LAB 1504.25 (1520.75) 59472
DIVYA GRANIT 98.90 (94.20) 8330
DR REDDY 2616.80 (2621.85) 21395
FOUR SOFT 37 (36.85) 119
GATI CORPN 80.80 (81.45) 49123
GAYATRI PROJ 180.95 (184.15) 259707
GMR INFRASTR 16.35 (16.60) 410310
GOLDST INFRA 242.05 (244.35) 21399
GOLDSTONE EN 15.55 (15.70) 2962
GRANULES (I) 90.05 (91.20) 24390
GSS AMERICA 130.40 (129.60) 11733
GVK POWER 7.49 (7.57) 318259
HBL NIFE POW 28.75 (28.75) 4699
HERITAGE FOO 531.10 (537.20) 1822
HIFCO MARWEL 67.20 (68.55) 1
HIL LTD 2002.20 (2043) 828
HIND FLUROCA 16.35 (16.50) 3550
IDL INDUSTRS 269.45 (268.10) 561
ILFS ENGINEE 14.70 (14.30) 11759
IVRCL INFRAS 1 (0.99) 85115
JEEVAN SCIEN 38.75 (37.45) 2
KAKATIYA CEM 195.50 (196.25) 1327
KALLAM SPG 18.20 (17.80) 27543
KAVERI SEED 570.40 (573.50) 19947
KCP LTD 89.45 (89.95) 7423
KERNEX MICRO 26.70 (28.10) 6202
KNR CONSTRUC 210.70 (216.15) 5472
KREBS BIO 125.35 (127.50) 210
LANCO INDUS 188.25 (189.10) 949
LAURUS LABS 377.50 (378.60) 795
LOKESH MACH 45.40 (45.50) 2303
MADHUCON PRO 7.05 (6.71) 1495
MEDINOVA DIA 18.85 (19.80) 300
MEGA SOFT 7.21 (7.54) 3282
MIC ELECTRON 0.92 (0.96) 75122
MOLD-TEK.TEC 48.20 (46.40) 6992
MOLDTK PLA 262.75 (260.90) 683
MSR INDIA LT 11.05 (11.60) 12602
NAGARJAGRICH 27.55 (27.50) 1267
NATCO PHARMA 692.65 (679.90) 11066
NAVA BH VENT 111.30 (112.25) 8252
NCC 89.55 (88.55) 481206
NCL IND 129.55 (129) 2610
NEHA INTER 3.98 (4) 2734
NETTLINX 49.70 (50.50) 2526
NEULAND LAB 501.75 (502.10) 867
NIHAR INFO 13.50 (14) 1335
NILE 368.15 (366.85) 1451
NORTHGATE TE 0.73 (0.76) 59619
OIL COUNTRY 15.30 (15.40) 1379
PANYAM CEMEN 13.68 (13.59) 555
PENNER IND 37.65 (37.90) 64503
PHYTOCHEM I 44.80 (46.15) 1006
PIONEER DIST 164.15 (165.80) 685
PITTI LAMIN 66.65 (64.85) 11115
POKARNA 188.80 (182.95) 25157
PRAJAY ENGS 8.84 (8.35) 5869
PREMIER EXPL 236.60 (237.25) 2050
PRISM CEMENT 84.60 (85.40) 14182
PRUDENTL PHA 3.63 (3.63) 23207
RAASI REFRAC 14.37 (13.70) 1769
RAIN INDUSTR 121.85 (123.45) 172158
RAM INFORMAT 42.35 (40.80) 7530
REG.CERAMIC 4.52 (4.55) 1001
SAGAR CEM 648.90 (655.20) 338
SAMKRG PIST 191.70 (194.65) 1073
SATVAH. ISPA 9.20 (9.30) 1086
SMS PHARMA 79 (75.40) 15649
SOUTH BIO TE 2.05 (2.05) 4001
SREE RAYAL A 36.35 (35.75) 56880
SRI KPR INDU 18.10 (17.25) 100
SRINIVASA SH 40 (39.50) 710
STEEL EXCHAN 13.15 (13.70) 4930
SUJANA METAL 0.41 (0.41) 28834
SUJANA TOWER 1.32 (1.38) 1965
SURYALAKSH.C 43.15 (42.05) 2096
SURYALATA SP 127.50 (133.60) 252
SUVEN PHARMA 218.70 (219.55) 24050
TAJ GVK HOTE 179.45 (180.05) 187
TANLA 30.15 (30.25) 2525
TERA SOFTWAR 47.40 (48.50) 2428
TRANS BIOTEK 5.17 (4.93) 95721
TRENDY KNIT 0.24 (0.23) 28445
VAMSHI RUBB 31.95 (29.70) 1452
VBC FERRO 39.15 (39.75) 670
VICEROY HOTE 4.45 (4.55) 15078
VIJAY TEXTIL 42.50 (41.20) 217
VIMTA LABS 285.15 (291.10) 3750
VISAKA IND 429.15 (429.75) 1198
VISTA PHARMA 28.40 (28.70) 5238
VIVIMED LABS 33.10 (33.70) 29562
VJIL CONSULT 40.50 (41.30) 2688
VST INDUS 3221.95 (3269.20) 66
XL TELENE 1.03 (1.08) 12850
YBRANT DIGIT 2.91 (2.85) 162535
ZENOTECH LAB 31.95 (34.95) 24107
ZENTECH 80.95 (81) 7441

ఈనాడు బిజినెస్

హోండా కార్లు ప్రియం

దిల్లీ: హోండా కార్ల ధరలు వచ్చే నెల 1 నుంచి ప్రియం కాబోతున్నాయి. కమొడిటీ ధరలు పెరగడంతోపాటు రూపాయి మారకపు విలువ ప్రభావం నుంచి కొంతమేరకు ఉపశమనం పొందేందుకు వీలుగా అన్ని మోడళ్ల కార్లపై రూ.10,000 వరకు ధరలు పెంచబోతున్నట్లు హోండా కార్స్ ఇండియా గురువారం వెల్లడించింది. ప్రీమియం ఎస్‌యూవీ సీఆర్-వీ మోడల్‌పై రూ.10,000, మిగతా మోడళ్లపై రూ.7,000 వరకు ధరలు పెంచబోతున్నట్లు కంపెనీ ఓ ప్రకటనలో తెలిపింది.

5జీ విస్తరణలో మనమే ముందు!

- పెట్టుబడులే కీలకం
- ట్రాయ్ ఛైర్మన్ ఆర్.ఎస్. శర్మ



దిల్లీ: 5జీ సేవలను విస్తరించడంలో భారత్ ముందుండే అవకాశం ఉందని.. అయితే ఫైబర్ నెట్‌వర్క్‌పై పెట్టుబడులు పెంచడంపైనే అది ఆధారపడి ఉంటుందని ట్రాయ్ ఛైర్మన్ ఆర్.ఎస్. శర్మ పేర్కొన్నారు. ప్రస్తుతం చైనా వంటి దేశాలతో పోలిస్తే ఈ విషయంలో మనం వెనకబడి ఉన్నామని ఆయన గుర్తు చేశారు. '5జీ విషయంలో అన్ని అడ్డంకులను అధిగమించి మనం చాలా వేగంగా ముందుకు వెళ్లవచ్చు. సమాచారం, కమ్యూనికేషన్ల సాంకేతికతల ద్వారా ఆ అడ్డంకులను తొలగించుకోవచ్చు. ఫైబర్ నెట్‌వర్క్‌పై భారీ పెట్టుబడులు పెట్టకుండా 5జీ కావాలంటే కుదరద'ని శర్మ అన్నారు. 'ఇప్పటిదాకా భారత్‌లో ఏర్పాటు చేసిన ఫైబర్ నెట్‌వర్క్‌ను చైనా కేవలం ఒక ఏడాదిలోనే ఏర్పాటు చేసింది. కాబట్టి మౌలిక వసతుల్లో పెట్టుబడులను ప్రోత్సాహించడానికి తగిన విధానాలను తీసుకురావాల్సి ఉంటుంది. ద నేషనల్ డిజిటల్ కమ్యూనికేషన్స్ పాలసీ(ఎన్‌డీసీపీ)లో ఆ తరహా విధానాలు, ప్రకటనలు ఉన్నాయి. ఇపుడు వాటిని అమలు చేసి పెట్టుబడులు రాబట్టుకోవాల'ని శర్మ అన్నారు.

కాగా, భారత్‌లో అనుసంధాన సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాల్సి ఉందని కూడా అన్నారు. ఇతర టెలికాం మార్కెట్ల తరహాలో ఇక్కడి మూడు ప్రైవేటు కంపెనీలు, ఒక ప్రభుత్వ రంగ కంపెనీ కలిసి పనిచేయాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

జాతీయ వ్యాపార రిజిస్టర్ రూపకల్పనకు రూ.300 కోట్లు


దిల్లీ: దేశవ్యాప్తంగా కొనసాగుతున్న అన్ని వ్యాపారాలపై జాతీయ స్థాయి ఆర్థిక సర్వే నిర్వహించి కొత్త రిజిస్టర్‌ను రూపొందించడానికి కేంద్ర ప్రభుత్వం సమాయత్తమవుతోంది. ఇందుకోసం 2019-20లో నిర్వహించబోయే ఆర్థిక సర్వే కోసం సుమారు రూ.300 కోట్ల వరకు ఖర్చు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. 'వ్యాపార సంస్థల రిజిస్ట్రన్ను రూపొందించాలనే ప్రతిపాదన తాజాగా తీసుకొచ్చాం. దీన్ని ఎప్పటికప్పుడు ఆధునికీకరిస్తూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఉపయోగించుకునేలా రూపొందిస్తామ'ని కేంద్ర గణాంక, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ కార్యదర్శి ప్రవీణ్ శ్రీవాత్సవ వెల్లడించారు. 1977లో మొదలైన ఈ సర్వే ఇప్పటివరకు 6 సార్లు మాత్రమే నిర్వహించారు.

10,000 కోట్లు

చరిత్ర సృష్టించిన రిలయన్స్ ఇండస్ట్రీస్

- రూ.10 వేల కోట్ల నికర లాభం పొందిన తొలి ప్రైవేటు కంపెనీ ఇదే
- కలిసివచ్చిన రిటైల్, టెలికాం వ్యాపారాలు
- రూ.1,71,336 కోట్లకు ఆదాయం
- చమురు రిఫైనింగ్ మార్జిన్లపై ఒత్తిడి
- ఇతర విభాగాలు రాణించడంతో కనిపించని ప్రభావం

రిలయన్స్ ఇండస్ట్రీస్ ఫలితాల్లో దుమ్మురేపింది. విశ్లేషకుల అంచనాలను మించి రాణించింది. అంతకు మించి దేశంలోనే రూ.10,000 కోట్ల త్రైమాసిక లాభాన్ని పొందిన తొలి ప్రైవేటు కంపెనీగా చరిత్ర సృష్టించింది. రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు రికార్డులు కొత్త కాకపోయినప్పటికీ.. ఈ మైలు రాయి మాత్రం ఎప్పటికీ చిరస్థాయిగా కార్పొరేట్ చరితలో నిలిచిపోయేదే.



దిల్లీ

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్‌ఐఎల్) ఫలితాలు రికార్డు సృష్టించాయి. చమురు నుంచి టెలికాం దాకా సేవలందించే ఈ దిగ్గజం అక్టోబరు-డిసెంబరు 2018లో రూ.10,251 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. అంటే షేరుకు రూ.17.3(ఈపీఎస్) ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఇదే మూడు నెలల సమయంలో కంపెనీ ఏకీకృత నికర లాభం రూ.9,420 కోట్లు(రూ.16 షేరుకు)గా నమోదైందని కంపెనీ గురువారమిక్కడ విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది.

ప్రైవేటు కంపెనీల్లో దీనిదే ఘనత

ఇప్పటిదాకా దేశంలో ఏ ప్రైవేటు కంపెనీ కూడా రూ.10,000 కోట్లకు పైగా లాభాన్ని ప్రకటించలేదు. ప్రభుత్వ రంగం విషయానికొస్తే.. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐఓసీ) జనవరి-మార్చి 2013లో రూ.14,512.81 కోట్ల లాభాన్ని ప్రకటించింది. ఇప్పటిదాకా భారత కార్పొరేట్ చరిత్రలో ఇదే అత్యధిక త్రైమాసిక లాభం. అయితే ఆ ఏడాది మొత్తానికి సంబంధించిన సబ్సిడీని ఒకే త్రైమాసికంలో పొందడంతో లాభం భారీగా నమోదైంది. ఆ ఏడాది కంపెనీ అంతక్రితం త్రైమాసికాల్లో సబ్సిడీ మద్దతు లేక నష్టాలు నమోదు చేయడంతో వార్షిక లాభం రూ.5005.17 కోట్లుగానే నమోదుకావడం గమనార్హం.

ఆదాయం: 56% వృద్ధి

అక్టోబరు-డిసెంబరు 2018లో ఆర్‌ఐఎల్ ఆదాయం ఏకంగా 56 శాతం వృద్ధి చెంది రూ.1,71,336 కోట్లుగా నమోదైంది. ఓ వైపు చమురు రిఫైనింగ్ వ్యాపారంలో మార్జిన్ల ఒత్తిడి కనిపించినా.. రిటైల్, టెలికాం వ్యాపారాలు కంపెనీని ఆదుకున్నాయి. మరిన్ని రిటైల్ స్టోర్లను తెరవడం, తన టెలికాం అనుబంధ సంస్థ జియోకు అదనంగా 2.8 కోట్ల కొత్త వినియోగదార్లు రావడం వంటివి లాభదాయకతను పెంచాయి.

పెట్రో వ్యాపారం: 43% వృద్ధి

కంపెనీకి చెందిన పెట్రోరసాయనాల వ్యాపారం రూ.8221 కోట్ల పన్నుకు ముందు లాభాన్ని పొందింది. అంతక్రితం ఏడాది ఇదే సమయంతో పోలిస్తే ఇది 43 శాతం ఎక్కువ. పాలిమర్ ఉత్పత్తుల, ఫైబర్ ఇంటర్మీడియేట్స్‌లను అధికంగా ఉత్పత్తి చేయడం ఇందుకు నేపథ్యం. ప్రతీ పీపా చమురుకు 8.8 డాలర్లను కంపెనీ పొందింది. అక్టోబరు-డిసెంబరు 2017లో మాత్రం ఇది 11.6 డాలర్లుగా ఉంది. స్థూల రిఫైనింగ్ మార్జిన్ కూడా రెండో త్రైమాసికంలో 9.5 డాలర్ల కంటే తక్కువగానే ఉంది. చమురు-సహజ వాయువు వ్యాపారంలో నష్టం రెండో త్రైమాసికంలో రూ.480 కోట్లుగా ఉండగా.. అది ఈ మూడో త్రైమాసికం నాటికి రూ.185 కోట్లకు పరిమితం అయింది.

అప్పులు: డిసెంబరు 31, 2018 నాటికి కంపెనీ రుణాలు రూ.2,74,381 కోట్లకు పెరిగాయి. సెప్టెంబరు 30 నాటికి ఇవి రూ.2,58,701 కోట్లు; మార్చి 31 నాటికి రూ.2,18,763 కోట్లు మాత్రమే.

నగదు నిల్వలు: ఇక కంపెనీ చేతిలోని నగదు నిల్వలు మాత్రం రూ.77,933 కోట్లకు పెరిగాయి.

'రిటైల్' లాభం 210% వృద్ధి

- డిసెంబరు 2018 త్రైమాసికంలో రిలయన్స్ రిటైల్ పన్నుకు ముందు లాభం రెండింతలు పెరిగింది. పండగల విక్రయాలు, కొత్త స్టోర్ల ప్రారంభం ఇందుకు నేపథ్యం.
- 6,400కు పైగా పట్టణాలు, నగరాల్లోని 9,907 స్టోర్ల ద్వారా రూ.1680 కోట్ల లాభాన్ని ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో లాభం రూ.606 కోట్లు మాత్రమే.
- ఇక ఆదాయం కూడా 89.25% వృద్ధి చెంది రూ.35,577 కోట్లుగా నమోదైంది. వరుస అయిదు త్రైమాసికాలుగా ఆదాయాలు దాదాపు రెట్టింపు అవుతూనే ఉన్నాయని కంపనీ ఒక ప్రకటనలో పేర్కొంది.
- సమీక్షిస్తున్న త్రైమాసికంలో 13.9 కోట్ల మంది కంపెనీ స్టోర్లను సందర్శించారు.
- ఫ్యాషన్, రిటైల్ విభాగంలో 100 కొత్త స్టోర్లను డిసెంబరు త్రైమాసికంలోనే ప్రారంభించారు. దీంతో 25 కొత్త నగరాలకు విస్తరించినట్లయింది.
- రిలయన్స్ రిటైల్ 21 కొత్త డిజిటల్ స్టోర్లను ప్రారంభించారు. రిలయన్స్ జువెల్స్ కూడా 100 స్టోర్ల మార్కును అధిగమించింది.

> రూ.10,000 కోట్ల త్రైమాసిక లాభాన్ని పొందిన తొలి భారత ప్రైవేటు రంగ కంపెనీగా రిలయన్స్ ఇండస్ట్రీస్ అవతరించింది. దీన్ని సాధించిన రిలయన్స్ బృందంలో నేనూ భాగస్వామిగా ఉన్నందుకు గర్విస్తున్నా. సమీక్షిస్తున్న త్రైమాసికంలో చమురు ధరలు తీవ్ర ఊగిసలాటకు గురైనా బలమైన ఫలితాలను ప్రకటించాం. రిటైల్, జియో విభాగాలు మా లాభదాయకతను విశేషంగా పెంచాయి. తమ వాటాను స్థిరంగా పెంచుకుంటూ వెళుతున్నాయి.
>
> – ఫలితాల సందర్భంగా ఆర్‌ఐఎల్ ఛైర్మన్ ముకేశ్ అంబానీ

రూ.10,000 కోట్లకు పయనమిలా..

త్రైమాసికం	ఏకీకృత నికర లాభం(రూ.కోట్లలో)
జులై-సెప్టెంబరు 2017	8,097
అక్టోబరు-డిసెంబరు 2017	9,406
జనవరి-మార్చి 2018	9,459
ఏప్రిల్-జూన్ 2018	9,485
జులై-సెప్టెంబరు 2018	9,549
అక్టోబరు-డిసెంబరు 2018	10,251

జియో లాభం: 65% వృద్ధి

- గ్రూప్ టెలికాం విభాగమైన రిలయన్స్ జియో స్టాండలోన్ నికర లాభం రూ.831 కోట్లకు చేరింది. అంతక్రితం ఏడాది అక్టోబరు-డిసెంబరులో నమోదైన రూ.504 కోట్ల లాభంతో పోలిస్తే ఇది 65 శాతం ఎక్కువ కావడం విశేషం.
- సగటున ఒక్కో వినియోగదారుడి నుంచి వచ్చే ఆదాయం తగ్గుతూ ఉన్నా.. డిసెంబరు చివరకల్లా వినియోగదార్ల సంఖ్య ఏకంగా 28 కోట్లకు చేరడంతో ఆ ప్రభావం పెద్దగా కనిపించలేదు.
- అంతక్రితం ఏడాది ఇదే సమయంలో వినియోగదార్ల సంఖ్య 16 కోట్లు మాత్రమే.

'జియో కుటుంబంలో ఇపుడు 28 కోట్ల మంది వినియోగదార్లున్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద మొబైల్ డేటా నెట్‌వర్క్‌ల్లో ఒకటిగా వృద్ధి చెందుతూనే ఉంది. ప్రతి ఒక్కరికీ, ప్రతి చోటకు, ప్రతి అంశానికి అనుసంధానం చేయాలన్న మా దృక్పథం ప్రకారమే అడుగులు పడుతున్నాయి. అత్యధిక నాణ్యతను అత్యంత చౌకగా అందించడానికి కట్టుబడి ఉంటాం. అదే సమయంలో తదుపరి తరం ఎఫ్‌టీటీఎక్స్ సేవల ద్వారా గృహాలను, కంపెనీలకు చక్కటి అనుసంధాన మార్గాలను అన్వేషిస్తున్నామ'ని కంపెనీ సీఎండీ ముకేశ్ పేర్కొన్నారు.

గురువారం బీఎస్ఈలో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు 0.03% నష్టంతో రూ.1133.75 వద్ద ముగిసింది.

రూ.700 కోట్లు పెట్టుబడి పెడతా

- కానీ నా వాటా 25 శాతానికి తగ్గొద్దు
- జెట్ ఎయిర్‌వేస్ పునరుద్ధరణ ప్రణాళికపై నరేశ్ గోయల్



దిల్లీ: జెట్ ఎయిర్‌వేస్‌లో రూ.700 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టేందుకు ఆ సంస్థ ఛైర్మన్ నరేశ్ గోయల్ ముందుకొచ్చారు. షేర్ల తనఖా పెట్టేందుకు కూడా అంగీకరించారు. అయితే ఈ పెట్టుబడి అనంతరం సంస్థలో తన వాటా 25 శాతం కంటే తక్కువకు పడిపోకూడదని షరతు పెట్టారు. అలా అయితేనే తాను పెట్టుబడి పెట్టేందుకు సిద్ధమని ఎస్‌బీఐ ఛైర్మన్ రజనీశ్ కుమార్‌కు రాసిన లేఖలో తెలిపారు. జెట్ ఎయిర్‌వేస్ పునరుద్ధరణ ప్రణాళికపై ప్రస్తుతం చర్చలు నడుస్తున్న నేపథ్యంలో ఆయన ఈ లేఖ రాశారు. మరోవైపు నరేశ్ గోయల్ తన మెజార్టీ వాటా నియంత్రణను వదులుకుంటేనే జెట్ ఎయిర్‌వేస్‌లో పెట్టుబడులు పెడతానని ఎతిహాద్ కూడా వెల్లడించినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. 'నేను చెప్పిన షరతులను ఒప్పుకోవడం వీలుకాకపోతే, నేను పెట్టుబడులు పెట్టబోను నా షేర్లను కూడా తనఖా పెట్టను. అయితే 25 శాతం కంటే వాటా తగ్గినప్పుడు టేకోవర్ కోడ్‌తో సంబంధం లేకుండా తిరిగి వాటాను పెంచుకునేందుకు సెబీ అనుమతిస్తే మాత్రం పై వాటికి సమ్మతమేన'ని గోయల్ చెప్పారు. విమానయాన సంస్థ, వాటాదార్ల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని అందరికీ మేలు చేసేదిలా పునరుద్ధరణ ప్రణాళిక ఉండాలని ఆయన కోరారు. ఎస్‌బీఐతో నిరంతర సంప్రదింపుల్లో భాగంగా పునరుద్ధరణ ప్రణాళికపై గోయల్ తన ప్రతిపాదనలను సమర్పించారని ఎక్స్ఛేంజీలకు జెట్ ఎయిర్‌వేస్ వెల్లడించింది.

24 గంటల్లోగా రూ.100 కోట్లు కట్టండి

- ఫోక్స్‌వ్యాగన్‌కు ఎన్‌జీటీ ఆదేశాలు
- గడువులోగా కడతాం: కంపెనీ

దిల్లీ: ఫోక్స్‌వ్యాగన్‌పై జాతీయ హరిత ట్రైబ్యునల్(ఎన్‌జీటీ) విరుచుకుపడింది. డీజిల్ కార్లలో మోసపూరిత పరికరాన్ని ఉపయోగించడం ద్వారా పర్యావరణానికి హాని తలపెట్టిన కారణంగా విధించిన రూ.100 కోట్లను 24 గంటల్లోగా (శుక్రవారం సాయంత్రం 5 గంటల కల్లా) కట్టాలని ఆదేశాలు జారీ చేసింది. లేదంటే కంపెనీ డైరెక్టర్లను జైలుకు పంపుతామని హెచ్చరించింది. మధ్యంతర డిపాజిట్‌గా ఈ రూ.100 కోట్లను కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి(సీపీసీబీ)కి కట్టాలని ఫోక్స్‌వ్యాగన్‌కు నవంబరు 16, 2018న ట్రైబ్యునల్ ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఇది కేవలం మధ్యంతర డిపాజిట్ మాత్రమేనని అప్పట్లోనే స్పష్టం చేసింది. సీపీసీబీ, భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ, ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏఆర్ఏఐ), నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌ల ప్రతినిధులతో కూడిన సంయుక్త బృందాన్ని సైతం ఏర్పాటు చేసింది. అదనపు నైట్రోజన్ ఆక్సైడ్(ఎన్ఓఎక్స్) ఉద్గారాల వల్ల దిల్లీలో వాయు కాలుష్యానికి కారణమైన ఫోక్స్‌వ్యాగన్‌పై రూ.171.34 కోట్ల అపరాధ రుసుమును ఆ నలుగురు సభ్యుల కమిటీ విధించింది. కాగా, ఇప్పటికీ ఆదేశాలను పాటించని ఆ జర్మనీ వాహన దిగ్గజంపై ఎన్‌జీటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. 'స్టే లేకపోయినా ఎందుకు ఆదేశాలను పాటించలేదు. ఇక మరింత సమయం ఇవ్వలేం. మీరు ఆ మొత్తాన్ని డిపాజిట్ చేకపోతే.. మీ డైరెక్టర్లను జైలుకు పంపుతామ'ని పేర్కొంది. మరోవైపు భారత్‌లో తమ కార్లన్నీ ఉద్గార ప్రమాణాలను పాటిస్తున్నాయని ఫోక్స్‌వ్యాగన్ పునరుద్ఘాటించింది. ఎన్‌జీటీ చెప్పిన ప్రకారం గడువులోగా రూ.100 కోట్లను డిపాజిట్ చేస్తామని కంపెనీ ప్రతినిధి పేర్కొన్నారు.

హెచ్‌యూఎల్ లాభంలో 9% వృద్ధి

దిల్లీ: ఎంఎఫ్‌సీజీ దిగ్గజం హిందుస్థాన్ యునిలీవర్ (హెచ్‌యూఎల్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.1,444 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో సంస్థ ఆర్జించిన రూ.1,326 కోట్లతో పోలిస్తే ఇది 9 శాతం అధికం. 2017-18 ఆర్థిక సంవత్సరం డిసెంబరు త్రైమాసికంతో పోలిస్తే సమీక్షా త్రైమాసికంలో నికర విక్రయాలు రూ.8,323 కోట్ల నుంచి 12.42 శాతం వృద్ధితో రూ.9,357 కోట్లకు చేరాయి. మొత్తం వ్యయాలు రూ.7,036 కోట్ల నుంచి 8.75 శాతం వృద్ధితో రూ.7,652 కోట్లకు పెరిగాయి.

విభాగాల వారీగా..



- గృహ సంరక్షణ ఉత్పత్తుల విభాగ ఆదాయం రూ.2,741 కోట్ల నుంచి 14.84 శాతం వృద్ధితో రూ.3,148 కోట్లకు చేరింది.
- సౌందర్య, వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తుల విభాగ ఆదాయం రూ.4,090 కోట్ల నుంచి 10.9 శాతం వృద్ధితో రూ.4,539 కోట్లకు పెరిగింది.
- ఆహార ఉత్పత్తుల విభాగ ఆదాయం రూ.1,572 కోట్ల నుంచి 9.92 శాతం వృద్ధితో రూ.1,728 కోట్లకు చేరింది.
- ఇతర విభాగాల ఆదాయం మాత్రం రూ.187 కోట్ల నుంచి 23.52 శాతం తగ్గి రూ.143 కోట్లకు పరిమితమైంది.

దేశీయ వినియోగదారుల పెరుగుదల 13 శాతం, విక్రయాల వృద్ధి 10 శాతం, ఎబిటా మార్జిన్ 170 బేసిస్ పాయింట్లు, పన్ను తర్వాత లాభం (పీఏటీ) 17 శాతం మేర పెరిగినట్లు ఎక్స్ఛేంజీలకిచ్చిన సమాచారంలో హెచ్‌యూఎల్ పేర్కొంది. 'ముడి చమురు, రూపాయి మారకపు విలువల్లో హెచ్చుతగ్గులు ఉన్నా, సరైన నిర్వహణతో మార్జిన్ పెంచుకోగలిగామ'ని హెచ్‌యూఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సంజీవ్ మెహతా వెల్లడించారు. జీఎస్‌కే కన్జ్యూమర్ హెల్త్‌కేర్ విలీనానికి సంబంధించి స్టాక్ ఎక్స్ఛేంజీలు, కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) తదితర వర్గాల నుంచి అవసరమైన అనుమతులు తీసుకుంటున్నామని తెలిపారు.

బీఎస్ఈలో షేరు 1.12 శాతం నష్టంతో రూ.1,750.10 వద్ద ముగిసింది.

సైయెంట్ లాభం రూ.92.5 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఐటీ సేవల కంపెనీ సైయెంట్ ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.1,187 కోట్ల ఆదాయాన్ని, రూ.92.5 కోట్ల నికరలాభాన్ని ఆర్జించింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆదాయం రూ.983 కోట్లు, నికరలాభం రూ.87.1 కోట్లు ఉన్నాయి. దీంతో పోలిస్తే ప్రస్తుత మూడో త్రైమాసికంలో ఆకర్షణీయమైన ఫలితాలు నమోదు చేసినట్లు అవుతోంది. ఒక త్రైమాసికంలో నమోదైన అత్యధిక ఆదాయం ఇదేనని సైయెంట్ ఈ సందర్భంగా పేర్కొంది. అంతేగాక ఆపరేటింగ్ లాభాలు కూడా పెరిగినట్లు, ఈ మూడో త్రైమాసికంలో 14.7% ఆపరేటింగ్ మార్జిన్ ఉన్నట్లు వివరించింది.

రూ.1,230 కోట్ల నగదు



ఈ మూడో త్రైమాసికం చివరి నాటికి సైయెంట్ వద్ద రూ.1,230 కోట్ల నగదు నిల్వలు ఉన్నాయి. సాధారణంగా మూడో త్రైమాసికంలో ఆదాయాల్లో పెద్ద వృద్ధి ఉండదని, కానీ ప్రస్తుత మూడో త్రైమాసికంలో మాత్రం తాము మెరుగైన ఫలితాలను సాధించామని కంపెనీ ఎండీ అండ్ సీఈఓ కృష్ణ బొడనపు పేర్కొన్నారు. కానీ రెండో త్రైమాసికంతో పోల్చితే, ఈ మూడో త్రైమాసికంలో ఆదాయాలు, లాభాలు తగ్గటానికి సెమీ కండక్టర్-కమ్యూనికేషన్ల విభాగంలో వ్యతిరేక వృద్ధి నమోదు కావటం ప్రధాన కారణమని వివరించారు. డీఎల్ఎం (డిజైన్ లెడ్ మ్యానుఫ్యాక్చరింగ్) వ్యాపార విభాగంలోనూ ఇదే పరిస్థితి ఎదురైనట్లు చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తం మీద సేవల విభాగంలో 8.5% నుంచి 9.5% వృద్ధి ఉంటుందని సైయెంట్ యాజమాన్యం అంచనా వేస్తోంది. ఆపరేటింగ్ లాభాల్లో రెండంకెల వృద్ధి ఉంటుందని, డీఎల్ఎం విభాగంలో మార్జిన్లు పెరిగే అవకాశం ఉందని వివరించింది.

బైబ్యాక్ పై నిర్ణయం వాయిదా: కంపెనీ చేతిలో ఆకర్షణీయమైన రీతిలో నగదు నిల్వలు ఉన్న నేపథ్యంలో సైయెంట్ ఈక్విటీ షేర్లను వెనక్కి కొనుగోలు చేయాలనే (షేర్ల బైబ్యాక్) ఆలోచన చేసింది. ఈ ప్రతిపాదనపై గురువారం జరిగిన కంపెనీ డైరెక్టర్ల బోర్డు సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని భావించారు. కానీ ఈ ప్రతిపాదనను ప్రస్తుతానికి వాయిదా వేశారు. షేర్ల బైబ్యాక్‌పై ఇంకా కూలంకషంగా చర్చించాల్సి ఉందనే అభిప్రాయం వ్యక్తం అయినట్లు, అందువల్ల దీనిపై భవిష్యత్తులో నిర్ణయం తీసుకోవచ్చని అనుకున్నట్లు సైయెంట్ వెల్లడించింది.

మెప్పించిన ఫెడరల్ బ్యాంక్

నికర లాభం రూ.334 కోట్లు



దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ప్రైవేటు రంగ ఫెడరల్ బ్యాంక్ రూ.333.63 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో బ్యాంకు ఆర్జించిన రూ.260 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 28.3 శాతం ఎక్కువ. మొత్తం ఆదాయం రూ.2,729.83 కోట్ల నుంచి రూ.3,299.96 కోట్లకు పెరిగింది. నికర వడ్డీ ఆదాయం 13.40 శాతం వృద్ధితో రూ.1,077.29 కోట్లకు చేరింది. వడ్డీయేతర ఆదాయం రూ.228.63 కోట్ల నుంచి 51 శాతం వృద్ధితో రూ.345 కోట్లకు పెరిగింది. మొత్తం రుణాల్లో స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏలు) 2.52 శాతం నుంచి 3.14 శాతానికి చేరాయి. నికర ఎన్‌పీఏలు 1.36 శాతం నుంచి 1.72 శాతానికి పెరిగాయి. మొండి బాకీలకు మొత్తం కేటాయింపులు రూ.162 కోట్ల నుంచి రూ.190.12 కోట్లకు పెరిగాయి. రుణాల్లో వృద్ధి 24.61 శాతానికి పెరిగినా, నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) మాత్రం 3.3 శాతం నుంచి 3.17 శాతానికి తగ్గింది.

బీఎస్ఈలో షేరు 3.01 శాతం నష్టంతో రూ.88.65 వద్ద ముగిసింది.

ఎల్&టీ టెక్నాలజీ లాభంలో 47% వృద్ధి

దిల్లీ: ఎల్అండ్‌టీ టెక్నాలజీ సర్వీసెస్ (ఎల్‌టీటీఎస్) సంస్థ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.185.6 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో సంస్థ ఆర్జించిన రూ.126.3 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 47 శాతం అధికం. మొత్తం ఆదాయం రూ.969.1 కోట్ల నుంచి 36 శాతం వృద్ధితో రూ.1,316.9 కోట్లకు పెరిగింది. 'డిజిటల్, టెక్నాలజీల్లో మేము మంచి స్థానంలో ఉండటంతో కంపెనీ అన్ని విభాగాల్లోనూ మంచి వృద్ధి నమోదు చేసింది. దీంతో రెండంకెల వృద్ధి సాధించగలిగాం. కొత్త సామర్థ్యాలను నిర్మించడంలో పెట్టుబడులు పెట్టడం, ఆవిష్కరణల కోసం కొత్త ల్యాబ్‌ను సృష్టించడం కొనసాగిస్తామ'ని ఎల్‌టీటీఎస్ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ కేశబ్ పాండా తెలిపారు. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ 1,192 మంది కొత్త ఉద్యోగులను చేర్చుకోవడంతో మొత్తం ఉద్యోగుల సంఖ్య 14,777కు చేరింది.

బీఎస్ఈలో షేరు 2.36 శాతం లాభంతో రూ.1689.45 వద్ద ముగిసింది.

ముగ్గురు భారతీయ అమెరికన్లకు కీలక పదవులు

వాషింగ్టన్

ముగ్గురు భారత సంతతి అమెరికన్లకు కీలక పదవులు దక్కాయి. అత్యంత ప్రాధాన్యమైన మూడు విభాగాలకు బుధవారం వీరిని అధ్యక్షుడు ట్రంప్ ఎంపిక చేశారు. వీరిలో ఒకరు మహిళ కావడం విశేషం. తాజా నియామకాలతో ట్రంప్ ఇప్పటివరకూ 36 మందికిపైగా భారతీయ అమెరికన్లకు ముఖ్యమైన పదవులు ఇచ్చినట్టయింది. అణు విద్యుత్ విభాగ సహాయ కార్యదర్శిగా రీటా బరన్వాల్; ప్రైవసీ-సివిల్ లిబర్టీస్ ఓవర్‌సైట్ బోర్డు సభ్యుడిగా ఆదిత్య బంజాయ్; కోశాగార సహాయ కార్యదర్శిగా బిమల్ పటేల్‌లను అధ్యక్షుడు ఎంపిక చేశారు. వీరి నియామకాల ఆమోదం కోసం సంబంధిత దస్త్రాన్ని కాంగ్రెస్‌కు పంపారు.



ఆదిత్య బంజాయ్ · బిమల్ పటేల్ · రీటా బరన్వాల్

ముగ్గురూ ముగ్గురే...

అణుశక్తి నిపుణురాలైన బరన్వాల్ ఇప్పటికే న్యూక్లియర్ ఆవిష్కరణల విభాగం 'గెయిన్'కు డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. తాజా నియామకంతో అణు సాంకేతిక పరిశోధన, అభివృద్ధి, నిర్వహణ, వసతుల కల్పనకు సంబంధించిన బాధ్యతలను ఆమె నిర్వర్తించాల్సి ఉంటుంది. ఇక యేల్ విశ్వవిద్యాలయ గ్రాడ్యుయేట్ అయిన బంజాయ్ బహుముఖ ప్రజ్ఞాశాలి. రచయితగా, అధ్యాపకుడిగా, సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు సహాయకుడిగా, అమెరికా న్యాయశాఖలో సలహాదారుగా పనిచేశారు. బిమల్ పటేల్ ఆర్థిక నిపుణులు. ప్రస్తుతం ఫైనాన్షియల్ స్టెబిలిటీ ఓవర్‌సైట్ కౌన్సిల్ (ఎఫ్ఎస్ఓసీ) కోశాగార సహాయ కార్యదర్శిగా ఉన్నారు. గతంలోనూ ఆయన పలు ప్రభుత్వ పదవులు చేపట్టారు. స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయ సహాయ ఆచార్యుడిగానూ సేవలందించారు.

ఇంటెలిజెన్స్ కమిటీలో కృష్ణమూర్తికి చోటు!



అమెరికా జాతీయ భద్రతకు సంబంధించిన అత్యంత కీలకమైన ఇంటెలిజెన్స్ కమిటీలో డెమోక్రటిక్ చట్టసభ్యుడు రాజా కృష్ణమూర్తికి చోటు దక్కింది! దక్షిణాసియా నుంచి తొలిసారిగా ఈ కమిటీకి కృష్ణమూర్తి ప్రాతినిధ్యం వహిస్తుండటం విశేషం. ఆయనతో పాటు మరో ముగ్గురు డెమోక్రటిక్ పార్టీ చట్టసభ్యులను కూడా నియమించారు. వీరు హెచ్‌పీఎస్‌సీఐ సభ్యులుగా బాధ్యతలు నిర్వర్తించనున్నారు.



అవిశ్వాస తీర్మానంపై విజయం సాధించిన అనంతరం బ్రిటన్ దిగువ సభలో చిరునవ్వులు చిందిస్తున్న ప్రధాని థెరెసా మే

గట్టెక్కిన ప్రధాని మే

లండన్: బ్రిటన్ ప్రధాని థెరెసా మే అవిశ్వాస తీర్మానంలో విజయం సాధించారు. బుధవారం అర్ధరాత్రి జరిగిన ఓటింగ్‌లో ఆమెకు మద్దతుగా 325 మంది, వ్యతిరేకంగా 306 మంది ఓటేశారు. 19 ఓట్ల స్వల్ప ఆధిక్యతతో ఆమె గండం నుంచి గట్టెక్కారు. ఐరోపా సమాఖ్య నుంచి బ్రిటన్ వైదొలగడానికి ఉద్దేశించిన బ్రెగ్జిట్ వ్యవహారమై ఆమె ప్రతిపాదించిన ఒప్పందాలను సొంతపార్టీ ఎంపీలు సహా, విపక్ష సభ్యులు వ్యతిరేకించారు. దీన్ని అవకాశంగా తీసుకొని ప్రతిపక్ష నేత లేబర్ పార్టీకి చెందిన జెరెమై కోర్బిన్ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. ఆరు గంటల పాటు జరిగిన చర్చల అనంతరం తీర్మానంపై ఓటింగ్ జరగగా మిత్రపక్షం డెమొక్రాటిక్ యూనియనిస్టు పార్టీ మద్దతుతో ఆమె గెలుపొందారు. అనంతరం ప్రధాని మే మాట్లాడుతూ తాజా ప్రతిపాదనలను సభ ముందు ఉంచుతామని చెప్పారు

డోభాల్ కుమారుడి
రహస్య లావాదేవీలు

- పెద్దనోట్ల రద్దు తర్వాత అనుమానాస్పద వ్యవహారం
- కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఆరోపణ

ఈనాడు, దిల్లీ: జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ డోబాల్ కుమారుడు వివేక్ డోబాల్ కేమన్ ఐల్యాండ్‌లో తెరిచిన ఫండ్ అనుమానాలకు తావిస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాంరమేశ్ ఆరోపించారు. ప్రధాని మోదీ 2016 నవంబర్ 8న పెద్ద నోట్లు రద్దు చేసిన 13 రోజుల తర్వాత కేమన్ ఐల్యాండ్‌లో 'జీఎన్‌వై ఏషియా' పేరు మీద వివేక్ డోబాల్‌ఫండ్ తెరిచారని, ఆ తర్వాత ఏడాది వ్యవధిలో అక్కడి నుంచి భారత్‌కు రూ.8,300 కోట్ల ఎఫ్‌డీఐలు రావడం అనుమానాస్పదంగా ఉందని పేర్కొన్నారు. ఆయన గురువారం ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ''2016 నవంబర్ 21న వివేక్ కేమన్ ఐల్యాండ్‌లో జీఎన్‌వై ఏసియా పేరిట ఒక ఫండ్ తెరిచారు. ఆ తర్వాత ఏడాదిలో కేమన్ ఐల్యాండ్ నుంచి దాదాపు రూ.8,300 కోట్ల ఎఫ్‌డీఐ మన దేశంలోకి వచ్చింది. ఆర్‌బీఐ లెక్కల ప్రకారం 2000 నుంచి 2017 వరకు 17 ఏళ్లలో కేమన్ ఐల్యాండ్ నుంచి భారత్‌కు రూ.8,300 కోట్ల ఎఫ్‌డీఐ వస్తే, 2017 ఏప్రిల్ నుంచి 2018 మార్చి మధ్య కేవలం ఏడాది కాలంలోనే రూ.8,300 కోట్ల ఎఫ్‌డీఐ వచ్చింది. 17 ఏళ్లలో వచ్చినంత ఎఫ్‌డీఐ పెద్దనోట్ల రద్దు తర్వాత ఒక్క ఏడాదిలోనే ఎలా వచ్చింది? జీఎన్‌వై ఏషియా సంస్థకు ఈ ఎఫ్‌డీఐలో ఎంతమేర పాత్ర ఉందనేది తేలాలి. 17 ఏళ్లలో వచ్చిన రూ.8,300 కోట్ల ఎఫ్‌డీఐ పెట్టిన వారి పేర్లతోపాటు, పెద్దనోట్ల రద్దు తర్వాత ఏడాదిలో రూ.8,300 కోట్లు పెట్టిన వారి పేర్లను కూడా బయటపెట్టాలి. జీఎన్‌వై ఏషియాకున్న ఇద్దరు డైరెక్టర్లలో ఒకరు వివేక్ డోభాల్ కాగా, మరొకరు డాన్ డబ్ల్యూ. ఇబ్యాంక్స్. సదరు ఇబ్యాంక్స్ పేరు పనామా, ప్యారడైజ్ పత్రాల్లోనూ ఉంది. ఆ పత్రాల్లో పేరున్న వ్యక్తి డోభాల్ కుమారుడున్న కంపెనీలో డైరెక్టర్ ఎలా అయ్యారు? ఎన్ఎస్ఏ ఇద్దరు కుమారుల్లో వివేక్ జీఎన్‌వై ఏషియా ఫండ్ తెరిస్తే, మరో కుమారుడు శౌర్య జీయూస్ స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్ అడ్వయిజర్స్ అనే ఫండ్ తెరిచారు. ఇవి పెద్ద నోట్ల రద్దు తర్వాత ఏర్పడటం అనుమానాస్పదం. ఇక్కడున్న డబ్బును తొలుత కేమన్ ఐల్యాండ్‌కు తరలించి అక్కడి నుంచి భారత్‌కు రప్పించినట్లు అనుమానం ఉంది. దీనిపై దర్యాప్తు జరపాలి. ఆర్‌బీఐ మొత్తం పేర్లు బయట పెట్టాలి. ఎన్ఎస్ఏ కూడా వివరణ ఇవ్వాలి'' అని జైరాంరమేశ్ డిమాండ్ చేశారు.

మేఘాలయ బొగ్గుగనిలో మృతదేహం గుర్తింపు

దిల్లీ, షిల్లాంగ్: మేఘాలయలో బొగ్గుగనిలో చిక్కుకున్న కార్మికుల కోసం దాదాపు నెలరోజులుగా కొనసాగుతున్న అన్వేషణ విషాదాంతమైంది. గనిలో ఓ కార్మికుడి మృతదేహాన్ని నౌకాదళ డైవర్లు గురువారం గుర్తించారు. తూర్పు జయంతియా హిల్స్ జిల్లాలోని ఖ్లా-రైంగ్‌క్సాన్ ప్రాంతంలో ఎలుక బొరియలతో కూడిన గని ఉంది. అందులో అక్రమంగా బొగ్గు తవ్వకాలు చేపట్టేందుకు గత నెల 13న కార్మికులు వెళ్లారు. పక్కనే ప్రవహిస్తున్న లైటీన్ నది నుంచి నీరు ముంచెత్తడంతో 15 మంది అందులోనే చిక్కుకుపోయారు. ఐదుగురు సజీవంగా బయటపడ్డారు. గనిలో చిక్కుకున్నవారిని రక్షించేందుకు నౌకాదళం, జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం(ఎన్‌డీఆర్ఎఫ్), వాయుసేన సిబ్బంది దాదాపు నెల రోజులుగా సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. ప్రమాదం చోటుచేసుకున్న గని లోతు 370 అడుగులు. అందులో 'జలాంతర ఆర్‌వోవీ(రిమోట్లీ ఆపరేటెడ్ వెహికిల్స్)' సాంకేతికత సాయంతో 160-210 అడుగుల లోతున ఓ మృతదేహాన్ని తాము గుర్తించినట్లు నౌకాదళ అధికార ప్రతినిధి కెప్టెన్ డి.కె.శర్మ వెల్లడించారు. మృతదేహాన్ని దాదాపు పైభాగం వరకు తీసుకొచ్చామని చెప్పారు. గనిలో సహాయక చర్యలు కొనసాగిస్తున్న సిబ్బందికి కొన్ని అస్థిపంజరాలు కూడా కనిపించాయి. అవి కార్మికుల అస్థిపంజరాలు కావనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మహారాష్ట్రలో మళ్లీ డ్యాన్స్ బార్లు

- షరతులతో నిర్వహణకు అనుమతించిన సుప్రీంకోర్టు
- పూర్తి నిషేధం సరికాదని వెల్లడి

దిల్లీ, ముంబయి: మహారాష్ట్రలో డ్యాన్స్ బార్లు మళ్లీ తెరుచుకోనున్నాయి. షరతులతో వాటి నిర్వహణకు అనుమతినిస్తూ సుప్రీంకోర్టు గురువారం కీలక తీర్పు వెలువరించింది. డ్యాన్స్ బార్లకు వ్యతిరేకంగా 2016లో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టంలోని కొన్ని నిబంధనలను కొట్టివేసింది. నియంత్రణలు ఉండటం సబబే కానీ పూర్తి నిషేధం మాత్రం సరికాదని పేర్కొంది. ''2005 నుంచి ఇప్పటివరకు డ్యాన్స్ బార్ల ఏర్పాటు కోసం ఒక్కరికి కూడా లైసెన్స్ మంజూరు చేయలేదు. ఇది సరికాదు. నియంత్రణలు ఉండొచ్చు. కానీ అవి పూర్తి నిషేధం స్థాయికి చేరుకోకూడదు'' అని జస్టిస్ ఎ.కె.సిక్రి నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

మహారాష్ట్ర ప్రభుత్వం 'హోటళ్లు, రెస్టారెంట్లు, బార్ రూముల్లో అసభ్య నృత్యాల నిషేధం; మహిళల గౌరవ రక్షణ చట్టం' పేరుతో 2016లో కఠిన చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్టాన్ని హోటళ్లు, రెస్టారెంట్ల యజమానులు సుప్రీంకోర్టులో సవాలు చేశారు. సర్వోన్నత న్యాయస్థానం గతంలో ఇచ్చిన ఆదేశాలను బేఖాతరు చేస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం డ్యాన్స్ బార్లను నిషేధించే తరహాలో చట్టాన్ని తీసుకొచ్చిందని వారు నివేదించారు. రాష్ట్ర ప్రభుత్వం తమ చర్యను సమర్థించుకుంది. డ్యాన్స్ బార్లలో నృత్యాలు మహిళల గౌరవానికి భంగం కలిగించేలా ఉంటున్నాయని తాము గుర్తించినట్లు తెలిపింది. ఇరుపక్షాల వాదనలు ఆలకించిన సర్వోన్నత న్యాయస్థానం తాజాగా డ్యాన్స్ బార్ల నిర్వహణకు అనుకూలంగా తీర్పు వెలువరించింది.

తీర్పులో కీలక అంశాలు

- డ్యాన్స్ బార్లలో ప్రదర్శనలు ఇచ్చేవారికి టిప్‌లు ఇవ్వొచ్చు. కానీ వారిపై కరెన్సీ నోట్లు చల్లకూడదు.
- సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 11:30 వరకే ఈ బార్లు పనిచేయాలని 2016లో మహారాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టంలో ఉంది. ఆ నిబంధనను పాటించాల్సిందే.
- డ్యాన్స్ బార్లలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి అని కూడా చట్టంలో ఉంది. గోప్యతకు భంగం కలిగించేలా ఉందంటూ ఈ నిబంధనను సుప్రీంకోర్టు కొట్టివేసింది.
- మతపరమైన స్థలాలు, విద్యాసంస్థలకు కనీసం కిలోమీటరు దూరంలో డ్యాన్స్ బార్లను ఏర్పాటుచేయాలంటూ ఉన్న నిబంధనను తొలగించింది.
- బార్ గదులు, నృత్య వేదికల మధ్య విభాగిని(పార్టిషన్) ఉండాలన్న నిబంధననూ కొట్టివేసింది.



పాత్రికేయుడి హత్య కేసులో
డేరా బాబాకు జీవితఖైదు

- మరో ముగ్గురికీ అదే శిక్ష
- సీబీఐ ప్రత్యేక కోర్టు తీర్పు

పంచకుల: పాత్రికేయుడిని హత్య చేసిన కేసులో డేరా సచ్చా సౌధా అధిపతి గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ (డేరా బాబా)కు జీవిత ఖైదు పడింది. అతడితోపాటు మరో ముగ్గురు దోషులకూ ఇదే శిక్షను విధిస్తూ పంచకులలోని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం గురువారం తీర్పును ఇచ్చింది. హరియాణాలో 16 ఏళ్ల క్రితం రామ్‌చందర్ ఛత్రపతి అనే పాత్రికేయుడు హత్యకు గురైన ఘటనకు సంబంధించి ఈ కేసు నమోదైంది. మహిళలపై డేరా బాబా సాగిస్తున్న లైంగిక దోపిడీ గురించిన ఓ లేఖను 2002లో ఛత్రపతి పనిచేస్తున్న దినపత్రిక ప్రచురించింది. కొన్ని రోజుల అనంతరం ఆయన్ను దుండగులు కాల్చి చంపారు. ఈ హత్యకు సంబంధించి ప్రధాన కుట్రదారుడు డేరా బాబాతోపాటు నిర్మల్ సింగ్, కుల్దీప్ సింగ్, కృషన్‌లాల్‌లను వారం క్రితమే కోర్టు దోషులుగా తేల్చింది. తాజాగా వారికి శిక్షలు ఖరారు చేసింది. గతేడాది ఆగస్టులో ఓ అత్యాచార కేసులో డేరా బాబాకు 20 ఏళ్ల జైలుశిక్ష పడింది. రోహ్‌తక్‌లోని సునరియా జైల్లో అతడు ఈ శిక్షను అనుభవిస్తున్నాడు. తాజా కోర్టు విచారణలో అతడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నాడు.

రుణాల మంజూరుకు కొత్త ప్రక్రియ

- జీఎస్టీ రిటర్నులు ఆధారంగా అమలు
- ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడి

అహ్మదాబాద్: వస్తు-సేవల పన్ను (జీఎస్టీ) రిటర్నుల ఆధారంగా బ్యాంకులు రుణాలు ఇచ్చేలా కొత్త విధానం ప్రవేశపెట్టనున్నామని ప్రధాని మోదీ వెల్లడించారు. సొంతరాష్ట్రం గుజరాత్‌లో మూడు రోజుల పర్యటన నిమిత్తం వచ్చిన ప్రధాని గురువారం గాంధీనగర్‌లో 'విశ్వ వ్యాపార ప్రదర్శన'ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ ''నూతన విధానం వైపు దేశం పయనిస్తోంది. బ్యాంకులు కేవలం జీఎస్టీ రిటర్నుల ఆధారంగానే రుణాలు ఇచ్చే విధానం రానుంది. పరోక్ష పన్నుల విధానాన్ని క్రమబద్ధం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి'' అని చెప్పారు.

కోట్లాది ఉద్యోగ అవకాశాలను కల్పించాం

తమ ప్రభుత్వం గత నాలుగున్నరేళ్లలో కోట్లాది ఉద్యోగ అవకాశాల కల్పనకు సహకరించిందని ప్రధాని అన్నారు. ''పర్యాటక రంగంలో కానీయండి, సేవా రంగంలో కానీయండి.. కోట్లాది ఉద్యోగ అవకాశాలను కల్పించాం'' అని చెప్పారు. చిన్న వ్యాపారులు ఆన్‌లైన్‌లో వ్యాపారం చేసుకోవడానికి వీలుగా 'జెమ్' (గవర్నమెంట్ ఈ-మార్కెట్)ను ప్రారంభించామని, దీని ద్వారా ఇంతవరకు రూ.16,500 కోట్ల వ్యాపారం జరిగిందని తెలిపారు.



సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆసుపత్రిని ప్రారంభించిన అనంతరం ప్రసంగిస్తున్న మోదీ

చక్రం నుంచి చంద్రయాన్ వరకు...

ఈ ప్రదర్శనలో ఖాదీ, ఇస్రో, డీఆర్‌డీఏ వంటి సంస్థలు 'భారత్‌లో తయారీ'లో భాగంగా తాము రూపొందించిన ఉత్పత్తులను ప్రదర్శించాయి. వీటన్నింటినీ ప్రధాని సందర్శించారు. తొలిసారిగా ఆఫ్రికా దేశాలు తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నాయి. పాకిస్థాన్ నుంచి ఎలాంటి బృందమూ రాలేదు. చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఉత్పత్తుల కోసం ప్రత్యేకంగా పెవిలియన్లు ఏర్పాటు చేశారు. దాదాపు 1,500 మంది ప్రముఖ స్వదేశీ, విదేశీ వ్యాపారులు రానుండడంతో వారికి ఈ ఉత్పత్తులను పరిచయం చేయనున్నారు. వారితో సమావేశాలు కూడా నిర్వహించనున్నారు.

రిజర్వేషన్లపై దృఢ నిర్ణయం

జనరల్ కేటగిరీలోని ఆర్థికంగా వెనుకబడిన పేదలకు పది శాతం రిజర్వేషన్లపై రాజకీయంగా దృఢ నిర్ణయం తీసుకున్నామని ప్రధాని చెప్పారు. ఇక్కడ రూ.750 కోట్లతో నిర్మించిన ఎస్‌వీపీ వైద్య శాస్త్రాల పరిశోధన కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. గతంలోని రిజర్వేషన్ల విధానాలు సామాజిక అశాంతిని నింపితే తమ విధానం వల్ల సామాజిక సామరస్యం నెలకొంటుందని అన్నారు. అందరికీ సమాన అవకాశాలు కల్పించాలన్నదే తమ ప్రభుత్వ విధానమని చెప్పారు. అభివృద్ధి పరుగులో ఎవరూ వెనుకబడకూడదన్నదే లక్ష్యమని వివరించారు.

నేడు వైబ్రంట్ గుజరాత్ ప్రారంభం

వైబ్రంట్ గుజరాత్ 9వ సదస్సును ప్రధాని మోదీ శుక్రవారం ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ప్రారంభోత్సవం చేయనున్నారు. వివిధ దేశాల బృందాలతో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2003లో ఆయనే ఈ సదస్సుకు శ్రీకారం చుట్టడం గమనార్హం.

రైతుల కోసం కేంద్రం భారీ ప్రణాళికలు!

దిల్లీ: రైతుల కష్టాలను తీర్చేందుకు రాబోయే వారాల్లో కొన్ని భారీ ప్రణాళికలను తమ ప్రభుత్వం ప్రకటించనుందని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి రాధామోహన్ సింగ్ సంకేతాలిచ్చారు. ఏటా బడ్జెట్ సమయంలో గానీ, ఆ తర్వాత గానీ రైతుల కోసం కేంద్రం కొత్త కొత్త కార్యక్రమాలు ప్రకటిస్తోందని.. ఈసారీ కూడా అది కొనసాగుతుందని అన్నారు. చిన్న, సన్నకారు రైతుల సమస్యలను తీర్చేందుకు ఆర్థిక ప్యాకేజీ, తీసుకున్న రుణాలను సమయానికి చెల్లించేవారికి వడ్డీ రాయితీ కల్పించడం వంటి ప్రతిపాదనలతో వ్యవసాయశాఖ కేబినెట్ నోట్‌ను సిద్ధం చేసినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కేంద్రం భారీ వ్యవసాయ ప్యాకేజీని ప్రకటించనుందా? అని విలేకర్లు ప్రశ్నించగా ప్రకటన సమయంలోనే అన్ని విషయాలూ బయటకు వస్తాయని రాధామోహన్ సింగ్ బదులిచ్చారు. అంతకుముందు చిన్నకారు రైతుల వ్యవసాయ వాణిజ్య సమాఖ్య (ఎస్ఎఫ్ఏసీ) ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రైతుల సంక్షేమానికి కేంద్రం కట్టుబడి ఉందని చెప్పారు.

సీబీఐ కొత్త డైరెక్టర్‌గా ఎన్ఐఏ అధిపతి?

దిల్లీ: సీబీఐ కొత్త డైరెక్టర్ నియామకానికి కసరత్తు ఆరంభమైంది. 1982 నుంచి 1985 వరకూ మొత్తం నాలుగు బ్యాచ్‌లకు చెందిన 17 మంది ఉన్నతాధికారులకు ఈ పదవిని చేపట్టే అర్హత ఉంది. వీరిలో ఆరుగురి పేర్లను ప్రధాని మోదీ నేతృత్వంలోని ఉన్నతస్థాయి కమిటీ పరిశీలిస్తున్నట్టు సమాచారం. అయితే... ఈ రేసులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధిపతి వై.సి.మోదీ ముందున్నట్లు తెలుస్తోంది. అసోం-మేఘాలయ కేడర్ (1984 బ్యాచ్)కు చెందిన ఆయన 33 ఏళ్లుగా సేవలు అందిస్తున్నారు. పదేళ్ల పాటు సీబీఐలోనే పనిచేశారు. ఆర్థిక నేరాల కేసులను ఛేదించడంలో ఆయనకు మంచి అనుభవం ఉంది.

నికోబార్ దీవుల్లో భూకంపం

పోర్ట్ బ్లెయిర్: అండమాన్ నికోబార్ దీవుల్లో గురువారం బలమైన భూకంపం వచ్చింది. రిక్టర్ స్కేల్‌పై దీని తీవ్రత ఆరుగా నమోదైనట్లు జాతీయ భూకంప అధ్యయన కేంద్రం (ఎన్‌సీఎస్) వెల్లడించింది. ఉదయం 8.45 సమయంలో నికోబార్ దీవుల ప్రాంతం కేంద్రంగా కంపనాలు వచ్చినట్లు పేర్కొంది. ప్రాణ, ఆస్తి నష్టం జరిగినట్లు ఎలాంటి నివేదికలూ రాలేదు.

లోక్‌పాల్‌కి అర్హులను తేల్చండి

- సుప్రీం కోర్టు ఆదేశం
- అన్వేషణ సంఘానికి ఫిబ్రవరి వరకు గడువు

దిల్లీ: ప్రథమ లోక్‌పాల్ నియామకానికి ఫిబ్రవరిలోగా అర్హుల పేర్లను సూచించాలని అన్వేషణ సంఘాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయి, న్యాయమూర్తులు జస్టిస్ ఎల్.నాగేశ్వరరావు, జస్టిస్ ఎస్.కె.కౌల్‌తో కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వులు ఇచ్చింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రంజనా ప్రకాశ్ దేశాయి ఆధ్వర్యంలో ఈ సంఘం ఏర్పాటయింది. ఇది అర్హుల పేర్లతో జాబితాను రూపొందించి ప్రధాని అధ్యక్షతన ఏర్పాటయ్యే ఎంపిక సంఘానికి అందజేయాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ కె.కె.వేణుగోపాల్ మాట్లాడుతూ తగిన సౌకర్యాలు కల్పించకపోవడం, సిబ్బందిని నియమించకపోవడం వల్లనే అన్వేషణ సంఘం (సెర్చ్ కమిటీ) ఇంకా చర్చలను కూడా ప్రారంభించలేకపోయిందని తెలిపారు. బుధవారమే



తొలి సమావేశం జరిగిందని చెప్పారు. నిధుల కొరత లేదని, రూ.4.39 కోట్లు కేటాయించారని తెలిపారు. వ్యాజ్యం దాఖలు చేసిన కామన్ కాజ్ స్వచ్ఛంద సంస్థ తరఫున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపిస్తూ అన్వేషణ సంఘం సభ్యుల పేర్లను ప్రభుత్వం బయటపెట్టలేదని, వారి వివరాలు వెబ్‌సైట్‌లో లేవని తెలిపారు. దీనిపై స్పందించిన ధర్మాసనం.. కర్తవ్య నిర్వహణకు వీలుగా అన్ని సౌకర్యాలు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ తదుపరి విచారణను మార్చి ఏడో తేదీకి వాయిదా వేసింది.

అన్వేషణ సంఘం ఏర్పాటులోనే జాప్యం

లోక్‌పాల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించినా, మొదటి లోక్‌పాల్ నియామకం ఇంకా జరగలేదంటూ కామన్‌కాజ్ సంస్థ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అన్వేషణ సంఘం ఏర్పాటుపై కేంద్రం గత ఏడాది జులై 24న ప్రమాణ పత్రాన్ని సమర్పించగా వివరాలు సరిగ్గా లేవంటూ ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. అన్వేషణ సంఘంలో ఎవరిని నియమించాలన్న విషయమై ప్రధాని నరేంద్ర మోదీ, అప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర, లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్, ప్రముఖ న్యాయకోవిదుడు ముకుల్ రోహత్గీ ఆధ్వర్యంలోని ఎంపిక సంఘం చర్చలు జరిపింది. ఛైర్‌పర్సన్ సహా కనీసం ఏడుగురు సభ్యులు ఉండాలని నిర్ణయించింది. అనంతరం సెప్టెంబరు 27న కేంద్ర ప్రభుత్వం ఎనిమిది మంది సభ్యులతో అన్వేషణ సంఘాన్ని నియమించింది. జస్టిస్ దేశాయి అధ్యక్షతన ఏర్పాటయిన ఈ సంఘంలో ఎస్‌బీఐ మాజీ ఛైర్‌పర్సన్ అరుంధతీ భట్టాచార్య, ప్రసార భారతి ఛైర్మన్ ఎ.సూర్యప్రకాశ్, ఇస్రో మాజీ ఛైర్మన్ ఎ.ఎస్.కిరణ్ కుమార్, అలహాబాద్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ శఖారాం సింగ్ యాదవ్, గుజరాత్ మాజీ డీజీపీ షబ్బీర్‌హుస్సేన్ ఖండ్వావాలా, రాజస్థాన్ కేడర్ విశ్రాంత ఐఏఎస్ అధికారి లలిత్ కె పన్వర్, మాజీ సొలిసిటర్ జనరల్ రంజిత్ కుమార్ సభ్యులుగా నియమితులయ్యారు.

వేధింపుల బారిన హెచ్-1బి వీసాదారులు

అమెరికా మేధోమథన సంస్థ నివేదిక

వాషింగ్టన్: అమెరికాలో హెచ్-1బి వీసాదారులు శ్రమ దోపిడీ, వేధింపులకు గురవుతున్నారని అట్లాంటిక్ కౌన్సిల్ దక్షిణాసియా కేంద్రం అనే మేధోమథన సంస్థ వెల్లడించింది. వారిలో చాలా మంది దారుణమైన పరిస్థితుల మధ్య ఉద్యోగాలు చేస్తున్నారని పేర్కొంది. ప్రస్తుత హెచ్-1బి విధానం వల్ల అమెరికన్లతో పాటు విదేశీయులకూ నష్టం కలుగుతోందని ఇందులో అభిప్రాయపడింది. హెచ్-1బి వీసాదారులకు తగిన వేతనాలు, ఉద్యోగ హక్కులు కల్పించాలని అమెరికా ప్రభుత్వానికి సూచించింది. ప్రతిభావంతుల్లోకెల్లా అత్యుత్తమమైన వారు కావాలనుకుంటే వేతనాలూ ఆ స్థాయిలోనే ఉండాలని వ్యాఖ్యానించింది. అమెరికాలో నిపుణులు లభించనప్పుడే సంస్థలు హెచ్-1బి ద్వారా ఉద్యోగులను నియమించుకోవాలని స్పష్టం చేసింది. ముందుగా దరఖాస్తు చేసిన వారికి గానీ, లాటరీ విధానంలో గానీ వీసాలను ఇవ్వడం వల్ల హెచ్-1బి అసలు ప్రయోజనం నెరవేరదని.. ఈ పద్ధతుల్లో మార్పులు రావాలని అభిప్రాయపడింది.

లెక్కలు, సైన్సులో ఐఐటీల మార్గనిర్దేశనం

కేంద్ర మంత్రి జావడేకర్ వెల్లడి



అహ్మదాబాద్: ఐఐటీ, ఐఐఎస్ఈఆర్ వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాలు బడి పిల్లలకు మార్గనిర్దేశనం చేయనున్నాయి. గణితం, సైన్స్ వంటి కీలకమైన అంశాల్లో చిన్నారులు వెనుకబడిపోకుండా, వారికి తగిన శిక్షణ అందేలా చర్యలు తీసుకోనున్నాయి. తమ ప్రాంగణాలకు సమీపంలో ఉన్న 10 నుంచి 15 పాఠశాలలను ఎంపిక చేసుకుని ఈ మార్గనిర్దేశక సేవలు అందించనున్నాయి. ఈ మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జావడేకర్ వెల్లడించారు. 'వైబ్రెంట్ గుజరాత్' ప్రపంచ సదస్సులో భాగంగా గుజరాత్ సైన్స్ సిటీలో ఏర్పాటు చేసిన కొన్ని ప్రదర్శనలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలోనే ప్రభుత్వ తాజా నిర్ణయం గురించి జావడేకర్ వివరాలు వెల్లడించారు. ప్రాథమిక పాఠశాలల్లో ఉన్నప్పుడే విద్యార్థులకు పరిశోధనలపై ఆసక్తి కలిగేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. దేశంలో ఆవిష్కరణల సంస్కృతిని, అంకుర సంస్థలను ప్రోత్సహించేందుకు కేంద్రం ఎన్నో చర్యలు తీసుకుంటోందని వివరించారు.

పాక్యాంగ్‌లో దిగిన వాయుసేన విమానం

దిల్లీ: సిక్కింలోని వ్యూహాత్మకంగా కీలకమైన పాక్యాంగ్ వైమానిక క్షేత్రంలో వాయుసేనకు చెందిన ఏఎన్-32 రవాణా విమానం విజయవంతంగా ల్యాండ్ అయింది. భారత్-చైనా సరిహద్దుకు 60 కి.మీ.ల దూరంలో ఉన్న పాక్యాంగ్.. సముద్ర మట్టానికి 4,500 అడుగుల ఎత్తులో ఉంది. దేశంలోనే అత్యంత ఎత్తులో ఉన్న వైమానిక క్షేత్రాల్లో ఒకటి. ఇక్కడ ఏఎన్-32 శ్రేణి విమానం దిగడం ఇదే మొదటిసారని వాయుసేన అధికారులు వెల్లడించారు. వింగ్ కమాండర్ ఎస్‌కే సింగ్ నేతృత్వంలో ఈ ల్యాండింగ్ జరిగినట్లు వివరించారు. గతేడాది ఈ క్షేత్రంలో డార్నియర్ విమానం దిగింది. కొన్ని రోజుల క్రితమే అరుణాచల్ ప్రదేశ్‌లోని తేజూ వైమానిక క్షేత్రంలోనూ సీ-130జే విమాన ల్యాండింగ్‌ను రాత్రి పూట, పగటి పూట నిర్వహించారు. 2017 చైనాతో డోక్లాం వివాదం తలెత్తిన నేపథ్యంలో సరిహద్దుల వెంబడి మౌలిక వసతుల అభివృద్ధిని భారత్ వేగవంతం చేసింది.



పాక్యాంగ్ వైమానిక క్షేత్రంలో దిగిన ఏఎన్-32 విమానం

10% కోటా అమలుకు ఉత్తర్వులు జారీ

- మార్చి 31లోపు వెబ్‌సైట్‌లలో వివరాలు ఉంచాలని ఆదేశం

ఈనాడు, దిల్లీ: దేశవ్యాప్తంగా ప్రభుత్వ నియంత్రణలో ఉన్న అన్ని ఉన్నత విద్యాసంస్థల్లో జనరల్ కేటగిరీలోని ఆర్థికంగా వెనుకబడిన వర్గాల(ఈడబ్ల్యుఎస్)కు 10% రిజర్వేషన్లు అమలు చేయాలని ఆదేశిస్తూ కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. 103వ రాజ్యాంగ సవరణ చట్టం ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా నిధులు సమకూరుస్తున్న విద్యాసంస్థలన్నింటిలోనూ ఈ రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ యూజీసీ, ఏఐసీటీఈ, ఎన్‌సీటీఈ ఛైర్మన్లు, ఉన్నత విద్యాశాఖలో వివిధ విభాగాలకు నేతృత్వం వహిస్తున్న అధికారులు, అన్ని రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శులకు ఆఫీస్ మెమోరాండం జారీచేసింది. ఉన్నత విద్యాసంస్థల్లోని ప్రతి విభాగంలో ఉన్న మొత్తం సీట్లలో గరిష్ఠంగా పదిశాతం సీట్లను వీరికి రిజర్వ్ చేయాలని అందులో స్పష్టం చేసింది. 2019-20 విద్యాసంవత్సరం నుంచి ఇవి అమలవుతాయని పేర్కొంది. కేంద్ర విద్యా సంస్థల చట్టం (సెంట్రల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ రిజర్వేషన్స్ ఇన్ అడ్మిషన్స్- యాక్ట్ 2006లోని సెక్షన్ 2, క్లాజ్-డి)లో చెప్పిన అన్ని కేంద్ర విద్యాసంస్థల్లో వీటిని అమలు చేయాలని స్పష్టం చేసింది. ఈ కొత్త కోటా ఇదే చట్టంలోని షెడ్యూల్‌లో చెప్పిన 8 సంస్థలతో పాటు, మైనార్టీ విద్యా సంస్థలకు వర్తించదని పేర్కొంది. రిజర్వేషన్‌కు తగ్గట్టు ప్రతి కేంద్ర విద్యాసంస్థ సంబంధిత అధికారుల ముందస్తు అనుమతితో ప్రతి విభాగంలో సీట్లను పెంచుకోవచ్చని స్పష్టం చేసింది. ఈ అనుమతి గరిష్ఠంగా రెండేళ్లవరకు అమలులో ఉంటుందని పేర్కొంది.

తొలి డ్రైవర్ రహిత బస్సు



ఇది మన దేశంలోనే తొలి డ్రైవర్ రహిత బస్సు. పంజాబ్‌లోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ విద్యార్థులు దీన్ని తయారుచేశారు. పూర్తిగా సౌర విద్యుత్‌తో నడవడం దీని ప్రత్యేకత. దీని కోసం బస్సుపై సౌర ఫలకాలు ఏర్పాటుచేశారు. ఒకసారి ఛార్జింగ్ పెడితే 70 కి.మీ. వరకూ ఇది పరుగులు తీస్తుంది. దీనిలో ప్రత్యేక సెన్సర్‌లు ఉన్నాయి. ఇవే బస్సుకు మార్గనిర్దేశం చేస్తాయి. ప్రమాద సమయాల్లో అనుసరించాల్సిన వ్యూహాలను సమాచారం రూపంలో దీనికి అందించారు. 15 మంది వరకూ బస్సులో ప్రయాణించొచ్చు. దీని ధర రూ.15 లక్షల వరకు ఉంటుందని అంచనా.

ఛాంపియన్

విజయవంతమైన పర్యటనలో ఆఖరి పోరాటానికి వేళైంది. ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్ ఫలితాన్ని నిర్ణయించే ఆఖరి మ్యాచ్ నేడే. కంగారూల గడ్డపై తొలిసారి టెస్టు సిరీస్ గెలిచి చరిత్ర సృష్టించిన టీమ్ ఇండియా.. ఇప్పుడు తొలి ద్వైపాక్షిక వన్డే సిరీస్‌పై కన్నేసింది. మరో ఘన విజయంతో, ఆత్మవిశ్వాసాన్ని ఎన్నో రెట్లు పెంచిన పర్యటనను మరింత చిరస్మరణీయం చేసుకోవాలనే పట్టుదలతో కోహ్లీసేన ఉండగా.. వన్డే సిరీస్‌నైనా నెగ్గి పరువు నిలబెట్టుకోవాలని ఆతిథ్య జట్టు ఆరాటపడుతోంది. మరి అంతిమ యుద్ధంలో ఎవరిది పైచేయి అవుతుందో చూద్దాం!

చిక్కేనా సిరీస్?

ఉదయం 7.50 నుంచి సోని నెట్‌వర్క్‌లో

ఆస్ట్రేలియాతో భారత్ ఆఖరి వన్డే నేడు



మెల్‌బోర్న్

ఆస్ట్రేలియాలో తొలిసారి ద్వైపాక్షిక సిరీస్ గెలుచుకోవాలనుకుంటున్న భారత్ చిట్టచివరి పోరాటానికి సిద్ధమైంది. శుక్రవారం జరిగే మూడో వన్డేలో ఆసీస్‌తో తలపడుతుంది. సిరీస్‌లో రెండు జట్లు 1-1తో సమంగా ఉన్నాయి. తొలి వన్డేలో ఆతిథ్య జట్టు 34 పరుగుల తేడాతో నెగ్గగా.. రెండో వన్డేలో భారత్ 6 వికెట్ల తేడాతో విజయం సాధించిన సంగతి తెలిసిందే. భారత జట్టు ఆస్ట్రేలియాలో ఎప్పుడూ ద్వైపాక్షిక వన్డే సిరీస్ నెగ్గలేదు. వన్డే ఫార్మాట్లో ఆసీస్‌లో రెండు సిరీస్‌లు నెగ్గింది కానీ అవి ద్వైపాక్షికం కాదు. భారత జట్టు అక్కడ 1985లో వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ క్రికెట్, 2008లో సీబీ సిరీస్‌లు గెలిచింది. నిజం చెప్పాలంటే ఆసీస్‌లో భారత్ ద్వైపాక్షిక వన్డే సిరీస్ ఆడడం ఇది రెండోసారి మాత్రమే. తొలిసారి 2016లో ఆడిన సిరీస్‌లో భారత్ 1-4తో ఓడిపోయింది. భారత్ ఆఖరి మ్యాచ్‌లో గెలిస్తే ఆసీస్‌లో ఒక్క సిరీస్ కూడా కోల్పోకుండా పర్యటనను ముగించినట్లవుతుంది. టీ20 సిరీస్‌ను 1-1తో సమం చేసిన భారత్ టెస్టు సిరీస్‌ను 2-1తో చేజిక్కించుకున్న విషయం తెలిసిందే.

అదే సమస్య: రెండో వన్డే జోరును మూడో వన్డేలోనూ కొనసాగించాలనుకుంటున్న భారత్‌కు.. ఆరో బౌలర్‌గా ఉపయోగించుకునేందుకు సరైన ప్రత్యామ్నాయం లేకపోవడమే పెద్ద సమస్య. అందుకోసం జట్టు ఇప్పుడు సీమ్ బౌలింగ్ ఆల్‌రౌండర్ విజయ్ శంకర్, కేదార్ జాదవ్‌ల నుంచి ఒకరిని ఎంచుకోవాల్సివుంటుంది. పార్ట్‌టైమ్ ఆఫ్‌స్పిన్నరైన జాదవ్.. ఇంతకుముందు బంతితో మెరుగైన ప్రదర్శన చేసిన సంగతి తెలిసిందే. వేరే దారి లేక కోహ్లి.. సిడ్నీలో రాయుడుతో బౌలింగ్ చేయించాడు. కానీ అతడి బౌలింగ్ శైలిపై అంపైర్లు ఐసీసీకి ఫిర్యాదు చేశారు. ఇక అడిలైడ్‌లో సిరాజ్ ధారాళంగా పరుగులిస్తున్నా.. ప్రత్యామ్నాయం లేకపోవడంతో కోహ్లీకి అతడితో అన్ని ఓవర్లు బౌలింగ్ చేయించక తప్పలేదు. ఈ నేపథ్యంలో మూడో వన్డేకు రాయుడును పక్కన పెట్టే అవకాశం ఉంది. మరి అతడి స్థానంలో కోసం జాదవ్, విజయ్ శంకర్‌లలో ఎవరు వస్తారో చూడాలి. చాహల్ కూడా ఆ స్థానం కోసం పోటీలో ఉన్నాడు. మ్యాచ్ వేదిక ఎంసీజీలో ఎక్కువ దూరం ఉన్న బౌండరీలు, పొదుపుగా బౌలింగ్ చేయడం చాహల్‌కు అనుకూలాంశాలు. ఇక బ్యాటింగ్‌లో భారత్‌కు పెద్దగా ఇబ్బందులేమీ లేవు. ధోని రెండు వరుస అర్ధశతకాలతో ఫామ్‌లోకి రావడం జట్టుకు సంతోషాన్నిస్తోంది.

పిచ్.. వాతావరణం

ఎంసీజీ పిచ్‌పై ఫాస్ట్‌బౌలర్లకు మంచి బౌన్స్ లభించనుంది. బౌండరీలు దూరంగా ఉన్నందున స్పిన్నర్లు కూడా కీలకం కానున్నారు. వాతావరణం వల్ల ఆటకు ఎలాంటి ఆటంకం కలిగే అవకాశం లేదు.

తుది జట్లు

భారత్ (అంచనా): రోహిత్ శర్మ, ధావన్, కోహ్లి, ధోని, కార్తీక్, కేదార్ జాదవ్/విజయ్ శంకర్, జడేజా, భువనేశ్వర్ కుమార్, కుల్‌దీప్ యాదవ్, ఖలీల్ అహ్మద్, షమి.

ఆస్ట్రేలియా: ఫించ్, అలెక్స్ కరే, ఖవాజా, షాన్ మార్ష్, హాండ్స్‌కాంబ్, స్టాయినిస్, మాక్స్‌వెల్, రిచర్డ్‌సన్, సిడిల్, జంపా, స్టాన్‌లేక్.

9 ఎంసీజీలో ఆస్ట్రేలియాతో ఆడిన 14 వన్డేల్లో భారత్ ఓటములు. గత మూడు వన్డేల్లో ఒక్కటీ నెగ్గలేదు.

రెండు మార్పులతో ఆస్ట్రేలియా



ఫించ్

ఆస్ట్రేలియాకు ఓపెనింగే పెద్ద సమస్యగా మారింది. ఫించ్, అలెక్స్ కరే శుభారంభాలివ్వలేకపోవడంతో మిడిల్ ఆర్డర్‌పై ఎక్కువ భారం పడుతోంది. ఇప్పటికే తుది జట్టును ప్రకటించిన ఆస్ట్రేలియా రెండు మార్పులు చేసింది. లైయన్ స్థానంలో జంపా, గాయపడ్డ పేసర్ బెహెండార్ఫ్ స్థానంలో స్టాన్‌లేక్ జట్టులోకి వచ్చారు. షాన్ మార్ష్ మంచి ఫామ్‌లో ఉండడం ఆసీస్‌కు సానుకూలాంశం.

భారత్‌కు బ్యాటింగ్ అప్పగించాలి!

డీన్ జోన్స్

వన్డే సిరీస్ నిర్ణయాత్మక మ్యాచ్‌కు మెల్‌బోర్న్ ఆతిథ్యమివ్వనుంది. పెద్ద మైదానంలో ఏ జట్టు బౌలర్లు ఎలాంటి అస్త్రాలతో సిద్ధమవుతారో చూడాలి. 2015లో ఇక్కడే ఆస్ట్రేలియా వన్డే ప్రపంచకప్‌ను కైవసం చేసుకుంది. ఈ పిచ్‌పై ఎలా బౌలింగ్ చేయాలో వారికి బాగా తెలుసు. బౌండరీలు 80-85 మీటర్ల దూరంలో ఉంటాయి కాబట్టి కంగారూ బౌలర్లు ఎక్కువగా షార్ట్ బంతులతో భారత బ్యాట్స్‌మెన్‌ను పరీక్షించే అవకాశముంది. ఇక వన్డేల్లో కోహ్లి సాధించిన 39 వన్డేల్లో 32 జట్టు విజయానికి తోడ్పడ్డాయి. అతడు అద్భుత బ్యాట్స్‌మన్. సచిన్ అంటే నాకెంతో గౌరవముంది. ఐతే వన్డేల్లో ఆల్‌టైమ్ గ్రేట్ ప్లేయర్‌గా విరాట్ కోహ్లి నిలుస్తాడని అనిపిస్తోంది. అడిలైడ్‌లో జరిగిన రెండో వన్డే ఆఖర్లో దినేశ్ కార్తీక్ ధనాధన్ ఇన్నింగ్స్‌తో జట్టుకు మేలుచేశాడు. ధోని తనదైన శైలిలో మ్యాచ్‌ను ముగించాడు. వన్డే క్రికెట్ గమనాన్ని అతడు గొప్పగా అర్థం చేసుకుంటాడు. ఎప్పుడు ఏం చేయాలో ఎలా మ్యాచ్‌ను మలుపు తిప్పాలో అతడికి బాగా తెలుసు. ఇప్పటికీ సిరీస్ టీమ్‌ఇండియాదే అనుకుంటున్నా. ఆస్ట్రేలియాను 280 పరుగులకు పరిమితం చేస్తే.. భారత జట్టు గెలవకపోవడానికి కారణాలేం కనిపించడం లేదు. ఆసీస్ టాస్ గెలిస్తే మొదట టీమ్‌ఇండియాకే బ్యాటింగ్ అప్పగించడం ఉత్తమం. ఎందుకంటే.. లక్ష్యాన్ని ఛేదించడమెలానో ప్రస్తుతం ప్రపంచంలో ఆ జట్టు కంటే గొప్పగా మరో జట్టుకు తెలియదు.

THE ULTIMATE INVERTER BATTERY
EXIDE INVATUBULAR

పాండ్య, రాహుల్‌ల భవితవ్యం కోర్టులో..



దిల్లీ: టీమ్‌ఇండియా ఆటగాళ్లు హార్దిక్ పాండ్య, కేఎల్ రాహుల్‌ల భవితవ్యం ఇప్పుడిప్పుడే తేలేలా లేదు. ఓ టీవీ కార్యక్రమంలో మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిద్దరిపై విచారణ చేపట్టి తుది నిర్ణయం తీసుకునేందుకు వెంటనే అంబుడ్స్‌మన్‌ను నియమించాలని బీసీసీఐ పాలకుల కమిటీ (సీవోఏ) సుప్రీం కోర్టుకు విజ్ఞప్తి చేసింది. సీవోఏ వినతిని పరిశీలించిన కోర్టు ద్విసభ్య బెంచ్ మరో వారం తర్వాత విచారణ చేపడతామని చెప్పింది. ఆటగాళ్ల కేసు విషయంలో కోర్టు సహాయకుడిగా ఉండేందుకు సీనియర్ న్యాయవాది గోపాల్ సుబ్రమణియన్ నిరాకరించడంతో.. అతడి స్థానంలో మాజీ అదనపు సొలిసిటర్ జనరల్ పీఎస్ నర్సింహను నియమించింది. అతడు బాధ్యతలు చేపట్టాక కోర్టు అంబుడ్స్‌మన్‌ను నియమిస్తుంది. విచారణ ఆలస్యమవనుండటంతో రాహుల్, పాండ్య న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కూ దూరమయ్యే అవకాశముంది. 'కాఫీ విత్ కరణ్' కార్యక్రమంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన పాండ్య, రాహుల్‌లపై సీవోఏ నిషేధం విధించిన సంగతి తెలిసిందే. తొలుత వారిద్దరిపై రెండు వన్డేల నిషేధం విధించాలని సీవోఏ ఛైర్మన్ వినోద్ రాయ్ భావించాడు. ఐతే సీవోఏ సభ్యురాలు డయానా ఎడుల్జీ న్యాయ సలహా కోరడంతో విషయం కోర్టు వరకు వెళ్లింది.

క్వార్టర్స్‌లో సైనా, శ్రీకాంత్



మలేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్

కౌలాలంపూర్: మలేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్లో భారత స్టార్ షట్లర్లు సైనా నెహ్వాల్, కిదాంబి శ్రీకాంత్ క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లారు. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో సైనా 21-14, 21-16తో పుయిన్ ఇప్ (హాంకాంగ్)ను వరుస గేముల్లో ఓడించింది. సెమీస్‌లో స్థానం కోసం మాజీ ప్రపంచ నంబర్ వన్ నొజొమి ఒకుహర (జపాన్)తో సైనా తలపడనుంది. ఒకుహరపై సైనాకు 8-4తో మెరుగైన విజయాల రికార్డు ఉంది. గతేడాది డెన్మార్క్ ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్‌లలో సైనా.. ఒకుహరను ఓడించింది. మరోవైపు పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో కిదాంబి శ్రీకాంత్ 23-21, 8-21, 21-18తో వాంగ్ వింగ్ విన్సెంట్ (హాంకాంగ్)పై చెమటోడ్చి గెలిచాడు. తొలి గేమ్‌ను 23-21తో కష్టం మీద గెలుచుకుని.. రెండో గేమ్‌ను 8-21తో సులభంగా ప్రత్యర్థికి చేజార్చుకున్న శ్రీకాంత్‌కు మూడో గేమ్‌లోనూ గట్టి పోటీ ఎదురైంది. అయితే ఆఖర్లో వరుసగా మూడు పాయింట్లు గెలుచుకున్న కిదాంబి.. 21-18తో గేమ్‌తో పాటు మ్యాచ్‌ను సాధించాడు. కామన్వెల్త్ ఛాంపియన్ పారుపల్లి కశ్యప్ పోరాటం ముగిసింది. ప్రిక్వార్టర్స్‌లో కశ్యప్ 17-21, 23-25తో ఆంటోని గింటింగ్ (ఇండోనేసియా) చేతిలో ఓడాడు. మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప-సిక్కిరెడ్డి జోడీ ఓడిపోయింది. రౌండ్లో అశ్విని జోడీ 18-21, 17-21తో అమెలియా-నికెటుట్ (ఇండోనేసియా) జంట చేతిలో పరాజయం చవిచూసింది.

మెరిసిన తోమర్

మధ్యప్రదేశ్ విజయం



పంచకుల: ఫలితాన్ని నిర్ణయించే బౌట్లో సందీప్ తోమర్ గెలవడంతో ప్రిమియర్ రెజ్లింగ్ లీగ్‌లో మధ్యప్రదేశ్ యోధ 4-3తో ముంబయి మహారథిని ఓడించింది. తొలి మ్యాచ్‌లో హర్‌పూర్ (ముంబయి)పై గెలిచిన అలియెవ్ మధ్యప్రదేశ్‌కు ఆధిక్యం అందించాడు. అయితే వినేశ్.. తన సోదరి రీతు (ఎంపీ)పై గెలవడంతో ముంబయి స్కోరు సమం చేసింది. ఆ తర్వాత వ్లాదిస్లావ్ (ముంబయి), పూజ (ఎంపీ), దీపక్ (ముంబయి), మనోలోవా (ఎంపీ) నెగ్గడంతో స్కోర్లు 3-3తో సమమయ్యాయి. ఈ స్థితిలో ఇల్యాసోవ్‌ను ఓడించిన తోమర్ ఎంపీ యోధకు విజయాన్ని అందించాడు.

ఆస్ట్రేలియన్ ఓపెన్

ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో టైటిల్ ఫేవరెట్ సెరెనా విలియమ్స్ దూసుకుపోతోంది. బౌచర్డ్‌ను చిత్తు చేస్తూ అలవోకగా మూడో రౌండ్లో అడుగుపెట్టింది. హలెప్, ఒసాకా కూడా ముందంజ వేశారు. పురుషుల సింగిల్స్‌లో జకోవిచ్, జ్వెరెవ్ రెండో రౌండ్‌ను అధిగమించారు. వావ్రింకా టోర్నీ నుంచి నిష్క్రమించాడు.



సెరెనా దూకుడు

- ఆలవోకగా మూడో రౌండ్లోకి
- జకోవిచ్, జ్వెరెవ్, హలెప్, ఒసాకా ముందంజ

మెల్‌బోర్న్

కెరీర్‌లో 24వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌తో మార్గరెట్ కోర్ట్ రికార్డును సమం చేయాలని ఉవ్విళ్లూరుతున్న అమెరికా తార సెరెనా విలియమ్స్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో అదరగొడుతోంది. గురువారం రెండో రౌండ్లో తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించిన ఆమె 6-2, 6-2తో కెనడా అమ్మాయి బౌచర్డ్‌ను చిత్తుగా ఓడించింది. టాప్ సీడ్ హలెప్ (రొమేనియా), నాలుగో సీడ్ ఒసాకా (జపాన్) కూడా మూడో రౌండ్లో ప్రవేశించారు. హలెప్ 6-3, 6-7 (5-7), 6-4తో కెనిన్ (అమెరికా)పై నెగ్గగా.. ఒసాకా 6-2, 6-4తో జిదాన్‌సెక్ (స్లొవేనియా)ను ఓడించింది. ఇతర రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో ఆరో సీడ్ స్వితోలినా 6-4, 6-1తో కుజ్‌మోవా (స్లొవేకియా)పై, ఏడో సీడ్ ప్లిస్కోవా (చెక్) 4-6, 6-1, 6-0తో బ్రింగిల్ (అమెరికా)పై, వీనస్ విలియమ్స్ (అమెరికా) 6-3, 4-6, 6-0తో కోర్నెట్ (ఫ్రాన్స్)పై, మాడిసన్ కీస్ (అమెరికా) 6-3, 6-4తో పొటాపోవా (రష్యా)పై, వాంగ్ (చైనా) 6-2, 6-3తో కుర్నిచ్ (సెర్బియా)పై, బసిన్‌స్కీ (స్విట్జర్లాండ్) 6-2, 7-5తో విక్లియాన్‌త్సెవా (రష్యా)పై విజయం సాధించారు.

వావ్రింకా ఔట్: పురుషుల సింగిల్స్‌లో మాజీ ఛాంపియన్ వావ్రింకా (స్విట్జర్లాండ్) కథ ముగిసింది. హోరాహోరీగా సాగిన రెండో రౌండ్లో అతడు 7-6 (7-4), 6-7 (6-8), 6-7 (11-13), 6-7 (5-7)తో రోనిచ్ (కెనడా) చేతిలో ఓడిపోయాడు. ఇద్దరూ పదునైన సర్వీసులు చేశారు. వావ్రింకా 28 ఏస్‌లు, రోనిచ్ 39 ఏస్‌లు కొట్టడం విశేషం. టాప్ సీడ్ నొవాక్ జకోవిచ్ (సెర్బియా) సునాయాసంగా మూడో రౌండ్‌కు దూసుకెళ్లాడు. అతడు రెండో రౌండ్లో 6-3, 7-5, 6-4తో సోంగా (ఫ్రాన్స్)పై విజయం సాధించాడు. నిషికోరి (జపాన్), నాలుగో సీడ్ జ్వెరెవ్ (జర్మనీ) మాత్రం కష్టంగా ముందంజ వేశారు. రెండో రౌండ్లో నిషికోరి 6-3, 7-6 (8-6), 5-7, 5-7, 7-6 (10-7)తో కార్లోవిచ్ (క్రొయేషియా)పై, జ్వెరెవ్ 7-6 (7-5), 6-4, 5-7, 6-7 (6-8), 6-1తో చార్డీ (ఫ్రాన్స్)పై గెలిచారు. మరోవైపు ఏడో సీడ్ డొమినిక్ థీమ్ (ఆస్ట్రియా) టోర్నీ నుంచి నిష్క్రమించాడు. వైల్డ్‌కార్డ్ ఆటగాడు పొపిరిన్ (ఆస్ట్రేలియా)తో మ్యాచ్‌లో 5-7, 4-6, 9-2తో వెనుకబడి ఉన్న దశలో అతడు రిటైరయ్యాడు. హెర్బర్ట్ (ఫ్రాన్స్), ఫోగ్నిని (ఇటలీ), కోరిచ్ (క్రొయేషియా), గొఫిన్ (బెల్జియం) మూడో రౌండ్‌కు చేరుకున్నారు.

లారెస్ ప్రపంచ క్రీడల అవార్డు రేసులో వినేశ్



మొనాకో: భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ లారెస్ ప్రపంచ క్రీడల అవార్డు రేసులో నిలిచింది. ఫిబ్రవరి 18న ప్రకటించే ఈ అవార్డుల్లో గొప్పగా పునరాగమనం చేసిన క్రీడాకారుల జాబితాలో వినేశ్ పేరు ఉంది. ఈ ప్రతిష్ఠాత్మక అవార్డుకు నామినేట్ అయిన భారత తొలి క్రీడాకారిణి వినేశే. రియో ఒలింపిక్స్‌లో గాయపడిన తర్వాత కామన్వెల్, ఆసియా క్రీడల్లో స్వర్ణాలు గెలిచి తన పునరాగమనాన్ని గొప్పగా చాటింది ఈ హరియాణా రెజ్లర్. దిగ్గజ గోల్ఫర్ టైగర్ వుడ్స్ కూడా ఈ అవార్డు రేసులో ఉన్నాడు. చివరిగా 2004లో భారత, పాకిస్థాన్ క్రికెట్ జట్లకు సంయుక్తంగా లారెస్ అవార్డు వరించింది.

ఆలస్యంలో.. రికార్డు!

ముగురుజ



తెల్లవారుజామున 3 గంటల 12 నిమిషాలు.. ముగురుజ, కొంటా మధ్య మ్యాచ్ ముగిసిన సమయం ఇది. ఆస్ట్రేలియన్ ఓపెన్ చరిత్రలో అత్యంత ఆలస్యంగా ముగిసిన మహిళల సింగిల్స్ మ్యాచ్ ఇదే. జ్వెరెవ్-చార్డీల మధ్య పురుషుల సింగిల్స్ మ్యాచ్ దాదాపు నాలుగు గంటలపాటు సుదీర్ఘంగా సాగడంతో ఆ పోరు ముగిశాక, అదే కోర్టులో ఆరంభం కావాల్సిన ముగురుజ-కొంటా మ్యాచ్ చాలా ఆలస్యంగా రాత్రి 12.30 తర్వాత మొదలైంది. ఈ మ్యాచ్‌లో ముగురుజ (స్పెయిన్) 6-4, 6-7 (3-7), 7-5తో కొంటా (బ్రిటన్)పై విజయం సాధించింది. గురువారం షెడ్యూలులో ఉన్న ఈ మ్యాచ్ ఆస్ట్రేలియా కాలమానం ప్రకారం శుక్రవారం తెల్లవారుజామున ముగియడం విశేషం.

అమ్మకానికి రాయల్స్ వాటాలు!



దిల్లీ: ఇండియన్ ప్రిమియర్ లీగ్ (ఐపీఎల్)లో తమ ఫ్రాంఛైజీ వాటాలను కొంత భాగం అమ్మాలని రాజస్థాన్ రాయల్స్ యజమానులు నిర్ణయించుకున్నారు. రాబోయే ఐపీఎల్ నాటికి జట్టును ఆర్థికంగా మరింత పరిపుష్ఠం చేయడం కోసమే ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఈ మేరకు ఫ్రాంఛైజీ యజమానులు బీసీసీఐ అధికారులను సంప్రదించినట్లు.. తమ వాటాల్లో 50 శాతం అమ్మే ఉద్దేశంతో ఉన్నట్లు వారికి చెప్పినట్లు సమాచారం. ఈ వాటాలను కొనేందుకు ప్రముఖ వ్యాపార సంస్థలు పోటీపడుతున్నట్లు తెలిసింది. వీరిలో మరో ఐపీఎల్ మాజీ ఫ్రాంఛైజీ రైజింగ్ పుణె సూపర్ జెయింట్ యజమాని సంజీవ్ గొయాంకా కూడా ఉన్నట్లు సమాచారం.

తొలిసారి సెమీస్‌లో కేరళ

వేయాండ్ (కేరళ): రంజీ ట్రోఫీలో కేరళ జట్టు సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. క్వార్టర్స్‌లో ఆ జట్టు 113 పరుగుల తేడాతో గుజరాత్‌ను చిత్తు చేసింది. గురువారం మూడోరోజు 195 పరుగుల విజయ లక్ష్యంతో బరిలో దిగిన గుజరాత్.. థంపి (5/27), సందీప్ (4/30) ధాటికి రెండో ఇన్నింగ్స్‌లో 31.3 ఓవర్లలో 81 పరుగులకే కుప్పకూలింది. గుజరాత్ జట్టులో రాహుల్ షా (33), రావల్ (17) మినహా మరెవరూ రెండంకెల స్కోరు చేయలేదు. తొలి ఇన్నింగ్స్‌లో 185 పరుగులు చేసిన కేరళ.. రెండో ఇన్నింగ్స్‌లో 171 పరుగులకే ఆలౌటైంది. గుజరాత్ తొలి ఇన్నింగ్స్‌లో 162 పరుగులకే కుప్పకూలింది. రంజీ ట్రోఫీలో సెమీస్ చేరడం కేరళకు ఇదే తొలిసారి. మరోవైపు వసీం జాఫర్ (206) డబుల్ సెంచరీ సాధించడంతో ఉత్తరాఖండ్‌తో క్వార్టర్స్‌లో విదర్భ కీలక ఆధిక్యాన్ని కూడగట్టుకుంది. ఆట ఆఖరికి తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్లకు 559 పరుగులు చేసిన విదర్భ.. ఇప్పటికే 204 పరుగుల ఆధిక్యంలో ఉంది.



'మెట్రో'లో ఉద్యోగాలంటూ మోసాలు

- 161 మంది నుంచి రూ.80 లక్షలు వసూలు
- ముఠా గుట్టురట్టు చేసిన పోలీసులు
- ఇద్దరు అరెస్టు, పరారీలో మరో ఇద్దరు
- నిందితుల్లో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ


నిందితులు రామకృష్ణ, మహాలక్ష్మి

ఉప్పల్, న్యూస్‌టుడే: మెట్రో రైలులో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగుల నుంచి భారీగా వసూళ్లకు పాల్పడ్డారు. ఏకంగా ఎల్ అండ్ టీ మెట్రో ఉన్నతాధికారుల పేరుతోనే నకిలీ నియామక పత్రాలు జారీ చేశారు. ఎట్టకేలకు పోలీసులకు పట్టుబడ్డారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు పట్టణానికి చెందిన వెలగపూడి రామకృష్ణ (55) హైదరాబాద్ అమీర్‌పేటలో స్థిరపడ్డాడు. పలు సంస్థల్లో ప్రజా సంబంధాల అధికారి (పీఆర్‌ఓ)గా పనిచేశాడు. రెండేళ్లుగా నిజామాబాద్ జిల్లాకు చెందిన చిల్ల మహాలక్ష్మి (45)తో సహజీవనం చేస్తున్నాడు. వారిద్దరు, ఎస్‌ఆర్‌నగర్‌లో ఉండే హైకోర్టు న్యాయవాది గడ్డం శ్రీధర్‌రెడ్డి (56), మంచిర్యాల డివిజన్‌లో మిషన్ భగీరథలో డీఈఈగా పనిచేస్తున్న రామకృష్ణ బావమరిది బండారు లక్ష్మణరావు (58) ముఠాగా ఏర్పడ్డారు. మెట్రో రైలులో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగులను నమ్మించారు. సుమారు ఏడాది కాలంలో 161 మంది నుంచి రూ. 80 లక్షలు వసూలు చేశారు. 'వసులైన సొమ్మంతా తన ఖాతాలో జమ చేయించుకున్న రామకృష్ణ రూ. 23 లక్షలు వెచ్చించి మహాలక్ష్మికి జిల్లా కేంద్రం నిజామాబాద్ ఫతేనగర్‌లో ఇల్లు నిర్మించి ఇచ్చాడని, శ్రీధర్‌రెడ్డి, లక్ష్మణరావులకు 10 శాతం చొప్పున వాటా ఇచ్చాడని' పోలీసులు తెలిపారు.

వెలుగులోకి వచ్చిందిలా..


ఉద్యోగాల కోసం డబ్బులు ఇచ్చిన బాధితులు నియామక పత్రాల కోసం ఒత్తిడి తేవడంతో రామకృష్ణ అడ్డదారులు వెదికాడు. నకిలీ జీమెయిల్ అకౌంట్‌ను సృష్టించాడు. ఎల్ అండ్ టీ మెట్రో రైలు ఎండీ కేవీబీరెడ్డి పేరుతో తానే గూగుల్ టెక్నాలజీ ఆధారంగా నిరుద్యోగ అభ్యర్థులతో మాట్లాడటం ప్రారంభించాడు. ఎల్ అండ్ టీ మెట్రో వైస్ ప్రెసిడెంట్ పి.రాధికారెడ్డి పేరుతో నకిలీ నియామక పత్రాలు (అపాయింట్‌మెంట్ లెటర్లు) సృష్టించి పలువురికి పంపాడు. అలా లేఖ అందుకున్న దిల్‌సుఖ్‌నగర్‌లో ఉంటున్న, చిత్తూరు జిల్లాకు చెందిన టి. లావణ్య (27) ఇటీవల మెట్రో అధికారులను కలవడంతో మోసం వెలుగులోకి వచ్చింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉప్పల్ పోలీసులు ఈ నెల 7న కేసు నమోదు చేసి, ముఠా గుట్టురట్టు చేశారు.

రామకృష్ణ.. మోసాలలో ఘనుడు

'రామకృష్ణ పలు సంస్థల్లో ప్రజా సంబంధాల అధికారి (పీఆర్‌ఓ)గా పనిచేయడంతో విస్తృతమైన పరిచయాలు ఏర్పడ్డాయి. అవే పెట్టుబడిగా అతను అక్రమాలకు తెగబడ్డాడు. నిరుద్యోగులే లక్ష్యంగా తెలుగు రాష్ట్రాల్లో పలు మోసాలకు పాల్పడ్డాడు. ఇప్పటికే అతనిపై రెండు రాష్ట్రాల్లో 15 కేసులు నమోదయ్యాయి. రామకృష్ణతోపాటు మహాలక్ష్మిని గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాం. అతన్నుంచి కారు, నకిలీ నియామకపత్రాలు, రూ. 70 వేల నగదు స్వాధీనం చేసుకున్నాం. శ్రీధర్‌రెడ్డి, లక్ష్మణరావు పరారీలో ఉన్నారు' అని ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు గురువారం వెల్లడించారు.

గద్దల్లా వాలుతున్నారు

- అసూయపరులంతా ఒక్కటై రాష్ట్రంలో చిచ్చు పెడుతున్నారు
- కేటీఆర్, జగన్ భేటీతో ముసుగు తొలగిపోయింది
- మోదీకి మేలు చేసేందుకే ఫెడరల్ ఫ్రంట్ కుట్ర
- ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్వజం
- తలసాని వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం
- మొక్కులకు వచ్చి రాజకీయ వ్యాఖ్యలేంటని మండిపాటు
- తలసాని పర్యటనలో పాల్గొన్న తెదేపా నేతలపై చర్యలకు ఆదేశం



"తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం కళింగ, తూర్పు కాపు, గవర, శెట్టిబలిజ వంటి 26 కులాల్ని బీసీల జాబితా నుంచి తొలగించి వారికి తీవ్ర అన్యాయం చేసింది. ఇప్పుడు ఆ పార్టీకి చెందిన నాయకులు ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి బీసీలపై కపట ప్రేమ చూపుతున్నారు. తెరాసతో జట్టుకట్టిన వైకాపాకు ఆ 26 కులాల బీసీలు బుద్ధి చెప్పాలి"

"కాంగ్రెస్ హయాంలో సంవత్సరానికి రూ.2,400 వచ్చే పింఛను మొత్తాన్ని, మనం రూ.24 వేలకు పెంచాం. ఐదేళ్లలో పింఛన్‌ను 10 రెట్లు పెంచడం ఒక చరిత్ర. పింఛను మొత్తాన్ని పెంచడంతో పేదలు రాష్ట్రమంతా సంక్రాంతిని మించిన సంబరాలు చేసుకున్నారు. అది చూసి అక్కసు పట్టలేకే భాజపా, వైకాపా, తెరాస కుట్రలు చేస్తున్నాయి"

"అవినీతి గొంగళిపురుగుని కేసీఆర్ కౌగలించుకున్నారు. ఈ స్నేహం తెలంగాణ కోసమేనా? దీనిపై ప్రజలకు కేసీఆర్, కేటీఆర్ జవాబివ్వాలి. మోదీ చెప్పింది చేయడమే కేసీఆర్ కర్తవ్యం. మోదీ చేతిలో జగన్ కీలు బొమ్మ. భాజపా, తెరాస, వైకాపాలకు ప్రజలే బుద్ధి చెబుతారు"

- ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు (మంత్రులు, ఎమ్మెల్యేలతో టెలీకాన్ఫరెన్స్ సందర్భంగా..)

ఈనాడు – అమరావతి

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని జీర్ణించుకోలేని ప్రధాని నరేంద్ర మోదీ, వైకాపా అధ్యక్షుడు జగన్, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంపై గద్దల్లా వాలుతున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్వజమెత్తారు. అసూయపరులంతా ఏకమై కులాల మధ్య చిచ్చు పెడుతున్నారని, రాష్ట్రంపై కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్ చెబుతున్న ఫెడరల్ ఫ్రంట్‌కు స్పందన లేదని, అందుకే తెరాస నేత కేటీఆర్ హడావుడిగా జగన్‌తో భేటీ అయ్యారని ఆక్షేపించారు. ఈ చర్యతో తెరాస, వైకాపా ఒక్కటేనని మరోసారి స్పష్టమైందని, వారి ముసుగు తొలగిపోయిందని వ్యాఖ్యానించారు.

మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలతో సహా రాష్ట్ర వ్యాప్తంగా తెదేపా నాయకులతో ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం ఉదయం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా తెరాస నాయకుడు తలసాని శ్రీనివాస్ యాదవ్ రాష్ట్రానికి వచ్చిన సందర్భంగా చేసిన వ్యాఖ్యలపై చంద్రబాబు మండిపడ్డారు. ఆలయాల్లో మొక్కులు తీర్చుకోవడానికి వచ్చి రాజకీయ వ్యాఖ్యలు చేయడమేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీనివాస్ యాదవ్ రాష్ట్ర పర్యటనకు వచ్చినప్పుడు కొందరు తెదేపా నాయకులూ పాల్గొన్నారని, ఆయనకు స్వాగతం చెప్పారని పార్టీ సీనియర్ నేత బుచ్చయ్య చౌదరి ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. దీనిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన చంద్రబాబు... ఆ పర్యటనలో పాల్గొన్న పార్టీ నాయకులకు షోకాజ్ నోటీసులు ఇచ్చి పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ఆదేశించారు. తెరాస నాయకులు రాష్ట్ర పర్యటనకు వచ్చినప్పుడు తెదేపా నాయకులెవరూ పాల్గొనరాదని, ఎవరైనా దీన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. "బంధుత్వాలుంటే ఇంట్లో పెట్టుకోండి. స్నేహాలు ఉంటే వ్యక్తిగతంగా చూసుకోండి. మీ బంధుత్వాలు, స్నేహాల పేరుతో పార్టీని పణంగా పెట్టినా, రాష్ట్రం, ప్రజల ప్రయోజనాలు దెబ్బతీయాలని చూసినా సహించను" అని ఆయన తీవ్ర స్వరంతో పేర్కొన్నారు.

భాజపా అజెండా అమలు చేయడానికే

కేసీఆర్ చెబుతున్న ఫెడరల్ ఫ్రంట్ వెనుక అసలు రహస్యం భాజపా అజెండా అమలు చేయడమేనని చంద్రబాబు ధ్వజమెత్తారు. దేశంలోని పార్టీలను గందరగోళానికి గురిచేయడం, ప్రజల్లో అయోమయం సృష్టించడం వారి లక్ష్యమని మండిపడ్డారు. భాజపా వ్యతిరేక ఓట్లను చీల్చడం ద్వారా ఆ పార్టీకి, మోదీకి లబ్ధి చేకూర్చేందుకే కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ పేరుతో కుట్రకు తెర తీశారని ఆరోపించారు. భాజపా, తెరాస, వైకాపా కలసి దొంగనాటకాలు ఆడుతున్నాయన్నారు.

ప్రాంతాల మధ్య చిచ్చుకు కుట్ర

"భాజపా, తెరాస, వైకాపా నాయకులు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. అమరావతిలో అభివృద్ధి పనులు వారికి కంటగింపుగా మారాయి. రాయలసీమ, ఉత్తరాంధ్రలో పారిశ్రామిక ప్రగతి చూసి అసూయ చెందుతున్నారు. ప్రాంతాల మధ్య చిచ్చు రగిలించేందుకు కుట్రలు చేశారు. రాయలసీమ, ఉత్తరాంధ్రల్లో చిచ్చు పెట్టాలని చూశారు. కులాలు, మతాల మధ్య ఉద్రిక్తతలు రేపుతున్నారు. తెలంగాణలో సెంటిమెంట్ రెచ్చగొట్టారు. వాళ్ల రాజకీయ ప్రయోజనాల కోసం ఎంతకైనా తెగిస్తారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తే తమకూ ఇవ్వాలని కేసీఆర్ అన్నారు. 9, 10 షెడ్యూళ్లలోని సంస్థల విభజనకు అడ్డంకులు సృష్టించారు. చివరకు సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయనివ్వలేదు. ఇప్పుడేమో ఆ కేసీఆర్ పార్టీతో వైకాపా అంటకాగుతోంది. గుజరాత్‌ను మించిపోతుందని ఆంధ్రప్రదేశ్ అంటే మోదీకి అసూయ. ఏపీ అభివృద్ధి చెందితే తన చేతగానితనం బయటపడుతుందని మోదీకి భయం. అవినీతి కేసుల్లో జైలుకి వెళ్లాల్సి వస్తుందని జగన్‌కు భీతి. వాళ్లంతా ఒక్కటై రాష్ట్రంపై గద్దల్లా వాలుతున్నారు" అని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.

సేద్యాన్ని లాభసాటిగా మార్చాలి

- 'అగ్రి విజన్' సదస్సులో ఉపరాష్ట్రపతి

ఈనాడు, హైదరాబాద్: స్థానికంగా పండే ఉత్పత్తులతో కూడిన ఆహార భద్రత దేశానికి కావాలని, విదేశాల నుంచి దిగుమతి చేసుకునేంత 'భద్రత' అవసరం లేదని ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. సీఐఐ, జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, కోర్నెల్ యూనివర్సిటీ సంయుక్తంగా నిర్వహించిన అగ్రి విజన్-2019 సదస్సును గురువారం ఆయన ప్రారంభించారు. విద్యావంతులైన యువతీ యువకులు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి, వ్యవసాయాన్ని అక్కడ లాభసాటిగా మార్చాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కోర్సుల్లో ఆరునెలలు రైతులతో కలిసి పనిచేసేలా ఇంటర్న్‌షిప్ కార్యక్రమం అమలు చేసి... ప్రత్యేక గ్రేడింగ్, మార్కులు ఇవ్వాలని సూచించారు. తెలంగాణలో పంటకాలనీల ఏర్పాటు ప్రక్రియ మంచిదని కితాబిచ్చారు. ఒకప్పుడు జీడీపీలో 40 శాతం ఉన్న వ్యవసాయరంగం ప్రస్తుతం 18 శాతానికి పడిపోయిందని, ఈ పరిస్థితి నుంచి బయటపడేందుకు పరిశోధనలన్నీ రైతుల దరికి చేరాలని ఆయన కోరారు. 2022నాటికి రైతుల ఆదాయం రెట్టింపు కావాలన్న లక్ష్యంతోనే ప్రధాని నరేంద్ర మోదీ వివిధ కార్యక్రమాలు, పథకాలు అమలుచేస్తున్నారని వివరించారు. తమ విశ్వవిద్యాలయం పరిశోధనలపరంగా దేశంలోనే రెండో స్థానంలో నిలిచిందని జయశంకర్ వ్యవసాయ వర్సిటీ ఉపకులపతి వి.ప్రవీణ్‌రావు ప్రకటించారు. భవిష్యత్తులో ఆహార, పశుసంపదకు గల డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని పనిచేస్తున్నామన్నారు. సదస్సులో సీఐఐ తెలంగాణ అధ్యక్షుడు సంజయ్‌సింగ్, కోర్నెల్ యూనివర్సిటీ కార్యనిర్వాహక డీన్ డాక్టర్ మాక్స్ జె పెఫెర్, కోరమాండల్ ఎండీ సమీర్ గోయల్ పాల్గొన్నారు.

టేకు వుడ్ డిస్కౌంట్ సేల్
భారతదేశంలోనే అతి పెద్ద టింబర్ డిపో
బర్మా టేకు రూ. ~~12,000~~/- రూ.5,500/- per Cft.
హై క్వాలిటి టేకు రూ. ~~3,800~~/- రూ.2,800/- per Cft.
బెస్ట్ క్వాలిటి టేకు రూ. ~~3,000~~/- రూ.2,100/- per Cft.
మీడియం క్వాలిటి టేకు రూ. ~~2,000~~/- రూ.1,500/- per Cft.
ఉచిత రవాణా సౌకర్యం కల్పించబడును
ఏషియన్ టింబర్ ఎస్టేట్స్
1. ఔటర్ రింగ్‌రోడ్ ప్రక్కన, గచ్చిబౌలి కొల్లూరు 2. కూకట్‌పల్లి 'వై' జంక్షన్
ఫోన్ : 98480 28811, 99485 17777, 81799 22021, 040-23817448.



Honda Motorcycle and Scooter India Pvt. Ltd., Registered Office: Commercial Complex II, Sector - 49-50, Golf Course Extension Road, Gurugram - 122018 (Haryana), India; **Website:** www.honda2wheelersindia.com; **Customer Care:** customercare@honda2wheelersindia.com

*Terms and Conditions apply. For further details, please visit www.hondajoyclub.com. #Rs.7999/- Low Down Payment as per financier policy and subject to relevant document. Financier can withdraw scheme anytime without any prior notice. ##Paytm Mall Benefits are applicable in selected dealerships and on selected models only with the terms and conditions of Paytm and Dealership. All schemes are at sole discretion of dealership and maybe revoked at any time. Scheme is valid till 31st January'19 only. **Conditions apply. Accessories shown in the picture are not a part of the standard equipment. Product shown in the picture may vary from actual product available in market.

Honda Exclusive Authorized Dealerships: KARIMNAGAR: Samrat Honda - 0878-2277299; 9441333665; Srikanth Honda - 0878-2224555, 7799946632; **JAGATIAL:** Samrat Honda - 9701200045, 9704500045; **HUZURABAD:** Samrat Honda - 8099979050; **SIRCILLA:** Srikanth Honda - 08723-233336, 7799700245; **PEDDAPALLY:** Srikanth Honda - 7799700259; **SULTANABAD:** Aradhna Honda - 9849885862; **VEMULAWADA:** Srikanth Honda - 9177662757; **METPALLY:** Saanvi Honda - 9581295818; **JAMMIKUNTA:** Srikanth Honda - 7799700263; **DHARMARAM:** Sairam Honda - 9642828885, 08728-270950; **HUSANABAD:** Laxmi Honda - 9949915222; **ADILABAD:** Sree Mahalakshmi Honda - 9010977757; **RAMAGUNDAM:** Sai Ram Krishna Honda - 8100779999; **MANCHERIAL:** Jagadamba Honda - 08736-259303; **BELLAMPALLY:** Thirumala Honda - 08735225975; 9059979909; **NIRMAL:** Sree Mahalakshmi Honda - 9010977757; **ASIFABAD:** Sainath Honda - 9010431431, 8500612233; **KHANAPUR:** Sri Ganesh Honda - 9010977757; **BHAINSA:** Sree Mahalakshmi Honda - 9010977757; **KAGAZNAGAR:** Sree Mahalakshmi Honda - 9010977757; **ICHODA:** Sree Mahalakshmi Honda - 9010977757; **NIZAMABAD:** Sairam Honda - 243434, 9052116500; Sai SRK Honda - 08462- 239966, 7095911666, **BHEEMAGAL:** Druva Honda - 08463238888, 9912151515; **NIZAMABAD:** Sai Krishna Honda - Pitlam - 08466-271372, 9949812751; **BODHAN:** Sairam Honda - 225588, 8886022883; **KAMAREDDY:** Sairam Honda - 220034, 9951426969; **DHARMARAM:** Sairam Honda - 9494555511, 08463-226696; **ARMOOR:** Sairam Honda - 9052416222; **NIRMAL:** Mahalakshmi Honda - 08734-244155, 9553408811; **KHANAPUR:** Sri Ganesh Honda - 9705559111, 9705559222; **BHAINSA:** Mahalakshmi Honda - 9010977757; **KAGAZNAGAR:** Mahalakshmi Honda - 9010977757; **ICHODA:** 9010977757; **WARANGAL:** Nagarjuna Honda - 9704377444, 9000477444; Borra Honda - 9849486292, 9100441821; **HANAMKONDA:** Sri Srinivasa Honda - 0870-2531111, 8374357999; **STATION GHANPUR:** Sri Srinivasa Honda - 8143498979; **JANGAON:** Sri Srinivasa Honda - 9951203333, 8340042555; **MAHABUBABAD:** Nagarjuna Honda - 9441933789; **BHUPALPALLY:** Nagarjuna Honda - 9052190444; **THORRUR:** Gajalakshmi Honda - 9441770871; **PARKAL:** Sri Sai Honda - 8686477444, 8341776222; **NARSAMPET:** Sneha Honda - 08718-231310, 9393982174; **NAIMNAGAR:** Sri Srinivasa Honda - 9160414222.

For Bulk/Institutional enquiries, please write us at: institutionalsales@honda2wheelersindia.com

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92,
Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00